# మల్లాది

## వెంకట కృష్ణమూర్తి



# బ్రిటిష్ క్రైమ్ కథలు

# బ్రిటిష్ క్రైమ్ కథలు Malladi Venkata Krishnamurthy

క్రైమ్ కథాభిమానులకి

దీనికి బ్రిటిష్ క్రైమ్ కథలు అనే పేరు పెట్టడానికి కారణం, ఇందులోని కథలన్నీ బ్రిటన్లో జరగడం లేదా బ్రిటిష్ రచయిత రాసింది అవడం లేదా బ్రిటిష్ పాత్ర ఉండటం. ఆ ప్రాతిపదిక ఆధారంగా కథలని ఈ సంపుటిలో చేర్చాను. ప్రఖ్యాత అపరాధ పరిశోధకుడు షెర్లాక్ హోమ్స్, గూఢచారి 007 జేమ్స్ బాండ్, హిచ్కాక్, స్కాట్లేండ్ యార్డ్ల స్వదేశమైన బ్రిటన్కి చెందిన ఈ కథా సంపుటిలోని పేజీల్లో చాలా మంది మరణిస్తారు.

గొంతు నులమబడి, తల నరకబడి, కారు ప్రమాదంలో, సుత్తితో, విషంతో, రివాల్వర్ గుండుతో, కత్తితో పొడిచి, జెల్లీ ఫిష్తో, రాబందులతో. అన్నిటికీ మించి కలం పోటుతో పాత్రలని చంపచ్చని బ్రిటిష్ క్రైమ్ రచయితలు ఈ కథల ద్వారా ఋజువు చేస్తున్నారు.

బ్రిటన్ లోని లండన్లో, సౌతంప్టన్లో, రగ్బీలో, లివర్పూల్లో, డోవర్లో కార్లిసేలో న్యూకేజిల్లో, బర్మింగ్హామ్లో ఇలా అనేక చోట్ల ఈ కథలు జరుగుతాయి. సేల్స్మెన్, డాక్టర్లు, లాయర్లు, హోటల్ వెయిట్రెసెస్, విద్యార్థులు, కార్ మెకానిక్స్, బార్ టెండర్స్. ఇలా అనేక మందిని మీరు ఈ కథల్లో కలుసుకోవచ్చు. లవర్లా నేరస్తుడు కూడా దాక్కో లేడు అన్నది ప్రతీ కథా బోధిస్తుంది. ఉత్కంఠ, ఉత్సాహం, వినోదం, కొస మెరుపుల కోసం మీరు వీటిని ఆస్వాదించచ్చు.

మంచి క్రైం కథలో ఎన్నో దినుసులు ఉంటాయి. కాని ఆ దినుసులు ఉన్న కథలన్నీ మంచి కథలు కావు. మంచి క్రైం కథలో చదివించే గుణం, సస్పెన్స్ సాగడం , కొస మెరుపుతో ముగియడం అనే దినుసులు ఉంటాయి. ఈ సంకలనంలోని అన్ని కథల్లో ఈ మూడు దినుసులు ఉండటంతో చక్కటి క్రైం కథలు చదివిన తృప్తిని అవి మీకు తప్పక ఇస్తాయి.

అనేక తరాల బ్రిటిష్ రచయితలు రాసిన వందలాది కథలని చదివి, వాటిలో నాకు నచ్చినవి ఎంపిక చేసి అనువదించి అందిస్తున్న ఈ సంకలనం మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తూ.

మీ,

మల్లాది వెంకట కృష్ణమూర్తి.

---

## వారసుడు - హెరాల్డ్ స్వాంటన్

వారం క్రితం న్యూయార్క్‌లోని హేలీ జాక్స్ అనే బార్లో నేను చూసిన దినపత్రిక లోని ఓ ప్రకటన నా జీవితాన్నే మార్చేసింది.

నా పేరు చార్లీ రేమండ్ గుర్రప్పందాలంటే నాకు ఇష్టం. ఈ సీజన్లో నేను ఐదు వేల డాలర్లని పోగొట్టుకున్నాను. నాకు అందిన టిప్ సరైంది కాదు. సినబార్ రోండ్ వే, సేలీస్ గర్ల్ నన్ను మోసం చేసాయి. బేటిల్ క్లాగ్ నెక్ట్తో గెలిచింది.

రిసీవర్ని మూసి బార్ టెండర్ నాతో చెప్పాడు.

''డచ్ ష్రూడర్ నించి నీకు ఫోన్.''

"నేను వెళ్ళిపోయానని చెప్పు." బార్ టెండర్కి చెప్పాను.

''బహుశా కొద్ది నిమిషాల్లో మీ అప్పుని తీర్చడానికి అతను మీ దగ్గరకి రావచ్చు." బార్ టెండర్ నా తరఫున అబద్ధం ఆడాడు.

నా జేబులో ఉన్నది కేవలం ఇరవై డాలర్ల నోటు, కొంత చిల్లర మాత్రమే. నా ఒంటి మీద ఉన్న ఖరీదైనవి జిఫికాన్ కఫ్లింక్స్ మాత్రమే. నేను డచ్ ష్రూడర్కి నాలుగు వేల రెండు వందల

డాలర్లు బాకీ పడ్డాను. అరగంటలో అతని దగ్గరికి వెళ్ళకపోతే డచ్కి అనుమానం వస్తుంది. రాత్రికల్లా నన్ను వేటాడడం మొదలు పెడతాడు.

నేను బీర్ మగ్ని దినపత్రిక మీంచి తీస్తే దాని మీద పడ్డ గుండ్రటి మరకలో "లండనర్ వాంటెడ్'' అనే ప్రకటన కనిపించింది. నేను దాన్ని ఆసక్తిగా చదివాను. డ్రైవర్గా శాన్ఫ్రాన్సిస్కోకి తీసుకెళ్ళే వారికి నూట ఏభై డాలర్లు, ఖర్చులు చెల్లిస్తానని, లండన్కి చెందిన వ్యక్తికి ప్రాధాన్యత అని ఉంది. హెన్రిక్స్ అనే అతను ఇచ్చిన ఆ ప్రకటనలో ఫోన్ నంబర్ కూడా ఉంది. నగరం నించి వెళ్ళిపోవటానికి ఇది చక్కటి మార్గం అనిపించింది. పైగా నాకు చేతనైన ఉద్యోగం అదొక్కటే. నేను నా జీవితంలోని ఎక్కువ భాగం లండన్లో గడిపాను. నాకు అక్కడ బాగా చెడ్డ పేరు రావడంతో అమెరికాకి వచ్చాను. ఓ చెక్ మీది నా సంతకం విషయంలో అపార్థం కలగకపోతే, ఇంకా లండన్లోనే ఉండి ఉండేవాడిని. నేను వెంటనే ఆ నంబర్కి ఫోన్ చేసాను.

''హలో...'' ఓ మగ కంఠం వినిపించింది.

"ఇవాళ పేపర్లో వచ్చిన ప్రకటన గురించి ఫోన్ చేసాను.''

''ఓ! నా పేరు వాకర్ హెన్రిక్స్."

''ఎలా ఉన్నారండీ? నా పేరు ఛార్లెస్ ఫోలియట్ రేమండ్" చెప్పాను.

"మీరు లండన్కి చెందిన వ్యక్తా?"

''అవునండి. నేను నా సగం జీవితమంతా అక్కడే నివశించాను - ఈటన్, ఆక్స్ఫర్డ్లని వదిలేస్తే."

''బావుంది. విస్కీ సోడా కోసం నా హోటల్కి మీరు ఓ గంటలో రాగలరా?'' ఆహ్వానించాడు.

''తప్పకుండా, విస్కీ అండ్ సోడా అన్నారా? నాకది బాగా ఇష్టం."

"నేను వెల్డన్ హోటల్లో ఉన్నాను. గుడ్ బై." రిసీవర్ పెట్టేసాడు.

* * *

"సో మీకు లండన్ బాగా తెలుసన్న మాట మిస్టర్ రేమండ్?" విస్కీ గ్లాసు అందిస్తూ హెన్రిక్స్ అడిగాడు.

“బాగా”

“మీరు ఎక్కడ ఉండేవారు?”

“నేను వేగో స్ట్రీట్లోని బేచ్లర్ క్వార్టర్స్లో ఉండేవాడిని."

“వీగో స్ట్రీటా? అది నాకు తెలీదనుకుంటాను.”

"శాక్విల్ స్ట్రీట్ లోంచి రీజెంట్ స్ట్రీట్లోకి తిరుగుతూంటే, కుడివైపు కనిపిస్తుంది."

"ఓ! అవును. గుర్తొచ్చింది."

"మిస్టర్ హెన్రిక్స్! మీరు శాన్ఫ్రాన్సిస్కోకి వెళ్ళడానికి ఏదైనా ప్రత్యేక కారణం ఉందా? మీకు గుర్రప్పందేల్లో ఏదైనా ఆసక్తి ఉందా?” అడిగాను.

“లేదు. మీకు ఆసక్తి అనుకుంటా?” అతను అడిగాడు.

“వచ్చే వారం శాన్ఫ్రాన్సిస్కోలోని బే మెడోస్లో గుర్రప్పందేలు మొదలవుతున్నాయి. కాకపోతే, లండన్లోని ఎస్కాట్ రేస్ కోర్సుని మించింది ప్రపంచంలో లేదు.”

“నిజమే. నేనూ ఒప్పుకుంటాను. మీకు లండన్ బాగా తెలుసా? లేదా ఉద్యోగం కోసం నటిస్తున్నారా?”

"మిస్టర్ హెన్రిక్స్! నేను మిమ్మల్ని లండన్కి గైడ్గా తీసుకెళ్ళగలను. కెన్సింగ్టన్ గార్డెన్స్ నించి ఈస్ట్ ఇండియా డాక్ దాకా కళ్ళు మూసుకుని తీసుకెళ్ళగలను." చెప్పాను.

హెన్రిక్స్ నవ్వాడు.

"అంత అవసరం లేదు. నా జీవితమంతా నేను లండన్లోనే జీవించాను. సిగరెట్ కావాలా?"

"థాంక్స్."

ఆయన అందించిన సిగరెట్ని అంటించాను.

"నిజం చెప్పాలంటే, నేను అమెరికాలో డిప్రెషన్కి లోనయ్యాను. శాన్ఫ్రాన్సిస్కోలో ముఖ్యమైన వ్యాపార పని లేకపోతే నేను ఈ దేశానికి వచ్చేవాడిని కాదు. లండన్కి చెందిన ఎవరూ నా పక్కన లేకుండా ఈ దేశంలో అంత దూరం ప్రయాణించలేను అనిపించి ఆ ప్రకటన ఇచ్చాను. మరో బ్రిటిషర్ నా ప్రక్కన ఉంటే అది కొంత తగ్గచ్చు అనిపించింది. లండన్ గురించి మనం మాట్లాడుకోవచ్చు. అది ప్రపంచంలోనే గొప్ప నగరం కదా?"

"ప్రశ్నే లేదు." నేను నవ్వుతూ చెప్పాను.

అంతలో ఫోన్ మోగింది. రిసీవర్ అందుకుని హెన్రిక్స్ చెప్పాడు.

"హలో? ప్రకటన?... ఐ యాం సారీ. ఆ ఉద్యోగం వేరేవారికి ఇచ్చేసాను."

అది వినగానే నాకు ఆనందం కలిగింది.

* * *

మర్నాడు ఉదయం మేము కార్లో శాన్ఫ్రాన్సిస్కోకి బయలుదేరాం. ఆయన జాలీ

లండన్ గురించి మాట్లాడాలి అంటే ఏమిటో అనుకున్నాను. విసిగించేసాడు.

"రేమండ్ సోహోలో ఎక్కువ టైం గడిపావా?" హెన్రిక్స్ అడిగాడు.

"నేను అక్కడ నివసించలేదు. మీ ఉద్దేశం అదే అయితే.''

''కాదు నా ఉద్దేశం అక్కడి రెస్టారెంట్స్, అవీ తెలుసా అని."

''తెలుసు. అక్కడ మొరాకన్.... ఏమిటది? డీన్ స్ట్రీట్లోని ది అల్జీరియన్ కేఫ్ మీకు గుర్తుందా?'' అడిగాను.

"డీన్ స్ట్రీట్లోని 'ది అల్జీరియన్?' తెలుసు." హెన్రిక్ నవ్వుతూ చెప్పాడు.

''అందులో గోడ మీద రాసున్నది గుర్తుందా? ఎవరైనా జూదం ఆడుతూ పట్టుబడితే, వారిని మురిక్కాలవలో పడేసి మళ్ళీ పైకి తీయం." చెప్పాను.

"గుర్తుంది గుర్తుంది. అదింకా ఉంది. దాని యజమానురాలు తెలుసా?" హెన్రిక్స్ నవ్వుతూ అడిగాడు.

''తెలుసు.''

''ఆమెని అమెరికా రాబోయే ముందే కలిసాను.''

"నిజంగా? ఆమె కొన్ని సంవత్సరాల క్రితం మరణించిందనుకుంటాను.''

''అలాగా? అయితే నేను ఆమెని ఎలా చూసాను?''

''ఆమె కూతురు ఆమె లాగే ఉంటుంది. కాబట్టి మీరు ఆవిడని చూసి ఉంటారు.''

''కావచ్చు. డీన్ స్ట్రీట్ లోని అల్జీరియన్ నించి కొంచెం ముందుకి వెళ్తే... '' ఆయన చెప్పసాగాడు.

మేము దారిలో లండన్లోని వివిధ ప్రదేశాల గురించి మాట్లాడుకుంటూనే ప్రయాణించాం. అక్కడి రెస్టారెంట్స్ వీధులు మొదలైనవి. సోహోతో మొదలెట్టి మిగిలిన ప్రదేశాల గురించి కూడా మాట్లాడాను. బేస్ వాటర్, ఫ్లీట్ స్ట్రీట్, బ్లూమ్స్బరీ, మేఫెయిర్... రోజంతా కారులో ఇదే సంభాషణ. మధ్యాహ్నం భోజనానికి ఆగినప్పుడు కూడా. రాత్రి హోటల్లో కూడా. అతని ఉద్దేశం లండన్లో వాకింగ్ గైడ్గా అవాలని అని నాకు అనిపించింది. బ్రిటిషర్ తన హృదయాన్ని మనసుని లండన్కి అంకితం చేసాడు.

ఆ రాత్రి హోటల్లో ఒకే గదిలో బస చేసాం. టై కట్టుకుంటూ హెన్రిక్స్ నన్ను అడిగాడు.

‘‘కోవెంట్ గార్డెన్లోని ఆ గొప్ప మనిషి నీకు తెలుసా?’’

‘‘కోవెంట్ గార్డెన్లో చాలా మంది గొప్పవాళ్ళు ఉన్నారు." చెప్పాను.

"బేలన్సింగ్ ఏక్ట్ చేసే అతని గురించి నేను చెప్పేది. గ్రీన్ గ్రోసరో, ఇంకేదో అతని పేరు.’’

"గ్రీన్ గ్రోసర్? జిమ్ ది పోర్టర్ అతని పేరు. ట్రాఫిక్ మధ్య వంద బుట్టలని నెత్తి మీద పెట్టుకుని బేలన్స్ చేస్తాడు."

"వంద శాతం కరెక్ట్"

"నా జీతంలో కొంత అడ్వాన్సా ఇస్తారా?" అద్దం ముందు నిలబడి టై కట్టుకుంటూ అడిగాను.

‘‘తప్పకుండా, ఏభై ఇస్తే చాలా?" అడిగాడు.

చాలన్నాను. అతను కబోర్డ్ తెరిచి అందులోంచి బ్రీఫ్ కేస్ని బయటికి తీసాడు. అందులోంచి ఓ నోట్ల కట్ట తీసి, ఏభై డాలర్లు లెక్కపెట్టడం అద్దంలోంచి చూసాను.

"నేను బార్కి వెళ్తున్నాను." చెప్పాను.

‘‘మంచి ఆలోచన. రెండు నిమిషాలు ఆగు. నేనూ వస్తాను." హెన్రిక్స్ కోరాడు.

నాకు వంటరిగా తాగాలని ఉంది. కానీ వద్దనలేను. నేను లండన్ నించి బయటికి వచ్చాక లండన్ని మర్చిపోవాలి అనుకున్నా కానీ ఆ అదృష్టం లేదు. బ్రిటిష్ క్వీన్ కోసం మూడు సార్లు టోస్ట్ చేసాం. బార్ టెండర్తో హెన్రిక్స్ బ్రిటిష్ బీర్ కన్నా అమెరికన్ బీర్ ఎందుకు బావుండదో చెప్పసాగాడు. అకస్మాత్తుగా నాకు నా మిత్రుడు కనపడడంతో నేను లేచి అతని దగ్గరికి వెళ్ళాను.

"నువ్వు కష్టంలో ఉన్నావు. న్యూయార్క్ నించి నాకు డచ్ ఫోన్ చేసాడు. నువ్వు అతనికి నాలుగు వేల రెండు వందల డాలర్లు బాకీ పడ్డావట. నువ్వు కనపడితే తనకి చెప్పమన్నాడు . అతనెవరు?" హెన్రిక్స్ వంక చూస్తూ అడిగాడు.

‘‘అతనికి కారు డ్రైవర్ని. శాన్ఫ్రాన్సిస్కోకి తీసుకెళ్తున్నాను."

‘‘అతన్ని వదిలెయ్! మనం రేపు ఫ్లోరిడాకి వెళ్దాం. ఐదు వందల డాలర్లకి పది వేలు గెలుచుకోవచ్చు. నా దగ్గర గట్టి సమాచారం ఉంది. ఐదు వందల డాలర్లకి తక్కువైతే లాభం లేదు. అతని దగ్గర డబ్బు ఏమైనా ఉందా?"

‘‘ఈసారి మనం ఓడిపోం కదా? అడిగాను.

‘‘ఓడిపోం. ఇది, మరణం, టేక్సా నిశ్చయం."

"నేను ఐదు నిమిషాల్లో మళ్ళీ నిన్ను కలుస్తాను. అతను పైకి వస్తుంటే నాకు ఫోన్ చేసి చెప్పు, రూమ్ నంబర్ 582."

‘‘సరే." ఒప్పుకున్నాడు.

నేను రిసెప్షన్లో తాళంచెవి తీసుకుని, మా గదికి వెళ్ళి కబోర్డ్ తాళం తీసి, అతని బ్రీఫ్ కేస్ని తెరిచాను. కొన్ని కాగితాల కింద డబ్బుంది. నేను తీసిన నోట్ల కట్టలో ఇరవైలు, పదులు, ఐదులు ఉన్నాయి. మొత్తం ఐదు వందలో, వెయ్యి డాలర్లో ఉండచ్చనుకున్నాను. దాన్ని ఆనందంగా కోటు జేబులో ఉంచుకున్నాను. ఆ కాగితాలని పరిశీలించాను. వ్యాపారానికి సంబంధించిన అనేక కాగితాలు, టేక్స్ రసీదులు, బర్త్ సర్టిఫికెట్, అఫిడవిట్స్ మొదలైనవి ఉన్నాయి. ఆ కాగితాలు శాన్ఫ్రాన్సిస్కోలోని అతని వ్యాపారానికి చెందినవి. అదేమిటో తెలుసుకోవాలని ఓ ఉత్తరాన్ని చదివాను. లండన్ లోని బెడ్ఫోర్డ్ పార్క్ అడ్రస్కి హెన్రిక్స్కి టైపు చేయబడ్డ ఆ ఉత్తరంలో అతని గతించిన మేనమామకి చెందిన అమెరికాలోని ఎస్టేట్కి హెన్రిక్స్ ఏకైక వారసుడని, అతని ఐడెంటిటీ, ఆఫీసు కాగితాలతో వస్తే ఇంక ఎంత మాత్రం ఆలస్యం చేయకుండా రెండు లక్షల డాలర్లని ఇస్తామని ఉంది. “ఇక్కడి బంధువులకి కాని, లాయర్కి కాని మీరు అపరిచితులు కాబట్టి మీ ఐడెంటిటీని నిరూపించుకోవాలి. మా ఆఫీస్కి ఆ కాగితాలతో రండి.”

ఆ ఉత్తరం మేథ్యూ కెల్సన్ అనే లాయర్ రాసింది. ఆ కాగితాలన్నీ వెంటనే పరిశీలించాను. అవసరమైన సర్టిఫికెట్స్, అఫిడవిట్స్ అన్నీ ఉన్నాయి. దేనిలోనూ హెన్రిక్స్ ఫోటో లేదు. కెల్సన్స్ ఆఫీస్కి వాకర్ హెన్రిక్స్గా ఆ కాగితాలతో ఎవరు వెళ్తే వాళ్ళనే హెన్రిక్స్గా కెల్సన్ భావిస్తాడని, అతనే రెండు లక్షల డాలర్లకి వారసుడు అవుతాడని నాకు అర్థమైంది. వెంటనే నాకో కొత్త ఆలోచన తట్టింది. నేను వెంటనే డబ్బుని, ఆ కాగితాలని లోపల పెట్టేసాను. కబోర్డ్ తాళం వేసి, కింద బార్కి వచ్చాను.

నా కోసం వేచి ఉన్న నా మిత్రుడు "ఎప్పుడు బయలుదేరుదాం?” అని అడిగాడు.

“సారీ. డబ్బు లేదు. కుదరదు.” చెప్పాను.

హెన్రిక్స్ దగ్గరికి వెళ్ళి చెప్పాను.

"త్వరగా పడుకుందాం. ఇక్కడి నించి కేన్సాస్ సిటీకి ఆరు వందల మైళ్ళు త్వరగా లేచి బయలుదేరాలి."

"ఈ దేశంతో వచ్చిన చిక్కే ఇది. చాలా పెద్దది. మనం శాన్ఫ్రాన్సిస్కోకి ఎప్పుడు చేరుకుంటాం?" హెన్రిక్స్ అడిగాడు.

"మధ్యలో ఎలాంటి ప్రమాదాలు జరక్కపోతే నాలుగైదు రోజులు పట్టచ్చు." చెప్పాను.

* * *

ఆ రాత్రి మేము డెన్వర్ నగరం లోంచి వెళ్తుండగా కునుకు తీస్తున్న హెన్రిక్స్కి మెలకువ వస్తే చెప్పాను.

"డెన్వర్. తర్వాతది సాల్ట్ లేక్ సిటీ."

"అక్కడ నాకో పెద్దమ్మ ఉందని తెలుసా?" అడిగాడు.

"తెలీదు. ఈ దేశంలో మీకు తెలిసిన వారు ఉన్నారని నేను అనుకోలేదు." చెప్పాను.

"మార్గరెట్ ఆంటీ తప్ప ఇంకెవరూ లేరు. నేనావిడ్ని ఎప్పుడూ చూడలేదు. చూడబోవడం లేదు కూడా. ఆమె నా అమ్మకి అక్క ఆమె భర్త స్టాడర్డ్ ఈ పాటికి ఆమె అమెరికన్ అయిపోయి ఉంటుంది. ఆవిడతో మాట్లాడడం విసుగే."

నేను హెన్రిక్స్ పాత్రలో ఎలా ఇమడగలనో తెలుసుకునేందుకు ఇదో మంచి అవకాశం అనుకున్నాను. మర్నాడు ఉదయం సాల్ట్ లేక్ సిటీలో దినపత్రికలు అమ్మే షాప్లో ది లండన్ టైమ్స్ దొరికింది. దాన్ని హెన్రిక్స్కి ఇచ్చి నేను చిరునామా సంపాదించి ఆవిడ ఇంటికి వెళ్ళాను. చాలా పెద్ద ఇల్లు, ఆవిడ తలుపుకి ఉన్న మరో చిన్న తలుపుని తెరిచి చూస్తూ అడిగింది.

"ఎవరు?"

"మీరు మిసెస్ మార్గరెట్ స్టాడ స్త్రాట్డ్?"

"అవును."

"నేను శాన్ఫ్రాన్సిస్కోకి వెళ్తూ, దారిలో మిమ్మల్ని చూద్దామని ఆగాను. నా పేరు వాకర్ హెన్రిక్స్"

వెంటనే ఆమె తలుపు తెరిచి చెప్పింది.

"నేను నమ్మలేకపోతున్నాను."

"ఎందుకని?" నేను వెంటనే అడిగాను.

"నువ్వొస్తావని నేను ఊహించలేదు. శుక్రగ్రహం నించి వచ్చిన మనిషిలా అనిపిస్తున్నావు. లోపలికి రా."

వాకర్ హెన్రిక్స్ కుంటుతూ నడుస్తాడని గమనించాను కాబట్టి నేను కూడా కుంటుతూ నడుస్తూ లోపలికి వెళ్ళాను.

ఆవిడ నేను హెన్రిక్స్ అని నమ్మి టీ కూడా కలిపి ఇచ్చింది. నామీద ఎలాంటి అనుమానం కలగలేదు. నేను ఆ పరీక్షలో పాసయ్యాను. నా భయాలు తొలగిపోయాయి.

"నాకు ఓ ప్రశ్నకి సమాధానం చెప్పండి. అంకుల్ గెరాల్డ్ ఆ డబ్బుని నాకెందుకు రాసారు?"

"చిన్న పిల్లగా ఉండగానే మీ అమ్మతో బాగా స్నేహం. నీకిచ్చింది కూడా చాలా తక్కువే."

ఆవిడ దగ్గర సెలవు తీసుకున్నాను. మేము మళ్ళీ బయలుదేరాం. సాల్ట్ లేక్ సిటీ నించి రెనోకి 521 మైళ్ళు. ఆగకుండా శాన్ఫ్రాన్సిస్కోకి వెళదామని హెన్రిక్స్కి నచ్చచెప్పాను. అందుకో ప్రత్యేక కారణం ఉంది. రాత్రికి మేము నెవెడా ఎడారి మీదుగా వెళ్ళాము.

* * *

హెన్రిక్స్ ముందు సీట్లో నిద్రపోతున్నాడు. ఎల్కో దగ్గర హై వే ఫోర్ నించి ఓ మట్టి రోడ్డులోకి కారుని తిప్పి, పదిహేను ఇరవై మైళ్ళు వెళ్ళాక కారుని ఆపాను.

‘‘ఏం జరిగింది?'' కునుకుతున్న హెన్రిక్స్ అడిగాడు.

‘‘సారీ! మనం దారి తప్పినట్లున్నాం.''

‘‘దారి తప్పామా?’’

నేను అతనికి రోడ్ మేప్ చూపించి చెప్పాను.

‘‘ఈ గీత షార్ట్ కట్ రోడ్డుని సూచిస్తోంది. కానీ అది అబద్ధం అని అర్థమైంది.''

"నష్టమేమీ లేదు. వెనక్కి తిప్పి, మళ్ళీ మెయిన్ రోడ్ మీదకి పోనించు." సూచించాడు.

‘‘మనం వెనక్కే వెళ్తున్నాం. మెయిన్ రోడ్ రావడం లేదు.''

‘‘భలే చిక్కులో పడ్డాం. ఏం చేద్దామంటావ్?''

‘‘ఈ రాత్రి ఇక్కడే గడుపుతాం. కార్లో కంటే మీరు బయట పడుకోవచ్చు. మనం డ్రైవ్ చేస్తుంటే పెట్రోల్ అయిపోయింది. చాలామంది నెవెడా ఎడారిలో ఇలాగే మాయం అవుతూంటారు.''

‘‘భయమేం లేదుగా?’’’

"భయమా?'' అమాయకంగా ప్రశ్నించాను.

‘‘గేదెలు? రెడ్ ఇండియన్స్....''

‘‘లేదు.’’

అతను బయట నేల మీద పరుచుకున్న దుప్పటి మీద నిద్రపోయాక నేను లేచి కారెక్కి స్టార్ట్ చేసి, రివర్స్ గేర్లో దాన్ని సరిగ్గా అతని తల మీదకి ఎక్కించాను. అతని అరుపు వినిపించాక ముందుకి బయలుదేరాను. ఎందుకో నాకు కొద్దిగా జంకుగా అనిపించింది. నా వృత్తిలో ఏదన్నా జరగబోతూంటేనే జంకు కలుగుతుంది అని నా అనుభవం.

మర్నాడు సెవెడా పేపర్లన్నీ కొని చదివాను.ఎక్కడా శవం దొరికిన వార్తే లేదు. ఇక ఇటో అటో మాత్రమే నాకు మిగిలింది. నా జంకు వల్ల అచ్చు పడితే వెనక్కి వెళ్ళాలి. బొమ్మ పడితే ముందుకు వెళ్ళాలి అనుకున్నాను.బొమ్మ పడింది. మేథ్యూ కెల్సన్ ఆఫీస్కి చేరుకున్నాను. ఓ లేడీ టైపిస్టు టైప్ చేస్తోంది.

"నా పేరు వాకర్ హెన్రిక్స్, కెల్సన్తో ఈ టైంకి ఫోన్ ద్వారా అపాయింటిమెంట్ తీసుకున్నాను."

“అవును. మిస్టర్ కెల్సన్ మీకోసం చూస్తున్నాను. వెళ్ళండి." ఆమె ఇంటర్కంలో ఆ సంగతి చెప్పి నన్ను లోపలికి వెళ్ళమంది. థేంక్స్ చెప్పి నేను కొద్దిగా బెరుగ్గానే వెళ్ళాను.

"మిస్టర్ హెన్రిక్స్. శాన్ఫ్రాన్సిస్కోకి స్వాగతం. నేను మేథ్యూ కెల్సన్ని."

ఆ అరవై పై బడ్డ వ్యక్తితో నేను నవ్వుతూ కరచాలనం చేసాను.

“ప్రయాణం బాగా సాగిందా?” అడిగాడు.

“చాలా దూరం ప్రయాణించాల్సి వచ్చింది. మీ దేశం చాలా పెద్దది." బ్రి

"మీరీ పని త్వరగా పూర్తి చేసుకుని ఇంగ్లండ్కి తిరిగి వెళ్ళాలనుకుంటున్నారని నాకు తెలుసు. మొదలు పెడదామా?”

“తప్పకుండా, అన్ని కాగితాలు తెచ్చాను. నాకు మీరు రాసిన ఉత్తరాలతో సహా." ఆయన అన్నీ పరిశీలించి సరిగానే ఉన్నాయని చెప్పాక అడిగాను.

"మిస్టర్ కెల్సన్! ఆ డబ్బు నాకు రావడానికి ఎంతకాలం పడుతుంది?"

"డబ్బు లేదు."

"ఐ యాం సారీ. నాకు అర్థం కావడం లేదు. ఏదైనా సమస్యా? అన్నీ సవ్యంగానే ఉన్నాయిగా?"

"లేవు." అంతదాకా మౌనంగా డ్రాయర్లోని ఫైల్స్ని చూస్తున్న ఓ మధ్య వయస్కుడు నా వంక తిరిగి చెప్పాడు.

"ఇంకో కాగితం ఈ కాగితాలన్నిటినీ రద్దు చేసింది."

"ఏమిటది?" అడిగాను.

"వాకర్ హెన్రిక్స్ డెత్ సర్టిఫికెట్. గుర్తు తెలియని ఒకరో, ఎక్కువ మందో ఆయన్ని చంపారు. శవం దొరికింది. నా పేరు సార్జెంట్ మేక్. శాన్ఫ్రాన్సిస్కో హోమిసైడ్ సెక్షన్కి చెందినవాడిని."

నేను చిన్నగా నవ్వి కూర్చున్నాను. అదృష్టం విజేతలకి అనుకున్నాను.

"ఆ హత్య గురించి చెప్తావా?" మేక్ అడిగాడు.

"చెప్పడానికి పెద్దగా ఏం లేదు. నా పేరు ఛార్లీ రేమండ్ న్యూయార్క్లో హెన్రిక్స్ ప్రకటన చూసి ఫోన్ చేసాను. అతను నన్ను డ్రైవర్గా తీసుకున్నాడు. ఇది చాలా తేలిక పథకం అనుకున్నాను. అతని మీదకి కారు ఎక్కించి చంపాను. అతని శవం ఇక్కడికి వెయ్యి మైళ్ళ దూరంలో ఉంది. నెవెడా ఎడారిలో అది ఎక్కడుందో నాకే తెలీదు. మీకా శవం ఎక్కడ దొరికింది?" అడిగాను.

కెల్సన్ ఏదో మాట్లాడబోతుంటే వద్దన్నట్లుగా మేక్ సైగ చేసాడు.

"నెవెడా ఎడారా? కారెక్కించి చంపావా? అదేమిటి?"

"నెవెడా పోలీసులు సరిగ్గా పని చేయరా?''

''మాకు నెవెడా పోలీసుల నించి హత్యకి చెందిన ఫిర్యాదు ఏదీ రాలేదు రేమండ్. ఎడారిలో ఎవరికీ ఆ శవం కనపడలేదు.''

''అలాంటప్పుడు నేనే అతన్ని చంపానని మీకెలా తెలిసింది?''

''నువ్వు లోపలికి వచ్చినప్పుడు కుంటుతూ ఎందుకు నడిచావు?'' మేక్ అడిగాడు.

"ఎందుకంటే హెన్రిక్స్ కుంటుతూ నడుస్తాడు కాబట్టి.... కమాన్ మేక్. నేను హెన్రిక్స్ని చంపిన సంగతి మీకెలా తెలిసిందో చెప్పండి.''

"నాకు తెలీదు. వాకర్ హెన్రిక్స్.... అసలు వాకర్ హెన్రిక్స్ని న్యూయార్క్లో రివాల్వర్తో కాల్చి హడ్సన్ నదిలో పడేసారు. బ్రిటన్కి చెందిన మోసగాడు ఇంగ్లీష్ జిమ్ ఆ పని చేసాడని మాకు తెలిసింది. ఇంగ్లీష్ జిమ్ కుంటుతూ నడిచేవాడు. నిన్ను అతను డ్రైవర్గా తీసుకోవడానికి కారణం లండన్ గురించిన విశేషాలు తెలుసు కోవడానికై ఉంటుంది. ఇక్కడికి మేము ఇంగ్లీష్ జిమ్ వస్తాడనుకున్నాం. కానీ అతను నెవెడా ఎడారి దాకానే వచ్చాడని ఇప్పుడు అర్థమైంది. విషయం మాకు వివరించినందుకు థాంక్స్ రేమండ్.''

నేను పకపక నవ్వసాగాను.

---

## దోషి - జేమ్స్ బుష్

లయోనెల్, జిమ్లకి చాలా విషయాల్లో తేడాలున్నాయి. లయోనెల్ మొగవాళ్ళ దుస్తుల దుకాణంలో మేనేజర్గా పనిచేస్తుంటే, జిమ్ లండన్ నగరంలోని ఓ ఆఫీస్లో ప్యూన్గా పనిచేస్తున్నాడు.

లయోనెల్, జిమ్లకి మూడు విషయాల్లో మాత్రం పోలికలున్నాయి. వాళ్ళిద్దరూ ఒకే గ్రామంలో నివశిస్తున్నారు. ఇద్దరూ బ్రహ్మచారులే. ఇద్దరికీ డబ్బంటే ఆశ.

ప్రతీ ఉదయం వాళ్ళిద్దరూ ఎనిమిది ఇరపై ఎనిమిదికి వాళ్ళ గ్రామంలో ఆగే లోకల్ ట్రెయిన్ ఎక్కి సాయంత్రం తిరిగి ఆరూ నలభై ట్రెయిన్లో దిగుతారు. కొన్ని సంవత్సరాలుగా ఆ విధంగా ప్రయాణం చేస్తున్న వాళ్ళిద్దరికీ సీజన్ టిక్కెట్లున్నాయి. ఒకే రోజు వాటిని రెన్యూ చేయిస్తూంటారు. ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. తేలికగా డబ్బు సంపాదించగలిగే మార్గాల గురించి ఇద్దరూ తరచూ ఆలోచించి, ఒకరి ఆలోచనలని మరొకరికి చెప్తుంటారు.

ఓ పోస్ట్మేన్ కవర్లలోని చెక్కులని దొంగిలించి, తన పేరు రాసుకుని వాటికి నగదు పొందడం గురించిన ఓ వార్త ఆ రోజు దినపత్రికలో వచ్చింది. దాన్ని చదివి చెప్పాడు లయోనెల్.

"వెధవ. మూడువందల పౌండ్లకోసం ఆశపడ్డాడు. జైలుకెళ్ళాడు. నేనయితే కనీసం అయిదు లక్షల పౌండ్లకి ఒక్క షిల్లింగ్ తగ్గినా దొంగతనం చేయను."

"నేను కూడా అంతే." వప్పుకున్నాడు జిమ్.

వారిద్దరూ, విరామ సమయాల్లో, కేవలం బేంకాఫ్ ఇంగ్లండ్లోకి సొరంగం తవ్వడం, టవర్ ఆఫ్ లండన్లో ఉన్న బ్రిటిష్ రాణి నగలని దొంగిలించటంలాంటి వాటిని గురించి మాత్రమే ఊహలు అల్లుకునేవారు అసాధ్యం అని తెలిసి కూడా.

చివరికి లయోనెల్కి చక్కటి పథకం ఒకటి తట్టింది. తను పనిచేసే దుస్తుల దుకాణం పక్కనే ఉన్న ఖరీదైన వజ్రాల దుకాణంలోని వజ్రాలు దొంగిలించాలనుకున్నాడు.

ఆ దుకాణం ప్రధాన ద్వారం ఎప్పుడూ లోపలి నించి తాళం వేసి ఉంటుంది. కొనుగోలుదారు లోపలికి వెళ్ళాలనుకుంటే తలుపుకున్న మీటని నొక్కాలి. లోపల గంట మోగుతుంది.

తలుపుకున్న అద్దంలోంచి చూసి, తమ దుకాణంలో తరచూ కొనే వ్యక్తే అనుకుంటేనే తలుపుతెరుస్తాడు దుకాణం యజమాని.

జిమ్మి తన పథకం చెప్పాడు లయోనెల్. జిమ్మి కూడా అది నచ్చింది. సోమవారం ఉదయం లయోనెల్ వెళ్లి వజ్రాల దుకాణం తలుపుకున్న మీట నొక్కాడు. అద్దంలోంచి లయోనెల్ని చూసి తలుపు తెరిచాడు యజమాని. చిల్లర కోసం లయోనెల్ తరచూ ఆ దుకాణంలోకి రావడం మామూలే.

తలుపు తెరవగానే లయోనెల్ వెనక నక్కివున్న జిమ్ తలుపులోంచి లోపలకి వెళ్ళి మెరుపులా చేతిలో సిద్ధంగా వుంచుకున్న క్లోరోఫాంలో ముంచిన బట్టని యజమాని మొహానికి అదిమాడు. అతనికి స్పృహ తప్పగానే లోపలికి వెళ్ళారిద్దరూ. దుకాణంలోని విలువయిన వజ్రాలని, నగలని తమ సంచీలలో నింపి యజమాని నోట్లో గుడ్డలు కుక్కి అతని కాళ్ళు చేతులూ వెనక్కి విరిచి కట్టేసారు.

నలభై నిమిషాల తర్వాత ఇద్దరూ తమ చేతుల్లోని సంచులతో లోకల్ ట్రెయిన్ ఆగే ప్లాట్ఫాం మీదకి వచ్చారు. ఆరున్నరకి వచ్చే బండిలో ఎక్కి ఎయిర్పోర్ట్ స్టేషన్లో దిగి చాలా దూరంలో వున్న ఇంకో నగరానికి బయలుదేరే విమానంలో పారిపోదలచుకున్నారు. ముందే కొన్న విమానం టిక్కెట్లు వాళ్ళ జేబుల్లో సిద్ధంగా వున్నాయి.

రైలు వస్తూండగా, "ఏయ్! మీరిద్దరూ రండిటు." అన్న మాటలు వెనకనించి ఇద్దరికీ వినపడ్డాయి. వెనక్కి తిరిగి చూస్తే పోలీసు.

ఇద్దరి గుండెల్లో వణుకు ప్రారంభం అయింది. ఇద్దరూ గబగబా పరిగెత్తసాగారు. లయోనెల్ కాలుజారి కిందపడ్డాడు. చేతిలోని సంచీ ఆ విసురుకి తెరుచుకుని అందులోని వజ్రాలన్నీ ప్లాట్ ఫారం మీదకి ఒలికాయి. వెనకనించి వచ్చిన రైల్వే పోలీసు జిమ్ని, లయోనెల్ని గట్టిగా పట్టుకున్నాడు. ఇద్దరూ తమ ఆట కట్టిందని గ్రహించారు.

"మేమే దొంగలమని ఎలా కనుక్కున్నావ్?" అడిగాడు లయోనెల్ నీరసంగా.

రైల్వే పోలీసు మొహంలో ఆశ్చర్యం తొణికిసలాడింది. ప్లాట్ఫాం మీద ఒలికిన వజ్రాలని చూస్తూ చెప్పాడు –

‘‘ఓ... మీరు దొంగలా! లోపలికి వస్తూ గేటు దగ్గిర మీరు చూపించిన సీజన్ టిక్కెట్లు రెండూ కిందటి శుక్రవారం నించి చెల్లవు. వాటిని మీరు మళ్ళీ రెన్యూ చేయలేదు అని గుర్తుచేయడానికి పిలిచానంతే" అంటూనే ఆ పోలీసు దూరాన ఉన్న మరో ఇద్దరు పోలీసులని రమ్మని సైగ చేసాడు.

---

## నేనే చంపాను - అలెక్ కాపెల్

ఆక్స్లీ కోర్ట్ హోటల్లోని ఆ గదిలోకి ట్రేలో టీ కప్పు, బ్రేక్ఫాస్ట్తో వచ్చిన ఛాంబర్ మెయిడ్ తలుపు మీద తట్టి తెరుస్తూ చెప్పింది.

"కౌంట్ మరోనీ! మీ టీ తెచ్చాను.’’

బెడ్రూంలోని మంచం ఖాళీగా కనపడడంతో టీని ముందు గదిలో టేబుల్ మీద ఉంచి, కిటికీ తెరలు తెరిచి వెనక్కి తిరిగింది. ఎదురుగా సోఫాలో నిద్రపోతున్న కౌంట్ కనిపించాడు. అతను రాత్రి తాగి అక్కడే నిద్రపోయాడని ఊహించి అతన్ని పేరు పెట్టి పిలుస్తూ కుదిపింది. తక్షణం అతని తల పక్కకి వాలిపోయింది. కుడి చెవికి పైన అయిన బుల్లెట్ గాయాన్ని రకాన్ని చూసిన ఛాంబర్ మెయిడ్ కెవ్వున అరిచింది.

* * *

హోటల్ మేనేజర్ మార్టిన్ ఫోన్ అందుకున్న స్కాట్లాండ్ యార్డ్ ఇన్స్పెక్టర్ డేవిడ్సన్ అరగంట తర్వాత వచ్చి శవాన్ని పరిశీలించాడు. నేల మీద పడి ఉన్న హత్యాయుధమైన రివాల్వర్,

తెరచి ఉన్న పర్స్ లోంచి బయటకి కనిపించే రక్తపు వేలిముద్రలు అంటిన నోట్లు ఆయనకి కనిపించాయి. ఛాంబర్ మెయిడ్ పాలీ ఆ రివాల్వర్ హతుడు కౌంట్ మరోనీదే అని గుర్తించింది.

‘‘సర్జన్ డాడ్స్ ప్రకారం మరణం అర్ధరాత్రి పన్నెండు, రెండు మధ్య జరిగింది సర్. నుదుట దిగిన బుల్లెట్ మరణానికి కారణం. ఈ కుచ్చు బహుశా హంతకుడికి చెందింది. ఇక్కడున్న దేనికీ ఇది మేచ్ అవడం లేదు. దీపం కింద పడి బల్బ్ ముక్కలైంది. ఇదే మనకి తెలిసిన సమాచారం." అతనికన్నా ముందే వచ్చిన అసిస్టెంట్ రైన్స్ చెప్పాడు.

ఇన్స్పెక్టర్ డేవిడ్సన్ ఎదురుగా టేబిల్ మీదున్న పోస్ట్లో వచ్చిన ఓ కవర్ని విప్పదీసి, అందులోంచి ఓ ఉత్తరం తీసి చదివాడు.

లార్డ్ సారింగ్టన్ సోమవారం పదిహేడో తారీకు డిన్నర్కి రాలేడని తెలిపే ఉత్తరం అది.

‘‘సర్. ఈ ఉత్తరం డేట్ పదమూడు రోజుల క్రితంది. కవర్ మీది పోస్టల్ ముద్ర నిన్నటిది." గమనించిన రైన్స్ చెప్పాడు.

డేవిడ్సన్ సూచన మీద లెటర్ హెడ్ మీది లార్డ్ సారింగ్టన్ నంబర్కి రైన్స్ వెంటనే ఫోన్ చేసాడు.

అతను లైన్లోకి రాగానే డేవిడ్సన్ చెప్పాడు.

"మీ మిత్రుడు కౌంట్ మరోనీకి చిన్న ప్రమాదం జరిగింది."

"నేనా పేరు ఎన్నడూ వినలేదు." అవతలి నించి జవాబు వచ్చింది.

‘‘దయచేసి మీరు బేకర్ స్ట్రీట్లోని ఆక్స్లీ కోర్టుకి వెంటనే రావాలి." డేవిడ్సన్ అతన్ని పిలిచాడు.

కౌంట్ మరోనీ రోమ్ నించి వచ్చాడని తెలుసుకున్న డేవిడ్సన్ అతని రోమ్ చిరునామా తీసుకు రమ్మని మేనేజర్ని కోరాడు. దాంతో వచ్చిన మేనేజర్ మార్జిన్కి డేవిడ్సన్ ఆ గదికి పక్క గదికి మధ్య గల పార్టిషన్ తలుపుని చూపించి అడిగాడు.

"దీనికి బోల్టు పెట్టి లేదు. ఆ గదిలో ఎవరున్నారు?''

''రూపర్ట్, అతను ముందే ఉత్తరం రాసి రిజర్వ్ చేసుకుని రెండు వారాల క్రితం దిగాడు. ఆ ఉత్తరంతోనే వారం అద్దె పంపాడు. క్రితం శుక్రవారం రెండో వారం అద్దె ఉన్న కవర్ ఛాంబర్ మెయిడ్కి టేబుల్ మీద కనిపించింది. ఆ గదిలో అతన్ని మేలట్ తప్ప ఎవరూ ఎన్నడూ చూడలేదు. మేలట్ లిఫ్ట్మేన్."

డేవిడ్సన్ ఆ తలుపు తోస్తే తెరచుకోలేదు.

''ఈ ఫ్లోర్లో ఎన్ని గదులు ఉన్నాయి? ఎంతమంది ఉన్నారు?"

"నాలుగు గదులు ఉన్నాయి. ఒకటి హత్య చేయబడ్డ గది. ఇంకోటి పక్కన రూపర్ట్ తీసుకుంది. అటువైపుది ఖాళీగా ఉంది. ఇంకో దాంట్లో ఇద్దరు ఆడవాళ్ళు ఉన్నారు." మార్టిన్ చెప్పాడు.

మార్టిన్తో ఆయన బయటికి వచ్చి ఆ తలుపు మీద కొట్టాడు. ఎవరూ తెరవక పోవడంతో డేవిడ్సన్ సూచన మీద మేనేజర్ మార్టిన్ ఆ తలుపుని డూప్లికేట్ కీతో తెరిచాక అంతా లోపలికి వెళ్ళారు.

ఎదురుగా మాంటెల్పీస్ మీద మార్టిన్ పేరున ఓ కవర్ కనిపించింది. రైన్స్ దాన్ని తీసి చూస్తే అందులో ఇంకో వారం అద్దె ఉంది. అది చూసి డేవిడ్సన్ చెప్పాడు.

"నిన్న రాత్రి రూపర్ట్ తప్పనిసరిగా ఇక్కడికి వచ్చి వెళ్ళాడు."

"ఇదిగో చూడండి. బుల్లెట్ కేప్."రైన్స్ వంగి, పేల్చిన గుండు కేప్ని తీసి డేవిడ్సన్కి ఇచ్చాడు.

ఇద్దరూ ఆ గదిని పరిశీలించారు. తర్వాత కౌంట్ మరోనీ గదిలోకి ఉన్న తలుపుని డేవిడ్సన్ లాగగానే తెరచుకుంది. ఇద్దరూ లోపలికి నడిచారు. రైన్స్ నడిచి వెళ్ళి ఎదురుగా ఉన్న టేబుల్

మీది టైప్ రైటర్లోని కాగితాన్ని పరిశీలించాడు. వెంటనే దాన్ని బయటకి తీసి డేవిడ్సన్కి చదివి వినిపించాడు.

"బెర్నార్డ్ కె ఫ్రాయ్కి రాసిన ఉత్తరం సార్ ఇది. వినండి. 'నీతో చర్చించడానికి నాకు ఇంక ఏమీ లేదు. ఇక నేను నిన్ను ఇక్కడ కానీ, మా ఇంట్లో….'' ఆగి రైన్స్ మళ్ళీ ఆసక్తిగా చెప్పాడు.

''తర్వాత టైపైనది వినండి! ఫ్రాయ్కి ఈ గదిలోకి చేతిలో రివాల్వర్తో ఇప్పుడే వచ్చాడు. అద్దంలో నాకు కనిపిస్తున్నాడు. నాకు ఏమైనా అయితే…..' అంతే సర్."

"ప్రఖ్యాత రేస్ హార్స్ ఓనర్, అమెరికన్ పోలో ప్లేయర్ బెర్నార్డ్ కె ఫ్రాయ్ ఇతనే అయి ఉండచ్చు. అతను డోర్స్టర్ హోటల్లో ఉన్నాడని దినపత్రికలో చదివాను."

వెంటనే డేవిడ్సన్ రిసీవర్ అందుకుని డోర్స్టర్ హోటల్కి కనెక్షన్ ఇవ్వమని కోరాడు.

"మిస్టర్ బెర్నార్డ్ కె ఫ్రాయ్ మీ హోటల్లో ఉన్నారా... థాంక్ యూ మిస్." చెప్పి రిసీవర్ పెట్టేసాడు.

బయట ఉన్న తన ఇంకో సహాయకుడు క్లిస్టన్ని పిలిచి చెప్పాడు.

"డోర్స్టర్ హోటల్కి వెళ్ళి మిస్టర్ బెర్నార్డ్ కె ఫ్రాయ్ని వెంట పెట్టి తీసుకురా. రేపు ఉదయం వెళ్ళిపోతున్నాడట. ఎందుకో చెప్పకు."

''పక్కగది అద్దెకి తీసుకున్న రూపర్ట్, బెర్నార్డ్ కె ఫ్రాయ్ ఒక్కరే అంటారా?"రైన్స్ ప్రశ్నించాడు.

''అవును. ఇది చాలా తేలిక కేసు. నైట్ లిఫ్ట్ బోయ్ మేలట్తో మాట్లాడుదాం. పిలు.''

మేలట్ లేడు. రూపర్ట్ని తను చూడలేదని డ్యూటీలో ఉన్న లిఫ్ట్ మేన్ జాన్సన్ జవాబుగా చెప్పాడు.

"బెర్నార్డ్ కె ఫ్రాయ్ని చూసావా?" డేవిడ్సన్ అతన్ని అడిగాడు.

"చూసానండి. మూడు వారాల క్రితం ఓ మధ్యాహ్నం కౌంటిని చూడటానికి వచ్చాడు. ఆ సమయంలో "కౌంట్ లేడు" అని నేను చెప్తే,'ఉన్నాడు. కానీ నన్ను చూడటానికి భయపడుతున్నాడు' అని చెప్పి ఫ్రాయ్ వెళ్ళిపోయాడు."

కాసేపటికి కబురు అందుకుని వచ్చిన మేలట్ డేవిడ్సన్ దగ్గరికి వచ్చాడు.

"నీ మొహం ఇదివరకు ఎక్కడో చూసినట్లుంది." డేవిడ్సన్ అతన్ని చూసి అడిగాడు.

"కానీ మీ మొహం నేను చూడలేదు." అతను చెప్పాడు.

"పక్క గదిలో దిగిన రూపర్ట్ని నువ్వెప్పుడైనా చూసావా?"

"చూసాను. గుర్తు పట్టగలను." మేలట్ జవాబు చెప్పాడు.

తలుపు చప్పుడైంది. మేలట్ని బెడ్ రూంలోకి వెళ్ళమని డేవిడ్సన్ టైప్ అయిన ఉత్తరాన్ని టైప్ రైటర్ రోలర్లో మళ్ళీ ఉంచాక రైన్స్ తలుపు తెరిచాడు.

"మిస్టర్ ఫ్రాయ్ సర్" క్రిస్టన్పరిచయం చేసి వెళ్ళిపోయాడు.

"నేను రేపు మధ్యాహ్నం అమెరికాకి వెళ్ళిపోతున్నాను. నన్నెందుకు రప్పించారు?" అడిగాడు.

"మీ మిత్రుడు కౌంట్ మతానీ గురించి ప్రశ్నించడానికి."

"నాకా పేరు గల మిత్రులెవరూ లేరు." అతను చెప్పాడు.

"ఇక్కడి లిఫ్ట్మేన్ జాన్సన్ మూడు వారాల క్రితం కౌంట్ మతానీని కలవడానికి మిమ్మల్ని చూసాడు. దానికి ఏం చెప్తారు?"

‘‘సరే. నాకు అతను తెలుసు. కానీ అతనితో సంబంధం నాకు ఇష్టం లేక అలా చెప్పాను. అతను మంచివాడు కాడు. నా తప్పు వసూలు చేసుకోడానికి వచ్చాను."

"క్రితం రాత్రి మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారు మిస్టర్ ఫ్రాయ్?" డేవిడ్సన్ ప్రశ్నించాడు.

‘‘నిన్న రాత్రా? రాలేదు. నేనొచ్చింది ఒక్కసారే."

‘‘అంటే పక్క గదిని రూపర్ట్ పేరు మీద మీరు అద్దెకి తీసుకోలేదంటారా?’’

‘‘లేదు. ఎందుకు తీసుకుంటాను?’’

‘‘మరి ఈ ఉత్తరం మాటేమిటి?’’

టైప్ రైటర్లోంచి ఉత్తరాన్ని తీసి అతనికి ఇచ్చి అడిగాడు. దాన్ని చదివి ఓసారి

అద్దం వంక చూసి ఫ్రాయ్ అడిగాడు.

‘‘ఈ ఉత్తరం గురించి మీరు నాకు ముందే ఎందుకు చెప్పలేదు? ఇప్పుడు మీకంతా అవగతమైంది కదా?’’

‘‘అవును. క్రితం రాత్రి కౌంట్ హత్య చేయబడ్డాడు."

"అది నాకు తెలుసు. అతన్ని నేనే చంపాను.’’ ఫ్రాయ్ అంగీకరించాడు.

"మీరు ఏదైనా చెప్పదలచుకుంటే చెప్పచ్చు. ఐతే మీరు చెప్పేది స్టేట్మెంట్గా రాసి, దాన్ని మీకు వ్యతిరేక సాక్ష్యంగా ఉపయోగిస్తాం." డేవిడ్సన్ చెప్పాడు.

‘‘ఈ ఉత్తరం బయటపడ్డాక ఇక ఏదీ దాచి ప్రయోజనం లేదు."

“అవును. ఈ ఉత్తరమే కాక, పక్క గదిని మీరు రూపర్ట్ పేరు మీద తీసుకున్న సంగతి కూడా. అక్కడ రివాల్వర్ కేట్రిడ్జ్ కూడా దొరికింది.”

"ఒక్క నిమిషం. రూపర్ట్ ఏమిటి? నేను రూపర్ట్ పేరుతో పక్క గదిని అద్దెకి తీసుకోలేదు. మీరు కన్ఫ్యూజ్ అయ్యారు ఇన్ స్పెక్టర్.” ఫ్రాయ్ చెప్పాడు.

వెంటనే డేవిడ్సన్ లిఫ్ట్‌మేన్ మేలట్ని పిలిచి అడిగాడు.

"ఇతన్ని ఇదివరకు ఎప్పుడైనా చూసావా? ఇతను రూపర్ట్ కదా?”

“లేదు. ఇతను రూపర్ట్ కాదు." మేలట్ చెప్పాడు.

గదిలో ఫోన్ మోగింది. అవతలి వైపు నించి చెప్పేది విని క్లిఫ్టన్ని పిలిచి డేవిడ్సన్ అయోమయంగా చెప్పాడు.

"ఫ్రాయ్ని ఖాళీ గదిలో ఉంచు. కొద్ది సేపు మీరు ఇతనితో అక్కడే కూర్చోండి. మేలట్! చెప్పకుండా నువ్వు హోటల్ వదిలి వెళ్ళకు."

వాళ్ళ వెళ్ళాక ఒకతను లోపలికి వచ్చి చెప్పాడు.

“నేనే లార్డ్ సారింగ్టన్ని. నన్నెందుకు రమ్మన్నారు?"

"కౌంట్ మతానీ గరించి మీకేం తెలుసు? అతను హత్య చేయబడ్డాడు." అతను కూర్చున్నాక డేవిడ్సన్ అడిగాడు.

“అలాగా? నాకతను తెలీదని ఫోన్లో చెప్పా కదా?”

“ఈ ఉత్తరాన్ని చూసాక కూడా మీ జవాబు అదేనా?” పోస్ట్లో వచ్చి ఉత్తరాన్ని ఇస్తూ చెప్పాడు.

దాన్ని చదివి సారింగ్టన్ ముఖం వివర్ణమైంది. నెమ్మదిగా చెప్పాడు.

"మతానీతో కనెక్షన్ ఇష్టం లేక అబద్ధం చెప్పాను. అతను జూదగాడు."

తలుపు తెరచుకుని క్లిస్టన్తో వచ్చిన మేలట్ చెప్పాడు.

"ఈయనే రూపర్ట్."

"ఏమిటి ఇతను అనేది?" సారింగ్టన్ ప్రశ్నించాడు.

"పక్క గదిని అద్దెకి తీసుకుంది మీరే కదా?"

"నిజమే. రూపర్ట్ పేరుతో నేను పక్కగదిని అద్దెకి తీసుకున్నాను. అది నేరమా?"

మేలట్ని బయటికి పంపించారు.

"అంత రహస్యంగా మీకు తెలిసిన మనిషి పక్క గదినే మారు పేరుతో ఎందుకు తీసుకున్నారు?"

"అది కాకతాళీయంగా జరిగిందని చెప్పి తప్పించుకోలేను. నా సెక్రటరీ ఆ ఉత్తరాన్ని పోస్ట్ చేసి తప్పు చేసింది. కాబట్టి ఇక జరిగింది ఒప్పుకోక తప్పదు. కౌంట్ మతానీని నేనే హత్య చేసాను. మతానీ నా కూతురు హెలెన్ని పెళ్ళి చేసుకున్నాడు. రోమ్లో కాలేజీ చదువు పూర్తి చేసే సమయానికి వాళ్ళకి పరిచయమై పెళ్ళి చేసుకున్నారు. పెళ్ళయ్యాక అతను జూదగాడని తెలిసింది. సంవత్సరం క్రితం హెలెన్ నా దగ్గరికి వచ్చేసింది. అప్పుడు కానీ మాకు ఇవన్నీ తెలియలేదు. మతానీ ఇటీవల తమ ఆర్నెల్ల బిడ్డ సంరక్షణ తనకి చెందాలని న్యాయ పోరాటం చేయడం కోసం ఇక్కడికి వచ్చాడు. బిడ్డకి దూరం అవచ్చనే మా అమ్మాయి బాధని చూడలేక నేనతన్ని చంపేసాను. అతని కదలికలని గమనించడానికే పక్క గది అద్దెకి తీసుకున్నాను. ప్రతీ రాత్రి పదకొండు గంటల కల్లా తప్పతాగుతాడని, లిఫ్ట్ బోయ్ మేలట్ వచ్చి అతన్ని పక్క

మీద పడుకోబెట్టి వెళ్తుంటాడని గ్రహించాను. గురువారాలు మేలటికి ఆఫ్. దాంతో నిన్న గురువారం రాత్రి నేను సైలెన్సర్ అమర్చిన నా రివాల్వర్తో మా రెండు గదుల మధ్య ఉన్న తలుపు తెరిచి లోపలికి వచ్చాను. నిద్రపోతున్న వాడిని కాల్చడం ఇష్టం లేక సోఫాలో పడుకుని నిద్రపోతున్న అతన్ని లేపాను. నా కూతురికి విడాకులు ఇస్తానని, చంపద్దని చెప్తూనే తిరగబడ్డాడు. మా పోట్లాటలో టేబుల్ లైట్ కింద పడింది. అతను డ్రాయర్ లోంచి తన రివాల్వర్ని తీసి నన్ను కాల్చబోయాడు. దాంతో అతన్ని నేను చంపేసాను. అతన్ని కుర్చీలో కూర్చోబెట్టి రివాల్వర్ శబ్దానికి ఎవరూ రాకమునుపే వెళ్ళిపోయాను."

లార్డ్ సారింగ్టన్ వేలిముద్రలు తీసుకోడానికి నిపుణుడికి కబురు చేసారు. అతను అవి తీసుకుంటూంటే, డేవిడ్సన్ అడిగాడు.

‘‘మీ పోట్లాటలో అతని పర్స్ జేబులోంచి కింద పడడం గమనించారా?’’

‘‘లేదు. నా రివాల్వర్ని నా గదిలో డ్రాయర్లో ఉంచి వెళ్ళిపోయాను."

వెంటనే రైన్స్ పక్కగదిలోంచి కర్చీఫ్లో చుట్టి తీసుకు వచ్చిన రివాల్వర్ని చూపిస్తే, అది తనదే అని సారింగ్టన్ ఒప్పుకున్నాడు.

క్లిస్టన్ని పిలిచి సారింగ్టన్ని హోటల్ గదిలోనే నిర్బంధంలో ఉంచమని కోరాక డేవిడ్సన్ వేలి ముద్రల నిపుణుడితో చెప్పాడు.

‘‘రక్తం అంటిన నోట్ల మీది వేలి ముద్రలని ఫ్రాయ్ వేలి ముద్రలతో, లార్డ్ సారింగ్టన్ వేలి ముద్రలతో పోల్చి చూసి వెంటనే నాకు అవి ఎవరివో సమాచారం ఇవ్వు"

"నేను లార్డ్ సారింగ్టనే హంతకుడని పందెం కడతాను." రైన్స్ చెప్పాడు.

‘‘ఇది అమెరికన్ ఫ్రాయ్ పని కాదంటావా?’’

టెలిఫోన్ మోగింది. అవతలి వైపు చెప్పేది విని డేవిడ్సన్ రైన్స్తో చెప్పాడు. "మతానీ శరీరంలో దిగిన గుండు అతని తుపాకీ నించే కాల్చబడింది అని నిర్ధారణ అయింది. అతని గోళ్ళలో ఒకరి చర్మం, రక్తం చిక్కుకుని ఉన్నాయట. హంతకుడ్ని అతను రక్కాడు అని అర్థమవుతోంది. ఇప్పుడు నువ్వేం చేయాలో తెలుసా?''

తల ఊపి రైన్స్ వెళ్ళి క్లిస్టన్తో ఏదో చెప్పాడు. నిమిషంలో వాళ్ళిద్దరూ వచ్చి చెప్పారు. '

''ఫ్రాయ్, సారింగ్టన్ల చేతులు, మెడ, ఒంటి మీద ఎలాంటి రక్కులు లేవు.''

డేవిడ్సన్ నిర్ఘాంతపోయాడు. తర్వాత ఫ్రాయ్ ఉన్న గదిలోకి వెళ్ళి అడిగాడు. "మీరు కౌంట్ మతానీని ఎందుకు, ఎలా చంపారు?''

''అతని భార్య హెలెన్తో నాకు పరిచయమైంది. ఆమెని అతను ఎలా హింసించాడో చెప్పనా?''

"అది అనవసరం. అతను మంచివాడు కాడని నేనూ ఒప్పుకుంటాను.''

''అతను తనతో ఆమె ఇటలీకి రాకపోతే తమ కొడుకుని స్వాధీనం చేసుకునే ప్రయత్నం మొదలు పెట్టబోయాడు. హెలెన్ తన కొడుకుని విడిచి ఉండలేదు. నేను ఆమెని వదిలి ఉండడానికి ఇష్టపడలేదు. దాంతో అతన్ని నేను హత్య చేసాను."

''ఎలా?''

"నిన్న రాత్రి ఒంటిగంటకి హోటల్ గదిలోకి వచ్చి డూప్లికేట్ తాళం చెవి తీసుకుని తుపాకీతో అతని గదిలోకి ప్రవేశించాను. నిజానికి బెదిరించాలనే వచ్చాను. అతను టైప్ రైటర్ ముందు కూర్చుని ఏదో టైప్ చేస్తున్నాడు. నేను రాసిన ఉత్తరం ఇమ్మని అతన్ని అడిగాను.

''అతని భార్యని వెనక్కితీసుకెళ్ళే ప్రయత్నం ఆపకపోతే చంపుతానని ఆ ఉత్తరంలో రాసాను. దాన్ని చింపేసానన్నాడు. కానీ ఆ ఉత్తరం రాసినంత మూర్ఖంగా అతని జవాబుని నేను

నమ్మలేదు. నిలదీస్తే అది అవతలి వైపున్న బల్ల సొరుగులో ఉందని, దానికి తాళం వేసుందని చెప్పి లేచి దాని వైపు వెళ్తూ నా మీద తిరగబడ్డాడు. అతను జేబులోంచి తన రివాల్వర్ని తీయగానే నేను అతని చేతిని పట్టుకుని అతని వైపు తిప్పి దాంతోనే కాల్చాను. తర్వాత అతని శవాన్ని కుర్చీలో కూర్చోబెట్టి కిందపడ్డ నా రివాల్వర్ తీసుకుని పారిపోయాను. ఏక్షణంలోనైనా రివాల్వర్ పేలిన చప్పుడుకి ఎవరైనా రావచ్చని ఆ ఉత్తరాన్ని తీసుకోకుండానే వెళ్ళిపోయాను.''

డేవిడ్సన్ ఆ డ్రాయర్ తెరిచి చూస్తే అందులో ఫ్రాయ్ చెప్పిన ఉత్తరం ఉంది. దాన్ని చదివి అడిగాడు.

"మిస్టర్ ఫ్రాయ్. అతని జేబులోంచి కింద పడ్డ పర్సుని మీరు ముట్టుకున్నారా?"

‘‘లేదు.''

"మీరు వెళ్ళి మళ్ళీ నేను పిలిచే దాకా వేచి ఉండండి."

‘‘ఆలస్యం దేనికి? నన్ను జైల్ సెల్కి పంపచ్చుగా?" ఫ్రాయ్ అడిగాడు.

క్లిస్టన్ అతన్ని తీసుకెళ్ళాక డేవిడ్సన్ రైనోస్తో చెప్పాడు.

"ఒక హత్యకి ఇద్దరు హంతకులు! నాకేం పాలుపోవడం లేదు.''

పక్క గదిలో దిగిన మిస్ లూయిస్ రాజర్స్ని డేవిడ్సన్ పిలిపించి ప్రశ్నించాడు. గత రాత్రి తను రివాల్వర్ పేలిన శబ్దం వినలేదని, రాత్రి పదిన్నరకే నిద్రపోయానని ఆమె చెప్పింది.

మరో గదిలోని మిస్ లలూన్ అనే డాన్సర్ని కూడా డేవిడ్సన్ ప్రశ్నించాడు. తను అర్ధరాత్రి రెండింటికి మెట్లెక్కి తన గదిలోకి వెళ్ళి నిద్రపోయానని, లిఫ్ట్ బెల్ కొట్టినా లిఫ్ట్ బోయ్ లిఫ్ట్ని తీసుకురాలేదని చెప్పింది. తరచూ లిఫ్ట్ బోయ్ మేలట్ కౌంట్ మరానీతో తాగడం చూసానని కూడా చెప్పింది.

ఆమె వెళ్ళాక జాన్సన్ని పిలిపించి గత రాత్రి రెండుకి లిఫ్ట్ని వదిలి ఎక్కడికి వెళ్ళావని డేవిడ్సన్ ప్రశ్నించాడు.

"నా బదులు నిన్న రాత్రి మేలట్ డ్యూటీ చేసాడు. అనేక గురువారాలుగా ఇలా జరుగుతూంది." జాన్సన్ చెప్పాడు.

రైన్స్ వెళ్ళి మేలటిని తీసుకువచ్చాడు.

"గత రాత్రి నువ్వు జాన్సన్ బదులు డ్యూటీలో ఉన్నావా?"

"ఉన్నాను."

"ఇందాక నాకా సంగతి ఎందుకు చెప్పలేదు?" డేవిడ్సన్ ప్రశ్నించాడు.

"మీరు అడగలేదు కాబట్టి."

"యూనిఫాంలో లేకుండా సివిల్ డ్రస్లో ఉన్నావేం?"

"నా యూనిఫాం కనపడలేదు."

"నీ మొహం ఎక్కడో చూసినట్లుంది...." రైన్స్కి ఏదో సౌంజ్ఞ చేసాడు.

అతను బయట నిలబడ్డ యూనిఫాంలోని కాన్స్టేబుల్కి ఆ సూచనని చెప్పాడు. ఫోన్ మోగితే, రిసీవర్ అందుకున్న డేవిడ్సన్కి వేలిముద్రల నిపుణుడు చెప్పాడు.

"నోట్ల మీది వేలి ముద్రలు ఫ్రాయ్వి కావు. సారింగ్టన్వి కూడా కావు."

డేవిడ్సన్ కొద్దిగా నిశ్చేష్టుడయ్యాడు.

“అవి పేట్ లమక్ అనే పాత నేరస్థుడికి చెందినవని స్కాట్లాండ్ యార్డ్ రికార్డ్స్ ప్రకారం తెలిసింది. అతని ఫోటో పంపమంటారా?”

"అక్కర్లేదు. నేను ఇప్పుడు అతన్నే చూస్తున్నాను. థాంక్స్," చెప్పి డేవిడ్సన్ రిసీవర్ పెట్టేసి మేలట్ వైపు తిరిగి చెప్పాడు.

"గుర్తు పట్టాను. పేట్ లమక్ కదా నీ పేరు?”

“మీ జ్ఞాపక శక్తి గొప్పది." మేలట్ చెప్పాడు.

“నీ నేరం ఒప్పుకో లమక్.” కోరాడు.

"నేను మతానీని చంపాను." లమక్ నిస్పృహగా కూర్చుంటూ చెప్పాడు.

ఆ మాటలకి ఉలిక్కిపడ్డ డేవిడ్సన్ తడబడుతూ అడిగాడు.

“లమక్! నువ్వు నిజమే చెప్తున్నావా?”

“అవును. కౌంటిని నిన్న రాత్రి నేనే చంపాను.”

“లేదు...లేదు... ప్రతీ టామ్ డిక్ అండ్ హేరీ కౌంటిని నేనే చంపాను అంటున్నారు. నువ్వు చంపావంటే నేనొప్పుకోను."

ఆ గదిలో కొద్దిసేపు నిశ్శబ్దం రాజ్యం చేసింది. సిగరెట్ వెలిగించి దాన్ని కాల్చాక ఇన్స్పెక్టర్ డేవిడ్సన్ నిర్లిప్తంగా అడిగాడు.

“లమక్! ఏం జరిగిందో చెప్పు.”

‘‘ప్రతీ రాత్రి తాగిన కౌంట్ని అతని మంచం మీద నేను పడుకోబెడతాను. అతని కోట్ జేబులోని పర్సోంచి ప్రతీ రాత్రి కొంత డబ్బు కొట్టేస్తూంటాను. అతనెప్పుడూ డబ్బు పోయిన సంగతి గమనించలేదు. నిన్న రాత్రి అదే విధంగా నేను రెండు గంటలకి ఇక్కడికి వచ్చి ఎప్పటిలా ఆయన్ని మంచం మీద పడుకోబెట్టి పర్స్ లోంచి డబ్బు కాజేస్తూంటే, కౌంట్ చేతిలో రివాల్వర్తో నా దగ్గరికి వచ్చాడు. ‘చేతులెత్తు, నేను నిద్రపోయానని అనుకున్నావు కదా? రోజూ నువ్వు డబ్బు కొట్టేస్తున్న సంగతి తెలియనంత తాగుబోతును కాను నేను' చెప్పి అతను పోలీసులకి ఫోన్ చేయబోతూంటే, అతని మీద తిరగబడ్డాను. నేను కొట్టిన దెబ్బకి కౌంట్ టేబుల్ లేంప్ని కిందికి తోస్తూ పడిపోయాడు. ఐతే తన చేతిలోని రివాల్వర్ని నేను అతని వైపు తిప్పానని చూడకుండా కాల్చాడు. చెవి దగ్గర గుండు తగిలి మరణించిన అతన్ని కుర్చీలో కూర్చోబెట్టాను. పర్స్ని తీసి నోట్లు బయటికి లాగుతూంటే, నా చేతికి అంటిన రక్తం నోట్లకి అంటుకోవడంతో ఆ రక్తాన్ని చూసి భయపడి దాన్ని అలాగే వదిలేసి పారిపోయాను. ట్రిగ్గర్ని నేను లాగలేదు. అతనే లాగాడు. అది ప్రమాదవశాత్తూ జరిగిన హత్య"

డేవిడ్సన్ లమక్ మెడని, చేతులని పరిశీలిస్తే ఎక్కడా రక్కులు కనపడలేదు. క్లిఫ్టన్ చేతిలో హోటల్ యూనిఫాంలో వచ్చి చెప్పాడు.

‘‘ఇది ఇతని దుస్తులు ఉంచుకునే లాకర్లో దొరికింది.’’ పరిశీలిస్తే దానికి భుజం మీద ఉండాల్సిన ఓ కుచ్చు లేదు. తమకి ఆ గదిలో దొరికిన కుచ్చు అదేనని డేవిడ్సన్ గ్రహించాడు. అతని కోటుకి కొద్దిగా రక్తం కూడా అంటుకుని కనిపించింది. ‘‘ఇతను చెప్పింది నమ్మదగ్గదిగా ఉంది కదా?" డేవిడ్సన్ అడిగాడు.

‘‘అవును సార్. ఈ ముగ్గురి ఒప్పుకోలుని స్కాట్లాండ్ యార్డ్ మ్యూజియంలో ఉంచుతారు కదండీ?"రైన్స్ చెప్పాడు.

"వాటిని ఎక్కడ ఉంచుతారు అన్నది ప్రస్తుతం అప్రస్తుతం. ఆ ముగ్గుర్ని వేరే వేరే వాహనాల్లో హెడ్ క్వార్టర్స్కి తీసుకెళ్ళి ఒక గదిలో ఉంచి వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో వింటే, వారిలో ఎవరు అబద్ధమాడుతున్నారో తెలియచ్చు."

* * *

పోలీస్ స్టేషన్లోని ఆఫీస్ గదిలోకి వచ్చిన ఫ్రాయ్ని విష్ చేసి డేవిడ్సన్ వెనక గదిలోకి తీసుకెళ్ళి అక్కడున్న లమక్ని మేలట్గా పరిచయం చేసి వెళ్ళిపోయాడు. డేవిడ్సన్ బయట పోస్ట్ మార్ధమ్ రిపోర్ట్ని చదువుతూంటే, ఫ్రాయ్, లమక్లు గొంతు తగ్గించి మాట్లాడుకున్నారు. లమక్ చెప్పాడు.

"నేను అక్కడికి వెళ్ళేసరికే కౌంట్ మరణించి నేల మీద పడి ఉన్నాడు. దాంతో అతన్ని కుర్చీలో కూర్చోబెట్టి మన పథకం ప్రకారం అన్ని ఆధారాలని అక్కడ వదిలి వెళ్ళిపోయాను. కానీ నేనతన్ని చంపలేదు."

"ఐతే అది లార్డ్ సారింగ్టన్ పనై ఉంటుంది."

"బర్మాలో మనం ముగ్గురం ఉన్నప్పటి నించి ఆయన చంపే రకం కాదని నాకు తెలుసు." లమక్ చెప్పాడు.

తలుపు తెరుచుకుని క్లిస్టన్తో లోపలికి వచ్చిన లార్డ్ సారింగ్టన్ని డేవిడ్సన్ ఆ గదిలోని ఇద్దరి దగ్గరికి పంపించాడు.

"ఫ్రాయ్! ఇక్కడ నువ్వేం చేస్తున్నావు?" సారింగ్టన్ ప్రశ్నించాడు.

"వాళ్ళు నన్ను తీసుకువచ్చారు. మన ఇటాలియన్ ఫ్రెండ్ని నేను చంపాను.'' ఫ్రాయ్ జవాబు చెప్పాడు.

“ఏమిటి?” సారింగ్టన్ నివ్వెరపోయాడు. "మీ ముగ్గుర్నీ ఇక్కడికి ఎందుకు తీసుకువచ్చానంటే, మీ ముగ్గురూ కౌంట్ మతానీని హత్య చేసామని నేరాన్ని అంగీకరించారు." డేవిడ్సన్ చెప్పాడు.

"ఇంకెవరో చంపారంటే నేను నమ్మలేను." సారింగ్టన్ చెప్పాడు.

"వాళ్ళెందుకు చంపుతారు? నిస్సందేహంగా నేనే అతన్ని చంపాను ఇన్స్పెక్టర్." ఫ్రాయ్ చెప్పాడు.

"ఎక్స్క్యూజ్ మీ సర్ మీరోసారి బయటికి వస్తారా?” రైన్స్ హఠాత్తుగా వచ్చి డేవిడ్సన్ని కోరాడు.

“తర్వాత, ఇప్పుడు కాదు. నేను బిజీగా ఉన్నాను." డేవిడ్సన్ నిరాకరించాడు.

“ఇది చాలా ముఖ్యమైనది. మీరు రావాలి." హడావిడిగా చెప్పాడు.

"ఇప్పుడు కాదన్నానా?"

"మీరు తప్పక రావాలి సార్.”

“సరే, పద.”

రైన్స్, డేవిడ్సన్ బయటికి వచ్చి తలుపు ఓరగా వేసి లోపలి మాటలని వినసాగారు.

“ఈ విషయం మీద మనం చర్చించడం హాస్యాస్పదం. ఎవరు చంపారన్నది పోలీసులని నిర్ణయించనిద్దాం." లార్డ్ సారింగ్టన్ చెప్పాడు.

“అలాగే.” ఫ్రాయ్ అంగీకరించాడు.

"నాకున్న నేర నేపథ్యం వల్ల ఆ హత్యని నా మీదే రుద్దుతారు." లమక్ చెప్పాడు.

"కానీ ఆ వెధవని నేను చంపితేనే నాకు బావుంటుంది.'' సారింగ్టన్ చెప్పాడు. "నా మాటా అదే." ఫ్రాయ్ కూడా చెప్పాడు.

రైన్స్ని దూరంగా తీసుకువెళ్ళి డేవిడ్సన్ అడిగాడు.

''ఏమిటంత ముఖ్యమైన విషయం?"

"మిస్ రాజర్స్ వెయిటింగ్ రూంలో ఉంది. ఆమె తను కౌంట్ మరానీని చంపానని చెప్తోంది.''

డేవిడ్సన్ చేతోత్తో నుదుటి మీద కొట్టుకుని వెయిటింగ్ రూం వైపు నడిచాడు.

* * *

"మీరెందుకు చంపారు? కౌంటిని చంపాల్సింది నేను కదా?'' లమక్ సారింగ్టన్ని అడిగాడు.

"నేను చంపలేదు.''

''మీరే చంపి ఉంటారు. నేను వెళ్ళేసరికే నేల మీద చచ్చిపడి ఉన్నాడు."

వెంటనే సారింగ్టన్ ఫ్రాయ్ వంక ప్రశ్నార్థకంగా చూసాడు.

"నేనూ చంపలేదు. మీరు నిజంగా చంపలేదా?'' సారింగ్టన్ని ప్రశ్నించాడు.

''లేదు. నేను నిన్న రాత్రి ఆ హోటల్ వైపే వెళ్ళలేదు."

"నేను కూడా వెళ్ళలేదు.'' ఫ్రాయ్ చెప్పాడు.

''మన ముగ్గురిలో ఎవరూ చంపకపోతే మరి ఎవరు చంపినట్లు?" సారింగ్టన్ ప్రశ్నించాడు.

ముగ్గురూ ఒకరి మొహాలు మరొకరు చూసుకున్నారు.

* * *

డేవిడ్సన్ మిస్ రాజర్స్ని అడిగాడు.

"నాతో జోక్ చేయడానికి ఇంత దూరం వచ్చారా?"

"జోక్ కాదు. నేను లార్డ్ సారింగ్టన్ కూతుర్ని మతానీ భార్యని. సారింగ్టన్ని మీరు తీసుకురావడం చూసి మతానీని నేనే చంపానని చెప్పడానికి వచ్చాను." ఆమె నిజం చెప్తోందని డేవిడ్సన్కి అనిపించింది.

"జరిగింది చెప్పండి. మీరు చెప్పేది మీకు వ్యతిరేకంగా సాక్ష్యంగా ఉపయోగిస్తామని హెచ్చరిస్తున్నాను."

"అది నాకు తెలుసు. నేను అతనితో మాట్లాడడానికి మరోసారి నన్ను నా బిడ్డ నించి వేరు చేయద్దు అని ప్రార్థించడానికి లండన్ వచ్చాను. రాత్రి పదిన్నరకి అతని గదికి వెళ్ళాను. లేదా ఆత్మహత్య చేసుకుంటాను అంటే నన్ను చూసి వెక్కిరింపుగా నవ్వాడు.

నాకో రివాల్వర్ ఇచ్చి ఆత్మహత్య చేసుకో అని నవ్వాడు. నేను ఆ రివాల్వర్ని అతని వైపు తిప్పాను...."

"అతన్ని కాల్చి చంపారు. అంతేనా?" డేవిడ్సన్ అనాసక్తంగా ప్రశ్నించాడు.

"అప్పుడే కాదు. నేను కాలుస్తానో లేదో నాకే తెలీదు. కానీ నా భర్త నా చేతిని పట్టుకున్నాడు. అది పేలి ఆయన కింద పడ్డాడు."

"తర్వాత ఏం జరిగింది?"

"అంతే. నేను రివాల్వర్ని కింద పడేసి నా గదికి వెళ్ళిపోయాను."

"కానీ మీరు చెప్పినదానికి ఎలాంటి ఋజువూ లేదు."

ఇక్కడ రక్కారు.'' కోటుని విప్పి భుజం మీది రక్కులని చూపించింది.

"కానీ శవం సోఫాలో ఉంది. మీరు అక్కడ అతన్ని పడుకోబెట్టారా?''

''లేదు.''

''మీ మధ్య తోపులాటలో టేబుల్ లేంప్ క్రింద పడి పగిలిందా?''

''లేదు.''

"కౌంటెస్ మరానీ! మీ నాన్నని రక్షించడానికి మీరు చేసే త్యాగం మెచ్చదగ్గది. కానీ మీరు మీ భర్తని నిన్న రాత్రి నిజంగా కలిసినా మీరు అతన్ని చంపలేదు."

"ఇన్స్పెక్టర్! నేను మా నాన్నని చూడచ్చా?" ఆమె అడిగింది.

''అందుకు అభ్యంతరం లేదు.''

వాళ్ళు ముగ్గురూ ఉన్న గదిలోకి ఆమెని తీసుకు రాగానే సారింగ్టన్ అడిగాడు.

"హెలెన్! నువ్వు ఇక్కడికి ఎందుకు వచ్చావు? ఇన్స్పెక్టర్ మీరు ఈమెని ఎందుకు తెచ్చారు?''

''లేదు నాన్నా నా అంతట నేనే వచ్చాను. ఆ నేరం మీమీద రాకూడదు.''

''ఏమిటి నువ్వనేది?'' ఫ్రాయ్ తన ప్రియురాలైన హెలెన్ని ప్రశ్నించాడు.

"మీరంతా నోరు మూయండి. డొంక దొరికే దాకా నేను తీగ లాగుతూనే ఉంటాను.'' డేవిడ్సన్ చెప్పాడు.

"నా భర్త హత్యకి ఈ ముగ్గురి మీద కేసు పెడుతున్నారా?''

‘‘అవును. వాళ్ళు ముగ్గురూ ఆ నేరాన్ని అంగీకరించారు. నమ్మదగ్గ ఋజువులని కూడా ఇచ్చారు. మీ రుజువు నమ్మదగ్గదిగా లేదు."

"కానీ నా భర్తని చంపింది నేనే." ఆమె తీవ్రంగా చూస్తూ చెప్పింది.

"ఇన్స్పెక్టర్! ఆమె కాదు. కౌంటిని చంపింది నేనని మీకు తెలుసు." ఫ్రాయ్ చెప్పాడు.

‘‘కాదు. నేను.’’ సారింగ్టన్ వెంటనే చెప్పాడు.

‘‘కాదు. నేను." లమక్ చెప్పాడు.

‘‘నిశ్శబ్దం. మీ నలుగురిలో ఒకరు ఖచ్చితంగా కౌంటిని చంపారు. అదెవరో తెలుసుకునే దాకా మిమ్మల్ని విడిచిపెట్టను." డేవిడ్సన్ తీవ్ర అసహనంగా చెప్పాడు.

తలుపు తెరుచుకుని లోపలికి వచ్చిన రైన్స్ ఆదుర్గాగా చెప్పాడు.

‘‘ఓసారి మీరు బయటికి వస్తారా ఇన్స్పెక్టర్?’’

బయటికి వచ్చాక డేవిడ్సన్ అదే అసహనంతో అడిగాడు.

‘‘మళ్ళీ కొత్తగా ఇప్పుడేమిటి?"

"మీరు ఆ నలుగుర్నీ ఒకే నేరం మీద కస్టడీలోకి తీసుకుంటున్నారా?" అడిగాడు.

‘‘అవును."

‘‘మనం అలా చేయలేం సార్?

‘‘ఏమిటి?’’

వెంటనే రైన్స్ ఓ లావుపాటి లా పుస్తకంలోని ఓ పేజీని బయటికి చదివాడు.

"ఒకే వ్యక్తి ఓ నేరాన్ని చేసాడనే రుజువు దొరికినప్పుడు ఇద్దరు లేక ఎక్కువ మంది మీద అదే నేరాన్ని ఆరోపించకూడదు.''

వెంటనే డేవిడ్సన్ మొహంలోకి వెలుగు ప్రవేశించింది.

''అవును. ఇప్పుడర్థమైంది." చెప్పాడు.

''ఏమిటి సార్?'' రైన్స్ అడిగాడు.

''ఆ నలుగురికీ చట్టంలోని ఈ విషయం గురించి ముందే తెలుసు. ఇదంతా ఓ పథకం ప్రకారం చేసారు. వాళ్ళల్లో ఒకరు చంపి సాక్ష్యాలని వదిలారు. నలుగురూ నేరాన్ని అంగీకరించారు."

''అంటే ఇది గూడుపుఠాణీనా సార్?''

''అవును. వీళ్ళు ఎందుకు తామే హత్య చేసామని ఒప్పుకున్నారో నాకిప్పుడు అర్థమైంది. సారింగ్టన్, ఫ్రాయ్, లమక్, హెలెన్ నలుగురూ కలిసి ఆడిన నాటకం ఇది. కౌంటెస్ నిజంగా తన భర్తని చూసిందని రక్కులని బట్టి రుజువుంది. కానీ పోస్టుమార్టం రిపోర్ట్ ప్రకారం హత్య జరిగిన సమయంలో ఆమె అక్కడ లేదు. తన తండ్రిని రక్షించడానికే అబద్దమాడింది. కాబట్టి ఆమెని తీసేయచ్చు."

పక్క గదిలో సారింగ్టన్ తన కూతుర్ని గొంతు తగ్గించి అడిగాడు.

''అది నిజంగా నీ పనా?''

''అవును."

''సరే. అదే మాట మీద ఉండు. మనకేం కాదు. తర్వాత నీకు అన్నీ వివరిస్తాను.'' చెప్పాడు.

"రైన్స్! వాళ్ళు తమ తప్పిదానికి కట్టుబడి ఉంటే ఆ నలుగురిలో ఎవర్నీ మనం నేరస్తులుగా కోర్టుకి తీసుకెళ్ళలేం.''

''అంటే వాళ్ళంతా విడుదల చేయబడాల్సిందేనా సర్?''

డేవిడ్సన్ లేచి వెళ్ళి గది తలుపు తీస్తే వాళ్ళంతా అతని వంక నిశ్శబ్దంగా చూసారు.

''సర్'' రైన్స్ పిలిచాడు.

''ఏమిటి?'' తలుపు మూసి అడిగాడు.

''ఒకటి మంచిదైంది సార్" చెప్పాడు.

''ఏమిటి?''

''కాంట్ మతానీ చంపదగ్గ మనిషే. అవునా సర్?'' ప్రశ్నించాడు.

అసహనంగా డేవిడ్సన్ కళ్ళు మూసుకున్నాడు.

---

## థ్రిల్ - జేమ్స్ మెల్విల్

అంతర్జాతీయ విమానంలో మరో ఖండానికి ఒంటరిగా వెళ్ళేవాళ్ళు సాధారణంగా వ్యాపారస్థులై ఉంటారని అతనికి తెలుసు.

మొదట్లో వారిద్దరూ ఒకరి వంక మరొకరు అలసటగా చూసుకున్నారు. విండో సీట్లో కూర్చున్న ఆ మధ్య వయస్కుడు ఐల్ సీట్లో కూర్చున్న ఆమెని చూసాడు. ఆమె తన ఉలెన్ కోటిని ఓవర్ హెడ్ లాకర్లో పెట్టి కూర్చుంది. సింగపూర్లో ఆ కోటు అవసరం లేదు కానీ, హీత్రో ఎయిర్పోర్ట్ లోంచి వెళ్ళాక అవసరం ఉంటుంది.

వారిద్దరి మధ్య గల సీటులో ఎవరూ కూర్చోకూడదని అతను ఆశించాడు. ఎందుకంటే కొందరు పక్క వాళ్ళతో మాట్లాడుతూనే ఉంటారు. విమానం గాల్లోకి లేస్తుండగా, ఇంక ఎవరూ వచ్చి కూర్చోరని అతను సంతోషించాడు. తన కన్నా పదేళ్ళు తక్కువ వయసు గల, ముప్పైలలో ఉన్న ఆమె చక్కటి దుస్తులని ధరించింది. ఆమె సాన్నిహిత్యంలో కూర్చోవడం అతనికి సంతోషంగా ఉంది. ఆమె ఎడమ చేతి ఉంగరం వేలికి ఉంగరం లేకపోవడంతో ఆమె అవివాహిత అని గ్రహించాడు.

“టైమ్కి బయలుదేరింది. మనం షెడ్యూల్ టైమ్కి వెళ్తామనుకుంటాను." అతను ఆమెతో చెప్పాడు.

“అవును. సింగపూర్ ఎయిర్లైన్స్కి ఆ పేరు ఉంది." ఆమె మర్యాదగా జవాబు చెప్పింది.

అతను స్ట్రైట్స్ టైమ్స్ దినపత్రికని తెరిచాడు. కాసేపాగి డ్రింక్స్ ట్రాలీ వచ్చింది. అది వెళ్ళాక, ఆమె తను చదివే ఇన్ ఫ్లయిట్ మేగజైన్ని ఎదుటి సీట్ సంచీలో ఉంచింది.

"నా పేరు తిమోతీ బెనడిక్ట్" అతను చెప్పాడు.

"సారా మిడిల్టన్." ఆమె కొద్దిగా సందేహించి చెప్పింది.

ఒంటరిగా ప్రయాణించే యురోపియన్ ఆడవారిలో సాధారణంగా ఉండే సందేహమే అది.

“మీరు సింగపూర్ నివాసా?” అతను అడిగాడు.

“కాదు. మీరు?”

"కాదు. లండన్లో ఉంటాను. ఓ పాత మిత్రుడ్ని చూడడానికి వెళ్ళొస్తున్నాను. ఓ పుస్తకానికి నేపథ్యాన్ని సేకరించడానికి కూడా."

“ఓ! మీరు రచయితా?”

అలాంటి ఆశర్యం మాటలు అతనికి అలవాటే. అయితే తను బాగా పేరుని, ధనాన్ని సంపాదించే వృత్తిపరమైన రచయిత కాదు. చాలామంది మరో విధంగా సంపాదిస్తూ, రచనలు ద్వారా తక్కువ సంపాదిస్తూంటారు. ఐతే, తను చేసే ఉద్యోగం గురించి చెప్పక, రచయితగా పరిచయం చేసుకున్నాడు.

"మీరు మీ పేరుతోనే రాస్తూంటారా?'' అడిగింది.

‘‘అవును. అయితే జెఫ్రీ ఆర్చర్, జిల్లీ కూపర్లాంటి ఎయిర్ పోర్ట్ బుక్ స్టాల్ రచయితని కాను నేను.''

"మీరు ఎలాంటివి రాస్తారు?''

‘‘డిటెక్టివ్ స్టోరీస్, మర్డర్ మిస్టరీస్."

‘‘నిజంగా?''

ఏర్హోస్టెస్ వారి భోజనం ట్రేలని తెచ్చే సమయానికి వారి మధ్య రచనలకి సంబంధించిన చాలా సంభాషణ కొనసాగింది.

"మీరు రాయబోయే కొత్త సబ్జెక్ట్ ఏమిటి?''

"అదీ డిటెక్టివ్ కథే. ఇంతదాకా చాలా థ్రిల్లర్స్లో అనేక స్థలాల్లో హత్యలు జరిగాయి. విమానాశ్రయాల్లో కూడా. కానీ ఇంతదాకా విమానంలో జరగలేదు. విమానంలోని ప్రయాణీకులు, సిబ్బంది గురించి తప్ప రచయితలు వారిలోని ఒకరు హత్య చేయచ్చనే విషయం ఆలోచించినట్లు లేదు. నా నవల్లో అది రాద్దామనుకుంటున్నాను." తిమోతీ చెప్పాడు.

‘‘అది భయంకరమైన ఆలోచన.''

"కాని అది కాగితం మీదే కదా?"నవ్వాడు.

"విమానంలో హత్య జరిగితే, హంతకుడు తప్పించుకోలేడు కదా?"

"నిజమే. సింగపూర్ వచ్చే విమానంలోని ఎయిర్ హోస్టెస్ని అడిగితే, తన కెరీర్లో తన విమానాల్లో ఐదారుగురు మరణించారని చెప్పింది. ఐతే అవన్నీ సహజమైన మరణాలే."

"ఏది ఏమైనా మీ ఊహాశక్తి భయంకరమైంది." ఆమె గుసగుసలాడుతున్నట్లుగా చెప్పింది.

"ఊహా శక్తి అలా ఉంటే ఫర్వాలేదు. కానీ దాన్ని అంతటితో ఆపాలి. నేను తెలిసి ఎవర్నీ చంపలేదు. కొందరు పాఠకులని భయపెట్టి ఉంటాను."

"అయి ఉండచ్చు. విమానంలో చంపాక హంతకుడు ఎలా తప్పించుకుంటాడు?"

"ఓసారి విమానం ఆగి, హంతకుడు దిగే లోగా హత్య గురించి ఎవరికీ తెలియకపోతే చాలు. తర్వాత హత్య జరిగింది అని తెలిసినా కేవలం హంతకుడ్నే పోలీసులు అనుమానించరు."

"ఎందుకు అనుమానించరు? హతుడికి, అతనికి గల సంబంధం గురించి పోలీసులకి తెలుస్తుంది. కాబట్టి మొదటి అనుమానితుడు అతడే అవుతాడు."

"మిగిలిన ప్రయాణీకుల్లా అతనికీ, అతను చంపేవాడికి సంబంధమే ఉండనప్పుడు చంపడానికి కారణమే ఉండదు. లేక హంతకుడు కిరాయి హంతకుడా?"

"కాదు. ఇది సైకలాజికల్ థ్రిల్లర్. కేవలం చంపడంలోని థ్రిల్ని అనుభవించడానికే హంతకుడు హత్య చేస్తాడు." టిమోతీ చెప్పాడు.

"అందులో థ్రిల్లేమి ఉంటుంది?"

"మీరే ఊహించండి. అంతటా చీకటి. వేల అడుగుల ఎత్తున ప్రయాణం. మిగిలిన వారంతా సినిమాల్లో నిమగ్నమై ఉంటారు. లేదా నిద్రపోతూంటారు. చుట్టుపక్కల ఏం జరుగుతోందో తెలీదు. అలాంటి చోట ఓ వ్యక్తిని చంపడం అంటే అతని మీద ఆధిక్యత కలిగి ఉండటమే కదా? అంతటితో ప్రపంచంలోని ఓ భాగాన్ని మూసివేయడమే కదా? ఇంక అతనికి పిల్లలు పుట్టరు. అతని జీవించి ఉండి పుడితే, అతని భవిష్యత్తు తరాల్లోని ఏ ఐన్‌స్టీన్నో, హిట్లర్నో హంతకుడు పుట్టకుండా ఆపేస్తున్నట్లే కదా? అంటే భవిష్య ప్రపంచ చరిత్రలో కొంత జరగకుండా తను శాసించగలుగుతున్నాడు కదా? ఈ కారణం చాలదా? విమానం దిగాక అతను శవం అని తెలిసే దాకా ఎవరికీ అసలు హత్య గురించే తెలీదు కదా? అంతా అతను నిద్ర పోతున్నాడని అనుకుంటారు.''

‘‘నిజమే. మీ రచయితలు ఏదైనా విడ్డురాన్ని కూడా నచ్చచెప్పేలా కలిపి రాయగలరు.''

‘‘ఓ తల్లిని ఓ కొడుకు కథ మొదట్లోనే చంపినట్లు రాస్తే, పాఠకులు గగుర్పాటు చెందుతారు. కానీ అందుకు సరైన వివరణ ఇస్తే, ఆ హత్యతో ఏకీభవిస్తారు." వారిద్దరి మధ్య కొద్ది సేపు నిశ్శబ్దం.

ఆమె లేచి బాత్రూంకి వెళ్ళొచ్చి కూర్చుని చెప్పింది.

‘‘చాలామంది ప్రయాణీకులు నాకు శవాల్లా కనిపించారు.''

తిమోతీ ఇక నిద్రని ఆపుకోలేకపోయాడు. కొద్ది గంటల తర్వాత ఏర్ హోస్టెస్ ప్రకటనకి మెలకువ వచ్చింది. బయట నించి వెలుగు పడుతోంది. విమానం మృదువుగా హీత్రో ఎయిర్పోర్ట్లోని నేలని తాకింది. సారాకి గుడ్ బై చెప్పి, ట్యూబ్ స్టేషన్ వైపు నడిచాడు.

* * *

మర్నాడు ఉదయం దినపత్రికలోని వార్తని చదివి తిమోతీ తృళ్ళిపడ్డాడు.

సింగపూర్ నించి తను వచ్చి విమానంలో ఓ శవం కనిపించింది! పదకొండేళ్ళ ఆ పిల్లవాడి గొంతు నులిమి చంపారు. హత్యకి ఎలాంటి కారణం కనపడలేదు. ఆ పిల్లవాడికి ఎవరితోనూ ఎలాంటి పేచీలు లేవు. ముఖ్యంగా తోటి ప్రయాణీకులతో.

తిమోతీని వెంటనే భయం ఆవహించింది. ఆ హత్య ఎవరు చేసారో ఊహించగలిగాడు. నిద్రపోతున్న తనని ఆమె చంపనందుకు సంతోషించాడు.

---

## క్రిస్ట్‌మస్కి వెనక్కి - జాన్ కోలియర్

క్రిస్మస్కి కొద్దిరోజుల ముందు ఏభై పైబడ్డ హెర్బర్ట్ ఇంగ్లండ్లో సౌతంప్టన్లో, ఆ ఇంట్లోని బేస్మెంట్లో ఓ గొయ్యి తవ్వుతున్నాడు. కొద్దిగా తవ్వాక హెర్బర్ట్ వైన్ సెల్లర్ని పరిశీలించాడు. అవసరమైన మేరకి తవ్వానని భావించాడు.

"హెర్బర్ట్ భోజనానికి రండి." అతని భార్య పిలుపు వినిపించింది.

అతను గజం బద్ద అందుకుని తను తవ్విన లోతుని కొలిచాడు. మెట్లు దిగి కిందికి వచ్చిన అతని భార్య హర్మియోన్ అడిగింది.

"వైన్ సెల్లర్ తవ్వడం ఎంతదాకా వచ్చింది?"

"పేకింగ్ పని దాదాపు పూర్తయింది. ఈ ఆఖరి రోజు ఏం చేయాలో తోచక ఈ పని చేస్తున్నాను."

హెర్బర్ట్ పక్కనే ఉన్న తన కోటు జేబులోంచి తన భార్య ఐడెంటిటీ కార్డుని తీసి చదివాడు. ఆమె ఎత్తు ఐదడుగుల నాలుగు అంగుళాలుగా నమోదైంది. తను తవ్వింది చూసుకుని సరిపోతుందని భావించాడు. పైకి వచ్చి చేతులు కడుక్కుని డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు. పని మనిషి ఎల్సీ భోజనం ప్లేట్లని పెట్టి వెళ్ళింది.

‘‘హెర్బర్ట్ పేపర్, పాలవాళ్ళకి వద్దని చెప్పాను. టెలిఫోన్ కంపెనీ, వాటర్ కంపెనీలకి వారి సర్వీస్ని కట్ చేయమని ఫోన్ చేసాను. కరెంట్ కంపెనీకి ఫోన్ చేయాలి. నా టైప్ రైటర్ కారులో పెట్టావా?’’

"పెట్టాను."

"ఎందుకంటే నేను మేగజైన్స్కి ఆర్టికల్స్ అక్కడి నించి పంపాలి. ఎల్సీ బెడ్రూంలోని కర్టై న్స్ అన్నీ విప్పుతీయి. మేం అమెరికా నించి తిరిగి వచ్చేసరికి డ్రైక్లీనర్ వాటిని సిద్ధం చేస్తాడు. మేం తిరిగి వచ్చే తారీకు నీకు ఉత్తరం రాస్తాను. బహుశా డిసెంబర్ పదిహేనుకి రావచ్చు. ఫర్నిచర్ మీద బట్టలు కప్పావా?"

‘‘పై గదుల్లో కప్పేసాను మేడం. టీకి వచ్చే అతిథులు వెళ్ళాక లివింగ్ రూంలో వాటిని కప్పుతాను." ఎల్సీ చెప్పింది.

‘‘గుడ్ హెర్బర్ట్ మనకి గుడ్ బై చెప్పడానికి హెవిట్, సింక్లయిర్లు వస్తున్నారు."

‘‘వాలింగ్ ఫోర్డ్?’’

"ప్రయత్నం చేస్తామన్నారు. బహుశా రాకపోవచ్చు."

"లైబ్రరీ బుక్స్ తిరిగి ఇచ్చేసామా?" హెర్బర్ట్ అడిగాడు.

‘‘కొద్ది రోజుల క్రితం మీరే ఇచ్చేసారు."

‘‘నువ్వు చాలా సమర్ధురాలైన భార్యవి."

‘‘అప్పుడప్పుడూ ఇలా మెచ్చుకుంటూంటే ఆనందం వేస్తుంది."

* * *

మధ్యాహ్నం టీకి వచ్చిన అతిథులకి హెర్బర్ట్ దంపతులు స్కోన్స్, టీలని సర్వ్ చేసారు.

"మీరు వెళ్ళేది కేలిఫోర్నియా కదా?'' హెవిట్ అడిగాడు.

''అవును. లాస్ ఏంజెలిస్."

"మిమ్మల్ని మేం మిస్ అవుతాం."

"క్రిస్మస్ దాకానే. అప్పటికి వెనక్కి వచ్చేస్తాం." హర్మియోన్ చెప్పింది.

"కానీ ఇంకా ఎక్కువ రోజులు, బహుశా శాశ్వతంగా ఉండే అవకాశం ఉంది." హెర్బర్ట్ చెప్పాడు.

హర్మియోన్ అతని వంక చూసింది.

"ఐతే ఇంకా ఏదీ నిర్ణయం కాలేదు. నేను ఉద్యోగంలో చేరాక అది ఆలోచిస్తాం." హెర్బర్ట్ చెప్పాడు.

"అలాంటిదేం జరగదు. నేను తప్పకుండా క్రిస్మస్కి వెనక్కివస్తాను.'' హర్మియోన్ చెప్పింది.

"మీరు లేకుండా అక్కడ హెర్బర్ట్ ఏం చేస్తాడు?'' మిసెస్ హెవిట్ అడిగింది.

''హెర్బర్ట్ మెటలాలజిస్ట్ కాబట్టి ఎయిర్క్రాఫ్ట్ పరిశ్రమలో ఉద్యోగం కొనసాగించచ్చు."

వారి మధ్య మరి కొద్దిసేపు పిచ్చాపాటీ సాగింది.

"సౌతాంప్టన్ నించి బయలుదేరి రేపు మధ్యాహ్నం హేరిస్బరీలో లంచ్ చేస్తాం. ఓడలో కారు కూడా ఎక్కించుకుని తీసుకెళ్తున్నాం.''

"బావుంది. రైలైతే రద్దీ, ట్రైమ్కి వెళ్ళడంలాంటి ఇబ్బందులుంటాయి. ఇదే బావుంది." హెవిట్ చెప్పాడు.

"మీరు తప్పకుండా క్రిస్మస్కి వెనక్కివస్తారు కదా?" మిసెస్ సింక్లయిర్ అడిగింది.

"తప్పకుండా, హెర్బర్ట్ తో నిజానికి తిరిగి వచ్చేసరికి హెర్బర్ట్ కోసం ఓ సర్ప్రయిజ్ ఎదురు చూస్తుంటుంది." హర్మియోన్ చెప్పింది.

గుడ్ బై చెప్పి అంతా వెళ్ళిపోయారు.

ఫర్నిచర్ మీద కప్పడానికి ఎల్సీ దుప్పట్లతో వస్తే హర్మియోన్ చెప్పింది.

"ఎల్సీ! ఆ పని నేను చేస్తాను. నువ్వింక వెళ్ళచ్చు."

లేచి ఓ కవర్ అందిస్తూ చెప్పింది. "ఇది నీ జీతం. కొంత అదనంగా కూడా ఇస్తున్నాను. మేం తిరిగి వచ్చే తారీకు తెలియగానే నీకు ఉత్తరం రాస్తాను."

"థాంక్ యూ మేడమ్."

ఎల్సీ వెళ్ళగానే హెర్బర్ట్ తలుపు తెరచుకుని మెట్ల దిగి బేస్మెంట్ లోకి వచ్చి అక్కడ ఓ మూల ఉన్న పంపు గొట్టాన్ని అందుకుని తన వెనక ఉంచుకుని పిలిచాడు.

"హర్మియోన్."

"ఎక్కడున్నారు?" ఆమె కంఠం వినిపించింది.

"సెల్లార్లో, ఓసారి వస్తావా? నీకోటి చూపించాలి."

"మీరో సారి పైకి రండి. నాకో సహాయం చేయాలి."

అతను పైకి, హాల్లోని షాండ్లియర్ దగ్గర నిలబడ్డ హర్మియోన్ దగ్గరికి వెళ్ళాడు. "ఈ షాండ్లియర్కి బట్ట చుట్టాలి. సహాయం చేయండి."

హెర్బర్ట్ స్టూల్ తీసుకు వస్తే, ఆమె బట్ట తీసుకుని స్టూల్ ఎక్కి దానికి చుట్టింది. హెర్బర్ట్ మళ్ళీ సెల్లార్ లోకి వెళ్ళి పిలిచాడు.

"ఇప్పుడు వస్తావా?"

"కిటికీలని ఎల్సీ లాక్ చేసిందో లేదో చెక్ చేసి వస్తాను. మీరు డైనింగ్ రూమ్ని చెక్ చేయండి."

అతను విసుగా వెళ్ళి ఆ పని చేసాక ఇద్దరూ కలిసి సెల్లార్లోకి నడిచారు. "

"ఓ విషయంలో నీ అభిప్రాయం కావాలి. ఇది ఇంకాస్త లోతుగా... దగ్గరికి వచ్చి చూడు."

ఆమె కిందికి చూస్తూండగా పంపు గొట్టంతో ఆమె తల మీద గట్టిగా మోదాడు. ఆమె కిక్కురుమనకుండా గోతిలోకి పడిపోయింది.

పైన మట్టి కప్పేసి అరగంటలో పైన సిమెంట్ చేసాడు. చేతులు కడుక్కోడానికి బాత్రూం లోకి వెళ్ళి పంపు తిప్పితే నీళ్ళు రాలేదు. మళ్ళీ సెల్లార్లోకి వెళ్ళి మెయిన్ని ఆన్ చేసాడు. పైకి రాగానే డోర్ బెల్ మోగింది. గేటు తెరచుకుని లోపలికి వచ్చిన వాలింగ్ఫోర్డ్ దంపతులు గట్టిగా పిలిచారు.

"హెర్బర్ట్! హర్మియోన్?"

హెర్బర్ట్ ఉన్న చోట కదలకుండా నిలబడిపోయాడు.

"ఏరీ వాళ్ళు? కారు ఇక్కడే ఉంది. బహుశ ఆఖరి నిమిషంలో ఏదైనా మర్చిపోతే కొనడానికి వెళ్ళారేమో?"

"హర్మియోన్ ఏదీ మర్చిపోదు. వినపడుతోందా? నీళ్ళ శబ్దం. బహుశా స్నానం చేస్తున్నారేమో! మనం మళ్ళీ ఆరున్నరకి వద్దాం."

వాళ్ళ వెళ్ళిపోయినట్లుగా తలుపు శబ్దం వినిపించింది.

హెర్బర్ట్ చేతులు కడుక్కుని మళ్ళీ మెయిన్ని ఆఫ్ చేసాడు.

* * *

ఓడలో హెర్బర్ట్ ఒక్కడే లాస్ ఏంజెలెస్కి చేరుకున్నాడు. ది బెవర్లీ హిల్టన్లో బస చేసి, కొన్ని రోజులు తన కార్లో టూరిస్ట్గా ఆ నగరాన్ని సందర్శించాడు. అమెరికన్ హాట్ డాగ్ తింటూ హాలీవుడ్ మొత్తం తిరిగి చూసాడు. దాదాపు పది రోజుల తర్వాత అతను టైప్ రైటర్లో తమ మిత్రుల భార్యలకి తన భార్య రాసినట్లుగా ఓ ఉత్తరాన్ని టైప్ చేయసాగాడు.

"మేము ఓ ఫ్లాటిని అద్దెకి తీసుకున్నాం. హెర్బర్ట్ సోమవారం ఉద్యోగంలో చేరుతున్నాడు. శాశ్వతంగా ఇక్కడే ఉండిపొమ్మని వాళ్ళు కోరారు. కానీ మాకు ఆ ఉద్దేశం లేదు. బహుశా మేము క్రిస్మస్కి తప్పక వెనక్కి వస్తాం. లవ్"

టైపింగ్ రాని హెర్బర్ట్ ఒకో అక్షరాన్ని వెతుక్కుని కొట్టాడు. రోలర్ లోంచి కాగితాన్ని తీసి భార్య సంతకాన్ని ఫోర్జరీ చేసాడు. డోర్ బెల్ మోగింది.

"మిస్టర్ హెర్బర్ట్ కార్పెంటర్. ఈ హోటల్లో బస మీకు ఎలా ఉంది? ఇబ్బందేం లేదు కదా?" హెర్బర్ట్ ఆఫీస్ కొలీగ్ అడిగాడు.

"బావుంది. ఇబ్బందేం లేదు."

"మీకు ఆఫీస్ అడ్రస్కి వచ్చిన ఉత్తరాలు తెచ్చాను. కొన్ని మిసెస్ హెర్బర్ట్కి కూడా వచ్చాయి." చెప్పి అతను కోటు జేబులోంచి ఓ ఉత్తరాల దొంతర తీసిచ్చి అడిగాడు.

"మీ భార్య ఎక్కడ ఉంది?"

"నేను, ఆవిడ ఈ మధ్యనే విడిపోయాం. అది అకస్మాత్తుగా జరిగింది. మా మిత్రులకి ఇంకా ఈ విషయం తెలీదు. వాళ్ళకీ సంగతి ఉత్తరాలు రాయాలి."

"మీరు మాతో శాశ్వతంగా ఉండే విషయంలో ఏం నిర్ణయించారు?" అతను అడిగాడు.

"నాకు ఇక్కడ బావుంది. బహుశా వెనక్కి వెళ్ళకపోవచ్చు."

"సోమవారం ఉదయం కలుద్దాం. మీ ఆఫీస్ గది సిద్ధంగా ఉంది. మీకు ఇంకేదైనా సహాయం అవసరమైతే తప్పకుండా అడగండి."

గుడ్ బై చెప్పి అతను వెళ్ళిపోయాక టైప్ రైటర్ ముందు కూర్చుని ఆ ఉత్తరాలని చదివాడు. మూడు మిసెస్ హెర్బర్ట్ పేరున వచ్చాయి. ఫ్రం అడ్రస్లు చూసి ఓ కవర్ని విప్పి ఓ బిల్ని బయటికి తీసాడు.

హోల్డ్ అండ్ సన్స్, బిల్డర్స్ డెకొరేటర్స్

మేడమ్,

'మీరు కోరిన పనిని రేపు మొదలుపెడుతున్నాం. ఎస్టిమేషన్ కన్నా తక్కువకే బిల్ పంపుతున్నాం. వెంటనే చెల్లించే ఏర్పాటు చేయగలరు.'

ఆ బిల్ని పరిశీలించగానే నిర్ఘాంతపోయాడు. మిసెస్ హెర్బర్ట్ కార్పెంటర్ పేరు గల ఆ బిల్లో తమ ఇంటి సెల్లార్ని మూడు అడుగులు లోతుకి తవ్వి అడుగు భాగం కాంక్రీట్ చేసి, చుట్టూ గోడ కట్టి పైన్ సెల్లార్ని నిర్మించడానికి డెబ్బై ఎనిమిది పౌండ్లు అని ఉంది.

క్రిస్మస్కి వెనక్కి వెళ్ళకూడదు అనుకున్న హెర్బర్ట్ వెళ్ళాల్సి వచ్చింది. పోలీసులు తన భార్యని హత్యచేసిన నేరాన్ని విచారించడానికి అతన్ని మళ్ళీ సొంతంప్టన్కి తీసుకెళ్ళారు.

## ఓ నిశీధి రాత్రి - ఏ.ఎం. ఖురేజ్

మెరైనర్స్ వేక్స్ మ్యూజియంలో యూనిఫాంలోని అటెండెంట్స్ బయటకి వెళ్ళే వారి కోసం తలుపులు తెరుస్తున్నారు మేనేజర్ తన ఎదురుగా కూర్చున్న రేమండ్తో చెప్పాడు.

"మీ రిక్వెస్ట్ సాధారణమైందే. వారానికి మూడు సార్లు మీలాంటి యువకులు ఎక్కువగా దీన్ని కోరుతూంటారు. మర్డరర్స్ డెన్లో ఎవరైనా ఓ రాత్రి గడపడాన్ని అనుమతించడం వల్ల మాకు నష్టమూ లేదు. లాభమూ లేదు. కానీ మేము అనుమతిస్తే, బలహీన గుండె గల వారికి ఏమైనా అయితే నా పరిస్థితి ఏమిటి?''

"నేను అలాంటి వాడిని కాదు పత్రికా విలేఖరిని.'' రేమండ్ నవ్వుతూ చెప్పాడు.

''అంటే, పత్రికా విలేఖరుల గుండె బలమైనదనా? కావచ్చు. వారు బాధ్యత గల వారై ఉంటారు. కాబట్టి మీ కేసు వేరు. దీని వల్ల మాకు లాభం కూడా కలుగుతుంది. ఉచిత పబ్లిసిటీ. ప్రకటన." మేనేజర్ అంగీకరించాడు.

''అందుకు మీరు ఎంతిస్తారో కూడా మనం చర్చించాలి." రేమండ్ చెప్పాడు.

''కొన్నేళ్ళ క్రితం మేడం టస్సాడ్ తన వేక్స్ మ్యూజియంలోని ఛాంబర్ ఆఫ్ హారర్స్లో ఒక రాత్రి గడిపే ధైర్యవంతులకి వంద పౌన్లు ఇస్తానని ప్రకటించింది. కానీ మేము ఎన్నడూ అలాంటి ప్రకటన చేయలేదు. మీరు ఏ పత్రిక నించి?"

''మార్నింగ్ ఎకో.''

"దీన్ని ఎలా రాద్దామనుకుంటున్నారు?'' మేనేజర్ ప్రశ్నించాడు.

"భయంకరంగా. కొద్దిగా హాస్యాన్ని జోడించి.''

‘‘సరే మిస్టర్ రేమండ్. మార్నింగ్ ఎకోలో మీ అనుభవం ప్రచురింపబడ్డాక మీరు ఇక్కడికి వచ్చి ఏభై పౌండ్లని తీసుకోవచ్చు. కాని మీరు చేయబోయేది సామాన్యమైన సాహసం కాదు. నేను ఆ మైనపు బొమ్మలకి బట్టలు తొడిగినప్పుడు, తొడగనప్పుడు చూసాను. వాటిని తయారు చేయడం కూడా చూసాను. వాటి మధ్య నేను వంటరిగా ఏ సోఫా పక్కనించి నడిచినట్లు గానో మరోసారి వాటి వంక చూడకుండా నడిచి వెళ్ళగలను. కానీ రాత్రి వంటరిగా పడుకోమంటే మాత్రం అది నా వల్ల కాదు.’’

‘‘ఎందుకని? "

‘‘నాకు తెలీదు. అందుకు కారణం ఏదీ లేదు. నేను దెయ్యాలని నమ్మను. ఒక వేళ అవి ఉంటే, హత్య జరిగిన ప్రదేశాల్లోనో లేదా శవాలని ఉంచిన చోటో తిరుగుతాయి తప్ప తమ మైనపు ఆకృతులున్న సెల్లార్లో తిరుగుతాయనుకోను. అవి తదేకంగా నన్ను చూస్తూండగా వాటి మధ్య నేను గడపలేను. ఎందుకంటే, అవి అత్యంత హీనమైన మనుషుల ఆకృతులు. అక్కడి వాతావరణం ఆనందకరంగా ఉండదు. ఆ వాతావరణం రాత్రంతా అసౌకర్యంగా ఉంటుంది."

"నాకీ ఆలోచన వచ్చినప్పుడే ఇది తట్టింది." రేమండ్ చెప్పాడు.

ఫ్రీలాన్సర్గా పని చేసే రేమండ్ కి గత నెల రోజులుగా సంపాదన సరిగ్గా లేదు. 'మార్నింగ్ ఎకో’లో ఆ ఆర్టికల్ ప్రచురింపబడితే, తాను అప్పుల్లో మునగడు. పైగా ఏభై పౌన్లు అదనంగా సంపాదించచ్చు.

"మీ మర్డరర్స్ డెన్ హోటల్ గదిలా ఉండదని నాకు తెలుసు. నేను కూడా మూఢ నమ్మకాలని నమ్మను." రేమండ్ చెప్పాడు.

"కానీ మీరు పత్రికా విలేఖరులు. మీలో ఊహాశక్తి అధికంగా ఉంటుంది.’’ మేనేజర్ చెప్పాడు.

"మా వృత్తిలో సాధారణ నిజాలు చాలు. మాకు ఊహాశక్తి ఉండకూడదని మా ఎడిటర్స్ తరచూ చెప్తూంటారు." మేనేజర్ నవ్వాడు.

"సరే. ఈ పాటికి సందర్శకులంతా వెళ్ళిపోయి ఉంటారు. డెన్ లోని మైనపుబొమ్మలని బట్టతో కప్పొద్దని చెప్తాను. రాత్రి కాపలా దారులకి మీరు ఉంటారని కూడా చెప్తాను." చెప్పి ఫోన్లో మేనేజర్ ఆ సూచనలు ఇచ్చి మళ్ళీ చెప్పాడు.

"మీరు ఓ నియమాన్ని ఖచ్చితంగా పాటించాలి. సిగరెట్ మాత్రం తాగకూడదు. అగ్ని ప్రమాద భయం సదా ఉంటుంది. ఇవాళ మధ్యాహ్నం ఎవరో అక్కడ నిప్పుందని చెప్పారు. కానీ అది అబద్ధం."

మేనేజర్ వెంట రేమండ్ ఇంగ్లండ్ రాజులు, రాణులు, ప్రముఖ రాజకీయ నాయకులు, మిలటరీ జనరల్స్ యొక్క మైనపు బొమ్మలకి తెరలు కప్పుతున్న ఐదారు గదులు దాటి, గుడ్డి వెలుగులోని మెట్లు దిగి మర్డరర్స్ డెన్కి చేరుకున్నాడు. అక్కడ కొత్తగా ఉంచబడ్డ కుర్చీని చూపించి మేనేజర్ చెప్పాడు.

"మీకు ఇంతకంటే సౌకర్యమైంది మరొకటి లేదు. దీంట్లో మీకు నిద్ర పడుతుందని ఆశిస్తాను."

ఆ గదిలోని కాంతి చాలా మందంగా ఉంది. తక్కువ కాంతి భయంకర వాతావరణాన్ని సృష్టిస్తోంది. మైనపు ఆకృతుల్లోని హంతకులు పీటల మీద నించుని ఉన్నారు. వారి పాదాల దగ్గర వారికి సంబంధించిన వివరాలు రాసి ఉన్నాయి.

"ఇతను థర్టెల్, నలుగురు ఆడవాళ్ళని చంపాడు. ఇతను లెఫ్రాయ్. డబ్బున్న విధవలని చంపడం ఇతని హాబీ. ఈమె మిసెస్ థామ్సన్. పెళ్ళి చేసుకుని భర్తలని ఇన్సూరెన్స్ డబ్బు కోసం చంపేది. ఇతను ఛార్లెస్, ఇతను నార్మన్, ఇతను బ్రౌన్, ఇతను కెనడీ..." కొన్ని బొమ్మల ఆకృతులని మేనేజర్ పరిచయం చేసాడు.

ఓ బొమ్మ ముందు ఆగి పరిశీలనగా చూసి గొంతు తగ్గించి చెప్పాడు.

"మీరు డాక్టర్ బోర్డెట్ని గుర్తు పట్టారనుకుంటా. చూడడానికి చీమని కూడా చంపలేదేమో అనిపించే మొహం.''

‘‘అతని పేరు విన్నాను. విషయం గుర్తు లేదు."

"మీరు ఫ్రెంచ్ దేశస్థులైతే గుర్తుండేది. ఇతను పేరిస్లో కొంతకాలం భయాన్ని సృష్టించాడు. ఉదయం రోగులకి చికిత్స చేస్తూ, రాత్రుళ్ళు తీవ్ర వాంఛ కలిగినప్పుడు మనుషుల గొంతుల్ని రేజర్తో కోసేవాడు. ఎప్పుడూ రేజర్తోనే. కేవలం చంపే ఆనందం కోసం తప్ప వేరే కారణం లేదు. అతన్ని శిక్షించడానికి దాదాపు డజను హత్యలకి ఆధారాలు దొరికాయి. అకస్మాత్తుగా అతను మాయమయ్యాడు. అప్పటి నించి యూరప్ లోని ప్రతీ పోలీస్ శాఖ అతని కోసం వెదుకుతోంది. ఇక్కడ మాంఛెస్టర్లో అలాంటి హత్యలు ఒకటి, రెండు ఆ తర్వాత జరిగాయి. కానీ, డాక్టర్ బోర్డెట్ మరణించాడని, ఎవరో అతన్ని అనుకరించి చంపారని పోలీసుల అనుమానం."

రేమండ్ కి అతని కళ్ళని చూసి కాళ్ళు వణికాయి.

"ఎంత దుర్మార్గపు కళ్ళు?" చెప్పాడు.

‘‘అవును. ఇది మాస్టర్ పీస్. ఆ చూపు మనల్ని కొరుకుతున్నట్లుంది కదూ? అందుకు కారణం బోర్డెట్కి మెస్మరిజం తెలుసు. వారిని చంపబోయే ముందు మెస్మరైజ్ చేసేవాడు. లేదా ఇంత సన్నటి బలహీనమైన వ్యక్తి తన కన్నా బలవంతులని ఎలా చంపగలడు? ఏ హతుడూ ప్రతిఘటించలేదు."

‘‘అతను కొద్దిగా కదిలాడని అనిపిస్తోంది." రేమండ్ చెప్పాడు.

మేనేజర్ నవ్వి చెప్పాడు.

“ఈ రాత్రి గడిచేలోగా ఇలాంటి భ్రమలు మీకు అనేకం కలుగుతాయనుకుంటాను. బయట తాళం వేయం. మీరు భరించలేనప్పుడు మెట్లెక్కి పైకి రావచ్చు. వాచ్మెన్ మీకు కనిపిస్తారు. సారీ. ఇంతకు మించిన ఎక్కువ కాంతిని మేము ఇవ్వలేం. మీరు కావాలంటే నా గదిలోకి వచ్చి కొద్దిగా విస్కీ తాగి మళ్ళీ ఇక్కడికి రావచ్చు." మేనేజర్ ఆహ్వానించాడు.

విస్కీ తాగి మేనేజర్ గదిలోంచి బయటకి వచ్చి మెట్లు దిగబోయే రేమండ్కి వాచ్మెన్ నవ్వుతూ చెప్పాడు.

“గుడ్ నైట్ వాళ్ళల్లో ఎవరూ మీ వెనక నించి వచ్చి గొంతు పిసకరని ఆశిస్తాను. మిసెస్ థామ్సన్ మీరంటే ఇష్టంలా చూస్తోంది. జాగ్రత్త, నేను పైనే ఉంటాను."

రేమండ్ నవ్వి అతనికి గుడ్ నైట్ చెప్పి మెట్లు దిగాడు. చక్రాల కుర్చీలో కూర్చుని దాన్ని కావాలని డాక్టర్ బోర్దెట్ ముందుకి తీసుకెళ్ళాడు. తక్కువ వెలుగులో ఆ విగ్రహాలన్నీ నిజం మనుషులా అనిపించేలా ఉన్నాయి. అక్కడి స్తబ్దత, నిశ్శబ్దం ఎంతో అసహజంగా, భయంకరంగా అనిపించాయి. బయట ప్రపంచానికి సంబంధించిన ఒక్క శబ్దం కూడా వినిపించడం లేదు. చెయ్యో కాలో కదిలించినప్పుడు తన నీడ మాత్రమే అక్కడ కదిలేది.

వారంతా మైనపు బొమ్మలే అనే ఆలోచన ఉన్నంతసేపు తనకేం ఫర్వాలేదని రేమండ్ తనకి తను చెప్పుకున్నాడు. డాక్టర్ బోర్డెట్ బొమ్మ చూపు తన్ని వెంటాడుతూ హింసిస్తోందని అనిపించడంతో, తల తిప్పుకున్నాడు. కాని తిరిగి దాని వంక చూడాలనే కోరిక అతన్ని ఆక్రమించడంతో మధ్య మధ్య అతని వైపు చూడసాగాడు. బోర్డెట్ బొమ్మ మీద మాత్రమే పడేలా ఓ లైట్ అమర్చి ఉండటంతో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాడు.

“మిగిలిన వాటిలా నువ్వు కూడా మైనపు బొమ్మవి మాత్రమే.” బయటకి చెప్పాడు.

అవి మైనపు బొమ్మలే అయితే కదలవు. అతను కదలికని చూడకపోయినా, తన వెనక నిలబడ్డ క్రిపెన్ బొమ్మ ఎడమ వైపుకి కనీసం ఒక డిగ్రీ కదిలినట్లుగా అనిపించింది. ఫీల్డ్, గ్రే

బొమ్మల్లోని ఓ బొమ్మ చేతి వేళ్ళని కదిలించిందని అన్పించింది. ఉంగరం వేలు ఇందాకటి కన్నా కిందకి వెళ్ళి అర చేతిని తాకింది అనుకున్నాడు. కొందరు ఎడిటర్స్ తనలో ఊహాశక్తి లేదని నిందించడం గుర్తొచ్చి నవ్వుకున్నాడు.

జేబులోంచి ఓ నోట్ బుక్ తీసి అందులో రాసాడు. మరణ నిశ్శబ్దం, అసహజ స్థబ్దత సముద్ర గర్భంలో ఉన్నట్లుగా అనిపిస్తోంది. డాక్టర్ బోర్డెట్స్ హిప్నాటిక్ కళ్ళు. నేను చూడనప్పుడు బొమ్మలు కదులుతున్నాయి అనిపిస్తోంది.'

పుస్తకాన్ని మూసి ఓసారి చుట్టూ ఉన్న బొమ్మలని చూసాడు. అతను ఏ కదలికని, శబ్దాన్ని వినకపోయినా అతనిలోని సిక్త్ సెన్స్ ఓ బొమ్మని కదిలిందని చెప్పింది. లెఫ్రాయ్ మొహంలోకి సూటిగా కొద్దిసేపు చూస్తూంటే, నవ్వే అతని మొహం "నేను కాదు" అన్నట్లుగా అనిపించింది.

కదిలింది ఆ బొమ్మ కాదు. అసలు ఏ బొమ్మా కాదు. తన ఊహే భయాలని సృష్టిస్తోంది. లేదా కదిలిందా? తన దృష్టి మరో వైపున్నప్పుడు క్రిపెన్ కదల్లేదా? తను చూడనప్పుడు ప్రతీ బొమ్మ కదులుతోందనే నమ్మకం రేమండ్ కి కలిగింది. తను చూడనప్పుడు కదిలే మైనపు బొమ్మల మధ్య తనీ రాత్రి గడపలేడు అనుకుని కుర్చీలోంచి సగం లేచాడు.

మళ్ళీ కూర్చుని అనుకున్నాడు. 'ఇది అవివేకమైన, పిరికితనం. అవన్నీ మైనపు బొమ్మలే. వాటికి కదిలే శక్తి లేదు. తను ఆ ఆలోచనని మర్చిపోకపోతే చాలు.' కానీ తనలోని ఈ నిశ్శబ్ద ఆందోళన ఎందుకు కలుగుతోంది? తనకి తెలియకుండా, తన దృష్టిలో పడకుండా అక్కడ ఏదో జరుగుతోందని అతనికి అనిపించింది.

అకస్మాత్తుగా వెనక్కి తిరిగి క్రిపెన్ బొమ్మ వంక చూసాడు. దాదాపుగా క్రిపెన్ కదలడం గమనించాడు.

"జాగ్రత్త క్రిపెన్.... మీరంతా కూడా. మీలో ఎవరు కదలడం చూసినా మిమ్మల్ని ముక్కలు ముక్కలు చేస్తాను. అర్థమైందా?" చెప్పాడు.

తను రాయడానికి సరిపడే అనుభవాన్ని అప్పటికే పొందాడని, ఇక తను వెళ్ళచ్చని రెండు గంటల తర్వాత అనుకున్నాడు. మార్నింగ్ ఎకో ఎడిటర్కి తను రాసేది నచ్చితే ఎంత సేపు ఉన్నాడన్నది పట్టించుకోడు. కానీ నైట్ వాచ్ మేన్ తనని చూసి నవ్వుతాడు. మేనేజర్ ఏభై పౌండ్లు ఇవ్వడానికి నిరాకరించచ్చు.

హంతకుల మైనపు బొమ్మలు తను చూడనప్పుడు కదలడం అతను భరించలేకుండా ఉన్నాడు. ఎవరో ఊపిరి పీల్చి వదిలిన శబ్దం. నిటారుగా కూర్చుని జాగ్రత్తగా విన్నాడు. అది తన శ్వాసే అని గ్రహించి రిలీఫ్గా ఫీలయ్యాడు.

రేమండ్ అకస్మాత్తుగా తలని వెనక్కి తిప్పి చూసాడు. మళ్ళీ కొన్ని బొమ్మలు పెదవులు బిగించుకున్నట్లు, కనురెప్పలు అల్లల్లాడినట్టు తోచింది. అవి క్లాస్లోని టీచర్ వెనక గొడవ చేస్తూ, అతను బ్లాక్ బోర్డ్ వైపు నించి క్లాస్ వైపు తిరిగినప్పుడు మొహాన్ని అమాయకంగా పెట్టే అల్లరిపిల్లల్లా అనిపించాయి. కదిలే వాళ్ళని పట్టుకోవాలనే కోరిక అతనికి కలిగింది. కానీ అంతలోనే జీవించి ఉన్నాయా అనిపించే అవి కేవలం హంతకుల మైనపు బొమ్మలే, సందర్శకులని వినోద పరచడానికే వాటిని అక్కడ ఉంచారు అని గుర్తుకు వచ్చింది. తన కుర్చీని డాక్టర్ బోర్డెట్ వైపు తిప్పి అతని కళ్ళ వంక చూసాడు. ఆ బొమ్మ కళ్ళు పెద్దవయ్యాయి. నవ్వుతూ పెదవులని కదిలించడం గమనించాడు.

''నువ్వు కదిలావు. నేను చూసాను. వెధవా! నువ్వు కదిలావు." గట్టిగా అరిచాడు.

తర్వాత నిశ్శబ్దంగా బోర్డెట్ కళ్ళ వంక చూస్తూ ఆర్కిటిక్లోని మంచులా గడ్డ కట్టుకుని కూర్చుండిపోయాడు.

డాక్టర్ బోర్డెట్ కదలికలు చాలా నెమ్మదిగా ఉన్నాయి. బస్ లోంచి ఓ ముసలావిడ దిగేంత నెమ్మదిగా అతను తన పీఠం మీంచి కిందకి దిగాడు. దాన్ని తాకకుండా అడ్డుగా ఉంచిన ఎర్రటి తాడు కింద నించి రేమండ్ ముందుకి వచ్చి పలకరింపుగా తల ఊపి నవ్వుతూ చెప్పాడు.

‘‘గుడీవినింగ్. మీకు, మేనేజర్కి మధ్య జరిగిన సంభాషణ నేను వినే దాకా ఈ రాత్రి ఇక్కడ నాకు ఓ తోడు ఉంటాడని అనుకోలేదు. నేను చెప్పేదాకా నువ్వు కదల్లేవు. మాట్లాడలేవు. కానీ నువ్వు నేను చెప్పేది చక్కగా వినగలవు. ఇది భ్రమ కాదు. నేను డాక్టర్ బోర్డెట్ని తప్ప బొమ్మని కాదు." అతని ఇంగ్లీష్లో ఫ్రెంచ్ యాస ఉంది.

"నేను ఇంగ్లండ్లో నివశించడానికి కారణం నీకు తెలుసు. ఈ సాయంత్రం నేను ఈ బిల్డింగ్ బయట ఉండగా ఓ పోలీస్ నన్ను ఆసక్తిగా చూసాడు. అతను నన్ను ప్రశ్నిస్తాడని అనిపించడంతో జనంతో కలిసి ఇక్కడికి చేరుకున్నాను. ఓ అదనపు నాణెం నన్ను ఇక్కడికి అనుమతించింది. మనం కలిసిన ఈ చోటుకి రాగానే నాకు ఓ ఆలోచన రావడంతో నేను నిప్పు అని అరిచాను. మూర్ఖులంతా బయటకి పారిపోయారు. నేను నా బొమ్మకి అలంకరించినవన్నీ విప్పదీసి వాటిని ధరించాను. దాన్ని ప్లాట్ఫాం వెనక దాచి ఇక్కడ నిలబడ్డాను. అయితే నన్నంతా ఏక కాలంలో చూడరు కాబట్టి ఊపిరి పీల్చుకోగలిగాను. ఓ చిన్నపిల్లవాడు నేను కదిలానని అరిచాడు. అంతా నవ్వారు.

"మేనేజర్ నా గురించి చెప్పింది అంతా నిజం కాదు. నేను చావలేదు అన్నది నిజం. నా హాబీ గురించి చెప్పింది కూడా నిజం. ఈ ప్రపంచంలో సేకరించేవారు, సేకరించని వాళ్ళు అనే రెండు తరహా మనుషులు ఉంటారు. సేకరించని వాళ్ళని వదిలేద్దాం. సేకరించే వాళ్ళు వారి వ్యక్తిగత అభిరుచిని బట్టి దేన్నయినా సేకరిస్తారు. డబ్బు, అగ్గిపెట్టెలు, సిగరెట్ పెట్టెలు, పురుగులు. నేను గొంతుల్ని సేకరిస్తాను.’’

చెప్పడం ఆపి అతను రేమండ్ గొంతు వంక ఆసక్తిగా చూసాడు.

"మనిద్దరం ఇక్కడ కలిసినందుకు సంతోషంగా ఉంది. మీ మెడ సన్నగా ఉంది. నాకు అవకాశం ఉంటే దీన్ని ఎన్నుకునే వాడిని కాదు. దళసరి మెడలని సేకరించడమే నాకిష్టం."

తన జేబులోంచి ఏదో తీసి దాన్ని చూపుడు వేలితో పరీక్షించి చెప్పాడు.

‘‘ఇది ఫ్రెంచ్ రేజర్. దీన్ని ఇంగ్లండ్లో ఉపయోగించరు. దీన్ని చెక్క మీద పదును పెడతారు. అందుకే అంత పదునుగా ఉంటుంది. మరీ లోతుగా దిగదు. కానీ కావలసినంత లోతుగా దిగుతుంది. ఓ క్షణంలో అది నువ్వే గ్రహిస్తావు. నేను నిన్ను మర్యాదస్తులైన బార్బర్స్ అడిగే ప్రశ్నని అడుగుతాను. మీకు రేజర్ ఓకేనా సర్?''

రేమండ్కి లేవాలని, అరవాలని, పారిపోవాలని అనిపించినా వాటిలో ఒక్క పనీ చేయలేక డాక్టర్ బోర్డెట్ వంక చూస్తూ, అతను చెప్పేది వింటూండిపోయాడు.

డాక్టర్ బోర్డెట్ నిశ్శబ్దంగా వేటాడే చిరుత పులిని గుర్తుకి తెచ్చేలా రేమండ్ వైపు నడిచాడు.

‘‘దయచేసి మీ గడ్డాన్ని కొద్దిగా పైకి ఎత్తుతారా? థాంక్ యూ. ఇంకొంచెం పైకి. ఇంకొద్దిగా. థాంక్ యూ.... మెర్సీ మాన్ ష్యుర్.... మెర్సీ.’’

* * *

మర్డరర్స్ డెన్లో పై నించి పగటి వెలుతురు పడుతోంది. ఐనా ఎలక్ట్రిక్ లైట్లే అక్కడ ఎక్కువ వెలుగుని ఇస్తున్నాయి. మైనపు బొమ్మలన్నీ వాటి వాటి స్థానాల్లో సందర్శకులని భయపెట్టడానికి ఎదురు చూస్తున్నాయా అన్నట్లు నిలబడి ఉన్నాయి.

వాటి మధ్య కుర్చీలో రేమండ్ వెనక్కి ఆనుకుని కదలకుండా కూర్చుని ఉన్నాడు. అతని గడ్డం పైకి ఎత్తి ఉంది- బార్బర్ షాపులో గడ్డం గీయించుకోడానికి కూర్చున్న వ్యక్తిలా. ఐనా అతని గొంతుక మీద ఎలాంటి గీతా లేదు. శరీరం మీద ఎలాంటి రక్తం లేదు. మరణించడంతో అతని శరీరం గడ్డ కట్టింది. అతనికి ఊహాశక్తి లేదని కోప్పడ్డ ఎడిటర్ది తప్పు.

డాక్టర్ బోర్డెట్ మరణించిన ఆ వ్యక్తి వంక ఎలాంటి భావం లేకుండా తన పీఠం మీంచి చూస్తున్నాడు. అతను కదల్లేదు. కదిలేశక్తి కూడా లేదు. ఎందుకంటే అది మైనపుబొమ్మ మాత్రమే. దాన్ని అక్కడ ఉంచినప్పటి నించీ ఎన్నడూ అది తన స్థానం నించి కదల్లేదు.

---

## క్లిక్ క్లిక్ - జూలియన్ సైమన్స్

డిటెక్టివ్ ఫ్రాన్సిస్ క్వారల్స్ సెక్రటరీ మోలీ అతని గదిలోకి వచ్చి చెప్పింది.

"మీ కోసం ఒకామె వచ్చింది."

“ఎలా ఉంది?" అతను ప్రశ్నించాడు.

“వయసు ముప్పై ఐదు పైనే ఉంటుంది. డబ్బున్న మనిషిలానే ఉంది. నాలాంటి తక్కువ స్థాయి ఉద్యోగస్థులని పట్టించుకోనట్లుగా ప్రవర్తించింది. కొద్దిగా ఆందోళనగా కూడా ఉంది." మోలీ చెప్పింది.

“సరే. పంపించు.”

ఆకర్షణీయంగా ఉన్న ఆమెని చూడగానే తెలివిగలది అనుకున్నాడు. ప్రమాదకరమైనది అని కూడా క్వారల్స్కి అనిపించింది. ఆమెకి ఓ సిగరెట్ని ఆఫర్ చేస్తే స్వీకరించి అంటించి చెప్పింది.

"మిస్టర్ క్వారల్స్! మీరు మీ క్లైంట్స్ రహస్యాలు కాపాడతారని విన్నాను. నా పేరు లెస్లీ రివర్సైడ్."

మినిస్ట్రీ అఫ్ హోం సెక్యూరిటీలో అండర్ సెక్రటరీగా పని చేసే లార్డ్ జార్జ్ రివర్సైడ్ కొన్ని నెలల క్రితం తనకన్నా చాలా తక్కువ వయసు గల ఓ అందమైన అమ్మాయిని వివాహం చేసుకున్నాడన్న సంగతి క్వారల్స్కి గుర్తొచ్చింది. పెళ్ళికి మునుపు ఆమెకి దాదాపు డజనుమంది మగాళ్ళతో సంబంధం ఉందన్న సంగతి అనేక దినపత్రికల్లో చదవడం కూడా గుర్తొచ్చింది. ప్రైవేట్ డిటెక్టివ్గా క్వారల్స్కి ఇలాంటివి చదవగానే గుర్తుండిపోతాయి.

"నేను మీకేం సహాయం చేయగలను మిసెస్ రివర్సైడ్?" అడిగాడు.

"నేను కొంత మూర్ఖంగా ప్రవర్తించాను. మీరు ఓ ఫొటో నెగిటివ్ని నాకు తెచ్చి పెట్టాలి. నేను ఓ మగాడితో ఉన్న ఫోటో అది. దాన్ని క్రితం నవంబర్లో ట్రఫాల్గర్ స్క్వేర్లో తీసారు. మేము సీలయన్స్ విగ్రహం కింద నిలబడి ఉండగా ఓ ఫోటోగ్రాఫర్ వచ్చి మమ్మల్ని ఫోటో తీసాడు. ఆ ఫోటో ధర ఒక పౌండ్ అని చెప్తే అక్కర్లేదన్నాం. నిజానికి నేనా కెమెరాని అప్పుడే బద్దలు కొట్టి ఉండాల్సింది."

"ట్రఫాల్గర్ స్క్వేర్లో ఇలాంటి ఫోటోగ్రాఫర్లు చాలామంది తిరుగుతూ అక్కడికి వచ్చిన సందర్శకుల మీద పావురం వాలినప్పుడో లేదా వారి చుట్టూ పావురాలు ఎగురుతూన్నప్పుడో ఫోటో తీస్తారు. పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటోకి ఐదు షిల్లింగులు తీసుకుంటారు. నెగిటివ్తో సహా ఐతే అర పౌండే తీసుకుంటారు. అతను మీకు రెండు ఫోటోలు తీసాడా?'' క్వారల్స్ ప్రశ్నించాడు.

''లేదు. ఒకటే. రెండోది తీసే లోపే తిట్టి పంపించాను. ఇప్పుడు నాకా నెగెటివ్ని మీరు సంపాదించి పెట్టాలి." లెస్లీ కోరింది.

''దేనికి?''

''చాలా కాలం క్రితం నాకు టోనీ హార్ట్మన్తో బాగా పరిచయం ఉండేది. నా పెళ్ళయ్యాక నేను నా పాత స్నేహితులని కలవనని నా భర్త జార్జ్కి మాట ఇచ్చాను. అనుకోకుండా టోనీ నాకు అక్కడ తారసపడి, నాకు పెళ్ళయిన సంగతి తెలియక నన్ను చుంబిస్తూండగా.... ఈ ఫోటో అచ్చయితే జార్జ్కి, నాకు విడాకులు తప్పవు."

ఆమె ఓ కవర్ అందించింది. అందులో 'ఇది నీ భర్తకి కానీ, పత్రికలకి కానీ అందకూడదనుకుంటే, వెంటనే జాక్ జాన్సన్ కేరాఫ్ ఛేరింగ్ క్రాస్ రోడ్ పోస్టాఫీస్కి ఇరవై పౌండ్లు పంపు" అన్న కాగితం ఉంది.

‘‘బ్లాక్ మెయిలర్ ఇంతటితో ఆగడు. జీవితాంతం జలగలా పీడిస్తాడు. ఐదడుగులున్న అతను గోధుమ రంగు సూట్ ధరించాడు. నలుపు, తెలుపు జుట్టు, ఎడంకన్ను మెల్ల కన్ను" ఆమె వివరించింది.

వంద పౌండ్లు అడ్వాన్స్ ఫీజుగా చెల్లించి తనే రోజూ ఉదయం పది-పదకొండు మధ్య ఫోన్ చేస్తానని చెప్పి లెస్లీ వెళ్ళిపోయింది.

* * *

క్వారల్స్ ట్రఫాల్గార్ స్క్వేర్లో లెస్లీ వర్ణించిన వ్యక్తి జాక్ జాన్సన్ కోసం తనకి పరిచయం ఉన్న ఫోటోగ్రాఫర్ని విచారిస్తే అతని అడ్రస్ చెప్పాడు.

పేడింగ్టన్ స్టేషన్ సమీపం లోని ఫెండీ స్ట్రీట్లో, ఓ పాత ఇంట్లో మేడ మీద సింగిల్ బెడ్ రూమ్ అపార్ట్మెంట్లో నివశించే ఆ ఫోటోగ్రాఫర్ జాక్ జాన్సన్ని కలిసాడు. అతను చెప్పింది విని జాక్ అడిగాడు.

‘‘డబ్బు తెచ్చారా? లేకపోతే బయటికి నడవండి.’’

"నా పేరు క్వారల్స్ బ్లాక్ మెయిలింగ్ పెద్ద నేరం..."

‘‘మగాడి పని చేయడానికి ఆమె నా దగ్గరికి పిల్లవాడిని పంపింది. నెగెటివ్ ఇవ్వను. నెలనెలా నేను కోరిన డబ్బు ఇవ్వాలి లేదా నా మీద పోలీసులకి ఫిర్యాదు చేయాలి తప్ప ఆమెకి మూడో అప్షన్ లేదు."

‘‘నాకా ఫోటో చూపించు.’’

‘‘చూపించను. డబ్బు చెల్లించకపోతే దాన్ని ఎవరు చూడాలో వారే చూస్తారని వెళ్ళి చెప్పు.’’

‘‘ఆ నెగెటివ్ ఇస్తే వెంటనే వంద పౌండ్లు చెల్లిస్తాను." క్వారల్స్ బేరం పెట్టాడు.

‘‘నన్ను నవ్వించక."

"ఐదు వందల పౌన్లు.’’

‘‘ఆ నెగెటివ్ అమ్మకానికి లేదు."

"ఆఖరి మాట ఏడు వందల ఏభై పౌండు."

‘‘బయటికి నడు." జాక్ అరిచాడు.

‘‘బ్లాక్ మెయిలింగ్కి ఇంతకాలం ఆగావేం?’’

"అదృష్టం. నాలుగు రోజుల క్రితం ఆమె ఫొటోని ఓ దిన పత్రికలో చూస్తే కాని ఆమె ఎవరో తెలీలేదు.’’

* * *

మర్నాడు ఉదయం క్వారల్స్కి ఓ ఫోన్ కాల్ వచ్చింది.

"నేను లెస్లీ రివర్సైడ్. ఇక మీ సేవ నాకు అవసరం లేదు. మీరు బిల్లు పంపితే చెక్ పంపిస్తాను.’’

‘‘ఎందుకని?’’

‘‘అతనితో నా వ్యవహారం ముగిసింది." లైన్ కట్ అయింది.

తర్వాత క్వారల్స్ దినపత్రిక చదువుతూంటే, ఫెండీ స్ట్రీట్ లోని ఓ అపార్ట్మెంట్లో జాక్ జాన్సన్ అనే టూరిస్ట్ ఫోటోగ్రాఫర్ హత్య చేయబడిన సంగతి కనిపించింది. క్వారల్స్ వెంటనే రివర్సైడ్ నంబర్కి ఫోన్ చేసాడు. ఆమె లైన్లోకి రాగానే చెప్పాడు.

"జాక్ జాన్సన్ చంపబడ్డాడు."

‘‘అతని పేరు నేను ఎన్నడూ వినలేదు. మీకేం కావాలి?" ఆమె కరకుగా అడిగింది.

‘‘ఈ పని మీ బాయ్ ఫ్రెండ్ చేసాడా లేదా మీరే చేసారా, లేదా అందుకు మీ భర్త సహకరించారా అన్నది నాకు తెలీదు. అది పోలీసులకి సంబంధించిన వ్యవహారం.

దినపత్రికలో హంతకులు దేని కోసమో వెదికారని రాసారు. కానీ అది మీకు అంటే ఆ నెగెటివ్ దొరకలేదని చెప్పడానికి విచారిస్తున్నాను."

కొద్ది క్షణాలు మౌనం తర్వాత ఆమె అడిగింది.

"మీకెలా తెలుసు? దాన్ని మీరు సంపాదించారా? అలా జరిగితే మీ ఫీజ్ ఎంతో చెప్పి ఆ నెగెటివ్ నాకు అందజేయండి.’’ ఆమె కంఠంలో ఆర్ధింపు ఉంది.

‘‘సారీ."

"దాని ధర ఎంత? బేరాలు లేకుండా ఓ మొత్తం చెప్పండి." లెస్లీ కోరింది.

‘‘ఓ చిన్న విషయం తెలియక మీరు ఓ ఘోరమైన తప్పిదం చేసారు."

‘‘ఏమిటది?’’

"అతన్ని చంపడం. ట్రఫాల్గర్ స్క్వేర్లో ఫోటోగ్రాఫర్లు మొదటిసారి క్లిక్ చేసినప్పుడు కెమెరాలో ఫిల్మ్ ఉండదు. యాత్రికులంతా ఫోటోలు కొనరు కాబట్టి ఫిల్మ్ని వృధా చేయరు. ఫోటో కొంటానంటేనే ఫిల్మ్ ఉన్న రెండో కెమెరాతో మళ్ళీ ఫోటో తీస్తారు. మీరు అతని అపార్ట్మెంట్ ఎంత వెదికినా ఈ లోకం లోనే లేని నెగెటివ్ మీకు కనపడదు."

‘‘అరెరె!’’

“జాక్ జాన్సన్ హత్య విషయంలో నాకు తెలిసిన సమాచారం పోలీసులకి తెలియచేయడం బ్రిటిష్ పౌరుడిగా నా విధి.”

“ఎంత?” ఆమె కంఠం ఆందోళనగా వినపడింది.

"నేను డిటెక్టివ్ని తప్ప బ్లాక్ మెయిలర్ని కాను.” క్వారల్స్ ఫోన్ పెట్టేసాడు.

---

## గైడ్ - ఎల్లీ పీటర్స్

"రండి. కిందకి దారి ఇటు వైపు. తలుపు దగ్గర మీ తలలు జాగ్రత్త. మెట్లని కూడా చూసుకోండి. బాగా అరిగి జారుతున్నాయి. మనం మళ్ళీ ప్రాంగణంలోకి చేరుకున్నాం.”

“లేడీస్ అండ్ జెంటిల్మెన్. ఇంతటితో మన టూర్ ముగుస్తుంది. మీ సమయానికి, సహనానికి థాంక్స్ గేట్ దగ్గరకి ఇటు వైపు నించి వెళ్ళాలి.”

"ఎస్ మేడం? అవును. ఇది చాలా చిన్న కోట. నిజం చెప్పాలంటే ఇది ఒకప్పటి రాజప్రాసాదం లోని ఆయుధ శాల మాత్రమే. కాని వాటిలో శిధిలమవకుండా చక్కగా ఉన్నది ఇదొకటే. అందుకు కారణం దీనికి ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయడం. ఆరు వందల ఏళ్ళ నించి ఇది ఒకే కుటుంబం ఆధీనంలో ఉండటంతో అది సాధ్యమైంది.... అవును మేడం. ఛేస్లీ కుటుంబం ఇక్కడ అన్నేళ్ళ నించి ఉంటోంది. నూట ఏభై ఏళ్ళ క్రితం ఈ గోడల మధ్య గ్రేస్ హౌస్ నిర్మాణం జరిగే దాకా ఇది ఆయుధాగారంగా ఉండేది. ఏంటి సర్ బావి? అది అటు వైపుంది సార్..... ఏమిటి సర్? నాకు సరిగ్గా వినపడలేదు. ఆ బావి కాదా సర్? ఇంకొక బావా?

"కాని తక్కువ మంది కుటుంబ సభ్యులు గల ఈ ఇంట్లో ఇంకో బావి ఎందుకు ఉంటుంది సర్? ఏమిటి? ఏం పేరన్నారు? మేరీ పర్సెల్ మరణించిన బావా సర్? ష్.... దయచేసి గట్టిగా మాట్లాడకండి సర్. అవును. దాని గురించి నాకు తెలుసు. కాని దాన్ని సందర్శకులకి చూపించను సర్ మిస్టర్ ఛేస్లీకి ఆ వ్యవహారం జ్ఞాపకం రావడం ఇష్టం లేదు సర్. దాన్ని అంతా

మర్చిపోవాలని ఆయన అనుకుంటున్నాడు. లేదు సర్. మీకా మినహాయింపుని ఇస్తే నా ఉద్యోగం పోవచ్చు. మీరు గ్రూప్లో వచ్చారు కదా? మీరు కార్లో వచ్చారా సర్? కాని బస్ ఇంకో ఐదు నిమిషాల్లో బయలు దేరుతుంది కదా? మీకోసం ఎదురు చూసే వారు ఇక్కడికి రావచ్చు కదా. ఓ! ఎవరికీ చెప్పి రాలేదా సర్?

"అది పెద్ద మొత్తం సర్, మీకా బావి మీద గల ఆసక్తిని నేను అర్థం చేసుకోగలను. మీరు ఆ కేస్ గురించి రాసిన రిపోర్టర్లలో ఒకరా సర్? ఓ.... పేరేమన్నారు? మేరీ పర్సెల్?

"లేదు సర్. అప్పట్లో నేనీ ఉద్యోగం చేయడం లేదు. కాని అందరిలా నేనూ దినపత్రికల్లో ఆ కేసు గురించి చదివాను. ఒక్క నిమిషం సర్. ఈ టూర్లోని వారందరినీ పంపించేదాకా మీరు వేచి ఉంటే...

"వెళ్ళారు. ఇప్పుడు మనం మాట్లాడుకోవచ్చు సర్. నా వెంట రండి. ఆఖరి టూర్లోని వారంతా బయటకి వెళ్ళాక, ఈ పాత తలుపుని మూసి బయట గడియ పెట్టాక నాకు శాంతి కలుగుతుంది సర్ రోజూ కార్ పార్క్ నించి కార్లు దూరం అయ్యే శబ్దం నాకు ఆనందాన్ని కలిగిస్తుంది. కాంపౌండ్ వాల్ మొదలయ్యే చోటికి అవి చేరుకోగానే వాటి శబ్దాలు వినపడటం ఆగిపోతుందని గమనించారా? ఇప్పుడు ఇక్కడంతా నిశ్శబ్దంగా లేదు సర్? త్వరలోనే మనం గుడ్లగూబల అరుపులు వింటాం.

"మీరు ఆ బావినే చూడాలని అనుకుంటున్నారా సర్? లేక ఇంకో బావినా? ఓ.... ఆ విషాదం సంభవించిన బావి నేనా? నిజానికి నేను దాన్ని చూపించకూడదు. మిస్టర్ ఛేస్లీకి అది తెలిస్తే బాగా కోపం వస్తుంది.... అది నిజమే సర్. మీరు చెప్పకపోతే అది ఎప్పటికీ ఆయనకి తెలీదు. సరే. ఆ పెద్ద హాల్ లోంచి పదండి సర్. మీ వెనకే నేనూ వస్తాను. నేను చెప్పకుండానే మీరు సరైన వైపు తిరిగారు సర్. నేలలో గతుకులు చాలా ఉన్నాయి. కాస్త చూసి నడవండి సర్.

"ఆ పాత విషయం మళ్ళీ బయటకి రావడం మిస్టర్ ఛేస్లీకి ఎందుకు ఇష్టం లేదో మీరు ఊహించగలరు సర్, అది అతని జీవితాన్ని ఎంతో నాశనం చేసింది. ఆమెని చంపిన ప్రేమికుడు ఆయనే అని అంతా భావించారు. ఆమె అతని ఉద్యోగస్థుల్లో ఒకరు సర్. ఛేస్లీ చూసీ చూడగానే ఆమెతో ప్రేమలో పడ్డాడు. ఆమె కూడా. ఈ వదంతిని ఎవరు సృష్టించారో అతనికి తెలిసి ఉంటే, తప్పక వారి మీద నష్టపరిహారం కేసుని కోర్టులో ఫైల్ చేసేవాడు. కాని వారెవరో ఆయన తెలుసుకోలేకపోయాడు సర్, ఓ ఏడాది తర్వాత ఆయన భార్య ఆయనకి విడాకులు ఇచ్చేసింది. అది జరిగి పదేళ్ళు దాటింది సర్ మళ్ళీ ఆ పాత విషయాలు అంతా మాట్లాడటం ఆయనకి ఇష్టం లేదు. లేదు సర్, మీరు బయట ఈ విషయాలు మాట్లాడుతారని నేను అనుకోవడం లేదు. లేదా నేను మిమ్మల్ని అక్కడికి తీసుకెళ్ళే వాడిని కాను.

‘‘నిజమే. ఆమె చాలా అందగత్తె అని అంతా చెప్పారు సర్, మిసెస్ పర్సెల్ చిన్నది. ఇరవై ఒక్క ఏళ్ళే. ఆమె ఫొటోలు ఆమె చర్మం రంగుకి న్యాయం చేయలేదని ఆమెని చూసిన చాలామంది చెప్పగా విన్నాను సర్ అద్భుతమైన నీలం రంగు కళ్ళు.....

ఓ! ఆకుపచ్చ రంగు కళ్ళా సర్? లేదు. మీతో వాదించను సర్. మీరు పత్రికా విలేకరిగా ఆ వ్యవహారాన్ని రాసాను అంటున్నారు కాబట్టి మీకే ఎక్కువ తెలిసి ఉండాలి. ఈ కింది ఆఖరి మెట్టు దగ్గర జాగ్రత్త సర్. అది చాలా అరిగి గుంట పడింది.

‘‘ఆకుపచ్చ రంగు కళ్ళ! లేదు. లేదు. నేను మీరు చెప్పింది నిజమనే నమ్ముతున్నాను. మీ జ్ఞాపక శక్తికి మీరు శిక్షణ ఇచ్చారని కూడా నేను నమ్ముతున్నాను. ఏది ఏమైనా గ్రామీణ వాతావరణంలో పెంచ బడ్డ ఆమె చిన్నది, అందమైంది, అమాయకురాలు. ఆమె తోటమాలుల్లోని ఒకరి కూతురు. మీరు ఆమె తండ్రిని కలవలేదా సర్? లేదా? నిజమే. ఆయన పత్రికలకి చెప్పడానికి ఏమీ ఉండదు. తర్వాత పాపం ఆయనకి ఆ విషాదానికి గుండె పోటు వచ్చింది. మిస్టర్ ఛెస్లీ ఆయనకి పెన్షన్ ఇవ్వడం ఆరంభించి, శారీరక శ్రమ లేని వేరే ఉద్యోగం ఇచ్చాడు. అదీ ఇక్కడ కాదు. అక్కడ కాదు. అన్ని చోట్లా.... ఇది స్టోన్ గేలరీ సార్ అడుగులు

జాగ్రత్తండి.... లైట్ వెలిగిస్తాను ఉండండి. అవును సర్. ఇక్కడంతా భయంకరంగా ఉంది. అక్కడ తమాషాగా వంకర తిరిగిన కత్తిని, పక్కనే గొడ్డలిని చూసారా? వాటన్నిటినీ నేను నిత్యం తుడుస్తుంటాను. సందర్శకులంతా వెళ్ళి పోయారని రూఢి చేసుకోడానికి రాత్రుళ్ళు నేను ఇక్కడ నడుస్తూంటాను. తలుపులకి తాళాలు వేసేప్పుడు ఆ గొడ్డలిని నా వెంట ఉంచుకుంటాను. అందువల్ల నాకు వంటరితనం పోయినట్లు అనిపిస్తుంది. నవ్వకండి. నాకు నిజంగా అలా అనిపిస్తుంది. చీకటి పడ్డాక ఇక్కడ చాలా భయం వేస్తుంది. నేను దెయ్యాల్లో ఒక్కణ్ణా అనిపిస్తూంటుంది. గొడ్డలిని మనతో తీసుకు వెళ్దాం. ఎందుకా? ఆ ఘోరం జరిగాక ఆ బావి మీద బరువైన మూతని మూసారు. దాని మీద ఓ కొక్కెం ఉంది. ఈ గొడ్డలి హేండిల్ని దాంట్లోకి చొప్పించి మూతని ఎత్తడానికి సార్.

‘‘బావి లోకి చూడటానికి మీరు భయపడచ్చు. ఆ బావిలోకి ఇనప రింగులతో చేసిన మెట్లున్నాయి. ఆమె భర్త వాటి మీంచే లోపలకి దిగి ఆమె శవాన్ని బయటకి తెచ్చాడు సర్. మనం ఎవరం ఆ పని చేయడానికి ఇష్టపడం. భర్తగా పాపం అది అతని బాధ్యత కదా మరి.

‘‘ఆమె భర్త ఇప్పుడు ఎక్కడ ఉన్నాడంటారా? మీరది ఎప్పుడూ వినలేదా? అతనికి పిచ్చెక్కింది. అతను ఇంకా పిచ్చాసుపత్రిలో ఓ సెల్లో ఉన్నాడు. నేను వినడం ఆ అక్రమ సంబంధం కొంత కాలం సాగింది. తను గర్భవతని తెలుసుకోగానే ఆమె కృంగిపోయింది. ఇహలోకం లోకి వచ్చి తనని ఆ వ్యక్తి ఎలా లొంగదీసుకున్నాడా అని ఆలోచించింది. ప్రియుడితో పరిచయం వల్ల ఆమె తాత్కాలిక హుషారులో ఉండి ఉంటుంది. ఆమె అతని దగ్గరకి వెళ్ళి ఆ విషయం చెప్పి, "ఏం చేద్దాం?’’ అని అడిగింది.

"అతను ఆమెని మూర్ఖంగా ఉండద్దని, చెయ్యడానికి ఏం ఉందని ప్రశ్నించాడు. ఆమెకి ఓ భర్త ఉన్నాడు కదండి. అందుకని ఆమె నోరు మూసుకుని నిశ్శబ్దంగా ఉంటే అంతా సవ్యంగా ఉంటుందని చెప్పాడు. కాని ఆమె అతనిలా ఆలోచించలేకపోయింది. బహుశ ఆమె తన భర్తని ప్రేమిస్తూండటం ఆగిపోయి ఉండదు. తన భర్త కళ్ళని చూసి ఇంకొకరి బిడ్డని అతని బిడ్డలా

భావిస్తూ పెంచే ద్రోహాన్ని చేయలేనని అనుకుంది. నిజాయితీగా ఉండాలని ప్రయత్నించే ఆమె తనని తను అసహ్యించుకోసాగింది. ఆ విషయంలో తన ప్రియుడి సహకారాన్ని ఆశించింది. ఆ విషయం తర్వాత మాట్లాడదామని ఆమె ప్రియుడు ఆ సంభాషణని వాయిదా వేసాడు.

''అతను మర్నాడు మాయమయ్యాడు సర్. ఎక్కడికి వెళ్ళాడో నాకైతే తెలీదు సర్ కాని పారిపోయాడు. లేదు సర్. అప్పుడు నేనీ ఉద్యోగంలో లేనని చెప్పాగా? ఎక్కడికి వెళ్ళాడో నాకెలా తెలుస్తుంది సర్? జరిగింది ఊహించి చెప్పానంతే. నేను చెప్పినట్లుగా జరిగి ఉండకపోవచ్చు కూడా. ఒక వేళ అది మిస్టర్ ఛేస్లీ పనై ఉంటే, ఇక్కడే ఉండి బురద చల్లించుకున్నాడు. కాని ఇప్పుడు చాలామంది అది ఆయన పని కాదని నమ్ముతున్నారు. ఆమె నిజాయితీపరురాలని చెప్పాగా, ఏది ఏమైనా ఆమె వెళ్ళి తన భర్తకి జరిగిందంతా చెప్పింది తప్ప తన ప్రియుడి పేరు మాత్రం ఎన్ని సార్లు అడిగినా చెప్పలేదు. అది దాచడం ఆ భర్తని దాదాపు చంపిందనే చెప్పాలి.

''అతను కోపంతో మండిపడటం, ఆమెని హింసించడం లాంటివి ఏం చేయలేదు. మౌనంగా వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు. ఆమె ఏడుస్తూ అతని వెనకే వస్తే అతను భరించలేక ఆమెని కొట్టాడు.

''నిజమే సర్. నాలో ఊహాశక్తి అధికం. నేను కాదనను. మీరు కూడా ఈ ప్రదేశంలో ఒంటరిగా గడుపుతూంటే మీలో కూడా ఊహా శక్తి పెరుగుతుంది సర్ రాత్రుళ్ళు ఒకో సారి వాళ్ళిద్దరూ కలిసి నడవడాన్ని నేను చూస్తూంటాను. భయపడకండి. నా ఊహల్లోనే సుమా. నేను అనుకోవడం ఆమె జీవితానుభవం లేని అమాయకురాలు. తనని అంత ప్రేమగా చూసుకునే తన భర్త కొట్టడంతో ఆమె మనసు చెదిరింది. తన భర్తకి, తనకి సంబంధం తెగిపోయిందని, ఇక తనతో కాపురం చేయడని భావించి ఉంటుంది. అతను లేకపోతే తనకి ఇంక ఏమీ ఉండదు. ఆమెకి వేచి భర్త ప్రవర్తనని చూడాలని, తన భర్త తనని నిజంగా వదిలేస్తాడో లేదో చూడాలని స్ఫురించలేదు సర్. ఆమెలో ఆశ లేదు. తక్షణం ఏడుస్తూ పరిగెత్తుకెళ్ళి ఆ బావిలో దూకింది.

"ఐదు నిమిషాల దాకా ఆమె జీవించి ఉంటే అతను ఆమెని కొట్టినందుకు క్షమాపణ చెప్పేవాడు. కాని అప్పటికే బాగా ఆలస్యం ఐపోయింది. శవాన్ని బయటకి తీసేసరికి ఆమె జుట్టు నిండా, అందమైన ఆమె ఆకుపచ్చ కళ్ళు నిండా పాచి అంటుకుని ఉంది.

‘‘సరిగ్గా ఇక్కడే సర్. మీరు నించున్న చోటు నించి ఆమె దూకింది సర్. అదే సర్ ఆ బావి మీది మూత. అప్పటి నించి ఈ బావిని మూసి ఉంచారు. ఎవరూ మళ్ళీ తెరవకుండా మూతని బరువుగా చేయించారు. మీరు కొద్దిగా వెనక నిలబడితే గొడ్డలి హేండిల్ని ఆ హుక్లోకి పోనించి దీన్ని లేపుతాను. బహుశ ఆ తర్వాత ఈ మూత తెరచుకోవడం ఇదే మొదటి సారై ఉంటుంది సర్. నిజానికి ఇక్కడికి అప్పటి నించి ఎవరూ అసలు వచ్చి ఉండరు సర్.

‘‘లోపలకి చూడండి సర్. ఊహూ... బావి ఎంత లోతో ఎవరికీ తెలీదు సర్ వత్తి ఇంకొంచెం పెద్దది చేస్తాను. అప్పుడు ఇంకాస్త స్పష్టంగా చూడచ్చు. ఇలాంటి బావిలోకి దుకాలంటే అమ్మాయి మనసు పగ్గాలు ఆమె స్వాధీనం తప్పి ఉంటాయి కదా సర్?

‘‘మూడేళ్ళల్లో ఈ రాత్రి దాకా ఇక్కడికి నేను తప్ప ఎవరూ రాలేదు సర్. బహుశ తర్వాతి మూడేళ్ళ దాకా కూడా ఎవరూ రారు సర్ మళ్ళీ ఎవరైనా చూడాలంటారని అనుకోను సర్ వచ్చిన వారు బావి మీది మూతని తెరవరు..... అవును సర్. నేనే ఇక్కడంతా శుభ్రం చేసేది. నాకు అశుభ్రత అంటే ఇష్టం ఉండదు సర్. ఈ గొడ్డలిని చూడండి సర్. దుమ్ము కాని, బూజు కాని లేదు. పదును కూడా పోలేదు. ఓ సారీ సర్ మీ చెయ్యి కోసుకుందా? పిచ్చినాకా సర్? లేదు. ఆమె భర్తకి. అతన్నిమెంటల్ హాస్పిటల్లో బంధించారు. నాకు వచ్చిన అనారోగ్యం కేవలం గుండె పోటే. అది నా శక్తిని హరించలేదు సర్. నాకు పెన్షన్ ఇచ్చి బరువులు ఎత్తని ఈ గైడ్ ఉద్యోగం ఇచ్చారు సర్. ఐనా నేను బలహీనుడ్ని కాను సర్. తొందర పడకండి సర్. ఇంకా చెప్పాల్సింది ఉంది.

‘‘లేదా? ఉంది సర్. ఐనా లేదని మీకెలా తెలుసు? ఎక్కువ తెలుసుకుని ఉండటం పొరబాటు సర్. ఒక్కోసారి ప్రమాదకరం కూడా. సాధారణంగా నేరస్తులకే అందరికన్నా ఓ నేరం గురించి అధికంగా తెలుస్తుంది సర్.

"మీరు మేరీ పర్సెల్ అన్నారా? ఆమె మొదటి పేరు ఏలిస్. దినపత్రికల్లో ఆ పేరునే ఉపయోగించారు సర్. ఆమె కుటుంబ సభ్యులు, దగ్గరి వారే ఆమెని మేరీ అని పిలిచేవారు. ఆమె కళ్ళు ఆకుపచ్చ రంగని మీకెలా తెలుసు సర్? పత్రికా విలేకరులు ఆమె శవం దగ్గరకి చేరుకునే సరికి అవి మూసేయబడ్డాయి. కాని ఆమె ప్రియుడికి ఆ రంగు తెలుసు సర్ అవును సర్. నాకు ఇప్పుడు మీరు ఎవరో తెలుసు సర్. ఆ వేసవిలో లోపెల్స్లో నివశించిన యువకుడు మీరు. మనం మేరీ గురించి మాట్లాడాలి సర్.... సారీ... ఆమె భర్త టిమ్ పర్సెల్ ఈ పార్టీలో పాలు పంచుకోనందుకు నాకు విచారంగా ఉంది సర్. అతను ఇక్కడ ఉండి ఉంటే బహుశ అతనికి మంచి జరిగేది. కాని ఉండాల్సిన వాళ్ళు ఉన్నాక ఇక్కడ లేని వాడి గురించి మాట్లాడటం అనవసరం సర్.

‘‘బయట నేనేం చేస్తున్నానా? ఈ గది తాళం ఇంకా పని చేస్తోందో లేదో పరీక్షిస్తాను సర్. దీనికి ఆయిల్ వేసి ఎంత కాలమైందో సర్. ఈ కోటలో ఎన్నో తాళాలు, ఎన్నో తాళం చెవులు సర్. మిస్టర్ ఛేస్లీ ఈ గదికి ఎప్పుడూ తాళం వేసే ఉంచాలని నాకు చెప్పారు సర్ తాళం పడింది సర్."

‘‘మీరు ఈ కోటకి వంటరిగా రావడం విధి కాక ఇంకేమిటి సర్? మీరు కారులో కూడా రాలేదు. ఇక్కడికి రాబోయే ముందు గ్రామం నించి టూరిస్ట్ బస్లో వచ్చారు. వాళ్ళు ఐదు నిమిషాలు మించి వేచి ఉండరు. మీరు ఏమయ్యారా అని పట్టించుకోరు కూడా. వాళ్ళు వ్యక్తులు కాదు సర్ వ్యాపారస్థులు. ఇప్పుడు వాళ్ళు తమ పౌండ్లని లెక్క పెట్టుకుంటూండచ్చు. మీరు ఇక్కడికి వస్తున్నట్లు ఎవరికీ చెప్పలేదన్నారు. కాబట్టి మీ కోసం ఎవరూ ఇక్కడికి రారు. కాని మీరు మళ్ళీ ఇక్కడికి రాకుండా ఉండలేక పోయారు కదా? మీరు ఎందుకు వచ్చారో కూడా బహుశ

మీకే స్పష్టంగా తెలీకపోవచ్చు. మీరు ఇక్కడ మేరీ తండ్రిని కలుస్తారని కల్లో కూడా ఊహించి ఉండకపోవచ్చు. నేను మాత్రం మళ్ళీ మిమ్మల్ని చూడాలని కలలు కంటున్నాను సర్. నా దీర్ఘమైన కల ఈ రోజు నిజం అయింది సర్.

"ఆగండి సార్.. మీరే నేనైతే అరవను సర్ అరిచినా ఆ అరుపులు ఎవరికీ వినపడవు సర్. అరమైలు దూరంలో మీరు, నేను తప్ప ఇంకెవరూ లేరు సర్. ఈ గోడలు చాలా దళసరివి సర్ చాలా దళసరివి. నేను వెళ్తున్నాను సర్. మీరు మేరీని మీ జీవితపు ఆఖరి రోజుల్లో కలుసుకోవడం మీకు ఆనందంగా లేదా సర్. ఆమె వియోగాన్ని మీరు భరించలేకపోతే గొడ్డలి ఉంది సర్. దాన్ని లోపలే వదిలాను. మీకు దాహం ఐతే ఆ బావిలోకి దిగకండి. అది ఎండిపోయిన బావి. మీరు మీ జీవితంలో ఆఖరిగా వినేది దూరంగా వెళ్ళే నా బూట్ల చప్పుడే సర్."

---

## నాలుగు హత్యలు - జార్జ్ బాక్స్టర్

స్విట్జర్లాండ్ నించి విమానంలో లండన్కి తిరిగి వస్తున్నాను.

మూడేళ్ళ క్రితం ఓ ఉదయం వేణ్ణీళ్ళ కింద స్నానం చేస్తూండగా, నాకు ఆ నలుగురిని చంపాలనే ఆలోచన రావడం గుర్తొచ్చింది. మా మేనత్త మిర్టెల్ మరణించడంతో నాకు ఆమె ఆస్థంతా వచ్చేసింది. నాకున్న శత్రువుల్లో నలుగురిని చంపడానికి ఎంపిక చేసుకున్నాను. మొదటి శత్రువు ఎల్సీ లీ మేకిన్తోష్. ఐదేళ్ళుగా మా మధ్య సాగిన స్నేహం బెడిసి కొట్టింది. ఆమె నా గురించి అనేక మందికి చెడ్డగా చెప్పి నాకు కొన్ని స్క్రిప్ట్స్ అసైన్మెంట్స్ రాకుండా చేసింది.

నేను చంపదల్చుకున్న రెండో వ్యక్తి డేనియల్ పెయిన్. ఈ రాక్షసుడు నటుడుగా చిత్రరంగంలోకి ప్రవేశించి తర్వాత నిర్మాతగా మారాడు. ఓ రోజు అతనితో నేను రాసిన ఓ సన్నివేశం విషయంలో వాదించాను. వెంటనే అతని మొహం ఎర్రబడింది. కొద్ది సేపు నావంక దీర్ఘంగా చూసి చెప్పాడు.

‘‘నీకు స్క్రిప్ట్ రైటర్గా ఇక ఎక్కడా పని దొరక్కుండా చూస్తాను.''

ఆ విషయంలో అతను విజయం సాధించాడు కూడా. దాంతో నేను చిత్ర సీమని వదిలి నవలా రచయితగా మారాల్సి వచ్చింది.

వేణ్ణీళ్ళ కింద స్నానం చేస్తూ నేను చంపాలనుకున్న మూడో వ్యక్తి గురించి ఆలోచించాను. అతని పేరు పేట్రిక్ కేంటర్. టి.వి. డ్రామాలకి దర్శకత్వం వహిస్తాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేట్రిక్కి నేను కొన్ని వేల పౌండ్లని అప్పుగా ఇచ్చాను. అప్పట్లో నేను సినిమా రచయితగా బాగా సంపాదించేవాడిని. కొన్నేళ్ళ తర్వాత, అంటే నిర్మాత డేనియల్ పెయిన్ హెచ్చరిక నిజమయ్యాక, అతని టి.వి. డ్రామాల్లో రాసేందుకు అవకాశం ఇవ్వమని ఉత్తరాలు రాసాను. వాటికి జవాబులు రాకపోవడంతో ఫోన్లు చేసాను. అతని భార్య ఆ కాల్స్ని రిసీవ్ చేసుకుంది. పేట్రిక్ మాత్రం నాకెన్నడూ తిరిగి ఫోన్ చేయలేదు. ఓసారి దినపత్రికలో ఓ ప్రఖ్యాత టి.వి. దర్శకుడు మరణించిన వార్తతో పాటు, పేట్రిక్ కేంటర్ స్టేట్మెంట్ కూడా అచ్చయింది. నేను అతనికి చాలా ఋణపడి ఉన్నాను. అతనే నన్ను అనేక సందర్భాల్లో ఆదుకున్నాడు. అది చదివితే నాకు ఒళ్ళు మండింది.

నేను చంపాలనుకున్న నాలుగో వ్యక్తి డ్రూ సమర్ఖండ్ అతను ప్రచురణకర్త. కొత్త రచయితల పుస్తకాలని మాత్రమే అతను ప్రచురించేవాడు. నా నవలలని కూడా ప్రచురించి పారితోషికం విషయంలో తప్పుడు లెక్కలతో నన్ను మోసం చేసాడు. నేను ఇంకాస్త మంచి పబ్లిషర్కి నా పుస్తకాలు ఇస్తే అగ్రిమెంట్ ఉల్లంఘించానని నా మీద కోర్టుకి వెళ్తానని బెదిరించాడు. నేను, మరో స్నేహితుడు కలిసి ప్రయాణాలు చేయడంతో మా ఇద్దరి మీద పుకార్లని ప్రచారం చేసాడు.

ఆ నలుగురినీ చంపాలని నిర్ణయించుకున్నాక స్విట్జర్లాండ్లోని ఓ బేంక్లో అకౌంట్ తెరిచి వారం వారం ఆ అకౌంట్కి డబ్బుని బదిలీ చేయసాగాను. నా పుస్తకాలు, చిత్రాలని, నేను సేకరించిన బేట్ మేన్ కామిక్స్, నా ఫర్నిచర్, బంగారు ఆభరణాలని అమ్మి ఆ డబ్బు మొత్తాన్ని స్విట్జర్లాండ్కి తరలించాను. ఆ నలుగుర్ని విష ప్రయోగంతో చంపాలని నిశ్చయించుకున్నాను.

వారు తరచూ వెళ్ళే రెస్టారెంట్స్ గురించి కొన్ని వారాలు వాళ్ళని అనుసరించి తెలుసుకున్నాను. వాళ్ళు ఏ రోజు ఏ రెస్టెంట్లో భోంచేస్తారో తెలుసుకున్నాక అక్కడి హెడ్ వెయిటర్స్, బార్ టెండర్స్ సహాయం కోరాను. పెద్ద టిప్స్ వాళ్ళు కాదనలేదు.

ఆర్కిబాల్డ్ గ్లామ్ ఓ పోలీస్ డిటెక్టివ్. నేను క్రైం థ్రిల్లర్స్ని రాసే ప్రయత్నంలో అతనితో పరిచయం ఏర్పడింది. ఈ రెస్ట్రెంట్స్కి కూడా అతను నా వెంట వచ్చాడు.

నేను నా మొదటి శత్రువు ఎల్సీ లీ మేకిన్తోష్ని సార్డీ రెస్టారెంట్లో హత్య చేసినప్పుడు అతను నా పక్కనే ఉన్నాడు.

ఆమెని నేను పలకరిస్తే, నా వంక మౌనంగా చూసింది తప్ప బదులు పలకలేదు. ఆమెతో నేను చెప్పాను.

"ఎల్సీ లీ! నీకు ఇష్టమైన అలెగ్జాండర్ బ్రాందీని ఆర్డర్ చేస్తున్నాను. నేను దేశం వదిలి శాశ్వతంగా వెళ్ళిపోతున్నాను. ఇక్కడ నాకు శత్రువు అంటూ లేకుండా చేసుకుని వెళ్ళాలని నా కోరిక. కాబట్టి నీకు ఇష్టం ఉంటే దాన్ని నాతో టోస్ట్ చేసి తాగు. లేదా దాన్ని నా మొహం మీద కుమ్మరించు."

“నువ్వీ దేశాన్ని వదలడం ఆనందకరమైన విషయం. కాబట్టి అందుకు టోస్ట్ చేస్తాను.” కోపంగా చెప్పి బ్రాందీని తాగింది.

మర్నాడు ఉదయం నేను ఓ కథకి మెరుగులు దిద్దుతూంటే, ఆర్కిబాల్డ్ నించి నాకు ఫోన్ వచ్చింది.

"మేక్స్ అంబర్వే! మనం నిన్న సార్డీలో భోజనం చేసినప్పుడు నువ్వు మాట్లాడిన వ్యక్తి ఎల్సీ లీ మేకిన్తోషా?"

“అవును. ఏం?” అడిగాను.

‘‘ఆమె హత్య చేయబడింది. ఆమె చర్మం రంగు, గోళ్ళ కండిషన్ చూసి విష ప్రయోగమని అనుమానించి పోస్ట్ మార్టం చేయబోతున్నారు." చెప్పాడు.

‘‘అది చాలా తీవ్రమైన విషం అయి ఉండాలి. ఎందుకంటే ఆమె విషకన్య." ఫోన్ పెట్టేసాను.

నా రెండో శత్రువు చిత్ర నిర్మాత డేనియల్ పెయిన్ మరణం ఫోర్ సీజన్స్ రెస్టారెంట్లో జరిగింది. అతను ఎల్సీ లీ లాగా నేను ఇప్పిస్తానన్న మార్టినీని తీసుకోలేదు. అతను ఖరీదైన డిజర్ట్ని ఆర్డర్ చేసాడు. వెయిటర్ డిజర్ట్ బౌల్ని టేబుల్ మీద ఉంచి వెళ్ళాక, మాటల్లో చిన్న సీసాలోని విషాన్ని అందులో కలిపాను. అతనితో కలిసి భోజనం చేసే ఓ ప్రఖ్యాత నటి దాన్ని రుచి చూద్దాం అనుకోకూడదని దేవుడ్ని ప్రార్థించాను.

ఆర్కిబాల్డ్ ఆ సాయంత్రం ఫోన్ చేసి అడిగాడు.

"ఈ మధ్యాహ్నం నువ్వు లంచ్ ఎక్కడ చేసావు?’’

‘‘ఫోర్ సీజన్స్లో. ఎందుకు?’’

‘‘నీ శత్రువు డేనియల్ పెయిన్ మరణించాడు.’’

‘‘ఆనందం." జవాబు చెప్పాను.

ఆ తర్వాత ఎల్సీ లీ మేకిన్తోష్ విషయంలో జరిగిన పోలీస్ ప్రొసీజర్ అంతా ఇతని విషయంలో కూడా జరిగింది.

మొదటిసారి ఆర్కిబాల్డ్కి నామీద అనుమానం కలిగింది.

నా మూడో శత్రువు పేట్రిక్ కేంటర్ హత్య మేక్ డొనాల్డ్స్లో చేసాను. బిగ్ మేక్ డైట్ కోక్ల ముందు కూర్చున్న అతన్ని పలకరించి మాట్లాడుతూ డైట్ కోక్ గ్లాస్ని పొరపాటుగా పడేసినట్లుగా

కావాలని కింద పడేసాను. సారీ చెప్పి నా డైట్ కోక్ని అతనికి ఇచ్చాను. ఐతే నేను మారు వేషంలో ఉండి, జర్మన్ ఏక్సెంట్లో ఇంగ్లీష్ మాట్లాడడంతో అతను నన్ను గుర్తించలేదు.

"పేట్రిక్ కేంటర్ నీ శత్రువని నువ్వు నాకు చెప్పిన గుర్తుంది." ఆర్కిబాల్డ్ ఆ సాయంత్రం నాకు ఫోన్ చేసి చెప్పాడు.

“ఆ టి.వి. సీరియల్ డైరెక్టరా?”

“అవును. మిగిలిన ఇద్దరిలా విష ప్రయోగంతో ఈ మధ్యాహ్నం మరణించాడు."

“దేవుడున్నాడన్నమాట." చెప్పాను.

నా నాలుగో శత్రువు డ్రూ సమర్ఖండ్ని చైనీస్ రెస్టారెంట్లో పలకరించి వెళ్తూ అతని నూడుల్స్లో విషం కలిపాను. ఆ సాయంత్రం మళ్ళీ ఆర్కిబాల్డ్ ఫోన్ చేసి డ్రూ సమర్ఖండ్ హత్య గురించి చెప్పాడు.

"నీతో అధికారికంగా మాట్లాడాలి. ఎందుకంటే నీకు వ్యతిరేకంగా కొంత సాక్ష్యం లభించింది. ఓ గంటలో వస్తున్నాను." చెప్పాడు.

అతను నా ఖాళీ అపార్ట్మెంటికి వచ్చేసరికి నేను విమానంలో స్విట్జర్లాండ్కి వెళ్తున్నాను.

* * *

డాక్టర్ గోడోవ్స్కీ చక్కటి సర్జన్. అతను నాకు ఆరు సెషన్స్లో సర్జరీ చేస్తున్నప్పుడు దినపత్రికల్లో పోలీస్ డిటెక్టివ్ ఆర్కిబాల్డ్ ఇంటర్పోల్ సహాయం తీసుకుని మేక్స్వెల్ అంబర్నే కోసం వెదుకుతున్నాడని, నా నవలలు బాగా అమ్ముడుపోతున్నాయని చదివి తెలుసుకున్నాను. నా చికిత్స పూర్తయ్యాక తిరిగి లండన్ వెళ్తూ ఆర్కిబాల్డ్కి ఓ కేబుల్ పంపాను. “అనుమానాస్పదుడు మారువేషంలో లండన్కి చేరుకుంటున్నాడు."

లండన్ ఏర్పోర్ట్ కస్టమ్స్ విభాగం లోంచి నేను బయటికి రాగానే ఆర్కిబాల్డ్ నన్ను రెండు సార్లు చూస్తే కాని గుర్తు పట్టలేదు. మరో ముగ్గురు పోలీస్ డిటెక్టివ్ లతో అతను నా దగ్గరికి వచ్చి చెప్పాడు.

"మేక్స్వెల్ అంబర్షే... శత్రువులు నలుగుర్ని చంపినందుకు నిన్ను అరెస్ట్ చేస్తున్నాను."

"మేక్స్వెల్ అంబర్షే? నా పేరు మేక్స ఐన్ అంబర్చే ఈ ప్రపంచంలో మేక్స్వెల్ అంబర్షే అనే వ్యక్తే లేడు." నా స్విస్ పాస్పోర్ట్ని అతనికి చూపించి చెప్పాను.

ఆర్కిబాల్డ్ నమ్మలేనట్లుగా నా వంక చూసిన చూపుని నేను మర్చిపోలేను. సుప్రీం కోర్టులో నా కేస్ గురించి లాయర్లు తలలు పగలకొట్టుకుంటూంటే, నేను టివిలో అతిథిగా ఇంటర్వ్యూలు ఇస్తూ హాయిగా జీవిస్తున్నాను- మగాడిగా బదులు ఆడదానిగా.

ఆ సాంకేతిక కారణంగా ఏ కోర్టూ నన్ను శిక్షించలేదు.

స్టీవెన్ స్పీల్బర్గ్, జార్జ్ లెకాస్ నా జీవితకథ ఆధారంగా సినిమా తీయాలని అనుకుంటున్నారు.

---

## మెరుపు మేధావి - పీటర్ లవ్సే

పాల్ మోలీ తుఫాను ముగిసాక బక్కెట్తో సముద్రపు ఒడ్డుకి వెళ్ళి కెరటాలు తెచ్చి పడేసిన శంఖాలని, ఆల్చిప్పలని, రంగు రాళ్ళని ఏరి బక్కెట్లో తీసుకెళ్ళి తన భార్య గ్వెన్నెత్కి ఇచ్చాడు. పాల్ మెదడు కొద్ది రోజుల క్రితం పాడయ్యింది. అతను విలువైనవిగా భావించి భార్యకి తెచ్చినవి, అతని వయసు మనిషికి విలువైనవి కావు. ఏనిమిదేళ్ళ పిల్లాడికే అవి విలువైనవిగా తోస్తాయి. పాల్ మెదడు ప్రస్తుతం ఏడెనిమిదేళ్ళ పిల్లవాడి మెదడులానే ఆలోచిస్తుంది అని డాక్టర్ గ్వెన్నెత్కి ఆర్నెల్ల క్రితం చెప్పాడు. అరుదుగా అతని మేధస్సు పూర్వంలా మెరుపులా అంటే తక్కువ సేపు మాత్రమే పని చేస్తుంది అని కూడా డాక్టర్ చెప్పాడు. ఒకటి రెండు సార్లు పాల్ తెలివిగా ప్రవర్తించినా అది తక్కువ సేపే అని ఆమె గమనించింది.

అరపై ఒక్కోళ్ళ తన భర్త సముద్రపు ఒడ్డు నించి తెచ్చిన ఆ వస్తువులని చూసి ప్రేమని నటిస్తూ చెప్పింది.

"ఓ! థాంక్స్, ఇవి చాలా బావున్నాయి."

అతను ఆనందంగా నవ్వాడు. ఆమె వాటిని టేబుల్ మీద, పూర్వం అతను తెచ్చిన వాటి పక్కన ఉంచి, చచ్చిన చేపలని చెత్త బుట్టలో పడేసింది. వారికి పిల్లలు, రెండు వైపులా దగ్గరి బంధువులు లేకపోవడం, పైగా తన భర్తకి మాట కూడా పడిపోవడంతో గ్వెన్నెత్కి పిచ్చెక్కినట్లుగా ఉంది. దాంతో ఆమె కాలక్షేపం కోసం ఓ మిత్రురాలి సలహాతో తప వంశవృక్షం గురించి తెలుసుకునే హాబీని చేసుకుంది.

ఆ ప్రయత్నంలో భాగంగా గ్వెన్నెత్ ఫేమిలీ హిస్టరీ సొసైటీలో సభ్యురాలై తన, తన భర్త పూర్వీకుల వివరాలని సేకరించడం ఆరంభించింది. ఆ సబ్జెక్ట్కి చెందిన, తక్కువ సర్క్యులేషన్ గల పత్రికలకి చందా కూడా కట్టింది. ఆస్ట్రేలియాకి చాలా మంది ఇంగ్లండ్ నించే వలస వచ్చారు కాబట్టి, వారి పూర్వీకుల కనెక్షన్స్ అన్నీ ఇంగ్లండ్లోని వ్యక్తుల చుట్టూనే తిరగసాగాయి.

తన మెదడు దెబ్బ తినడానికి ఏడాది ముందు పాల్ అరవయ్యవ ఏట దాకా బ్రిస్బేన్ హెడ్ క్వార్టర్స్గా గల ఓ ఇన్సూరెన్స్ కంపెనీకి ఛైర్మన్గా పని చేసి రిటైర్ అయ్యాడు.

అందువల్ల స్వంత ఇల్లు, స్విమ్మింగ్ పూల్, టెన్నిస్ కోర్టు, బోట్ హౌస్ మొదలైనవి వారు సమకూర్చుకో గలిగారు.

* * *

ఆ రోజు ఉదయం పోస్ట్ మేన్ మెయిల్ బాక్స్లో ఉత్తరాలు వేసి వెళ్ళడం చూసి వెళ్ళి చూస్తే వేల్స్ నించి ఓ ఉత్తరం ఉంది. అది తన హాబీకి సంబంధించిందిగా ఊహించి, దాన్ని అక్కడికక్కడే విప్పి చదివింది. అది హేడెన్ అనే వ్యక్తి నించి వచ్చింది.

స్వనెసా అనే పత్రికలో ఆమె రాసిన ఉత్తరం చదివానని, తన ఇంట్లోని ఫేమిలీ బైబిల్లో తన ముత్తాత రాసిన వంశవృక్షం ఉందని, తను కూడా ఆమెలా తన పూర్వీకుల వివరాలని సేకరిస్తున్నాడని పోర్ట్ టేల్బర్ట్లో తన ముత్తాత తండ్రి హగ్ ఇవాన్స్ ఉండేవాడని, బహుశా గ్వెన్నెత్ అతని రెండవ కొడుకు సంతతి అయి ఉండచ్చని రాస్తూ, ఆ వంశవృక్షం కాపీని జత చేసాడు. ఆమెకి ఆ ఉత్తరం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. తన పూర్వీకులు వేల్స్కి చెందిన వారన్న మాట! వారి మధ్య రెండు, మూడు ఉత్తరాలు నడిచాక హేడెన్ ఓ ఉత్తరంలో రాసాడు. నేను ఆస్ట్రేలియాలో క్వీన్స్లాండ్లోని ఓ చర్చికి ఆహ్వానం మీద వస్తున్నాను. నేను ఫాదర్ అని ఇంతదాకా చెప్పలేదు కదా? మీరుండేది కూడా అక్కడే కాబట్టి వచ్చాక ఫోన్ చేస్తాను. వీలుంటే కలుద్దాం.'

హేడెన్ని తమ ఇంట్లోనే బస చేయమని ఆమె ఉత్తరం రాసింది. ఎందుకంటే, తనకి కజిన్ అయ్యే హేడెన్ మాత్రమే ఆమెకి ఈ ప్రపంచంలో ఏకైక బంధువు. రెండు వారాల తర్వాత అతన్ని ఎయిర్ పోర్టులో రిసీవ్ చేసుకుని తన ఇంటికి తీసుకు వచ్చింది. హేడెన్ తమ పాత ఫేమిలీ బైబిల్ని ఆమెకి చూపించాడు.

"నా వెంట మా తాత ఫోటో తీసుకు రావాల్సింది. మీరు అచ్చు గుద్దినట్లు ఆయనలాగే ఉన్నారు." దారిలో చెప్పాడు.

ఇద్దరూ వారి ముత్తాత తండ్రి హగ్ ఇవాన్స్ గురించి మాట్లాడుకున్నారు. తన భర్త పాల్ అనారోగ్యం గురించి ముందుగానే అతనికి చెప్పింది.

"దైవ ప్రార్థనతో నయం అవడం నా ఇవాంజికల్ కెరీర్లో అనేక సార్లు చూసాను. సర్ ట్యూడర్ ఇవాన్స్ నించి, అంటే మన ముత్తాత తరం నించి మన కుటుంబంలో ఒకరు ఫాదర్ అవుతున్నారు."

"సర్ ట్యూడర్? మన కుటుంబానికి గౌరవ బిరుదు కూడా ఉందా?" ఆనందంగా ప్రశ్నించింది.

‘‘అవును. ఆయన్ని ప్లాంటర్ ఇవాన్స్ అని కూడా పిలిచేవారు. అప్పట్లో బార్బడోస్లోని చెరుకు తోటల్లోని సగం ఆయనవే."

‘‘అలాగా? ఇప్పుడా ఆస్థంతా ఏమైంది?"

‘‘ఆయన 1683లో దాన్ని అమ్మేసి గ్లోరియానా అనే ఓడలో బంగారు నాణాలతో తిరిగి వస్తూండగా ఆ ఓడ బ్రిస్టల్ ఛానల్లో తుఫాను వల్ల మునిగి పోయింది. సర్ ట్యూడర్, అతని భార్య ఎలినార్ అందులో మునిగి మరణించారు. మే గాడ్ రెస్ట్ దెయిర్ సోల్స్.’’

‘‘ఆ ఓడ పేరు గ్లోరియానా? ఆ ఓడ గురించి నేను పేపర్లో చదవడమో, టి.వి.లో చూడడమో జరిగింది.’’ గ్విన్నెత్ ఆలోచనగా చెప్పింది.

‘‘ఇక్కడ కూడా పేపర్లలో ఆ వార్త వచ్చిందన్నమాట! నా బ్రీఫ్ కేస్లో ఆ వార్త కటింగ్స్ ఉండాలి. సముద్రపు డైవర్స్ ఆ ఓడని కనుగొని, అందులోకి వెళ్ళి బక్కెట్ల కొద్దీ బంగారు, వెండి నాణేలు, ఆభరణాలు తెచ్చారు."

‘‘మనం వాటికి వారసులం కదా? మనకీ కొంత రావచ్చా?’’ ఆశగా అడిగింది.

‘‘బ్రిటిష్ తీరంలో మునిగిన ఓడ కాబట్టి, అదంతా కస్టమ్స్ దగ్గర ఉంది. నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన వారసుడు ఒక ఏడాది ఒక రోజులో దాన్ని క్లైమ్ చేయకపోతే, వాటిని అమ్మి పది శాతం మినహాయించుకుని మిగిలింది. ఆ ఓడలోంచి వెలికి తీసిన వ్యాపార సంస్థకి ఇస్తారు."

‘‘కస్టమ్స్ వారికి ఆ సొమ్ము ఎప్పుడు చేరింది?"

"క్రితం మార్చి."

‘‘పదకొండు నెలలు అయిందన్నమాట. మరి నువ్వు క్లైమ్ చేసావా?’’

‘‘లేదు. లాయర్లకి కనీసం పదివేల పౌండ్లు చెల్లించాలి."

“నేను కూడా హక్కుదారునే కాబట్టి మనిద్దరం ఖర్చులు పంచుకుని ఆ పని చేద్దామా?”

"నేను దైవసేవలో ఉన్నాను. వ్యక్తిగతంగా నాకు ఆ ధనం మీద మోజు లేదు. అదీ కాక, ట్రెజర్ హంటర్స్ మన క్లెయిమ్ని ఓ పట్టాన అంగీకరించరు. ఎందుకంటే వాటి విలువ లక్షల పౌండ్లు."

“నీకు ఇంగ్లండ్లో మంచి లాయర్ ఎవరైనా తెలుసా హేడెన్?” గ్వినెత్ ఆలోచించి అడిగింది.

“ఆ ఓడ ప్రయాణీకుల వారసుల కేసులు చూసే జోన్స్ కార్డిఫ్ అనే లాయర్ మా చర్చి సభ్యుడు. అతని ఫీజ్ పది వేల పౌండ్లు ప్లస్ వచ్చినదాంట్లో సగం."

గ్వినెత్ ఆ రాత్రి ఆ డబ్బు గురించి ఆలోచించింది. మర్నాడు ఉదయం హేడెన్తో చెప్పింది.

"నేను ఆస్ట్రేలియన్ చెక్ రాసిస్తే ఆ లాయర్ అంగీకరిస్తాడా?”

“నువ్వింకా ఆ విషయంలో సీరియస్గా ఉన్నావా?" హేడెన్ ప్రశ్నించాడు.

“అవును. పది వేల బ్రిటిష్ పౌండ్లతో లాటరీ టిక్కెట్ కొంటున్నాను. వస్తే లక్షల పౌండ్లు వస్తాయి. పోతే పదివేల పౌండ్లేగా?”

"చెక్ క్లియర్ అవడానికి చాలా సమయం పడుతుంది. ఎల్లుండి నేను వెనక్కి వెళ్తున్నాను కాబట్టి, నా పేర ట్రావెలర్స్ చెక్స్ తీసుకెళ్తే నగదు అందిన రోజే అతను ఈ కేసుని టేకప్ చేస్తాడు. నీకు ఈ సహాయం చేయడానికి నాకు అభ్యంతరం లేదు."

హేడెన్ బ్రీఫ్ కేస్లోంచి వేల్స్ టైమ్స్ కలర్ సప్లిమెంటిని తీసి చూపించాడు. అందులో ఆ ఓడ లోంచి వెలికి తీసిన ఆ ఫొటోల్లో రూబీ నెక్లెస్లు, గోల్డ్ బ్రేస్లెట్లు, బంగారు నాణేలు మొదలైనవి ఉన్నాయి. ఆ ఫోటోలు చూసాక గ్వినెత్ సందేహించలేదు.

పాల్ గట్టిగా దగ్గసాగాడు. అంతకు మునుపు ఎన్నడూ అతను అలా కావాలని దగ్గలేదు. గ్విన్నెత్ ఆశ్చర్యంగా అతని వంక చూసింది. పాల్ టేబుల్ టిష్యూని తీసుకుని, దాన్ని పరపర చింపుతూ నాలుగు ముక్కలు చేసాడు.

"దానర్థం ఏమిటి?" హేడెన్ ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏమో మరి? పాల్ ఇలా చేయడం ఇదే మొదటి సారి. ఏమిటి డార్లింగ్?"

పాల్ జవాబు చెప్పకుండా వెళ్ళిపోయాడు. మర్నాడు ఉదయం గ్విన్నెత్, హేడెన్ కార్లో బేంక్కి వెళ్ళడం పాల్ మౌనంగా చూసాడు.

హేడెన్ పేరు మీద పదివేల బ్రిటిష్ పౌండ్లకి ట్రావెలర్స్ చెక్స్ కొని గ్విన్నెత్ అతనికి ఇచ్చింది. ఇద్దరూ తిరిగి ఇంటికి వచ్చాక డైనింగ్ టేబుల్ మీద నాలుగు ముక్కలు చేసిన ఆస్ట్రేలియన్ పౌండ్ నోటు ఆమెకి కనిపించింది. వెంటనే డాక్టర్కి ఫోన్ చేసి పాల్ ప్రవర్తన గురించి చెప్పింది. ఆయన కూడా సరైన వివరణ ఇవ్వలేక పోయాడు.

* * *

మర్నాడు తెల్లవారు ఝామున పాల్ లేచి నిశ్శబ్దంగా ఇంట్లోంచి బయటికి వచ్చాడు. చేతిలో బక్కెట్తో, జేబులో రబ్బర్ గ్లవ్స్తో అతను సముద్రపు తీరానికి చేరుకున్నాడు.

కుడి చేతికి గ్లౌని ధరించి, సముద్రపు ఒడ్డంతా వెదికి, తనకి ఆసక్తి గల కొన్నిటిని ఏరి బక్కెట్లో వేసుకుని ఇంటికి చేరుకున్నాడు. అప్పటికి ఇంట్లో ఇంకా ఎవరూ నిద్ర లేవలేదు.

ఉదయం ఆరున్నరకి నిద్ర లేచిన హేడెన్ తన వస్తువులు అన్నిటినీ సూట్ కేస్లో సర్దుకున్నాడు. తను కాఫీ కలుపుకుని తాగి, గ్విన్నెత్కి కాఫీ ఫ్లాస్కోలో పోసాడు. తర్వాత బాత్రూం లోకి వెళ్తుండగా సూర్యోదయమైంది. అరగంట తర్వాత లేచిన గ్విన్నెత్ హేడెన్ గెస్ట్ బెడ్ రూంలో లేడని బాత్ రూంలో ఉన్నాడని గ్రహించింది. అతను కలిపిన కాఫీని తాగుతూ టి.వి.

చూడసాగింది. ఇరవై నిమిషాల తర్వాత వెళ్ళి చూస్తే, బాత్ రూం తలుపు ఇంకా మూసే ఉంది. మరో ఇరవై నిమిషాల తర్వాత కూడా.

గంటన్నర తర్వాత గ్వినెత్ బాత్ రూం తలుపు మీద కొడుతూ అతన్ని గట్టిగా పిలిచింది. సమాధానం లేదు. నీళ్ళ చప్పుడూ లేదు. మరో అరగంట చూసి రిసీవర్ అందుకుంది. పది నిమిషాల్లో అంబులెన్స్, రెండు నిమిషాల తర్వాత పోలీస్ వేన్ వచ్చాయి. ఓ పోలీస్ ఆఫీసర్ కిటికీ లోంచి, బాత్ రూంలోకి వెళ్ళి తలుపు తెరిచాడు. పేరామెడిక్స్ అచేతనంగా పడి ఉన్న హేడెన్ని పరిశీలించి అతను మరణించాడని నిర్ధారించారు. కజిన్ హేడెన్ గురించి గ్వినెత్తో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ పెర్రీ గంట సేపు మాట్లాడాక అతని సూట్ కేస్ని తెరిచి చూసాడు.

హేడెన్ ఇవాన్స్ పేరుతో ఐడెంటిటీ కార్డుతో పాటు, అనేక ఇతర పేర్లతో ఐడెంటిటీ కార్డులు, ఫేమిలీ ట్రీ పేర్లు గల అనేక బైబిల్స్, అనేక పేపర్ కటింగ్స్ కనిపించాయి. అతని అసలు పేరు మైఖేల్ హెర్బర్ట్ బ్రౌన్.

“ఈ బ్రిటిష్ దొంగ క్వీన్స్లాండ్కి క్రితం వేసవిలో వచ్చాడని స్కాట్లాండ్ యార్డ్ వారు మాకు సమాచారం ఇచ్చారు. ఇంత దాకా ఏడుగురు ఆస్ట్రేలియన్స్ని ట్రెజర్ హంట్ కథతో ఇతను వేల పౌండ్లు మోసం చేసాడు.”

"ఇంతకీ ఇతను ఎలా మరణించాడు?” గ్వినెత్ అడిగింది.

"జెల్లీ ఫిష్ తీవ్రమైన విషం గల జెల్లీ ఫిష్ అతన్ని కుట్టింది అని డాక్టర్ ప్రాథమిక రిపోర్ట్ని బట్టి తెలుస్తోంది. బహుశా సముద్రానికి ఈత కోసం వెళ్ళి ఉంటాడు. తుఫాను వల్ల లోపల ఉండే జెల్లీ ఫిష్లు ఒడ్డుకి వచ్చాయి. తూలుతూ బాత్ రూంకి వచ్చి ఉంటాడు."

"పాపం!" గ్వినెత్ చెప్పింది.

వారింట్లోని చెత్త బుట్టని పోలీసులు వెదికి ఉంటే పాల్ అందులో చంపి పడేసిన జెల్లీ ఫిష్లు కనపడేవి.

---

## ఎనభై అడుగుల లోతులో.... రిచర్డ్ హార్డ్విక్

మిత్రులైన మార్టీ, ఫిల్ ఆ సరస్సు ఒడ్డున కూర్చుని రెండు గంటల నించి ఫిషింగ్ రాడ్స్తో చేపలని పడుతున్నారు. ఎవరు పట్టినవి వారు వేరే వేరే బుట్టల్లో వేస్తూ మిలటరీ కేంపల్లో పాడే బూతు పాటలని గట్టిగా పాడుకుంటూ మధ్యమధ్యలో ఐస్ బాక్స్ లోంచి బీర్ బాటిళ్ళని తీసి తాగుతున్నారు. ఇంకో చేపని పట్టిన మార్టీ చెప్పాడు.

''దీనితో ఈ రోజు ఒక పౌను ఆదాయం సాధించాను.''

వారికి అకస్మాత్తుగా కారు టైర్ల కీచుమనే శబ్దం వినిపించింది. వెంటనే వాళ్ళు తల తిప్పి చూస్తే ఓ నల్లటి షెవర్లే కారు గాల్లోకి ఎగిరి వచ్చి సరస్సులో పడటం కనిపించింది. అందులో సూట్లోని డ్రైవర్, పక్కన కూర్చున్న ఓ ప్రయాణీకుడు కనిపించారు. ఇద్దరూ నివ్వెరపోతూ నీళ్ళల్లోకి మునిగిపోయే కారు వంక చూసారు. తర్వాత ఒకరి మొహాల వంక మరొకరు చూసుకున్నారు. నీళ్ళల్లోంచి పైకి బుడగలు వచ్చి కాసేపటికి ఆగిపోయాయి.

''ఎవరి కారది?" మార్టీ ప్రశ్నించాడు.

"బ్రిటిష్ ప్రైమ్ మినిస్టర్ది."

''ఛా!''

''లేకపోతే ఏ కారు ఎవరిదో నాకెలా తెలుస్తుంది అనుకున్నావు?'' ఫిల్ కసురుకున్నాడు.

"కారులో ఇద్దర్ని చూసాను. మనం దూకి వాళ్ళని రక్షిద్దాం." మార్టీ చెప్పాడు.

“సరిగ్గా ఆ కారు పడ్డ చోట ఎనభై అడుగుల లోతుంటుంది. స్నోర్కెల్ లేకుండా మనం అంత కిందకి వెళ్ళి వాళ్ళని రక్షించడానికి మనకి ఊపిరి ఆడదు."

ఫిల్ విసుగ్గా చెప్పాడు.

“కానీ మనం ఏదైనా చేయాలి. మన కళ్ళతో చూసి కూడా మనం మిన్నకుండటం అమానుషం." మార్టీ బాధగా చెప్పాడు.

"ఆ కారు పది అడుగులు ఇవతలికి వచ్చి ఉంటే మనిద్దరినీ కూడా సరస్సులోకి తీసుకెళ్ళేది.” ఫిల్ కోపంగా చెప్పాడు.

"ఆ కారు ఈ పైన్ చెట్టుకి సూటిగా ఒడ్డు నించి దాదాపు ఇరవై అడుగుల దూరం లోపల పడింది. ఇది గుర్తుంచుకుని వెంటనే పోలీసులకి ఫిర్యాదు చేద్దాం."

“కొద్దిసేపు ఇక్కడే ఉందాం. ఎవరైనా కారులోంచి పైకి వస్తారేమో చూద్దాం. వాళ్ళకి మనం సహాయం చేయచ్చు.” ఫిల్ సూచించాడు.

ఇద్దరూ పావు గంట దాకా వేచి చూసారు. కాని ఎవరూ పైకి తేలలేదు. వెంటనే ఇద్దరూ ఫిల్ కారు ఎక్కి గంట సేపు ప్రయాణం చేసి క్లింటన్ ఊళ్ళోని పోలీస్ స్టేషన్కి చేరుకున్నారు. ఐతే అందులో ఓ డెస్క్ సార్జెంట్ తప్ప మరెవ్వరూ లేరు. సార్జెంట్ నించి మంచి షేవింగ్ లోషన్ సువాసన వేస్తోంది. అతని పక్కన ఉన్న వైర్లెస్ లోంచి సంభాషణ వినపడుతోంది.

“ఇది స్కాట్లాండ్ యార్డ్. బయలుదేరారా?”

"దాదాపు అక్కడికి చేరుకున్నాం." మరో గొంతు సమాధానంగా వినిపించింది.

"నగరానికి తూర్పు వైపు రోడ్ బ్లాక్స్ ఏర్పాటు చేయండి.”

“ఆ పని ఇందాకే చేసాం.” ఆ గొంతు మళ్ళీ చెప్పింది.

"నేనే సార్జెంట్ హోల్మేన్. మీకేం కావాలి?'' వాళ్ళ వంక చూస్తూ ప్రశ్నించాడు.

"మేము మీకు ఒక ఫిర్యాదు చేయాలని వచ్చాం." మార్టీ చెప్పాడు.

''బేంక్ వెనుక తలుపులోంచి ఐదున్నరకి ఇద్దరు నల్ల సూట్లలో వచ్చి ఆ నల్లటి షెవర్లే కారు ఎక్కడం సాక్షులు చూసారు. బేంక్ అలారం పని చేయలేదు. బేంక్ ఐరన్ సేఫ్ లోంచి వాళ్ళు రెండు లక్షల పౌన్లని దొంగిలించారు. కాబట్టి రోడ్డు బ్లాక్స్ దగ్గర గట్టి నిఘా ఉండాలి." మళ్ళీ వైర్లెస్ లోంచి వినిపించింది.

''చూడండి సార్జెంట్ మేము.... ఆ కారుని చూసాం...."

ఫిల్ డెవ్లిన్ తన ఎడమ కాలితో మార్టీ పాదాన్ని తొక్కిచెప్పాడు.

"సార్జెంట్! మీరు బిజీగా ఉన్నట్టున్నారు. మేము మళ్ళీ వస్తాం."

"మీరేదో ఫిర్యాదు చేస్తామన్నారు."

''మా కారు లోంచి కెమెరాని ఎవరో దొంగిలించారు.''

తన మిత్రుడు మాట మార్చాడని మార్టీకి అర్థమైంది. అతను కూడా చెప్పాడు.

''ఫిషింగ్ బాక్స్ కూడా."

''అవును. ఓ కెమెరా, ఓ ఫిషింగ్ బాక్స్."

'రెండు లక్షల పౌండ్లు దొంగతనం కేసులో మేము బిజీగా ఉన్నాం. మళ్ళీ రండి."

''అవసరం లేదు. మాకు ఇన్సూరెన్స్ ఉంది. వాళ్ళ నించి క్లైమ్ చేస్తాం."

మిత్రులిద్దరూ బయటికి వచ్చాక మార్టీ అడిగాడు.

"మనిద్దరం ఎందుకు అబద్ధం ఆడాం?"

"విన్నది అర్థం కాలేదా? బేంక్ నించి రెండు లక్షలు దొంగిలించిన దొంగలు తమ కారుతో సహా పారిపోయారు. ఇప్పుడాకారు ఎక్కడుందో మనకి తెలుసు. తెలివైనవాడు పోలీసులకి ఆ లొకేషన్ని చెప్తాడా? లేక దాన్ని స్వంతం చేసుకుంటాడా?'' ఫిల్ కోపంగా అడిగాడు.

"కానీ అదీ, ఇదీ ఒకే కారని మనకి నిశ్చయంగా తెలీదుగా?''

"కానీ లేదు. గీనీ లేదు. నల్ల షెవర్లే కారు. అందులో సూట్లు ధరించిన ఇద్దరు దొంగలు. పోలీసులు అ కారు కోసం వెదుకుతున్నారు. వాళ్ళంత వేగంగా రావడానికి కారణం పోలీసులు తరుముతున్నారనే భయం.'' ఫిల్ చెప్పాడు.

"కాని ఓ నేరానికి సంబంధించిన సమాచారం మనం పోలీసుల నించి దాయడం చట్ట విరుద్ధం." మార్టీ చెప్పాడు.

"అకస్మాత్తుగా నీకు చట్టం గురించి ఎలా తెలుసు? నువ్వేమైనా లాయర్వా? నేను చెప్పినట్లు విను. కొన్ని రోజులు ఆగి చూద్దాం. దొంగలు దొరికినా లేదా ఆ కారు సంగతి పోలీసులకి తెలిసినా మనమేం చేయలేం. లేదా ఆ డబ్బు మనది అవుతుంది."

ఇద్దరూ కారులో కూర్చుని రెండు బీర్ కేన్స్ తెరిచి కారు రేడియోని ఆన్ చేసారు.

క్లింటన్ స్థానిక రేడియో స్టేషన్ ఎనౌన్సర్ బేంక్ దొంగతనం గురించి కళ్ళకి కట్టినట్లుగా వివరిస్తోంది. కెప్టెన్ క్లియరీ హిల్ కౌంటీ ప్రాంతం లోని రోడ్ల మీద పారిపోయిన దొంగల కోసం వెదుకుతున్నాడు. అక్కడ ఉన్న సరస్సులో చేపలు పట్టడానికి వచ్చే వారి సౌకర్యం కోసం గల కాటేజెస్ లోని ఒక దాంట్లో దొంగలు దాక్కుని ఉండచ్చని అనుమానిస్తున్నారు. ఎందుకంటే హెలికాప్టర్లో వెదికితే వారి కారు రోడ్డు మీద ఎక్కడా కనపడలేదు.... "

‘‘ఆ కారుని పైకి తీయాలంటే చాలా బలమైన క్రేన్ అవసరం అవుతుంది. ఇది ఎవరికీ తెలియకుండా చేయడం దుస్సాధ్యం." మార్టీ చెప్పాడు.

"కారుని పైకి తీయాలని ఎవరన్నారు? మనమే కారు దగ్గరికి వెళ్ళాలి. జేమ్స్ బాండ్ సినిమాలో జేమ్స్ బాండ్ని చూడలేదా? ఆ మాత్రం ఊహించలేవా? డైవింగ్ పరికరాలతో మనం కిందకి దిగి ఆ డబ్బు తీసుకుందాం.’’ ఫిల్ విసుకున్నాడు.

‘‘ఆ పరికరాలు మనకి ఎక్కడ దొరుకుతాయి? క్లింటన్లో అలాంటివి అమ్మే దుకాణాలు లేవు."

‘‘మనకి దగ్గర్లో ఉన్న నగరం లివర్పూల్. అక్కడ పెద్ద ఓడ రేవు ఉంది. కాబట్టి చిన్న ఆక్సిజన్ ఎయిర్ సిలెండర్, డైవింగ్ పరికరాలు దొరుకుతాయి. మనం వెళ్ళి వాటిని కొని తెచ్చి రేపు రాత్రి సరస్సులోకి దిగి కారు లోంచి డబ్బు సంచీలని పైకి తెస్తాం. తర్వాత పోలీసులు ఆ కారుని కనుక్కున్నా దొంగలు ఆ డబ్బుని ఎక్కడో దాచి ఉంచారని అనుకుంటారు ఈలోగా మనం అనుమానం కలిగేలా ఏమీ చేయకూడదు. ఈ విషయం ఎవరితో చెప్పకు. ఆఖరికి నీ భార్యకి కూడా. ఇందులో మనిద్దరమే భాగస్వాములం. అర్థమైందా?" ఫిల్ మిత్రుడ్ని అడిగాడు.

"అర్థమైంది." చెప్పి మార్టీ చేతిని చాపి ఫిల్తో కరచాలనం చేసాడు.

* * *

వాళ్ళకి డైవింగ్ గురించి తెలీదని అర్థమైన లివర్పూల్లోని దుకాణం యజమాని అడిగాడు.

"డైవింగ్లో శిక్షణ తీసుకున్నారా?"

‘‘లేదు. అది అవసరమా?’’

‘‘బాగా, లేదా మీరు మళ్ళీ ప్రాణాలతో పైకి రాలేరు."

ఇద్దరూ చెరో మూడు వందల ఏభై పౌండ్లు చెల్లించి లివర్పూల్లోని ఓ శిక్షకుడి నించి మూడు రోజుల్లో డైవింగ్ని నేర్చుకున్నారు.

నూట ఇరవై కిలోమీటర్ల దూరంలోని లివర్పూల్లో నీళ్ళల్లో పని చేసే బేటరీ లైట్స్, ఆక్సిజన్ సిలిండర్లు, ఫ్లాప్ అప్స్, డైవింగ్ సూట్, ఇతర పరికరాలని వంద పౌండ్లు అప్పు పెట్టి ఆరు వందల పౌండ్లకి కొని క్లింటన్కి కారు డిక్కీలోతెచ్చారు. ఆ రాత్రి ఇద్దరూ కారులో సరస్సుకి బయలుదేరారు. కారు హెడ్ లైట్లని ఆపి సరస్సు ఒడ్డుకి చేరుకున్నారు.

ఫిల్ దగ్గర ఉన్న పరికరాల్లో ఒకటి అదనంగా ఉంది. అది కత్తి! ఇద్దరూ లోతుకి వెళ్ళి మునిగిపోయిన కారు లోంచి డబ్బు సంచీలని బయటికి తీసాక ఫిల్ తన మిత్రుడు మార్టీ మెడని వెనక నించి కత్తితో సగం పైనే కసుక్కున కోసి, శవం పైకి తేలకుండా ఆ కారులోకే నెట్టి తలుపు మూసాడు. పైకి వచ్చాక పరికరాల బరువుని వదిలించుకున్నాడు. సంచీ తెరిచి మైనపు సంచీల్లో తడవకుండా చుట్టి ఉన్న బ్రిటిష్ పౌండ్ల వంక ఆనందంగా

చూస్తూండగా, అకస్మాత్తుగా అతని మీద సరస్సులోని చీకట్లో కనపడకుండా ఉన్న పడవ మీంచి ఓ స్పాట్ లైట్ పడింది.

"కదలక" గట్టిగా వినిపించింది.

సార్జెంట్ హాల్మేన్ నవ్వుతూ నడిచి వచ్చాడు.

“పోలీస్ పెట్రోల్ బోట్లో మీ కోసం కాపేసాం.”

“ఏమిటి మీరు చెప్పేది? దేనికి కాపేసారు?” అతను ఆందోళనగా అడిగాడు.

"ఆ దొంగతనం జరిగిన రోజు ఓ కారు గురించి మీ ఇద్దరూ ఫిర్యాదు చేయడానికి వచ్చి మాట మార్చడంతో మాకు మీ మీద అనుమానం కలిగింది. ఆ దొంగలకి మీరే ఆశ్రయం ఇచ్చారని అనుకున్నాం. అప్పట్నించి మిమ్మల్ని ఓ కంట కనిపెడుతున్నాం. మీరు లివర్పూల్లో డైవింగ్

పాఠాలు నేర్చుకోవడంతో జరిగింది గ్రహించాం. కాని ఇంత పెద్ద సరస్సులో కారు ఎక్కడ పడిందో మేం వెతికేకంటే ఓపిక పడితే మీరే చూపిస్తారని ఆగాం.''

నేల మీది సంచీలని స్వాధీనం చేసుకుని చెప్పాడు.

"ఈ సొమ్ముని దొంగిలించినందుకు నిన్ను, నీ మిత్రుడ్ని అరెస్ట్ చేస్తున్నాం. మీ ఇద్దరూ నేరస్థులు. నీ మిత్రుడు ఇంకా పైకి రాలేదేమిటి?"

ఫిల్కి ఏం జవాబు చెప్పాలో తోచలేదు. ఐదు నిమిషాలు చూసాక హర్ మెజస్టిస్ పోలీస్ పెట్రోల్ బోట్ లోంచి ఇద్దరు పోలీసు డైవర్స్ సరస్సులో కిందకి - మునిగిన కారు దగ్గరికి వెళ్ళారు.

---

## క్రోకడైల్ బేగ్ - రాయ్ వికర్స్

ఆ రాత్రి రేడియోలో వచ్చే సంగీతాన్ని వింటూ కారుని నడుపుతున్న ఆర్థర్ ఎదురుగా రోడ్డుకి అడ్డంగా ఆగి ఉన్న ఓ కారుని చూసాడు. వెంటనే కారుని ఆపి హారన్ కొట్టాడు. సమాధానం లేకపోవడంతో దిగి అరిచాడు.

''హలో! ఏమైనా ఇబ్బందుల్లో పడ్డారా?"

ఐనా జవాబు లేకపోవడంతో అందులో ప్రేమ జంట ఉందని భావించి ఆర్థర్ మళ్ళీ చెప్పాడు.

"మిమ్మల్ని డిస్ట్రబ్ చేస్తున్నందుకు సారీ. మీరు కారు అడ్డం తీస్తే నేను వెళ్తాను."

ఎదురుగా ఉన్న కారు వైపు నడిచాడు. చూస్తే కారులో ఎవరూ లేరు. అకస్మాత్తుగా చీకట్లోంచి ఒకతను అతని వెనక్కి వచ్చి ఎడం చేతిలోని రాయితో ఆర్థర్ తల మీద మోదాడు. తక్షణం కింద పడ్డ అతన్ని రోడ్డు పక్కకి లాగి, గ్లవ్స్ తొడుక్కున్న చేత్తో ఆర్థర్ కార్లోని రేడియో ఆఫ్ చేసాడు. పక్క సీట్లో అతనికి మొసలి చర్మంతో చేసిన ఓ వేనిటీ కేస్ కనిపించింది దాని మీద

పి.సి. అన్న నల్లటి అక్షరాలు ఉన్నాయి. తలుపు మూసి, రోడ్డుకి అడ్డంగా ఆపిన కారులో కూర్చుని స్టార్ట్ చేసి ముందుకి పోనిచ్చాడు.

* * *

బైవాటర్లోని లగూన్ హోటల్లో పార్టీ జరుగుతోంది. ఓ కుర్చీలో కూర్చుని వేచి ఉన్న ఫిలిస్ తన చెల్లెలిని అడిగింది.

"ఆర్థర్ ఇంకా రాలేదేంటి?"

"ఏమో! పదకొండుకల్లా నేను ఇంట్లో ఉండాలి." చెల్లెలు ఐలిన్ చెప్పింది.

"నేను చేయగలిగిందంతా చేసాను. నలభై నిమిషాల క్రితమే ఫోన్ చేసాను. షార్ట్ కట్లో సరాసరి ఇక్కడికే వస్తున్నానని చెప్పాడు."

"హలో ఫిలిస్. నువ్వింకా ఇక్కడే ఉన్నావా? ఈపాటికి మీరు వెళ్ళిపోయి ఉంటారు అనుకున్నాను." ఆ హంతకుడు జాక్ నవ్వుతూ చెప్పాడు.

"ఆర్థర్ ఇంకా రాలేదు. నా చెల్లెలు ఇరవై నిమిషాల్లో ఇంట్లో ఉండకపోతే మా నాన్న నించి ఫోన్ వస్తుంది."

"అలా అయితే నేను మిమ్మల్ని ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను."

"థాంక్స్ జాక్ కానీ ఆర్థర్ వస్తే?" ఫిలిస్ అడిగింది.

"వాచ్ మేన్కి మిమ్మల్ని నేను ఇంటికి తీసుకెళ్ళానని చెప్పి, ఆర్థర్కి ఆ సంగతి చెప్పమంటాను."

అక్కాచెల్లెళ్ళు ఇద్దరూ ఒప్పుకున్నారు. ఐలీన్ని డ్రాప్ చేసాక ఇద్దరూ ఫిలిస్ ఇంటికి చేరుకున్నారు. 'ఆర్థర్' అంటూ పిలుస్తూ ఫిలిస్ తలుపు తెరిచింది. లోపల ఎవరూ లేరు.

"ఆర్థర్ ఇంకా ఇంటికి రాలేదు." ఫిలిస్ జాక్ని చుంబించి చెప్పింది.

"ఆర్థర్ ఎందుకు ఇంకా రాలేదో?"

"వర్రీ కాకు." జాక్ చెప్పాడు.

"అతనికి ప్రమాదం జరిగి ఉండచ్చు కారు గోతిలో పడి ఉండచ్చు లేదా హార్ట్అటాక్ వచ్చిందేమో?" ఆదుర్గాగా చెప్పింది.

"అతనికేం కాకపోతే ఫర్వాలేదా?" జాక్ నవ్వుతూ అడిగాడు.

"ఎంత భయంకరమైన మాటది?"

"అందులో భయంకరం ఏముంది? అనేక సార్లు నువ్వే ఆయన్ని ఈ బాధలోంచి తప్పిస్తే మంచిదన్నావుగా?" జాక్ అడిగాడు.

"నేను అని ఉండచ్చు."

"అని ఉండచ్చు ఏమిటి? స్వంత భర్త మరణించాలనుకోవడం చెడ్డతనం. ఎన్ని సార్లు నువ్వు అతను ముసలివాడని, అసూయాపరుడని, అసమర్థుడని, మనకి అవకాశం వస్తే చంపచ్చని చెప్పలేదు?"

"అది సీరియస్గా తీసుకున్నావా?" ఆమె నివ్వెరపోతూ అడిగింది.

"అవును. అందుకే అతన్ని మన దారి నించి తొలగించాను. చంపేసాను."

‘‘అందుకే ఏమిటి? ఏం చేసావ్?" ఫిలిస్ ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

‘‘అందుకే చంపేసాను.’’

ఆమె భయంగా అరుస్తూంటే ఆపి చెప్పాడు.

‘‘ఆలస్యమైంది. అతను పోయాడు. పోలీసులు ఏ క్షణంలోనైనా రావచ్చు. కాబట్టి నేను చెప్పేది విను. వాళ్ళతో ఏం చెప్పాలో నువ్వు తెలుసుకోవాలి. లేకపోతే మనిద్దరం చిక్కుల్లో పడతాం" జాక్ హెచ్చరించాడు.

"కానీ నేను ఎందుకు చిక్కుల్లో పడతాను? నేనేం చేయలేదుగా?’’

‘‘నువ్వు అతనికి ఫోన్ చేసి త్వరగా వచ్చి పికప్ చేయమని, షార్ట్ కట్ తీసుకోమని చెప్పలేదా? అది హత్యకి సహాయకారి అవడం కాదా? దారిలో ఏం జరగచ్చో నాకు తెలీదు అని చెప్పి ప్రయోజనం లేదు. వాళ్ళు నన్ను అరెస్ట్ చేస్తే నిన్నూ అరెస్ట్ చేస్తారు. మనిద్దరం కలిసి ఉండాలనే నేనీ పని చేసాను. ఎటూ నువ్వు ఆర్థర్తో సంతోషంగా లేవు. నిన్ను ఆనందంగా ఉంచడానికి నేను ఏదైనా చేస్తాను.’’

‘‘నువ్వు నా కోసం ఇంత పని చేసావా జాక్? కాని అది ఘోరమైన తప్పు. ఐనా నిన్ను నేను జైలుకి వెళ్ళనివ్వను."

‘‘గుడ్. ఆర్థర్ని నేను చంపానన్న విషయం తప్ప మిగతాదంతా జరిగింది జరిగినట్లు నిజం చెప్పు, షార్ట్ రూట్లో రమ్మన్న విషయం నువ్వు దాస్తే వాళ్ళు కనుక్కుంటారు. అప్పుడు నీ మీద అనుమానం వస్తుంది. వాళ్ళకి నిజం చెప్తే చాలు. అర్థమైందా?"

‘‘అయింది జాక్, నువ్వు చెప్పినట్లే చేస్తాను."

‘‘మంచి పిల్లవి."

"జాక్! ఆయన ఇంకా కారులోనే ఉన్నారా?" అడిగింది.

"లేదు. ఇంకా నువ్వు ఆ విషయం ఆలోచించక."

"సరే. కాని నా మొసలి చర్మం డ్రస్సింగ్ కేస్ని కారులో చూసావా? దాన్ని రిపేర్ చేసిన షాప్ నించి ఆర్థర్ తీసుకువస్తున్నాను అన్నాడు." ఫిలిస్ అడిగింది.

"చూసాను. పర్పుల్ స్కార్ఫ్ కూడా కనిపించింది."

"దాన్ని నీ వెంట తీసుకురావాల్సింది."

"నాకు తోచలేదు." జాక్ చెప్పాడు.

బయట కారు ఆగిన చప్పుడు విని కిటికీ లోంచి చూసి జాక్ చెప్పాడు.

"పోలీసులు! జాగ్రత్త"

డోర్ బెల్ మోగింది వెళ్ళి తలుపు తెరిచింది. బయట యూనిఫాంలో ఓ పోలీస్, మాఫ్టీలో ఓ పోలీస్ నిలబడి ఉన్నారు.

"గుడీవినింగ్, మీరు మిసెస్ ఆర్థర్ చౌండ్రీనా?" మాఫ్టీలోని అతను అడిగాడు.

"అవును? ఏమిటి విషయం?"

"నేను సూపరింటెండెంట్ కార్సియాక్. ఇతను సార్జెంట్ రేసన్."

"హౌ డు యు డూ." రేసన్ పలకరించాడు.

"మేం లోపలికి రావచ్చా?" కార్సియాక్ అడిగాడు.

"రండి. ఏం జరిగింది? ఇతను మిస్టర్ జాక్ లయన్స్."

"మీ భర్తకి సెడాన్ కారుందా? లైసెన్స్ నంబర్ హెచ్ ఏ సి 4745."

"అవును. అది మా కారే. ఏం జరిగింది? ఏదైనా ఏక్సిడెంట్ అయిందా? ఆర్థర్కి ఏం కాలేదుగా?" ఆందోళనని నటిస్తూ అడిగింది.

"మీకు చెడ్డవార్తని తెచ్చినందుకు సారీ. మీ భర్త మరణించాడు."

ఫిలిస్ సోఫా మీద కూర్చుని 'ఓ జాక్!' అంటూ ఏడుస్తుంటే "ఐయాం సారీ" అని చెప్పి జాక్ వారిని అడిగాడు.

"ఎం జరిగింది?"

"ప్రైవాటర్కి వచ్చే నిర్మానుష్య రోడ్లో అతని మీద దాడి జరిగింది. ఈ సమయంలో అక్కడ ఆయన ఏం చేస్తున్నారో మీకు తెలుసా మిసెస్ ఆర్థర్?" కార్సియాక్ ప్రశ్నించాడు.

"తెలుసు. నన్ను లగూన్ హోటల్ నించి తీసుకురావడానికి వస్తున్నారు. అక్కడికి నా చెల్లెలుతో ఓ నృత్యం చూడడానికి వెళ్ళాను."

"మిసెస్ ఆర్థర్ నా గేరేజ్ నించి ఓ కారు అద్దెకి తీసుకుంది. ఆమెని లగూన్కి తీసుకెళ్ళాను. ఆమె భర్త త్వరగా రావాలని షార్ట్ కట్లో రమ్మని ఆమె ఫోన్ చేసింది."

"మీ భర్త దగ్గర పర్స్ లేదు."

"కారు లోంచి ఇంకేమైనా దొంగిలించబడ్డాయా? నా మొసలి చర్మం డ్రెస్సింగ్ కేస్ ఉందా? నా భర్త దాన్ని రిపేర్ షాపు నించి తెస్తున్నానని ఫోన్లో చెప్పాడు. దానికి ఓ చోట గీత పడింది." ఫిలిస్ అడిగింది.

"కారులో పర్పుల్ రంగు స్కార్ఫ్ తప్ప ఇంకేమీ లేదు." కార్సియాక్ చెప్పాడు.

"ఐతే అది దొంగిలించబడి ఉంటుంది. దాన్ని మీరు ఎలాగైనా తీసుకురావాలి. ఎందుకంటే దాని ధర రెండు వందల పౌండ్లు." ఆమె కోరింది.

"రేపు సార్జెంట్ మీ నించి దాని వివరాలు తీసుకుంటాడు. మా ప్రయత్నం మేం చేస్తాం. అలాగే మీ భర్తని ఎవరు చంపారో కూడా కనుక్కుంటాం."

మళ్ళీ ఆమె ఏడవసాగింది.

"గుడ్ నైట్ మిసెస్ ఆర్థర్ అండ్ మిస్టర్ లయన్స్" చెప్పి వాళ్ళు వెళ్ళిపోయారు.

"అది కారులో ఉందన్నావు. దాన్ని ఏం చేసావు?" ఫిలిస్ అడిగింది.

"చెప్పాగా? దాన్ని నేను అక్కడే వదిలేసాను."

"మరి నా డ్రెసింగ్ కేస్ ఏమైనట్లు?" ఆమె అడిగింది.

జ్యూరీ సభ్యులు అర్థార్థి హత్యే అని అభిప్రాయపడ్డారన్న సంగతి జాక్ లండన్ ట్రిబ్యూన్ దినపత్రికలో చదివాడు. ఫోన్ మోగింది. ఫిలిస్ నించి.

"ఏమిటి?" అడిగాడు.

"అది అడగడానికే ఫోన్ చేసాను. ఇవాళ్ల కోర్టులో నువ్వు నా వంకే చూడలేదు. ఇంటికి కూడా రాలేదు. ఎందుకని?"

"అలా చేస్తే మన మీద నింద పడుతుంది. నీ ఇంట్లో కానీ, ఎక్కడా కానీ మనం కొంతకాలం కలుసుకోవడం మంచిది కాదు. నువ్విలా ఫోన్ చేయడం కూడా మంచిది కాదు."

ఆమె కోపంగా ఫోన్ పెట్టేసింది.

* * *

ఆ సాయంత్రం ఫిలిస్ తన చెల్లెలు ఐలీన్తో ఓ రెస్టారెంటికి వచ్చింది. అక్కడ కూర్చుని ఉన్న జాక్ని చూసి ఆనందంగా చెప్పింది.

"వాట్ ఏ సర్ప్రయిజ్? మీరు ఈ ఊళ్ళో ఉన్నారనే నాకు తెలీదు. ఇతన్ని గుర్తుపట్ట లేదా? జాక్ లయన్స్." చెల్లెలికి పరిచయం చేసింది.

"హలో" ఆమె ముభావంగా పలకరించింది.

"ఈ ఊరికి షాపింగ్కి వచ్చాం, ఎవరో ఈ రెస్టారెంట్ గురించి చెప్తే ఇక్కడికి వచ్చాం." ఫిలిస్ చెప్పింది.

"కూర్చోండి." అతను మర్యాదగా ఆహ్వానించాడు.

"నో, థాంక్ యూ, మేం కేవలం టీ కోసం వచ్చాం ఫిలిస్." ఐలీన్ ముభావంగా చెప్పి ఇంకో టేబుల్ ముందు కూర్చుంది.

"ఒక్క నిమిషం." చెల్లెలికి చెప్పి ఫిలిస్ అతని ముందు కూర్చుంది.

"నువ్వు జాగ్రత్తగా లేకపోతే ప్రమాదం." జాక్ లో గొంతుతో హెచ్చరించాడు.

"నన్ను ఐలీన్ తప్ప ఎవరూ చూడడం లేదు. నా చెల్లెలు కూడా ఇది కాకతాళీయం అనుకుంటోంది. మన పెళ్ళీ ఎంత త్వరగా జరగచ్చు?" రహస్యంగా ప్రశ్నించింది.

"సంవత్సరం దాకా ఎవరూ పెళ్ళి చేసుకోరు."

"అలా ఐతే నాకు పిచ్చెక్కుతుంది."

“నీ దగ్గర చాలా డబ్బుంది. హాలీడేకి టర్కీకి వెళ్ళు."

“సరే. టర్కీకి వెళ్తాను. నువ్వు రోజూ నాకు ఉత్తరాలు రాయాలి." కోరింది.

"నేను నీకు రాయను. నువ్వూ నాకు రాయకు. పోలీసుల చేతిలో ఒక్క ఉత్తరం పడితే చాలు. మనం మునిగిపోతాం."

"పోలీసులు అసమర్థులు. నా లాయర్ నా డ్రస్సింగ్ కేస్ గురించి వాళ్ళకి ఉత్తరం రాసాడు. వాళ్ళసలు ఆ కేసునే పట్టించుకోవడం లేదు."

“ఫిలిస్. పోలీసులు ఈ కేసుని మర్చిపోయేందుకు అవకాశం ఇవ్వు ఇలాంటివి చేయకు." చిరుకోపంగా చెప్పాడు.

"నా మీద నీకు కోపం వచ్చిందా?”

“లేదు. చిన్న పిల్లలా ప్రవర్తిస్తున్నావు."

ఫిలిస్ నవ్వింది.

* * *

“ఫ్రిల్! ఫిలిస్!” జాక్ గట్టిగా పిలిచాడు.

“ఏమిటి?" అంటూ వచ్చిన ఫిలిస్ని కోరాడు.

"నాకో కప్పు టీ తీసుకురా..”

"ఇంకా ఎంతసేపు నువ్వు ఆ పాత పుస్తకాలు చదువుతావు?" విసుగా అడిగింది.

"ఎకౌంట్స్ బేలన్స్ అవాలిగా?”

“ఇంకో సారి చేయచ్చు. డేన్స్కి వెళ్దాం."

“ఆడిటర్స్ వచ్చే లోగా ఈ పని అవ్వాలి."

"అది నీ గేరేజ్ నువ్వు ఎలా చెప్తే వాళ్ళు అలా వినాలి."

“ఫిల్. గేరేజ్ వ్యాపారంలో నువ్వు జోక్యం చేసుకోకు. నీకేం తెలీదు.”

"కానీ కొత్త డ్రెస్ కొన్నాను. దాన్నివేసుకుని బయటికి వెళ్ళాలి." ఫిలిస్ గారంగా చెప్పింది.

“నీ చెల్లెలితో మేట్నీకి వెళ్ళావుగా?" జాక్ అడిగాడు.

“అవును. అక్కడి నించి స్కాట్లాండ్ యార్డ్కి కూడా.” ఫిలిస్ చెప్పింది.

"ఎక్కడికి? స్కాట్లాండ్ యార్డ్కా? ఎందుకు?" జాక్ నివ్వెరపోతూ అడిగాడు.

"నా డ్రస్సింగ్ కేస్ గురించి. కార్సియాక్ దాన్ని గురించి ఏమీ చేయలేదు."

“ఫిల్ దయచేసి ఆ వెధవ డ్రస్సింగ్ కేస్ గురించి మర్చిపోతావా? దాని కోసం వాళ్ళు వెదికితే మొత్తం బయటికి వస్తుంది. కార్సియాక్ హంతకుడెవరో కనుక్కోలేనంత మాత్రాన ఆ కేసు గురించి మర్చిపోయాడని అనుకోకు. స్కాట్లాండ్ యార్డ్ని ఇందులోకి తెస్తే మనకి ప్రమాదం."

"కాని ఆ డ్రస్సింగ్ కేస్ అంటే నాకెంత ఇష్టమో నీకు తెలుసు."

"ఐతే ఇంకోటి కొను. నీ దగ్గర చాలా డబ్బుందిగా?”

"నాకు ఇంకోటి వద్దు. ఆర్థర్ నాకిచ్చిందే కావాలి." బల్ల మీద గుద్ది చెప్పింది.

"ఫిల్, నువ్వు నాకు అర్థం కాలేదు. ఆర్థర్తో విసిగిపోయావు. అతన్ని తొలగించాలని అనేక సార్లు చెప్పావు. ఇప్పుడు అతని గురించి సెంటిమెంటల్గా మాట్లాడుతున్నావు." జాక్ విసురుగా చెప్పాడు.

"పెళ్ళయిన కొత్తల్లో ఆర్థర్ నేనంటే ఎంతో ప్రేమగా ఉండేవాడు. ఆ డ్రస్సింగ్ కేస్ ఆ సమయంలో ఇచ్చిందే."

"నిన్ను హెచ్చరిస్తున్నాను. నువ్వు ఆ డ్రెస్సింగ్ కేస్ గురించి మర్చిపో, లేదా చింతించాల్సి వస్తుంది." జాక్ కటువుగా చెప్పాడు.

* * *

గేరేజ్ నించి ఇంటికి వచ్చిన జాక్, తన భార్య ఎవరితోనో ఫోన్లో మాట్లాడడం గమనించాడు. ఆమె రిసీవర్ పెట్టేసాక అడిగాడు.

"ఎవరు?"

"విల్ఫ్. నాకు టర్కీలో పరిచయమయ్యాడు."

"డార్లింగ్ నిన్న రాత్రి జరిగినదానికి సారీ. నేను నీ మీద అనవసరంగా అరిచాను."

"ఫర్వాలేదు. నీ మీద నాకు కోపం లేదు."

"కొన్ని వస్తువులు ఆడవాళ్ళకి ముఖ్యం అని నాకు తెలీదు. ఇవాళ రీజెంట్ స్ట్రీట్కి వెళ్ళి దాన్ని నీ కోసం కొన్నాను."

రేపర్ విప్పుతూ ఫిలిస్ ఆనందంగా చెప్పింది.

"అచ్చం పోయిన నా డ్రస్సింగ్ కేస్ లాంటిదే కొని తెచ్చావా?"

విప్పాక చూస్తే అది వేరేది.

‘‘ఇది మొసలి చర్మంతో చేసింది కాదు.’’ అసహనంగా చెప్పింది.

‘‘కాదు. దీన్ని ఆర్థర్ కొన్న బరోటాస్ షాప్లోనే కొన్నాను. ధర ఇంకా ఎక్కువ."

"కానీ రెండూ ఒకటి కాదు.’’

"అది మనకి జరిగింది గుర్తు చేయకూడదని దీని తెచ్చాను." జాక్ చెప్పాడు.

‘‘ఏం గుర్తుకు రాకూడదని?’’

"ఆర్థర్ని నువ్వు మర్చిపోయి ఉండచ్చు. కాని నేను మర్చిపోలేను. పోలీసులు కూడా. ఈ ఇంట్లో మరో సారి మొసలి అనే మాటనే నేను వినదల్చుకోలేదు. ఇది నీకు నచ్చకపోతే షాపుకి వెళ్ళి రిటన్ చెయ్యి, మీ చెల్లెలికి ఇవ్వు లేదా పారెయ్."

"అలా మాట్లాడకు. ఈ ప్రపంచంలో నువ్వొక్కడివే మగాడివి కాదు. నాతో ప్రేమగా ఉండే చాలామంది ఉన్నారు.’’ ఫిలిస్ కోపంగా చెప్పింది.

‘‘అవును. ప్రేమతో మీ నాన్న నిన్ను పాడు చేసాడు. ఆర్థర్ కూడా. నిన్ను సంవత్సరం భరించాను. నీ ఫ్రెండ్ విల్ఫీ నాకంటే ప్రేమగా ఉంటే అతని దగ్గరికి వెళ్ళు" అరిచాడు.

"తప్పకుండా. యూరప్ యాత్రకి కలిసి వెళ్దామన్నాడు."

‘‘మంచిది. నువ్వెంత త్వరగా బయలుదేరితే అంత మంచిది."

విసురుగా అరిచి ఇంకో గదిలోకి వెళ్ళిపోయాడు.

***

డోర్ బెల్ విని విస్కీ తాగుతున్న జాక్ గట్టిగా చెప్పాడు.

“కమిన్.”

సూపరింటెండెంట్ కార్సియాక్ లోపలికి వచ్చి చెప్పాడు.

"మిస్టర్ జాక్ నేను ఇంత ఆలస్యంగా వచ్చినందుకు ఏమీ అనుకోకండి.”

“ఆలస్యం అని ఎవరన్నారు? నేను ఆలస్యం అనను."

జాక్ తన గ్లాస్లోకి విస్కీ పోసుకుంటూంటే అతను అడిగాడు.

"మీ ఆవిడతో నేనో మాట మాట్లాడచ్చా?”

"అయితే ఆలస్యమైంది."

“ఆమె పడుకుందా?”

“ఆమె యూరప్ వెళ్ళింది." నవ్వాడు.

"మిస్టర్ జాక్ ఆమె మమ్మల్ని చాలా ఇబ్బంది పెడుతోంది. మొసలి చర్మం డ్రెసింగ్ కేస్ కోసం స్కాట్లాండ్ యార్డ్కి వెళ్ళింది. అది హత్య జరిగినప్పుడు మాయమైంది. ఆ హంతకుడ్ని పట్టుకోలేదని యార్డ్ నాకు తాఖీదు ఇచ్చింది."

“ఇక మీకు ఎలాంటి సమస్యా డ్రెసింగ్ కేస్ని కనుగొన్నాం.”

“అది మీకు దొరికిందా?” అడిగాడు.

“అవును. మా గొప్పేం లేదు. అదృష్టం. ఓ ఆరు టన్నుల లారీ విల్క్ షైర్లోని ఓ కాటేజ్లోకి దూసుకెళ్ళింది. దాంట్లో దొంగిలించబడ్డ చాలా వస్తువులు కనిపించాయి. పోలీసులు ఆ దొంగని

పట్టుకున్నారు. హత్య జరిగినప్పుడు అతను స్కాట్లాండ్లో ఉన్నాడు. డ్రెసింగ్ కేస్ని మీరు గుర్తుపట్టగలరా?" ఓ డ్రెసింగ్ కేస్ని చూపించి అడిగాడు.

"అది కాదు," దాన్ని చూసి జాక్ జవాబు చెప్పాడు.

‘‘ఇది కాదా? నమ్మకంగా చెప్తున్నారా?" కార్సియాక్ ఆశ్చర్యంగా అడిగాడు.

‘‘అవును. ఆ డ్రెసింగ్ కేస్ మీద మా ఆవిడ ఇనీషియల్స్ పి.సి. అని ఇటు వైపు ఉండాలి. ఫిలిస్ చాండ్రీ." చేత్తో తట్టి చూపించాడు.

"అయితే ఫిలిస్ ఈ కేసు గురించి రాసిచ్చిన వివరాల్లో ఆ అక్షరాలు గురించి రాయలేదు.’’

"మర్చిపోయి ఉంటుంది. ఆమె ముఖ్యమైనవి మర్చిపోతూ ఉంటుంది."

కార్సియాక్ దాన్ని తీసి కింద పెట్టి అలాంటి ఇంకో కేస్ని చూపించి అడిగాడు.

‘‘ఇదేనా?’’

దాని మీద పిసి అన్న అక్షరాలని చూసి జాక్ చెప్పాడు.

‘‘అవును. ఇదే. రెండు తెచ్చారు? నాకు అర్థం కాలేదు. ’’

"సారీ సర్ మీ జ్ఞాపకశక్తి మీద అపనమ్మకం కాదు. మీకు బాగా గుర్తుందా? ఇది హత్య కేసు కదా?’’

‘‘అవును. గుర్తుంది. పి సి. ఇక్కడే ఉండాలి. ఉన్నాయి."

"మీ భార్య మర్చిపోయినా ఈ ఇనీషియల్స్ మీకు గుర్తున్నాయంటే మీ జ్ఞాపకశక్తిని మెచ్చుకోవాలి. చూడండి మిస్టర్ జాక్! ఇవి దీని మీద ఉన్నాయని ఆమెకి తెలీదు."

“ఎందుకు తెలీదు? ఇది ఆమె కేసే కదా? ఏమిటి ఇదంతా?”

“ఈ ఇనీషియల్స్ దీని మీద ఉన్నాయని మీరు ఆ కారులో దీన్ని చూసి ఉండకపోతే మీకూ తెలిసేది కాదు.”

"కానీ ఈ డ్రెసింగ్ కేస్ని అనేక సార్లు ఆర్థర్ ఇంట్లో చూసాను."

“కావచ్చు. కానీ ఈ ఇనీషియల్స్తో కాదు. ఆ షాపువాళ్ళు రిపేరు చేసాకే వీటిని రాసారు - గీతని కవర్ చేయడానికి. అదే రోజు ఆర్థర్ దాన్ని తీసుకున్నాడు. కాబట్టి ఈ ఇనీషియల్స్ని మీరు అంతకుముందు ఎప్పుడూ చూసే అవకాశం లేదు. మీరా సమయంలో అక్కడ ఏం చేస్తున్నారు మిస్టర్ జాక్?" కార్సియాక్ నవ్వుతూ చూస్తూ ప్రశ్నించాడు.

---

## ఓ వర్షం రాత్రి - జూలియన్ సైమన్

వర్షంలో కనపడే ఆ మైలు రాయి మీద డోవర్ 41 అని రాసుండడం కారు నడిపే డొనాల్డ్ చూసాడు. అతని నోట్లోంచి ఓ ఈల పాట వెలువడసాగింది. దాని పేరు 'ది సాంగ్ ఆఫ్ ది స్కై బోట్ మేన్.' అది ఫ్రెంచ్ పాట. ఫ్రాన్స్ నించి విదేశాలని కనిపెట్టడానికి వెళ్ళిన నావికులని కీర్తించే పాట అది.

అతని కారు విండ్ షీల్డ్ మీద వర్షపు చినుకులు చప్పుడు చేస్తూ పడుతున్నాయి. వైపర్స్ అటు ఇటు తిరుగుతూ చేసే చప్పుడు “కొత్త జీవితం.. కొత్త జీవితం" అని ధ్వనిస్తున్నట్లుగా అతనికి అనిపించింది. తడి రోడ్డు మీద కార్లటైర్ల శబ్దం కూడా వినిపిస్తోంది. మర్నాడు తను ఫ్రాన్స్కి వెళ్ళిపోతాడు అనుకున్నాడు. కారు రేడియోలో వార్తలు వస్తున్నాయి.

“...ఇది ఇంకో ప్రభుత్వ తప్పిదం. ప్రభుత్వాన్ని రాజీనామా చేయమని మిస్టర్ మైఖేల్ ఫుట్ కోరాడు."

కొద్ది క్షణాల నిశ్శబ్దం తర్వాత అనౌన్సర్ గొంతులో చిన్న మార్పు.

‘‘కెంట్లో హత్య. కెంట్ శివార్లలోని ఆష్లీ అనే గ్రామంలో మిసెస్ మేరీ ఫోర్డ్ వృద్ధురాలి శవం ఆవిడ ఇంట్లో కనుగొనబడింది. ఆవిడ మీద దాడి చేసి తీవ్రంగా కొట్టి చంపాక, నేరస్తులు ఇల్లంతా బాగా వెదికారు. మిసెస్ ఫోర్డ్ ఎవరితోనూ కలిసేది కాదు. ఒంటరి జీవి. ఆవిడ తనింట్లో పెద్ద మొత్తంలో నగదు దాచిందని వదంతి. పోలీసులు పరిశోధిస్తున్నారు.’’

అక్కడ నించి ఆష్లీ గ్రామం ఐదు మైళ్ళు ఉండచ్చని డోనాల్డ్ అనుకున్నాడు. తర్వాత రేడియోలో ఓ అందాల రాణితో వచ్చే ఇంటర్వ్యూని అతను ఆసక్తిగా వింటూండగా, ఎదురుగా రోడ్డుకి అడ్డంగా ఏదో పడి ఉండడం కనిపించింది. తక్షణం అది మనిషని గ్రహించి బ్రేక్ వేయడంతో తడి రోడ్ మీద కారు కొద్దిగా అదుపు తప్పింది. తిరిగి దాన్ని ఆధీనంలోకి తెచ్చుకుని కారుని ఆపి, అద్దం దింపి కోపంగా అరిచాడు.

"రోడ్డు మధ్య ఏం చేస్తున్నావు?"

"టార్చి లైట్ వెలుగు చూడలేదా?’’ ఆ వ్యక్తి నవ్వుతూ అడిగాడు.

"ఆ వెలుతురు నాకు కనపడలేదు. కొంచెంలో నిన్ను గుద్దేవాడ్ని.’’

"నాకు సహాయం చేయగలరా? నా కారు పాడైంది." అతని కంఠం మొరటుగా ఉంది.

డోనాల్డ్కి కారు హెడ్లైట్స్ వెలుగులో ఎక్కడా ఇంకో కారు కనపడలేదు. అడగని ప్రశ్నకి ఆ వ్యక్తి సమాధానం చెప్పాడు.

"మీరు దాటి వచ్చిన సైడ్ రోడ్లో నా కారు ఉంది. ముందు ఏక్సిల్ విరిగింది అనుకుంటాను.’’

అతను మళ్ళీ గట్టిగా నవ్వాడు. డోనాల్డ్కి ఆ నవ్వు అర్థరహితంగా అనిపించింది.

“దయచేసి నాకు లిఫ్ట్ ఇవ్వగలరా? ముందు కొద్ది దూరంలో ఓ కెఫే ఉంది. నన్నక్కడ దింపితే, నేను మెకానిక్కి ఫోన్ చేస్తాను."

తక్షణం డోనాల్డ్కి అతన్ని కారులో ఎక్కనివ్వకూడదు అనిపించింది. ఐనా తన పక్క సీట్ తలుపుని తెరిచాడు. ఆ వ్యక్తి తన తడి రెయిన్ కోట్ని విప్పి, వెనక సీట్లో పడేసి కూర్చున్నాడు. అతను తన కన్నా చిన్నవాడని, ఇరవై ఆరు, ఇరవై ఏడేళ్ళ ఉండచ్చని లోపలి వెలుగులో డోనాల్డ్ గమనించాడు. ఆ వ్యక్తి తలుపు మూయగానే లైట్ ఆరిపోయింది.

“సారీ. మీ కారుని తడుపుతున్నాను." చెప్పాడు.

డోనాల్డ్ జవాబు చెప్పలేదు. కారు డ్రైవ్ చేస్తూ మళ్ళీ ఫ్రెంచ్ పాటని ఈల వేయసాగాడు.

“చాలాదూరం వెళ్తున్నారా?" అతను కొద్ది సేపాగి అడిగాడు.

“డోవర్ వెళ్ళి ఇంగ్లీష్ ఛానల్ని దాటి ఫ్రాన్స్కి వెళ్ళిపోతాను." డోనాల్డ్ ఉత్సాహంగా చెప్పాడు.

"అదృష్టం. నేనెప్పుడూ ఫ్రాన్స్కి వెళ్ళలేదు."

"ఇంగ్లండ్ విసుగు కలిగించే దేశమని నా అభిప్రాయం. ఈ దేశం నించి వెళ్ళి పోతున్నందుకు నాకు ఆనందంగా ఉంది." కొద్దిసేపాగి అతని మనోభావాలు దెబ్బ తిన్నాయేమో అనే అనుమానంతో డోనాల్డ్ మళ్ళీ చెప్పాడు.

“మార్చి నెలలో ఇంగ్లండ్ నించి వెళ్ళడం బావుంటుందని చెప్పడం నా ఉద్దేశం.”

"నాకు అర్థమైంది. నేను ఉద్యోగరీత్యా ఐదేళ్ళ క్రితం సేల్స్ కాన్ఫరెన్స్కి ఫ్రాంక్ఫర్ట్కి వెళ్ళాను. భార్య, ఇద్దరు పిల్లలు ఉంటే విదేశాలకి వెళ్ళడం కుదరదు. ఏటా మా బడ్జెట్ లిటిల్ హేంప్టన్కి వెళ్ళడానికే సరిపోతుంది. అక్కడ బంధువులు ఉన్నారు. మీకు పెళ్ళయిందా?"

“లేదు." డోనాల్డ్ జవాబు చెప్పాడు.

"అదృష్టవంతులు. లండన్లో సింగిల్ బెడ్ రూం అపార్ట్మెంట్లో ఉంటూ, మీకేం తోస్తే అది చేయచ్చు. ఎక్కడికి వెళ్ళాలనుకుంటే అక్కడికి వెళ్ళచ్చు. నాకు ఒక్కోసారి అలాంటి వారి మీద అసూయపుడుతూంటుంది."

"లండన్లో నాకో ఫ్లాట్ ఉందని నేను చెప్పలేదు. నేను రచయితని. ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ని." డోనాల్డ్ అసహనంగా చెప్పాడు.

"ఫ్రీలాన్స్ అంటే స్వతంత్రం. కారు చెడిపోవడం వల్ల నాకు చాలా ఇబ్బంది కలిగింది. నేను రోడ్ రాజాని."

"అర్థం కాలేదు. అంటే?"

"కమర్షియల్ ట్రావెలర్. ఈ రాత్రికల్లా నేను ఫోకెస్టోన్కి చేరుకోవాలి. రేపు ఉదయం నాకు అక్కడ ఓ అపాయింట్మెంట్ ఉంది. నా కారుని మెకానిక్ వెంటనే బాగు చేయగలిగితే మంచిది. లేదా ఇబ్బందుల్లో పడతాను. దయచేసి మీరు నన్ను ఫాకెస్టోన్లో దింపగలరా? అది మీ దారిలోనే ఉంది. అది మీరు నాకు చేసే పెద్ద సహాయం అవుతుంది."

అతను చెప్పిన కట్టుకథకి తిరస్కరించాలి అని డోనాల్డ్కి అనిపించింది.

"మీ కారు బాగవకపోతే అలాగే."

"మీరు చాలా మంచివారు. ఆ కెఫే దగ్గర ఐదు నిమిషాలు ఆగితే నేను గేరేజీకి ఫోన్ చేస్తాను."

"మీరు ఏం అమ్ముతారు?" డోనాల్డ్ అకస్మాత్తుగా అడిగాడు.

"ఉలెన్స్ అన్ని రకాల ఉలెన్ బట్టలు."

"మీ దగ్గర శాంపుల్స్ ఉన్నాయా?"

క్షణం ఆలస్యంగా జవాబు వచ్చింది.

‘‘ఆ పెట్టె కారులో ఉంది. సూట్ కేస్ కూడా. వాటిని వెంట తీసుకురాలేదు."

శాంపుల్స్ లేకుండా అమ్మకాలని ఎలా బుక్ చేసుకుంటాడనే ఆలోచన డోనాల్డ్కి కలిగింది.

"ఆ హత్య షాకింగ్గా అనిపించింది." ఆ కొత్త వ్యక్తి చెప్పాడు.

"ఏ హత్య?" డోనాల్డ్ ప్రశ్నించాడు.

"కొద్ది మైళ్ళ దూరంలో ఆష్లీ అనే గ్రామం ఉంది. ఆ ఊళ్ళోని ఓ ఇంట్లోని హాల్లో ఓ వృద్ధురాలిని ఎవరో తల మీద బాది, కొట్టి చంపారు. ఐదు వందలో, వెయ్యో దొంగిలించి పారిపోయాడు. పోలీసులు హంతకుడిని తప్పకుండా పట్టుకుంటారు. ఆ ఇంట్లోంచి అతను వెళ్ళడం సాక్షులు చూసారని పందెం. లేదా పోలీసులు జో డోపెన్స్ని ఇంటర్వ్యూ చేయాలని ప్రయత్నిస్తున్నామని చెప్పారు. హత్య తేలిక. ఉదాహరణకి నేను నా తుపాకీని మీ డొక్కలో గుచ్చి కారుని ఆపమంటాను. తర్వాత కాల్చి, మిమ్మల్ని బయట పడేసి కారులో ఉడాయించి, దాన్ని ఎక్కడో వదిలేసి రైళ్ళు బస్సులు రెండు మూడు మారి దూరంగా వెళ్తే, నన్నెవరూ పట్టుకోలేరు. ఇలా చాలా సార్లు జరిగింది."

ఆ కొత్త వ్యక్తి కొద్దిసేపాగి మళ్ళీ చెప్పాడు.

"కానీ ప్రతీ హంతకుడు వేలిముద్రలు, కాలి ముద్రలు లాంటి ఆధారాల విషయంలో పొరపాటు చేస్తూంటాడు. నేను గ్లవ్స్ తొడుక్కుని ఉండాల్సింది... నాలోని సెన్సాఫ్ హ్యూమర్కి మీరు క్షమించాలి. నాకు గుర్తుంటే కెఫే ఆ మలుపులో ఎడమ వైపు ఉంది. హత్య ఆకర్షణీయమైంది కదా?"

డోనాల్డ్ సమాధానం చెప్పలేదు. ఫెర్రీ ఎక్కి ఆ రాత్రి ఫ్రాన్స్కి వెళ్ళబోతున్నాను అనుకున్నాడు. మళ్ళీ అతని నోట్లోంచి ఈల పాట వచ్చింది.

వర్షం ఆగింది. రోడ్డుకి ఎడమ వైపు లైట్లు కనిపించాయి. కారు వైపర్స్ని ఆపు చేసాక శబ్దం ఆగింది. డోనాల్డ్ ఈల పాటని ఆపేసి జోస్ కెఫే ముందు కారుని ఆపాడు. కొత్త వ్యక్తి కారు దిగుతూ అడిగాడు.

"మీరూ వస్తున్నారా?"

డోనాల్డ్ అతని చెప్పిన కథ అబద్ధం అని నిర్ణయించాడు. దాని గురించి ఏదైనా చేయాలనుకున్నాడు. అయిష్టంగానే కారు దిగాడు. అతని వెంట జోస్ కెఫేలోకి వెళ్తూ అతని బూట్ల వంక చూసాడు. వాటికి బురద అంటుకుని ఉంది.

ప్లాస్టిక్ టేబుల్స్ మీద సాస్ సీసాలు ఉన్నాయి. మాంసం వేయించే వాసన వస్తోంది.

కౌంటర్ వెనక వ్యక్తి వచ్చి తన పేరు జో అని చెప్పాడు.

"రెండు కప్పుల స్ట్రాంగ్ టీ. మాకు సాసేజెస్, చిప్స్ చేసి ఇవ్వగలరా?" కొత్త వ్యక్తి అడిగాడు.

"నాకు తినడానికి ఏం వద్దు." డోనాల్డ్ నవ్వే ఆ కొత్త వ్యక్తితో కఠినంగా చెప్పాడు.

"మనిద్దరి కడుపుల్లోకి వేడిగా ఏదైనా వెళ్తే మంచిది."

"నాకేం వద్దని చెప్పాగా? నేను సాసేజెస్ని తినను."

"ఇదవకండి. నా పేరు గోలైట్లీ. మిత్రులు గోలీ అని పిలుస్తారు."

"మీరు టెలిఫోన్ చేయడానికి వచ్చారనుకున్నాను." డోనాల్డ్ చెప్పాడు.

"అవును. జోని గేరేజి గురించి అడిగి ఫోన్ చేస్తాను." చెప్పి లేచి జోతో మాట్లాడి, మూల ఉన్న టెలిఫోన్ బూత్ దగ్గరకి వెళ్ళి ఫోన్లో మాట్లాడి తల ఊపాడు.

అతన్ని వదిలేసి వెళ్ళిపోతే? అన్న ఆలోచన డోనాల్డ్కి వచ్చింది. జో చిప్స్, సాసేజెస్, రెండు కప్పుల టీతో వచ్చాడు. గోలీ చెప్పిన ఓ విషయం తణిఖీ చేయాలనుకుని డోనాల్డ్ జోని అడిగాడు.

"మీ దగ్గర ఈవెనింగ్ పేపర్ ఉందా?"

"రేసుల ఫలితాల కోసమా? ఓ డ్రైవర్ ఈవెనింగ్ పేపర్ని తీసుకొచ్చాడు." జో అతనికి ఆ పేపర్ని తెచ్చిచ్చాడు.

దాన్ని జాగ్రత్తగా చదివి మడిచాడు. 'గోలైట్లీ నిజంగా ఫోన్ చేస్తున్నాడా? లేక అలా నటిస్తున్నాడా? ఈల ఆపి టీని చప్పరించాడు.

గోలైట్లీ చేతులు రుద్దుకుంటూ నవ్వుతూ వచ్చి చెప్పాడు.

"సాసేజ్ అండ్ చిప్స్ నాకిష్టం. రెండు గ్యారేజ్కి ఫోన్ చేస్తే, రెండోవాడు వచ్చి నా కారుని తీసుకెళ్తానని చెప్పాడు. ఈ రాత్రే పని పూర్తి చేస్తానని అన్నాడు. మీతో పాటు ఫోకెస్టోన్ దాకా వస్తాను."

"అక్కడ మీరు హోటల్లో ఉంటారా?" డోనాల్డ్ ప్రశ్నించాడు.

"కాదు. నాకో మిత్రుడు ఉన్నాడు."

"లిటిల్ హేంప్టన్లోని బంధువుల్లానా?"

"ఈమె లేడీ ఫ్రెండ్. సేల్స్ మేన్ ప్రతీ నౌకాశ్రయంలో ఓ గర్ల్ ఫ్రండ్ ఉండే నావికుడిలాంటి వాడు. నిజానికి నేను ఫోకెస్టోన్కి ఈ రాత్రి వెళ్ళడానికి కారణం

అదే.ఇంగ్లీష్ ఛానల్ దాటాక అక్కడ మీకో గర్ల్ ఫ్రెండ్ ఉందా? నేను ఎక్కువగా మాట్లాడుతూంటాను...." గోలైట్లీ చెప్పాడు.

"నిన్ను నాతో తీసుకెళ్ళడం లేదు." డోనాల్డ్ చెప్పాడు.

“నన్ను తీసుకెళ్ళడం లేదా?" అతని చేతిలోని కప్పు కొద్దిగా వణికింది.

"నేను ఇన్వాల్వ్ కాదల్చుకోలేదు."

“అంటే?” గోల్రైట్లీ అడిగాడు.

“మీరు చెప్పినవన్నీ అబద్దాలు. మీరు కమర్షియల్ ట్రావెలర్ అని, రేపు ముఖ్యమైన అపాయింట్మెంట్ ఉందని చెప్పారు. శాంపుల్స్ లేకుండా సేల్స్ మేన్ తన పనిని ఎలా చేయగలడు? మీ శాంపుల్స్ కారులో ఉన్నాయి. వాటిని తీసుకుని బయలుదేరే ఆసక్తి మీలో లేదు.”

“రేపు నాకు శాంపుల్స్ అవసరం లేదు.”

"శాంపుల్స్ సంగతి అలా ఉంచండి. మీరు సేల్స్ మేన్లాగా నాకు తోచడం లేదు. అసలు మీకు కారే ఉందనుకోను. మీ కారు నెంబరు ఎంత?" డోనాల్డ్ ప్రశ్నించాడు.

“ఏకెటి 113 హెచ్.”

“మేక్?”

"ట్రయంఫ్ హెరాల్డ్"

“ఋజువు చేయండి. మీ విజిటింగ్ కార్డు చూపించండి."

"నా దగ్గర విజిటింగ్ కార్డులు లేవు."

"విజిటింగ్ కార్డు లేని కమర్షియల్ ట్రావెలరే ఇంగ్లండ్లో ఉండరు."

‘‘సరే. నేను నిజం చెప్పలేదు. అయినా ఫోకెస్టోన్కి వెళ్ళాలి. నాకు లిఫ్ట్ కావాలి."

సరిగ్గా ఆ మాట వినగానే డోనాల్డ్ లేచి బయటికి వెళ్ళాలని అనుకున్నాడు. కానీ గోలైట్లీ ప్రవర్తన వెంటనే అతని మనసుని మార్చింది.

‘‘సరే. పదండి." చెప్పాడు.

‘‘నన్ను తీసుకెళ్తున్నారా? ‘‘ఆశ్చర్యంగా అడిగాడు.

‘‘మీకు చెవుడా?’’

గోలైట్లీ మారు మాట్లాడలేదు. బిల్లు చెల్లించి మౌనంగా డోనాల్డ్ వెనక కారు దగ్గరికి నడిచాడు. అతని మొహం కొద్దిగా పాలిపోయింది.

"మీరెవరో, ఏం చేస్తున్నారో నిజం చెప్పండి. మీ బూట్లు, వాటి మీద బురద రోడ్డు మీద నడవడం వల్ల అంటినట్లు లేదు. పొలంలో నడవడం వల్లో, పరిగెత్తడం వల్లో అంటిన బురద అది." కారు కదిలాక డోనాల్డ్ అడిగాడు.

‘‘అది బురద సందు."

డోనాల్డ్ ఓసారి తన కోటు జేబు మీద చేతిని వేసి తడిమి తర్వాత చెప్పాడు.

‘‘మిస్సెస్ ఫోర్డ్ హత్య చేయబడ్డ ఆష్లీ దగ్గర మిమ్మల్ని పికప్ చేసాను. సేల్స్ మేన్ అని అబద్ధం ఆడారు. మీరు నాకు ఆ హత్య గురించి చెప్పడం విచిత్రంగా ఉంది. దాని గురించి అసలు మీకెలా తెలిసింది?’’

‘‘పేపర్లో చదివాను.’’

"నేనూ కెఫేలో ఈవెనింగ్ ఎడిషన్ చదివాను. అందులో దాని గురించి రాయలేదు. రాత్రి ఏడుకి హత్య జరిగితే ఎలా రాస్తారు? మీకెలా తెలిసింది? నేను రాత్రి పది గంటల న్యూస్లో కారు రేడియోలో దాని గురించి విన్నా కాబట్టి నాకు తెలిసింది."

"మీలాగే నా కారు రేడియోలో వినుంటాను."

"అబద్ధం. అది విన్న ఒకటి రెండు నిమిషాల్లోనే మిమ్మల్ని పికప్ చేసాను. పైగా రేడియోలో ఆవిడని హాల్లో చంపారని చెప్పలేదు. అది మీకెలా తెలిసింది?"

నిశ్శబ్దం.

కారు హెడ్లైట్స్లో ఫోకెస్టోన్ బైపాస్కి వెళ్ళే ఏష్ఫర్డ్ బోర్డ్ కనిపించింది. కారుని ఎడమ వైపు తిప్పాడు. అతను చెప్పిందంతా అబద్ధం అని తను ఋజువు చేసానని డోనాల్డ్ మనసులో గర్వంగా అనుకున్నాడు.

"నేనో పొరపాటు చేసినట్లున్నాను." గోలైట్లీ నెమ్మదిగా చెప్పాడు.

"అవును." డోనాల్డ్ నోట్లోంచి మళ్ళీ ఆ మెలడీ ఈల రూపంలో వచ్చింది.

"సరే. నేను ఆ వృద్ధురాలిని చంపాను అనుకుందాం. జోస్ రెస్ట్రెంట్ నించి పోలీసులకి ఫోన్ చేసి, నాకు చెప్పిన కారణాలు వాళ్ళకీ చెప్పి ఎందుకు నా మీద ఫిర్యాదు చేయలేదు?" గోలైట్లీ అడిగాడు.

"ఎందుకంటే, నాకు ఇంగ్లండ్ అంటే అసహ్యం. ఎప్పుడు చూసినా మంచు తెర, మురికి వాతావరణం. అసహ్యమైన కెఫే, నీలాంటి మనుషులు అంటే నాకు ఇష్టం లేదు. పోలీసులకి ఫోన్ చేస్తే స్టేట్మెంట్ ఇవ్వాలి. సాక్షిగా ఆగిపోవాలి. కొన్ని రోజులు లేదా వారాల పాటు ఇంగ్లండ్ని వదిలి వెళ్ళలేను. అందువల్ల నువ్వు హంతకుడవైతే నాకేంటి?"

"మనిద్దరం ఒకరికొకరు పరిచయం కాలేదు కదా? మీకు నా పేరు తెలుసు. కాని మీ పేరు చెప్పలేదు. ఐనా అది నాకు తెలుసు." గోలైట్లీ చెప్పాడు.

"ఏమిటి?"

"డోనాల్డ్ గ్రాంట్. అవునా?"

"నువ్వు నా కారు లాగ్ బుక్ని దొంగతనంగా చూసావు." డోనాల్డ్ సగం నిజం కోపం, సగం తెచ్చి పెట్టుకున్న కోపంతో చెప్పాడు.

"లేదు. చూడలేదు. మిసెస్ ఫోర్డ్ అనే వృద్ధురాలి గురించి మీకో చిన్న కథ చెప్తాను. ఆవిడ చాలా మంచావిడ. కొడుకులు లేరు. కూతుళ్ళు లేరు. కాబట్టి ఆవిడని పట్టించుకునే వాళ్ళే లేరు. కానీ డబ్బుని అంటిపెట్టుకుని జీవించేది."

డోనాల్డ్ ఏక్సిలేటర్ని నొక్కాడు. అతను సాధారణంగా కారుని వేగంగా పోనించడు. కానీ డెబ్బై నించి ఎనభై తొంభై దాకా తను వినే కంఠం నించి దూరం అవ్వాలా అన్నట్లుగా కారు వేగాన్ని పెంచాడు. కానీ ఆ కంఠం సూదిలా అతని ఒంట్లో గుచ్చుకుంటున్నట్లుగా వినిపించింది.

"ఐనా ఆవిడ మేనల్లుడు మిసెస్ ఫోర్డ్ బాగోగులు చూసుకునేవాడు. 'నేను పోయాక మొత్తం నీదవుతుంది' అని ఎప్పుడైనా ఓ ఐదు పౌండ్ల నోటుని అతనికి ఇస్తుండేది అనుకుంటాను. డబ్బుకి బాధపడే ఆ యువకుడు పెద్దగా ఆర్జన లేని ఫ్రీలాన్స్ రైటర్. దాంతో ఓ వర్షపు సాయంత్రం మిసెస్ ఫోర్డ్ హత్య చేయబడింది. అది దొంగల పని అనిపించేలా సామానంతా చిందరవందర చేయబడింది. కానీ అది దొంగల పని కాదు." చిన్నగా నిట్టూర్చి పూర్తి చేసాడు.

"ఆ మేనల్లుడి పేరు నేను నీకు చెప్పక్కరలేదనుకుంటాను."

డోనాల్డ్ నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

"మేము మీ ఫ్లాట్ బెల్ కొట్టడానికి మునుపే నీ గురించి చాలా తెలుసుకున్నాం. నీ రూమ్ మేట్ ఛార్లెస్ నువ్వు అకస్మాత్తుగా విదేశాల్లో గడపడానికి వెళ్తున్నట్లు చెప్పాడు. మేము నీ కోసం వెదుకుతున్నాం. ఏ రోడ్డు తీసుకుంటావో మాకు తెలీదు.... డిటెక్టివ్ సార్జెంట్ గోలైట్లీ నిన్ను ప్రశ్నించడానికి స్టేషన్కి తీసుకెళ్ళొచ్చు. నీ దగ్గర రివాల్వర్ ఉందా?''

డోనాల్డ్ వేళ్ళు కోటు జేబు లోపలి రివాల్వర్ని బయటి నించే తడిమాయి. వారి కారు వెనుక వచ్చే పోలీస్ కారు లైట్లు ఆరి వెలుగుతున్నాయి.

"నేను దోషినని ఎలా కనుక్కున్నావు?'' డోనాల్డ్ బలహీనంగా అడిగాడు.

''నువ్వు ఒకటి రెండు తప్పులు చేయబట్టి. నాలా కావాలని కాదు. మిసెస్ ఫోర్డ్ ఏడు గంటల ప్రాంతంలో చంపబడిందని చెప్పావు. అది నిజమే. కానీ రేడియోలో ఆ విషయం చెప్పలేదు." గోలైట్లీ చెప్పాడు.

''మాటలు గాల్లో కలిసిపోయాయి. నేనా మాట అనలేదని చెప్తాను."

''ఇంకోటి. మిసెస్ ఫోర్డ్ ఇంట్లోంచి నువ్వు బయటికి రావడం ఓ సాక్షి చూసాడు. నువ్వు అతనికి తెలీదు కాని నిన్ను వర్ణించాడు. ఇంకోసారి చూస్తే గుర్తు పడతానన్నాడు."

''ఒకే సాక్షి! మంచి లాయర్ ఉంటే...."

''నువ్వు ఈల వేస్తున్నావు. ఇది నీ ఫేవరెట్ పాట కదా? ఆ సాక్షి దీన్ని స్పష్టంగా విన్నాడు." గోలైట్లీ ఆ ఈల పాటని ట్యూన్తో పాడాడు.

"కేరీ ది మేన్ హూ వజ్ బార్న్ టు బి కింగ్ ఓవర్ ది సీ టు స్కై''

తక్షణం రెండు సంఘటనలు సంభవించాయి. వెనక వచ్చే పోలీస్ కారు సరిగ్గా వారి కారు పక్కకి వచ్చింది. దాన్నించి స్పాట్ లైట్ కారు మీద పడడమే కాక సైరన్ మోగసాగింది.

రివాల్వర్ కోసం జేబులోకి వెళ్తున్న డోనాల్డ్ కుడి చేతిని గమనించిన గోలైట్లీ స్టీరింగ్ వీల్ మీదకి పడ్డాడు. డోనాల్డ్ తను ఎడమ చేతితో కారుని కంట్రోల్ చేయలేనని గ్రహించాడు. పెద్ద శబ్దం. ఆ తర్వాత అంతా నిశ్శబ్దం.

* * *

గోలైట్లీకి హాస్పిటల్లో మెలకువ వచ్చింది. సూపరింటెండెంట్ అతని వంక కోపంగా చూస్తూ చెప్పాడు.

"నువ్వు మూర్ఖుడివి గోలీ. నువ్వు జీవించడం అదృష్టం. డోనాల్డ్ గ్రాంట్ పోయాడు."

"ఎలా?" గోలైట్లీ ప్రశ్నించాడు.

"కారు ముందు అద్దం ముక్క మెడలో గుచ్చుకుని. నువ్వు అతని కారులోకి ఎక్కాల్సిన అవసరం లేదు. అతను ఏ రోడ్డులో ఉన్నాడో చెప్తే సరిపోయేది. మేం వచ్చేసే వాళ్ళం."

"ఎస్ సర్ అప్పుడది మంచి పథకం అనిపించింది."

"మాకు ఫోన్ చేసాక నువ్వు ఆ కెఫెలోంచి అతనితో పాటు ఎందుకు వెళ్ళావు?"

"అతను హంతకుడని నాకు తెలీనట్లు ప్రవర్తించాను. అప్పుడు అతన్ని పట్టుకోవడం తేలిక అనుకున్నాను. కానీ నేను ఆడిన ఓ అబద్ధాన్ని అతను పసిగట్టాడు."

"ఏం పొరపాటు చేసావు?"

గోలైట్లీ హాల్లో హత్య జరిగిందని చెప్పిన సంగతి వివరించాక చెప్పాడు.

“అతను కూడా ఆవిడ చనిపోయిన టైం విషయంలో ఓ పొరపాటు చేసాడు. దాన్ని అతను కోర్టులో ఒప్పుకునేవాడు కాదు. కానీ అతని ఈల పాటని గుర్తు పట్టిన ఓ సాక్షి ఉన్నాడని చెప్పాక భయపడ్డాడు. "

"కానీ అలాంటి సాక్షులు లేరుగా?” సూపరింటెండెంట్ అడిగాడు.

“అవును. లేరు సర్. ఆ విషయం అతనికి తెలీదు. అతనికి ఆ ఫ్రెంచ్ పాట ఇష్టం. కారులో దాన్నే పాడాడు. నాకు ఈల ఇష్టం ఉండదు. చెడ్డ అలవాటు, అమర్యాద. ఒక్కోసారి కష్టాలని కూడా తెచ్చిపెడుతుంది." గోలైట్లీ చెప్పి నవ్వబోయి గాయం తాలూకు బాధకి మొహం ముడిచాడు.

---

## బ్రిటిష్ రాణి ఆభరణం - జేమ్స్ హోల్డింగ్

తన కాపలా కుక్క డ్యూక్ శవంగా కనబడగానే జేన్ నిర్ఘాంతపోయింది. దాని కోసం వెదికే జేన్ ఫర్క్వర్కి తన హోటల్ వెనక ఎత్తుగా పెరిగిన గడ్డిలో అది కనిపించింది. వెంటనే ఆమెకి దాన్ని ఎందుకు చంపారో అర్థమైంది. బ్రిటిష్ రాణి ఆభరణం కోసం... ఎవరో కూడా అర్థమైంది. ఆర్థర్ కేంప్బెల్!

అది బాధపడి మరణించినట్లుగా బయటకి కనిపించే దాని పళ్ళని చూసి గ్రహించింది. డ్యూక్ విషం వల్ల మరణించిందని కూడా అర్థమైంది. ఆ షాక్ బాధగా, తర్వాత కోపంగా పరిణమించింది. ఆమెకి ఆర్థర్ మీద ఉన్న జీవించి ఉన్న తన ఏకైక బంధువు అనే మమకారం పోయింది. అతను ఆ బ్రిటిష్ రాణి ఆభరణం తప్ప తన నించి ఇంకేమీ ఆశించలేదని కూడా ఆ క్షణంలో అర్థమైంది.

స్వాజిలేండ్ దేశంలో తన కజిన్ జేన్ ఫర్క్వార్ ఉందని తెలిసి ఆర్థర్ కొద్ది రోజుల క్రితం అద్దెకి తీసుకున్న ప్లైమత్ కారులో వచ్చి అప్లేండ్ హోటల్లోని ఆమెని కలిసాడు. తను అమెరికా నించి సౌతాఫ్రికాకి డైమండ్, గోల్డ్ గనులని, వన్య మృగాలని చూడడానికి వచ్చానని చెప్పాడు.

"నా పేరు ఆర్థర్ కేంప్బెల్. నా తల్లి పేరు మేరీ ఫర్క్వార్, ఆమెని నా తండ్రి పెళ్ళి చేసుకున్నాడు. ఓసారి మా అమ్మ నీ గురించి నాకు చెప్పింది. నిన్ను చూద్దామని వచ్చాను. నీ గురించి విచారిస్తే, అప్లేండ్ హోటల్ నీదని, దీని ఆవరణలోని కాటేజ్లో ఉంటున్నావని తెలిసింది." చెప్పాడు.

దాదాపు ముప్పై ఐదేళ్ళున్న ఆ అమెరికన్ బంధువుని జేన్ ఆనందంగా ఆహ్వానించింది.

"అమెరికాలో నాకో కజిన్ ఉన్నాడన్న సంగతే నాకు తెలీదు. మీ అమ్మకి నా గురించి ఎలా తెల్సింది?" అడిగింది.

"రూట్స్ నవల చదివినప్పటి నించి జీనియాలజీ (వంశ వారసుల) సబ్జెక్ట్ మీద మా అమ్మకి బాగా ఆసక్తి ఉండేది. మా అమ్మ పూర్వీకులు ఆఫ్రికా నించి బానిసలుగా తీసుకురాబడ్డారు. అందుకని 'అమెరికన్ జీనియాలజీ క్లబ్లో చేరి మొదటి ఫర్క్వార్ గురించి సిటీ హాల్స్లోని డాక్యుమెంట్స్ని వెదికింది. మనం నలభై రెండవ తరానికి చెందిన కజిన్స్ అని ఆ అన్వేషణతో కనుగొంది."

"అదృష్టం!"

"నిజమే. 1820ల దాకా ఫర్క్వార్ ముగ్గురు సోదరులు కలిసే ఉన్నారు. పెద్దవాడు సౌతాఫ్రికాకి తిరిగి వెళ్ళిపోయాడు. మధ్య వాడు స్కాట్లేండ్కి వెళ్ళాడు. చివరి వాడు అమెరికాలోనే కొనసాగాడు. వందేళ్ళ క్రితం స్కాటిష్ తరం పూర్తిగా నశించిపోయింది. నువ్వు ఆఫ్రికాకి వచ్చిన పెద్ద కొడుకు వారసురాలివి. నేను అమెరికాలో కొనసాగిన సోదరుడి వారసుడ్ని నాకు నిన్ను చూడడం, నువ్వు నన్ను చూడడం కన్నా ఎంతో ఆనందంగా ఉంది." ఆర్థర్ చెప్పాడు.

“ఈ సమాచారం తెలుసుకోవడం నాకు ఆనందంగా ఉంది.”

"మా అమ్మకి మన వంశ చరిత్ర గురించి తెలుసుకునేప్పుడు ఓ విషయం తెల్సింది.” ఆర్థర్ సిగరెట్ వెలిగిస్తూ చెప్పాడు.

“ఏమిటది?” అడిగింది.

"మీ కుటుంబంలోని ఒకరికి వారసత్వంగా వచ్చిన ఓ విలువైన దాని గురించి నేను మాట్లాడేది. మీ నాన్న మీ వంశంలోని పెద్ద కొడుకు యొక్క పెద్ద కొడుకని, అది అతనికి వారసత్వంగా వచ్చిందని మా అమ్మ చెప్పింది. అది బ్రిటిప్రాణి ఆభరణం అని కూడా చెప్పింది. నువ్విప్పుడు దానికి వారసురాలివి అయ్యావని తప్ప ఇంకే వివరం అమ్మకి తెలీదు."

"మాకు వారసత్వంగా వచ్చిన ఓ విలువైంది నా దగ్గర ఉన్న మాట నిజమే." జేన్ నెమ్మదిగా చెప్పింది.

"నాకు దాని గురించి తెలుసుకోవాలని ఉంది.”

జేన్ తన కాపలా కుక్క డ్యూక్ తలమీద మెల్లిగా తట్టి కాళ్ళని సోఫాలోకి ముడుచుకుని చెప్పింది.

“సరే. క్వీన్ ఆఫ్ స్కాట్స్ అయిన మేరీకి చెందినది అది. ఆమె పెళ్ళి రోజు ఆమె మొదటి భర్త ఫ్రాన్సిస్ దాన్ని ఆమెకి బహూకరించాడు."

"మా స్కూల్ చరిత్ర పుస్తకంలో కూడా స్కాట్స్ రాణి మేరీ గురించి ఉంది. ఫ్రాన్సిస్ ఫ్రాన్స్ రాజరికానికి చెందిన వ్యక్తి కదా?" ప్రశ్నించాడు.

“అవును. అతను స్కాట్లేండ్ యువరాణిని పెళ్ళాడాడు."

"ఆ ఆభరణం ఎలా ఉంటుంది?”

"అందంగా ఉంటుంది. ఓ బరువైన బంగారు గొలుసుకి పెండెంట్ అది. ఓ పెద్ద ఎర్రటి కెంపు చుట్టూ వజ్రాలు గుండ్రంగా పొదిగి ఉంటాయి. ఏ వజ్రం బరువూ నాలుగు కేరట్లకి తగ్గదు. ఇవన్నీ పెండెంట్గా బంగారంలో పొదిగి ఉన్నాయి. వజ్రాలు లేత నీలం రంగులో ఉంటాయి. వాటన్నిటి విలువ కెంపు విలువతో సమానం. అంత పెద్ద, అంత గుండ్రటి కెంపు ప్రపంచంలో అదొక్కటేట!"

"ఐతే తప్పకుండా అది అందమైందే. కానీ క్వీన్ మేరీ స్టువార్ట్ నించి ఫర్క్వార్ కుటుంబానికి అది ఎలా వచ్చింది?"

"మేము దాన్ని దొంగతనం చేయలేదు. మేరీ స్వచ్ఛందంగా బహుమతిగా ఇచ్చింది. క్వీన్ ఎలిజబెత్, క్వీన్ మేరీని చంపబోయే ముందు ఆమెని ఇంగ్లండ్లోని ఫాథరింగ్ హే కోటలో ఖైదీగా ఉంచిన సంగతి నీకు తెలిసే ఉంటుంది. ఆ సమయంలో లయోనెల్ ఫర్క్వార్ స్కాట్లాండ్ నించి మేరీ కొడుకు కింగ్ జేమ్స్ది సిక్స్కి సేవకుడుగా వెంట వచ్చాడు."

"కనెక్షన్ అర్థమైంది. కానీ అది నీకు ఎలా లభించింది?"

“ఉరికంబానికి తీసుకెళ్ళేప్పుడు ఆమె తన మెళ్ళోంచి ఆ ఆభరణాన్ని తీసి లయోనెల్ మెళ్ళో వేసి, తన గుర్తుగా ఉంచుకోమని చెప్పింది."

"దాని విలువ ఎంతుంటుంది ఇప్పుడు?” అడిగాడు.

"గత మూడు వందల ఏళ్ళుగా అది మా కుటుంబంలో ఉంది. కాబట్టి నాకది చాలా విలువైనది."

"నేనడిగింది డాలర్స్లో, సెంట్స్లో.” నవ్వాడు.

"ఐదారేళ్ళ క్రితం మా నాన్న దాని విలువ కట్టించినప్పుడు మూడు లక్షల పౌండ్లని తెల్సింది.”

“ఓ! అది ఆ నాటి ఎనభై వేల మంది ఆఫ్రికన్ బానిసల ఖరీదు కన్నా ఎక్కువ!"

"మేము ఆభరణాలని అలాంటి దృష్టితో ఎన్నడూ వెలకట్టం." జెన్ మృదువుగా చెప్పింది.

“డబ్బుని ఎలా అయినా కొలవచ్చు. ఎలా అయినా సంపాదించచ్చు. నేను ఇంటికి వెళ్ళే లోపల ఓసారి ఆ ఆభరణాన్ని నాకు చూపిస్తావా?" అడిగాడు.

"సారీ ఆర్థర్! నేను దాన్ని ఇంగ్లండ్ లోని ఓ బేంక్లో దాచాను. నా దగ్గర లేదు."

"అయ్యో! అంత విలువైన ఆభరణం చూడాలని కోరికగా ఉంది నాకు." ఆర్థర్ చెప్పాడు.

భోజనానంతరం గుడ్ నైట్ చెప్పి, అతను తన హోటల్ గదికి వెళ్ళిపోయాడు. ***

రెండు రాత్రుల తర్వాత అప్లేండ్ హోటల్ యజమానురాలైన ఆమె అర్ధరాత్రి తన ఆఫీస్ గది లోంచి కాటేజ్కి చేరుకుంది. తాళం చెవితో తలుపు తెరిచి లోపలికి వెళ్తే ఎప్పటిలా డ్యూక్ ఎదురు రాలేదు. దాన్ని పేరు పెట్టి మృదువుగా పిలిచింది. తర్వాత చిన్నగా ఈల వేసినా రాలేదు. వెంటనే టార్చి లైట్ తీసుకుని హోటల్ ఆవరణలో వెదికితే డ్యూక్ శవం వెనక గడ్డిలో కనిపించింది. వెంటనే ఆమె వంట గది తలుపు లోంచి హోటల్లోకి ప్రవేశించి ఆర్థర్కి భోజనం సర్వ్ చేసిన ఓ స్వాజీ వెయిటర్ని నిద్ర లేపి అతనితో మాట్లాడింది. ఆర్థర్ ఓ పెద్ద మాంసఖండాన్ని తన ప్లేట్ లోంచి, పేపర్ నేప్కిన్లో చుట్టి తీసుకెళ్ళడం గమనించానని అతను చెప్పాడు. విషం కలిపిన ఆ మాంసాన్ని అతను డ్యూక్ తినే చోట ఉంచాడని జేన్ అర్థం చేసుకుంది.

వెయిటర్కి జరిగింది చెప్పలేదు. అందుకు రెండు కారణాలు. ఒకటి తన ఏకైక కుటుంబ సభ్యుడి మీద ఫిర్యాదు చేయడం అవమానంగా భావించడం. రెండోది, అది తనకి, ఆర్థర్కి మధ్య గల వ్యక్తిగత విషయంగా భావించడం.

ఆమె తిరిగి తన కాటేజ్కి వెళ్ళేసరికి దోమల్ని చంపుతున్న ఆర్థర్ కనిపించాడు.

"డ్యూక్ కనిపించడం లేదు." ఆమె చెప్పింది.

"నేను బ్రిటిష్ రాణి ఆభరణాన్ని చూడాలనుకుని వచ్చాను." అతను కాటేజ్ తలుపు లోపల తాళం వేసి చెప్పాడు.

“ఎందుకు? అడిగింది.

“ఫోటో తీయడానికి. దాన్ని నేను ఓ వ్యాసంతో అమెరికన్ పత్రికకి అమ్మగలను.”

"అది ఇంగ్లండ్లో ఉందని ఇదివరకే చెప్పాను."

“నువ్వు ఇక్కడ ఉండి, అది ఇంగ్లండ్లో ఉందంటే ఎలా నమ్మను? కాపలా కుక్క నీ తలుపుకి మూడు బలమైన తాళాలు. అది లండన్లోని బేంక్లో ఉంటే ఇన్ని జాగ్రత్తలు ఎందుకు? అది ఈ పడక గదిలోనే ఉందని నేననుకుంటున్నాను."

“ఉంటే?”

"నాకు చూపించు.”

“చూపించను.”

"నేను పరాచికాలు ఆడడం లేదు. వెంటనే చూపించు." కఠినంగా చెప్పాడు.

“సరే. డ్యూక్ని అందుకేగా హత్య చేసావు.”

“అది నీకు తెలిసిందా? లేవకు. అది ఎక్కడుందో చెప్పు.” ఆర్థర్ కోరాడు.

"పై డ్రాయర్లోని నీలం రంగు వెల్వెట్ పెట్టెలో.” నిస్పృహగా చెప్పింది.

అతను లేచి వెళ్ళి దాన్ని తీసుకుని జేబు లోంచి వజ్రాలని పరీక్షించే భూతద్దం తీసి కంటికి అమర్చుకుని జాగ్రత్తగా పరీక్షించి కోపంగా చెప్పాడు.

‘‘ఇది నకిలీది. ఒరిజనల్కి కాపీ. అసలుది ఎక్కడుంది?’’

‘‘బయటికి నడు ఆర్థర్. లేదా స్వాజీలు వచ్చి నిన్ను చంపేస్తారు.’’ కోపంగా చెప్పింది.

ఆమె తలుపు దగ్గరికి పరిగెత్తి, ఓ చేతో హేండిల్ని, మరో చేతో బోల్ట్ని పట్టుకుని గట్టిగా అరవడానికి నోరు తెరిచింది. ఏదో బలంగా ఆమె నెత్తి మీద తాకడంతో జేన్కి స్పృహ తప్పింది.

* * *

జెన్కి స్పృహ వచ్చేసరికి చుట్టూ అంతా చీకటి. కుదుపులని బట్టి తను ఓ కదిలే వాహనంలో ఉందని గ్రహించింది. కళ్ళు తెరిచి చూసింది. అది అతని ప్లైమత్ కారు కాదు. ఆమె లేండ్ రోవర్ ఆర్థర్ డ్రైవ్ చేస్తున్నాడు. రోడ్డు మీది దుమ్ములేస్తోంది. తన బ్లౌజ్ చిరిగి పోయిందని, మెళ్ళోని చెయిన్కి వేలాడే తాళం చెవి లేదని గ్రహించింది.

"మెలకువ వచ్చిందా?" అతను ప్రశ్నించాడు.

‘‘మనం ఎక్కడికి వెళ్తున్నాం?" అడిగింది.

‘‘బటౌన్. ఉదయం బేంక్ తెరిచే సమయానికి అక్కడికి చేరుకుంటాం. నీ మెళ్ళోని గొలుసుకి వేలాడే తాళం చెవి, దాని మీది బేంక్ పేరు, లాకర్ నంబర్ని బట్టి గ్రహించాను. బటౌన్ నగరంలోని లాకర్లో బ్రిటిష్ రాణి ఆభరణం దాచావని నువ్వు నాకు చెప్పలేదు. లండన్లో ఉందని అబద్ధం చెప్పావు."

"నువ్వు నన్ను కొట్టకపోతే చెప్పే దాన్నేమో.’’

‘‘సరే. క్షమాపణలు. నువ్వు అరిస్తే నా గతి ఏమయ్యేది?"

‘‘మనం నీ కార్లో వెళ్ళడం లేదే?’’ అడిగింది.

‘‘నీ కార్లో వెళ్తే బేంక్ వాళ్ళకి అనుమానం రాదని."

‘‘నువ్వు నిజంగా నా కజినేనా?" జేన్ అడిగింది.

"జవాబు చెప్పకుండా నిన్ను సస్పెన్స్లో ఉంచుతాను." నవ్వాడు.

"నాకో డ్రింక్ కావాలి." చెప్పి డేష్ బోర్డ్ తెరిచి అందులోంచి బ్రాందీ సీసాని తీసింది.

"నాకూ దాని అవసరం ఉంది."

‘‘నువ్వు నిరాకరించటం లేదు కాబట్టి నా కజిన్ అనే భావిస్తాను. కజిన్స్ ఫస్ట్." చెప్పి బ్రాందీ బాటిల్ ఇచ్చింది.

అతను మూడు గుక్కలు తాగగానే చెప్పింది.

"ఆపు. అది స్ట్రాంగ్ బ్రాందీ.’’

‘‘చేదుగా కూడా ఉంది." చెప్పి బాటిల్ని వెనక్కి ఇచ్చేసాడు.

వెంటనే ఆమె ఆ సీసాకి మూత పెట్టేసింది. అకస్మాత్తుగా కారు వేగం తగ్గింది. ఆర్థర్ మొహాన్ని ఎడం చేత్తో తుడుచుకున్నాడు.

"మోసం." చెప్పి అతను కోటు జేబులో చేతిని ఉంచుకున్నాడు. కానీ తీసిన రివాల్వర్ని సరిగ్గా గురి పెట్టలేకపోయాడు. కొద్ది క్షణాల్లో తల వాల్చేసాడు.

***

ఆర్థర్కి మెలకువ వచ్చి చూసేసరికి ఓ కొండ మీద ఆరుబయట పడి ఉన్నాడు. జేన్ని చూసి అడిగాడు.

"బ్రాందీలో ఏం కలిపావు?''

''అందులో స్లీపింగ్ పిల్స్ కరిగాయి. అదెప్పుడూ నా కార్లో ఉంటుంది."

"దేనికి?'' కొద్దిగా ఆశ్చర్యంగా అడిగాడు.

"నిన్న రాత్రి లాంటి సందర్భం కోసం. మా నాన్న మరణించే ముందు, దొంగల నించి నన్ను ఆ బ్రిటిష్ రాణి ఆభరణాన్ని కాపాడుకోడానికి నాలుగు తేలిక రక్షణలు ఏర్పాటు చేసాడు. ఆఫ్రికాలో వంటరి యువతికి అవి అవసరం."

''ఎలాంటి రక్షణలు?'' ఆర్థర్ అడిగాడు.

"మొదటిది డ్యూక్. దానికేమైనా ఐతే, తలుపుకి మూడు బలమైన తాళాలు. దొంగ అదీ దాటి వస్తే, నిపుణుడు కానీ కనుక్కోలేని నకిలీ ఆభరణం. అది నకిలీదని తెలుసుకుంటే, నా మెళ్ళోని బేంక్ లాకర్ తాళం నన్ను బటౌన్కి తీసుకువెళ్తుంది. బటౌన్లోని బేంక్లో దీన్ని చూపిస్తే, తక్షణం పోలీసుల్ని పిలుస్తారు. ఎందుకంటే, ఆ నంబర్ లాకర్ లేదు. ఆఖరి మెట్టు దాకా చేరుకోకుండా దారిలో మరో రక్షణ అయినా కారులోని బ్రాందీని ఉపయోగించాను." జేన్ వివరించింది.

''నీ రక్షణలో భాగంగా తుపాకీ లేదా?'' అడిగాడు.

''లేదు.''

''ఇక్కడ వేడిగా ఉంది." ఒంటి నిండా చెమట పట్టిన ఆర్థర్ చెప్పాడు.

"నిజానికి నువ్వు ఆఫ్రికాలో ఇప్పుడు భయపడాల్సింది వేడికి కాదు." చేతిని ఆకాశం లోకి చూపిస్తూ చెప్పింది.

అతను కూడా పైకి చూస్తే, రెక్కలు కదల్చకుండా చుట్టూ తిరిగే రెండు పక్షులు కనిపించాయి.

“రాబందులా?” అడిగాడు.

"త్వరలో అవి ఇక్కడికి చేరుకుంటాయి. వాటిని ఆకర్షించడానికి ఇది అవసరం."

డ్యాక్ కళేబరాన్ని అతని పక్కకి లాగింది.

"జేన్! నువ్వు నీ కజిన్కి ఇలా చేయకూడదు.” బతిమాలుతూ కోరాడు.

“నువ్వు నా కజిన్వే కాకపోవచ్చు. మోసగాడివై ఉండచ్చు. ఒక వేళ నువ్వు చెప్పింది నిజమే అయినా నీ కజిన్కి నువ్విచ్చిన గౌరవమే నేను నీకు ఇస్తున్నాను. ఇవాళ రాబందుల గురించిన ఓ థియరీ నిజమో కాదో నువ్వు తెలుసుకోవచ్చు. బతికున్న జీవిని అవి ముట్టవు అని అంటారు. నేను పోలీసులకి ఫోన్ చేస్తాను. వాళ్ళు ఇక్కడికి రావడానికి మూడు గంటలు పడుతుంది. అప్పటికి నువ్వు జీవించే ఉంటే అమెరికా నించి స్వాజిలేండ్కి వచ్చిన దొంగని వారు ఆట్టే గౌరవించరు. బహుశా చంపి వెళ్ళిపోతారు. ఇక్కడంతా ఆటవిక న్యాయం." చెప్పి జేన్ వెనక్కి తిరిగింది.

ఆర్థర్ చేతులకి, కాళ్ళకి వెనక్కి విరిచి కట్టిన ఇనుప వైర్ని తెంచే ప్రయత్నం చేస్తే అది శరీరంలో గుచ్చుకుని రక్తం కారసాగింది.

"ప్లీజ్ జేన్! నన్ను ఒంటరిగా ఇలా వదిలి వెళ్ళకు." పైన గుండ్రంగా తిరిగే దాదాపు డజను పక్షులని చూసి బతిమాలుతూ కోరాడు.

"నీలాంటి వాళ్ళని నా హోటల్లో ఉంచడం పరపతి కాదు. బై డ్యాక్ గుడ్ బై కజిన్." చెప్పి జేన్ కొండ మీంచి కిందకి నడవసాగింది.

---

## అనుకోని సాక్ష్యం - రాయ్ వికర్స్

**ఇంగ్లండ్ లోని శాలోస్పాత్. 1916.**

లాయర్ హెన్రీ ఓ కవర్ని చింపి ఉత్తరం చదివి తన చెల్లెలు మార్జరీతో చెప్పాడు.

"మిస్ విల్కిన్సన్ ఇటు వైపు వస్తోందిట. మన ఇంటికి వస్తుందిట. తొమ్మిదేళ్ళ తర్వాత ఆవిడ రావడం చిత్రంగానే ఉంది."

* * *

"మీ అన్నయ్య మేయర్గా ఎన్నికైనందుకు మీరు ఆనందంగా ఉన్నారనుకుంటాను మిస్ మార్జరీ." మర్నాడు వచ్చిన మిస్ విల్కిన్సన్ మార్జరీని అడిగింది.

“అవును." ఆమె జవాబు చెప్పింది.

"కానీ బాధ్యతలు నన్ను భయపెడుతున్నాయి." విల్కిన్సన్కి విస్కీ గ్లాస్ని ఇస్తూ చెప్పాడు హెన్రీ.

“మీ కొత్త బాధ్యతలతో మీరు కొన్ని పాత బాధ్యతలని వదిలించుకోవాలి." ఆమె చెప్పింది.

“లేదు. ఇదివరకటిలాగే నా క్లయింట్స్ అవసరాలని తీరుస్తూంటాను.”

"కానీ మీకు నా పనిని తగ్గించదల్చుకున్నాను."

"మీకు ఏదైనా అసంతృప్తి ఉందా?" హెన్రీ అడిగాడు.

"అలాంటిదేం లేదు. కాని మన చక్రవర్తి తన ఫేక్టరీని విస్తరింపచేయమని నా సోదరుడికి చెప్పాడు. అందువల్ల నా తమ్ముడికి డబ్బవసరం ఏర్పడింది. నా డబ్బుని ఆరు నెలల్లో రెట్టింపు చేస్తానన్నాడు. అతని అక్కయ్యగా అతనికి సహాయం చేయడం నా బాధ్యత కదా?”

"అది నిజమే. కానీ మీ షేర్లని వాటి అసలు ధరకి ఈ రోజు అమ్మలేం. బహుశా సగానికి కూడా అమ్ముడుపోవు." హెన్రీ చెప్పాడు.

‘‘కావచ్చు. కానీ ఆరు నెలల్లో అది రెట్టింపు అయ్యేట్లయితే అప్పుడు నాకు నష్టం ఉండదు. ఆ తర్వాత అంతా లాభమే. ప్రపంచ యుద్ధం అంత కాలం కొనసాగుతుందనే అనుకుంటున్నాను."

"కానీ కొనసాగకపోతే అది పెద్ద సాహసమే అవుతుంది."

"నేనా సాహసం చేయదల్చుకున్నాను." మిస్ విల్కిన్సన్ చెప్పింది.

‘‘బహుశా మీది మంచి ఆలోచన అనుకుంటాను." హెన్రీ ఆలోచనగా చెప్పాడు.

* * *

తెల్లవారురఝామున హెన్రీ నది ఒడ్డున మనిషి పట్టే ఓ గోతిని తవ్వాడు. అక్కడి నించి సరాసరి మిస్ విల్కిన్సన్ గదిలోకి వెళ్ళి స్కార్ఫ్ని తీసి ఆమె గొంతు చుట్టూ బిగించి చంపాడు. తర్వాత శవాన్ని భుజం మీద వేసుకుని తీసుకువెళ్ళి గోతిలో పడేసి మట్టి వేసి పూడ్చాడు. దాన్ని ఎవరూ తవ్వకుండా పైన ఓ పెద్ద రాతిని ఉంచాడు.

మర్నాడు ఉదయం రెండు గుర్రాల జట్కా బండి అతని ఇంటి ముందుకి వచ్చి ఆగింది. మిస్ విల్కిన్సన్ దుస్తులని ధరించి, మొహానికి స్కార్ఫ్ని చుట్టుకుని, టోపీ పెట్టుకున్న హెన్రీ చేతిలో సూట్ కేస్తో బండి దగ్గరకి వెళ్ళాడు.

‘‘గుడ్ మార్నింగ్ మేడమ్.’’ బండివాడు విష్ చేసాడు. స్టేషన్కి చేరుకున్నాక బండి దిగి రైల్వేస్టేషన్లోకి నడిచాడు. టి సి అతనిచ్చిన టిక్కెట్ని తీసుకుని చెప్పాడు.

"ప్లెజంట్ జర్నీ మేడం."

రైలు బయలుదేరాక హెన్రీ బాత్ రూంలోకి వెళ్ళి తలుపు మూసి, పెట్టెలోంచి ఆవిడ వస్తువులన్నీ తీసి ఓ దళసరి బట్టలో వేసాడు. ఆవిడ దుస్తులని విప్పాడు. లోపల అతని దుస్తులు ఉన్నాయి. విప్పిన బట్టలని కూడా అందులో వేసి మూట కట్టి కిటికీ అద్దం దింపి బయటికి విసిరేసాడు.

బాత్రూమ్లోంచి బయటకి వచ్చి తన పక్కనించి వెళ్ళే ఒకతన్ని పలకరించాడు. ‘‘గుడ్మార్నింగ్ మిస్టర్ బార్క్లే."

‘‘గుడ్మార్నింగ్ ఇవాళ మీరు త్వరగా వచ్చారే?’’ అతను పలకరించాడు.

‘‘అవును. నా క్లయింట్ ఒకామె ఫస్ట్ క్లాస్లో ప్రయాణం చేస్తోంది. రాత్రి మా ఇంట్లో బస చేసింది. లండన్కి వెళ్తోంది. నేను లిటిల్ మీడ్ దాకా వెళ్తున్నాను."

"నిజానికి నేనే మీ దగ్గరికి వద్దాం అనుకుంటున్నాను. మీతో ఓ నిమిషం మాట్లాడచ్చా?’’

‘‘అలాగే.’’

ఇద్దరూ ఓ చోట కూర్చున్నారు. తనకి ఓ సాక్షి దొరికాడని హెన్రీ సంతోషించాడు.

* * *

"హెన్రీ! సాధారణంగా మేము నీ మీద అనుమానపడాల్సి ఉంటుంది. ఒకావిడ తన లాయర్ దగ్గరికి వచ్చి అతని దగ్గర దాచిన డబ్బుని తీసుకోవాలనుకుంది. తర్వాత మాయమైంది. దీని గురించి నువ్వేమంటావు?’’ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ ఛార్లెస్ ప్రశ్నించాడు.

‘‘ఛార్లెస్! ఇన్ని సంవత్సరాలుగా నేను నీకు తెలుసు. ఐనా నీ వృత్తే అదిలే నన్ను అనుమానించే పక్షంలో సాక్ష్యం ఏది?" హెన్రీ బాధ నటిస్తూ అడిగాడు.

"నిజమే. గుర్రబ్బండి వాడు, టిసి, పోర్టర్ అంతా మిస్ విల్కిన్సన్ రైల్లో ఎక్కిందని సాక్ష్యం చెప్పారు. కాబట్టి నీ మీద అనుమానం లేదు. కానీ రైలెక్కాక మిస్ విల్కిన్సన్ ఎలా మాయమైంది? ఆవిడ జీవించి ఉండగా ఆఖరుగా చూసింది నువ్వే ఈ విషయంలో నువ్వేమైనా సమాచారం ఇవ్వగలవా?''

"లిటిల్ మీడ్ దాకా నేనావిడతో కలిసి ప్రయాణించాను. అంతకుమించి నాకు తెలీదు...''

''ఓ! లిటిల్ మీడ్కి ఆవిడతో కలిసి వెళ్ళావా?'' ఛార్లెస్ ప్రశ్నించాడు.

''అవును. మెక్ట్రాన్ స్టేషన్లో ఎక్కిన బార్కే అనే క్లెయింట్ నాకు కారిడార్లో తారసపడ్డాడు. తర్వాత లిటిల్ మీడ్ దాకా విల్కిన్సన్తో కలిసే వెళ్ళాను."

''ఆవిడ కాక ఆ కేబిన్లో ఇంకెవరైనా ఉన్నారా?''

''లేదు. మేమిద్దరమే ఉన్నాం."

"స్టేషన్ దాకా ఆవిడతో నువ్వు కలిసి బండిలో వెళ్ళలేదా?:

''లేదు.''

"మీ ఇంటి నించి బయలుదేరిన బండిలో నువ్వు వెళ్ళకపోవడం చిత్రంగా లేదూ?''

తగిన అబద్ధం చెప్పడానికి హెన్రీ కొంత సమయం తీసుకున్నాడు.

''అవును. ఇది నువ్వు రహస్యంగా ఉంచాలి. ఉదయం ఆరుకి ఇంకా చీకటిగానే ఉంది. ఆవిడ నన్ను చూసి నవ్వడం. అలాంటివి చాలా చేసింది.అవివాహితైన ఆవిడతో కలిసి గుర్రబ్బండిలో వెళ్ళదల్చుకోక నడిచి వెళ్ళాను."

"మిస్ విల్కిన్సన్ ఏదైనా ఇబ్బందిలో ఉందని నీకు అనిపించిందా?''

‘‘లేదు.’’

"నీకు ఏ చిన్న విషయం గుర్తొచ్చినా నాకు చెప్పడం మర్చిపోవద్దు."

‘‘అలాగే ఛార్లెస్.’’

తన ఆఫీస్ గదిలోంచి బయటికి వెళ్ళే ఛార్లెస్తో హెన్రీ చెప్పాడు.

‘‘ఆమె తమ్ముడి ఫేక్టరీలో డబ్బు పెట్టుబడి పెట్టొద్దని మేము ఓ నిర్ణయం కూడా తీసుకున్నాం.’’

‘‘అలాగా?" ఛార్లెస్ ఆలోచనగా చెప్పాడు.

* * *

బయట బాగా వర్షం పడుతోంది.

"నది ఆరేడు అడుగులు పైకి వచ్చి ఉండచ్చు. వర్షం తగ్గకపోతే రేపటి కార్యక్రమాన్ని వాయిదా వేయాల్సి రావచ్చు. కల్నల్ సర్ ఫ్రాన్సిస్ వస్తున్నాడు. రోల్ ఆఫ్ ఆనర్ని ఇంట్లో నాలుగు గోడల మధ్య చేయకూడదు.’’ హెన్రీ కిటికీలోంచి పడే వానని చూసి తన చెల్లెలు మార్జరీతో చెప్పాడు.

అతను భయపడ్డట్లే మర్నాడు వర్షం తగ్గలేదు. గొడుగులు వేసుకుని హాజరైన వారి ముందు మేయర్ హెన్రీ చెప్పాడు.

"...కాబట్టి ధైర్యవంతులైన స్పాలోస్పాత్ సైనికుల త్యాగాన్ని పురస్కరించుకుని వారి పేర్లు గల ఈ రోల్ ఆఫ్ ఆనర్ని వారికి అంకితం ఇస్తున్నాను."

అతని పక్కనే ఉన్న స్థూపం మీద యుద్ధంలో మరణించిన ఆ ఊరికి చెందిన ఏడుగురి పేర్లు చెక్కి ఉన్నాయి.

‘‘ఆ యుద్ధంలో వీరితో పాటు పాల్గొన్న ఓ వ్యక్తి మన మధ్య ఉండటం మన అదృష్టం. వారిని ఇప్పుడు మాట్లాడాల్సిందిగా కోరుతున్నాను. ఆ వ్యక్తి...."

‘‘అటు చూడండి...." ఓ మగ కంఠం గట్టిగా వినిపించింది.

‘‘చూడండి.’’ ఈసారి ఎక్కువ కంఠాలు వినిపించాయి.

హెన్రీ తల తిప్పి చూస్తే కొందరు నది వంతెన మీద నిలబడి నదిలో కొట్టుకు వచ్చే దేన్నో చూపించడం కనిపించింది.

‘‘మనందరికీ ఆయన ధైర్యసాహసాల వల్ల ఆ వ్యక్తి తెలుసు. ఆయన కల్నల్ సర్ ఫ్రాన్సిస్."

‘‘శవం. శవం. అది శవం." అన్న కంఠాలు వినిపించాయి.

హెన్రీ చూస్తే బ్రిడ్జి మీది వారంతా నదిలోకి చూస్తున్నారు. అక్కడ నిలబడ్డ వారంతా ఆసక్తిగా అక్కడికి వెళ్ళారు.

హెన్రీ కూడా కల్నల్తోపాటు వెళ్ళి చూస్తే ఓ శవం నీళ్ళల్లో కొట్టుకు వస్తూ కన్పించింది.

"మగాడు... కాదు. ఆడది." ఓ వ్యక్తి అరిచాడు.

* * *

"హెన్రీ! ఆ శవం విల్కిన్సన్దై ఉండచ్చని నాకు అనిపిస్తోంది." ఛార్లెస్ చెప్పాడు.

"కాకపోవచ్చు. ఆవిడ మళ్ళీ తిరిగి వచ్చిందని నేను అనుకోను."

"నువ్వు చెప్పింది నిజమే. కానీ డాక్టర్ ఆమె మరణించిన సమయాన్ని అంచనా వేసాక అది ఆవిడ శవమే అని నాకు అనిపిస్తోంది. కాబట్టి నువ్వు వచ్చి ఆ శవాన్ని గుర్తుపట్టాలి." గంట తర్వాత హెన్రీ ఇంటికి వచ్చిన ఛార్లెస్ కోరాడు.

“లేదు. రాలేను. అలాంటి శవాన్ని నేను చూడలేను."

"కాని ఆమె విల్కిన్సన్ కాదని రూఢి కావాల్సి ఉంది."

“సరే." హెన్రీ అయిష్టంగానే ఒప్పుకున్నాడు.

ఇద్దరూ వెంటనే కారులో మార్చురీకి చేరుకున్నారు. అక్కడ శవం మీది తెల్ల దుప్పటిని ఛార్లెస్ తొలగించినా, హెన్రీ దాని వంక చూడకుండా కళ్ళు మూసుకున్నాడు. తర్వాత చెప్పాడు.

“ఆవిడ కాదు.”

"థాంక్స్. హెన్రీ రూఢి చేసుకోవాలి కదా?”

* * *

ఆ సాయంత్రం ఇంటి బయట గులాబీలని కోస్తున్న హెన్రీ దగ్గరికి ఛార్లెస్ వచ్చి చెప్పాడు.

“గుడాఫ్టర్నూన్ హెన్రీ. మీ చెల్లెలుందా?”

"ఇవాళ మధ్యాహ్నం ఆ శవం.... బాగా షాకైంది."

"నేను నిజానికి ఆమె కోసమే వచ్చాను. వచ్చి ఆ శవాన్ని చూడమని కోరడానికి."

"ప్రశ్నే లేదు. అది చాలా కష్టమైన పని. మార్జరీ కంటే మిస్ విల్కిన్సన్ నాకు బాగా తెలుసు. అది ఆవిడది కాదని ఇప్పటికే చెప్పేసాను.”

"హెన్రీ! నువ్వు ఆమె మొహం చూసినప్పుడు ఏదైనా వింతగా కనిపించిందా?"

"లేదే."

"నువ్వు కళ్ళు మూసుకునే ఉండటం నేను గమనించలేదు అనుకోకు. ఇది చాలామంది చేసే పనే. ఉదాహరణకి ఓ హంతకుడు తను చంపిన వ్యక్తిని చూడాల్సి వచ్చినప్పుడు ఇలా చేస్తూంటాడు."

"అది ఘోరమైన నింద. నేను శవాన్ని చూడలేనని ఇప్పటికే చెప్పాను." హెన్రీ కోపంగా చెప్పాడు.

"అందువల్ల నువ్వు ఆ శవం మిస్ విల్కిన్సన్ది కాదు అని చెప్పడం నిరుపయోగమైంది. కాబట్టి మీ చెల్లెల్ని తీసుకెళ్ళడానికి వచ్చాను."

హెన్రీకి ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఇప్పటికే తనని అనుమానిస్తున్న మార్జరీ శవాన్ని గుర్తు పడితే దాన్ని నిర్ధారణ చేసుకుంటుందని అతనికి తెలుసు.

"సారీ ఛార్లెస్. ఇందులోకి ఆమెని లాగద్దు. ఆమె నాకన్నా బలహీనురాలు."

"హెన్రీ! నువ్విలా మాట్లాడితే ఆమె శవాన్ని గుర్తు పట్టేందుకు తగిన చట్టపరమైన చర్యలని తీసుకోవాల్సి ఉంటుంది." ఛార్లెస్ గట్టిగా చెప్పాడు.

"నీ పరిశోధనతో ఆమెని హింసించకు. లేదా సహ నేరస్థురాలిగా చూడకు. నేను మాత్రమే..." హెన్రీ చెప్పడం ఆపేసాడు.

తర్వాత నెమ్మదిగా "మిస్ విల్కిన్సన్ని నేనే చంపాను" అని చెప్పి కూలబడ్డాడు.

"డబ్బు కోసమేనా?" ఛార్లెస్ అడిగాడు.

“అవును. ఆవిడ పేర్లని కొట్టేసాను."

ఫోన్ మోగింది. హెన్రీ వెళ్ళి రిసీవర్ అందుకుని విని చెప్పాడు.

“చార్లీ! నీకే.”

ఛార్లెస్ రిసీవర్ అందుకుని మాట్లాడాడు.

“ఏమిటి?.... అది నిజమేనా? సరే. థాంక్స్." రిసీవర్ పెట్టేసి హెన్రీని అడిగాడు.

“మిస్ విల్కిన్సన్ని చంపేసాక శవాన్ని ఏం చేసావు?"

"నది పక్కన పాతిపెట్టి పైన పెద్ద రాతిని ఉంచాను. ఐనా అది ఎలా బయటికి వచ్చిందో అర్థం కావటం లేదు.”

“మనం ఇప్పుడు అక్కడికి వెళ్ళి చూద్దాం."

ఇద్దరూ అక్కడికి చేరుకున్నాక హెన్రీ ఆ రాతిని చూపించాడు.

“దీని కిందే.”

దాని కింద మిస్ విల్కిన్సన్ శవం ఉంది!

"మిస్ విల్కిన్సన్ తమ్ముడు లండన్ నించి ఇక్కడికి వచ్చి మార్చురీలోని శవాన్ని చూసాడు. ఆ శవం ఖచ్చితంగా తన అక్క మిస్ విల్కిన్సన్ది కాదని చెప్పాడు. నీ ఇంటికి వచ్చిన ఫోన్ అదే.” ఛార్లెస్ చెప్పాడు.

---

## వారసురాలు - పీటర్ లవ్సే

విమానంలో పక్కపక్క సీట్లలో ప్రయాణించే వారిద్దరి మధ్య మాటలు కలిసాయి.

"డాక్టర్ నేను ఏ క్షణంలోనైనా పోవచ్చని చెప్పారు. ఆర్నెల్లు, లేదా ఆరేళ్ళు. నా వయసెంతో తెలుసా? నలభై రెండు. అది తెలియగానే నా ప్రయారిటీలు మారాయి. ఇంగ్లండ్కి వెళ్ళి నా బంధువులు ఎవరైనా ఉన్నారా అని తెలుసుకోవడం నా మొదటి ప్రయారిటీ అయింది." అతను చెప్పాడు.

"నా పేరు ఈవా. నేను నివశించేది ఇంగ్లండ్లోనే. కేలిఫోర్నియాకి శెలవులు గడపడానికి వెళ్ళి తిరిగి ఇంటికి వెళ్తున్నాను." ఈవా అతనికి చెప్పింది.

"కేలిఫోర్నియాలో నేను పని చేసే కంపెనీ మైక్రో కంప్యూటర్స్లో తాజా అభివృద్ధి గురించి తెలుసుకోడానికి నన్ను సిలికాన్ వేలీకి పంపింది. ట్రైనింగ్ తర్వాత లండన్, పేరిస్లలో ఒకటి పోస్టింగ్కి ఎంచుకోమంటే, లండన్ సెలక్ట్ చేసుకున్నాను."

"మీరు లండన్ నే ఎందుకు ఎంచుకున్నారు?" ఆమె అడిగింది.

"నా భార్య పేటీ మూడేళ్ళ క్రితమే మరణించింది. మాకు పిల్లలు లేకపోవడంతో నాకో స్వంత కుటుంబం అంటూ లేకుండా పోయింది. నా అనాథ శరణాలయం రికార్డ్స్ ప్రకారం నా తాత జాన్ 1868లో ఇంగ్లండ్లోని డోర్సెట్ సమీపంలోని ఎడ్జ్కోంట్ అనే గ్రామంలో పుట్టాడు. ఆయనకి ముగ్గురు సోదరులు. మేథ్యూ, మార్క్, లూక్ నా కజిన్స్ ఇంగ్లండ్లోనే జీవిస్తూండాలి. వాళ్ళని కలిసి కొన్ని వంశపారంపర్య వ్యాధుల గురించి తెలుసుకోవాలని వస్తున్నాను. అంతే కాదు. నా ఆరోగ్యం బాగాలేదు కాబట్టి నా తదనంతరం నా ఆస్థి వారికి ఇవ్వాలని అనుకుని కూడా ఈ ప్రయాణం పెట్టుకున్నాను."

"మీ పేరు చెప్పనేలేదు?" ఈవా అడిగింది.

“స్మిత్ హగ్స్. నేను నా పూర్వీకుల గురించి ఎంక్వయిరీ చేయడం విషయంలో మీరు ఏదైనా సలహా ఇవ్వగలరా?" స్మిత్ ఆమెని అభ్యర్థించాడు.

"లండన్లోని కింగ్స్వేలో సోమర్సెట్ హౌస్ ఉంది. అందులో చాలా గ్రామాల జనన, మరణ రికార్డుల నకళ్ళు ఉంటాయి. మీరు అక్కడ ప్రయత్నించండి. అక్కడ దొరక్కపోతే అప్పుడు ఎడ్జ్కోంబ్కి వెళ్ళచ్చు." ఈవా కొద్ది క్షణాలు ఆలోచించి చెప్పింది.

* * *

ఆ రాత్రి ఈవా చెప్పింది విని ఆమె రూం మేట్ జానెట్ ఉత్సాహంగా చెప్పింది.

“కాలిఫోర్నియాలో రెండు ద్రాక్షతోటలు, స్వంత బంగళా, అనేక కంపెనీల్లో షేర్లు... నువ్వు చెప్పిందాన్ని బట్టి నేను అతని కజిన్ని అయితే బావుండును అనిపిస్తోంది. అప్పుడు అదంతా నాదవుతుంది అని ఆశగా ఉంది."

“అతను తన తాత, ఆయన సోదరుల వంశ వృక్షాన్ని ట్రేస్ చేసి వారి వారసులని కనుక్కునే ప్రయత్నంలో ఉన్నాడు. అతని వారసుల్ని ఆ అదృష్టం వరిస్తుంది." ఈవా ఆమెని నిరుత్సాహపరుస్తూ చెప్పింది.

"స్మిత్ కజిన్ చివరి పేరు హగ్స్ అయి ఉంటుంది. ఎడ్జ్కోంబ్ రికార్డుల్లో వారి వివరాలు తప్పక ఉంటాయి. కాబట్టి అతను వారిని కలుసుకోవడం తేలిక. ఎందుకంటే 1868 ఎడ్జ్కోంబ్లో ఎక్కువ మంది హగ్స్ ఉంటారనుకోను... నాకో ఆలోచన వచ్చింది. నేను ఎడ్జ్కోంబ్కి వెళ్ళి నా ప్రయత్నం నేను చేస్తాను. నేను అతనికి వారసురాలినైతే నీకేమైనా అభ్యంతరమా?" జానెట్ అడిగింది.

"కాని నువ్వు హగ్స్ కుటుంబానికి చెందిన దానివి కాదు కదా?”

“నిజమే. కాని దానికో పథకం ఉంది." జానెట్ నవ్వుతూ చెప్పింది.

"జాగ్రత్త!" ఈవా తన రూం మేటిని హెచ్చరించింది.

* * *

లండన్ నగరంలోని సోమర్సెట్ హౌస్లో, జనరల్ రిజిస్టర్ ఆఫీస్లోని నిలువెత్తు షెల్ఫ్ ల్లో విషయ సూచిక పుస్తకాలు వందల కొద్దీ ఉన్నాయి. కొందరు బల్లల ముందు కూర్చుని వాటిని శ్రద్ధగా తిరగేస్తున్నారు.

మర్నాడు ఉదయం జానెట్ ఆఫీస్కి వెళ్ళకుండా తనకి ఒంట్లో బాగాలేదని ఫోన్లో అబద్ధం చెప్పి, సోమర్సెట్ హౌస్కి ఉదయం తొమ్మిదీ అయిదుకి చేరుకుంది. లోపల అన్ని గదులని కలయ తిరుగుతూ స్మిత్ హగ్స్ కోసం వెదికింది. ఈవా చెప్పిన వర్ణనని బట్టి జానెట్ స్మిత్ని తేలిగ్గా గుర్తించింది. అతని ముందు 1868 విషయ సూచిక పుస్తకం ఉంది. ఆమె అతనికి దూరంగా కూర్చుని అతన్నే గమనించ సాగింది. గత పది నిమిషాలుగా అతను తలెత్తకుండా దాన్ని ఒక్కో పేజీ తిప్పుతూ చదువుతున్నాడు. అతని పక్కన సీట్ ఖాళీ అవగానే జానెట్ అక్కడ కూర్చుని తనతో తెచ్చిన విషయ సూచిక పుస్తకాన్ని తెరిచింది. అతను తన వంక చూడగానే అడిగింది.

"ఎక్స్క్యూజ్ మి. మీరు చూసేది 1868 వాల్యూం కదా?" అడిగింది.

‘‘అవును."

‘‘అందులో యం-ఎన్ పేర్లు ఉన్నాయా?’’

‘‘ఉన్నాయి."

"మీ పనయ్యాక ఆ పుస్తకం దయచేసి నాకు ఇస్తారా?"

‘‘అలాగే ఏ పేరు కోసం వెదుకుతున్నారు?" స్మిత్ ఆసక్తిగా అడిగాడు.

నేను ఎడ్జ్కోంబ్లోని మా తాత మార్క్ గురించిన వివరాల కోసం వచ్చాను.'' జానెట్ చెప్పింది.

''అతను ఏ సంవత్సరంలో పుట్టాడో తెలిస్తే మీ పని సులభం అవుతుంది. అతని ఇంటి పేరు తెలిస్తే పని ఇంకా సులభం అవుతుంది." స్మిత్ చెప్పాడు.

''1867 లేదా 68లో, ఎడ్జ్కోంబ్లో అతని ఇంటి పేరు హాగ్స్"

స్మిత్ మొహంలో కొద్ది క్షణాలు విస్మయం చోటు చేసుకుంది.

''వారి తండ్రి పేరు? సిస్టర్స్, బ్రదర్స్ పేర్లు తెలుసా?'' వెంటనే అడిగాడు.

''సిస్టర్స్ లేరు. పెద్దన్నయ్య జాన్ హాగ్స్, మిగిలిన సోదరుల పేర్లు మేథ్యూ, లూక్.''

అతని మొహంలోని విస్మయం రెట్టింపైంది.

"వాళ్ళు ఏం చేసేవారు?''

''నలుగురు వడ్రంగం పని చేసేవాళ్ళు''

''ఓ! మీ పేరు?''

''నా పేరు జానెట్.''

వెంటనే అతను తన చేతిని చాపి ఆనందంగా చెప్పాడు.

"హౌ ఆర్ యు మై కజిన్ జానెట్ హాగ్స్?''

* * *

జానెట్ని అతను అరగంట తర్వాత విగ్ అండ్ పెన్కి తీసుకెళ్ళాడు. అక్కడ జానెట్కి కొత్త దుస్తులని కొన్నాక అక్కడ నించి లంచ్కి తీసుకెళ్ళాడు. మధ్యాహ్నం పన్నెండున్నరకి భోజనం

చేస్తూ తన అమెరికా నించి ఇంగ్లండ్కి ఎందుకు వచ్చాడో ఈవాకి చెప్పిన విషయాలే జానెట్కీ చెప్పాడు.

"అంతా బానే ఉంది. ఐనా ఓ సారి మనం ఓ సారి ఎడ్జ్కోంబ్కి వెళ్ళి మనం ఇద్దరం కజిన్స్ అన్న సంగతి నిర్ధారణ చేసుకుందాం." సూచించాడు.

‘‘వచ్చే మూడు రోజులు నాకు కుదరదు. పై గురువారం నేను ఫ్రీ." జానెట్ చెప్పింది.

జానెట్, స్మిత్ ఎడ్జ్కోంబ్లోని బాప్టిస్ట్ చర్చి ముందు కారులోంచి దిగారు. స్మిత్ లోపలకి వెళ్ళి పాస్టర్తో తను వచ్చిన కారణం చెప్పాడు.

‘‘ఈ గ్రామంలోని పిల్లల్ని బాప్టైజ్ చేసిన రికార్డులు మా చర్చిలో ఉన్నాయి. మార్క్ సంతానం రికార్డు కూడా ఉండాలి. చూస్తాను."

అతను ఓ పెద్ద పుస్తకాన్ని తీసి చాలాసేపు పరిశీలించి ఆ వివరాలు ఉన్న పేజీని స్మిత్కి చూపించాడు. మార్క్కి ముగ్గురు పిల్లలు. ఇద్దరు బాల్యంలోనే మరణించినట్లు నమోదై ఉంది. మిగిలిన కొడుకు రూథర్ఫర్డ్, అతని కూతురు జానెట్ హాగ్స్లకి అక్కడే బాప్టైజ్ అయినట్లుగా నమోదైంది. మార్క్ మిగిలిన ఇద్దరు సోదరులు అవివాహితులుగానే హత్యా నేరం మీద ఉరి తీయబడి మరణించారు. ఆ చర్చి ఆవరణలోనే వారిని సమాధి చేసారు.

వెంటనే స్మిత్ జానెట్ వంక తిరిగి చెప్పాడు.

"నా బంధువుల్లో నువ్వు ఒక్క దానివే మిగిలి ఉన్నావు."

అతను చూడకుండా జానెట్ ఆ చర్చ్లో రికార్డులని మెయిన్టైయిన్ చేసే క్లర్క్కి అందించిన కవర్లో వెయ్యి పౌన్లు ఉన్నాయి.

* * *

పదిహేను రోజులైనా తన రూం మేట్ ఎడ్జ్కోంబ్ నించి తిరిగి రాకపోవడంతో ఈవా ఆందోళన చెందసాగింది. స్మిత్ని ఆమె అలా మోసం చేయడం ఈవాకి నచ్చలేదు. ఐతే వెళ్ళి ఉంటే, తనకి ఫోన్ చేసేది కదా? పోలీసులకి జానెట్ కనపడటం లేదని రిపోర్ట్ ఇచ్చి జరిగింది మొత్తం వివరించింది.

వారం తర్వాత ఎడ్జ్కోంబ్ నించి తిరిగి వచ్చిన పోలీస్ ఆఫీసర్ ఈవాకి ఫోన్ చేస్తే వెళ్ళి అతన్ని కలిసింది.

‘‘మీకో దుర్వార్త, స్మిత్ కుటుంబ సభ్యులు అందరికీ మానసిక ఉన్మాదం ఉంది. ఆ ఉన్మాదంలో హత్యలు చేసిన ఇద్దరు సోదరులని ఉరి తీసారు. తన భార్యని, కూతుర్ని చంపిన మార్క్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది జీన్స్ ద్వారా వచ్చే పిచ్చి, స్మిత్ హగ్స్కి కూడా ఆ ఉన్మాదం ఉందని తెలిసింది. కేలిఫోర్నియాలో తన ముప్పై రెండో ఏట తన

భార్య హత్యానేరంలో అతను ప్రశ్నించబడ్డాడు. కాని సాక్ష్యాధారాలు లేక వదిలేసారు. మూడు వారాల క్రితం మళ్ళీ అక్కడ ఒకర్ని చంపి, తన వంశపారంపర్య పిచ్చి నిజమో, కాదో అన్వేషించడానికి ఇంగ్లండ్ వచ్చాడని తెలిసింది. జానెట్ని స్మిత్ పక్కన ఆఖరిసారిగా ఓ చర్చిలో వికార్ చూసాడు. ఆ తర్వాత వారిద్దరూ ఏమయ్యారో తెలీదు. జానెట్ వయసు ఇరవై రెండా?’’

‘‘అవును."

‘‘తలలేని ఆ వయసు గల ఓ స్త్రీ మొండెం ఎడ్జ్కోంబ్ పోలీసులకి దొరికింది. ఆమె హత్య జరిగిన మర్నాడే స్మిత్ తిరిగి అమెరికా వెళ్ళిపోయాడని ఏర్పోర్ట్ రికార్డ్లని బట్టి తెలిసింది." ఆ పోలీస్ ఆఫీసర్ చెప్పాడు.

---

## ఐదో హత్య - థియోడర్ పంటన్

మొదటి హతురాలు శ్రీమతి బెంటన్ శుక్రవారం రాత్రి సింఫనీ థియేటర్ నించి తన ఇంటికి వస్తూంటే, ఆమె ఇంటికి వంద గజాల దూరంలో పొడిచి చంపబడింది.

ఐదు వారాల తర్వాత రెండో హతురాలు శ్రీమతి ఫోర్టెస్క్యూ క్లబ్ నించి ఇంటికి వస్తూంటే, రాత్రి పది పదిన్నరకి పొడిచి చంపబడింది.

ఈ రెండు హత్యలకి సాక్షులు లేరు. కానీ క్రితం రోజు జరిగిన మూడో హత్యలో ఓ సాక్షి ఉన్నాడు. శ్రీమతి స్మిత్ క్రిస్టియన్ సైన్స్ మీటింగ్కి హాజరై రాత్రి తొమ్మిదిన్నరకి ఇంటికి తిరిగి వస్తూ పొడిచి చంపబడింది. వీధి దీపం పొగ మంచు వల్ల డిమ్గా వెలుగుతోంది. నల్లటి ఓవర్ కోట్ వేసుకున్న ఓ మధ్య వయస్కుడు ఎడమ చేత్తో టోపీ పడిపోకుండా పట్టుకుని పరిగెత్తడం తను చూసానని స్మిత్ ఇంటి ఎదురుగా ఉన్న ఓ వ్యక్తి పోలీసులకి చెప్పాడు.

ఐతే అతని మొహం టోపీ వల్ల స్పష్టంగా కనపడలేదు. మధ్య వయస్కుడైన అతని ఎత్తు ఐదున్నర అడుగులు ఉండచ్చని, సన్నగా ఉన్నాడని మాత్రమే ఆ సాక్షి చెప్పగలిగాడు.

* * *

బేంక్కి వచ్చిన కస్టమర్స్లో ఒకరైన క్రాష్షా అంటే ఆలివర్కి అయిష్టం. తెల్లటి జుట్టు, నీలం రంగు కళ్ళతో అతను తరచూ ఇతరుల వంక వేలితో చూపించి విమర్శిస్తూంటాడు.

'అతను క్షవరం చేయించుకోవాలి' ఓ క్లర్క్ని చూపించి చెప్తాడు.

ఓసారి ఆలివర్ని చూపించి అంతా వినేలా చెప్పాడు. ''ఆయన టై ఛండాలంగా ఉంది. ఆయనకి డ్రెస్ సెన్స్ లేనే లేదు''.

అయితే క్రాష్షా ఆ బేంక్కి ముఖ్యమైన కస్టమర్ కాబట్టి ఆయన మాటలని అక్కడి సిబ్బంది అంతా పట్టించుకోనట్లుగా నటిస్తారు.

ఆ రోజు క్రాష్ణా గట్టిగా చెప్పాడు.

"ఎవరైనా నా మీద హత్యా ప్రయత్నం చేస్తే నాకు చూడాలని ఉంది."

"రాత్రి చీకటి పడ్డాక బయటకి వస్తే మీ మీద ఆ ప్రయత్నం జరిగి మీ ముచ్చట తీరచ్చు. కానీ అలా రావద్దని నా సలహా." ఆలివర్ అతనితో చెప్పాడు.

"నేను గత ఇరవై ఏళ్ళుగా ప్రతీ రాత్రి క్లబ్ నించి నా ఇంటికి వంటరిగా నడిచి వెళ్తున్నాను. ఈ రాత్రి ఆ హంతకుడు నా కళ్ళబడాలని అనుకుంటున్నాను." క్రాష్ణా అంతా వినేలా గట్టిగా చెప్పాడు.

"అతన్ని ఆ రాత్రి హంతకుడు చంపితే బావుండు" అని కేషియర్ జోన్స్ అనుకున్నాడు.

* * *

బేంక్ నించి బయలుదేరిన ఆలివర్ అరగంట నడిచి నూట ఏభై ఏళ్ళ క్రితం కట్టిన వెస్టెండ్లోని తన ఇంటికి చేరుకున్నాడు. రెండవ అంతస్థులో అతను ఉండే పెద్ద గదిలో కొంత భాగం తలుపు లేని వంట గది. కొంత భాగం తలుపు ఉన్న పడక గది. ఆ ఇంట్లో అద్దెకి ఉండే మిగిలిన ముగ్గురితో కలిసి గ్రౌండ్ ఫ్లోర్లోని డైనింగ్ రూంలో టీ తాగాడు. తర్వాత తన గదిలోని ఫైర్ ప్లేస్లో నిప్పుని రాజేసాడు. వద్దనుకున్నా అతను ఆ హత్యల గురించే ఆలోచిస్తున్నాడు.

రాత్రి ఏడున్నరకి ఇంట్లోంచి బయలుదేరి అతను రోజూ వెళ్ళే కాఫీ హౌస్కి వెళ్ళాడు. ఎప్పటిలా అది రద్దీగా ఉంది. తను ఎప్పుడూ కూర్చునే కుర్చీలో కూర్చున్నాడు. ఎదురుగా గోడకి పెద్ద అద్దం బిగించి ఉంది. లోపల వేడి భరించలేనంతగా ఉంది. దాంతో తన ఓవర్ కోట్ని విప్పి, కుర్చీకి తగిలించి కాఫీని, ఓ ప్లేట్ బిస్కెట్స్ని ఆర్డర్ చేసాడు.

ఒకతను ఆలివర్ని చూసి గుర్తు పట్టినట్లుగా తల ఊపాడు. అతన్ని ఆలివర్ గుర్తు పట్టలేదు. బహుశా అతను తన బేంక్కి వచ్చే కస్టమర్స్లో ఒకరై ఉండచ్చు అనుకుని చిరునవ్వు నవ్వాడు.

అతనికి తెలిసిన మరెవరూ అక్కడ లేరు. బిస్కెట్స్ తింటూ, కాఫీ తాగుతూ ఆలివర్ ఓ పది నిమిషాలు గడిపాడు. తర్వాత రెండు పౌన్ల నోటిని కాఫీ కప్పు కింద ఉంచి, లేచి వాష్ బేసిన్ దగ్గరకి నడిచాడు. చేతులు కడుక్కుని పేపర్ నేప్కిన్తో తుడుచుకుంటూ, ఎదురుగా అద్దంలోంచి కనబడ్డ ఓ వస్తువుని చూసి ఉలిక్కిపడ్డాడు.

అది ఓ కత్తి పిడి. తెల్లటి దంతపు పిడి గల ఆ కత్తి ఓ నల్లటి ఓవర్ కోట్ జేబులోంచి కొద్దిగా బయటకి పొడుచుకు వచ్చి కనిపించింది. కోటు జేబు లోపల ఉన్న చేతి రుమాలునో, లేదా మరి దేన్నో ఎవరో బయటకి తీస్తూండగా అది కొద్ది క్షణాలు బయటకి వచ్చి మళ్ళీ లోపల్కి వెళ్ళింది. ఆ కొద్ది క్షణాల్లోనే అది అతని కంట పడింది.

తక్షణం అతను వెనక్కి తిరిగి చూస్తే అది ఎవరు తొడుక్కున్న కోటో తెలియలేదు. తెల్లటి పిడి మీద నల్లటి నక్షత్రం బొమ్మ గల ఆ కత్తి అక్కడి వారిలో ఎవరి జేబులో ఉందో అద్దంలోంచి చూడబట్టి సరిగ్గా అంచనా వేయలేకపోయాడు. కాని అది సరిగ్గా తన వెనకే కనపడటంతో అది తన ముందు లేదా వెనక కూర్చున్న వారిలో ఒకరిదై ఉండాలి అనుకున్నాడు. అక్కడ కూర్చున్న వారి వంక ఆలివర్ తీక్షణంగా చూసాడు.

ఆ బేంక్ కస్టమర్ ఓసారి అందరి వంకా పరిశీలనగా చూడటం గమనించాడు. క్రమంగా అతని చూపు ఆలివర్ మీదకి మళ్ళింది. వాళ్ళిద్దరి కళ్ళు కలుసుకున్నాయి. అతను కొద్దిగా తడబడటం ఆలివర్ గమనించాడు. ఆ కస్టమర్ బూడిద రంగు ఓవర్ కోట్ వేసుకుని ఉన్నాడు. అతని కోట్లోని ఆ కత్తిని తనలా అతను తప్ప మరెవరూ చూసినట్లు లేరు.

అద్దంలోని ప్రతిబింబం అబద్ధం ఆడదు. ఆ కొద్ది క్షణాల్లోనే అది తన కంట పడింది. ఆ బేంక్ కస్టమర్, తను తప్ప మరెవరూ దాన్ని గమనించినట్లు లేదు. లేక అది అతని జేబులోంచే బయటకి వచ్చిందా? అతని వంక తేరిపార చూసాడు. బూడిద రంగు ట్వీడ్ కోట్ ధరించి ఉన్నాడు.

“నేనిప్పుడేం చేయాలి?” ఆలివర్ ఆలోచించాడు. ఒకరి కోటు జేబులో కత్తి కనపడగానే అతనే ఆ మూడు హత్యల హంతకుడు అనుకోవడం మూర్ఖత్వం. రక్షణ కోసం ఎవరైనా దాన్ని దగ్గర ఉంచుకుని ఉండచ్చు. లేదా కొనుక్కుని ఇంటికి తీసుకు వెళ్తుండచ్చు. బేంక్ కస్టమర్ తనని చూసి ఎందుకు ఉలిక్కిపడ్డాడు? తను ఆ కత్తిని చూసాడని గ్రహించా? రక్షణ కోసమైతే ఆ కత్తి తన దగ్గర ఉన్నందుకు అతనంత ఉలిక్కి పడడు. తను దాన్ని చూసానని అతను గ్రహించకపోయినా ఆ ఉలికిపాటు ఉండేది కాదు.

తను పోలీసుల దగ్గరకి వెళ్తే తను చెప్పేది విని నవ్వచ్చు. దంతపు పిడి గల పదునైన కత్తిని దగ్గర ఉంచుకోవడం నేరం కాదు. అతన్ని ఒకవేళ ప్రశ్నించినా ఏదో కారణం చెప్పి తప్పించుకోగలడు. కానీ తనకి అతని రహస్యం తెలిసిందని అతనికి తెలిసిపోయింది. అతనికి తను ప్రమాదకారి అన్పించడం మంచిది కాదు. ఈ ఊరు మొత్తంలో మూడు హత్యలు చేసి, నాలుగో హత్య కోసం మారణాయుధాన్ని ఓ హంతకుడు తన దగ్గర ఉంచుకున్నాడన్న సంగతి తనకి మాత్రమే తెలుసు. కానీ తనేమీ చేయలేడు. అతనే తననేమైనా చేయగలడు.

తను ఈ కాఫీ హౌస్లోంచి ముందుగా బయటకి వెళ్తే అతను తనని అనుసరించి చంపచ్చు. లేదా అతను వెళ్ళే దాకా ఆగి వెళ్తే, తను బయటకి వచ్చే దాకా అతను ఎక్కడైనా పొంచి ఉండచ్చు. ఆలివర్ వచ్చి తన సీట్లో కూర్చున్నాడు. వెనక్కి తిరిగి ఆ కస్టమర్ వంక చూసే ధైర్యం కూడా చేయలేదు. వెయిటర్ తెచ్చి పెట్టిన చిల్లర ప్లేట్లో కనిపించింది. అందులోంచి కొంత తీసుకుని లేచి తన ఓవర్ కోట్ అందుకుని తొడుక్కున్నాడు. గబగబ బయటకి వెళ్ళి ఓ చెట్టు చాటుకు వెళ్ళి దాక్కున్నాడు. కొద్దిసేపటికి ఆ బేంక్ కస్టమర్ బయటకి వచ్చి ఎవరి కోసమో చూస్తున్నట్లుగా అటూ, ఇటూ చూసాడు. అతను ముందుకి వెళ్ళే దాకా ఆగి ఆలివర్ చెట్టు చాటు నించి బయటకి వచ్చి ఎదురు సందులోంచి తన ఇంటి వైపు అడుగుల వేసాడు. కుడి వైపు సందులోకి తిరుగుతూ వెనక్కి తిరిగి చూస్తే ఎవరూ లేరు. ఆ కస్టమర్ తనని అనుసరించడం లేదని రూఢి చేసుకున్నాక తన ఇంటి వైపు నడిచాడు.

కొద్దిసేపటికి వెనక అలికిడి విని తల తిప్పి చూస్తే, ఆ కస్టమర్ మళ్ళీ తన వైపే వేగంగా నడుస్తూ కనిపించాడు. వెంటనే ఆలివర్ తన నడక వేగాన్ని పెంచాడు. అతను కూడా తన వేగాన్ని పెంచి ఆలివర్ని అనుసరించసాగాడు. ఆలివర్ తన ఇంటికి కుడి వైపు తిరిగే బదులు ఎడమ సందులోకి తిరిగి రెండు ఇళ్ళ మధ్య గల చెత్త డబ్బా వెనక పొంచి కూర్చున్నాడు. ఆ కస్టమర్ కూడా అదే సందులోకి తిరిగి సరిగ్గా ఆ చెత్త డబ్బా ఎదురు ఇంట్లోకి నడిచాడు. ఇనుప గేటు తెరుచుకున్న చప్పుడు, మూసుకున్న చప్పుడు.

ఆ ఇంటికి తగిలించి ఉన్న నామ బోర్డ్ మీదకి వీధి దీపపు స్థంభం వెలుతురు పడుతోంది. ఆ పేరుని చదివాడు.

క్రామ్షా!

మధ్యాహ్నం తమ బేంక్కి వచ్చిన కస్టమర్ క్రామ్షా ఇల్లేనా ఇది? హంతకుడిని తను చూడాలనుకుంటున్నానని అందరి ముందు ఛాలెంజ్ చేసాడు. అప్పుడు ఈ కస్టమర్ కూడా అక్కడే ఉండి విన్నాడా? ఆలివర్కి ఏమీ అర్థం కాలేదు. సరిగ్గా అదే సమయంలో దూరం నించి ఓ వ్యక్తి రావడం చూసాడు. చేతిలోని కర్రని అటు-ఇటు ఊపుతూ వచ్చే ఆయన క్రామ్షా అని గ్రహించాడు. రోజులా క్లబ్ నించి తొమ్మిదిన్నరకి ఇంటికి నడిచి వస్తున్నాడు. ఆయన్ని చంపడానికే ఆ కస్టమర్ అతనింటి బయట మాటు వేసాడా?

ఆలివర్ చెవుల్లో గంటలు గణగణ మోగుతున్న శబ్దం ముందు లీలగా విన్పించి, తర్వాత ఆ గంటల శబ్దం పెరుగుతూ తలంతా నిండిపోయింది. క్రామ్షా చాలా దగ్గరకి

వచ్చేసాడు. ఆలివర్ క్రామ్షాతో ఆ హంతకుడి గురించి చెప్పాలని అనుకుని చెత్త డబ్బా వెనక నించి లేచాడు. అకస్మాత్తుగా ఆ గంటల శబ్దం ఆగిపోయింది.

చూస్తే తన చేతుల్లో ఏదో ఉంది! ఎడం చేతిలో తెల్లటి కర్చీఫ్, కుడి చేతిలో దంతం పిడి గల కత్తి! కత్తి నించి కారే రక్తాన్ని ఎడం చేయి చేతి రుమాలుతో తుడుస్తోంది. నేల మీద పడి ఉన్న

క్రాఫ్షా మూలుగనైనా మూలగడం లేదు. ఆలివర్ తక్షణం భయంగా తన ఇంటి వైపు వేగంగా నడిచాడు.

అతని మనసంతా చిందరవందరగా ఉంది. రెండు రకాల ఆలోచనలు కలిగి క్రమేపీ, ఆ రెండూ ఒక దాంతో మరొకటి కలిసి పోయాయి. అవి అర్థమయ్యే కొద్దీ ఆలివర్లో నెలకొన్న అయోమయం క్రమేపీ తొలగింది. అతనిలోని ఓ భాగానికి ఆ కత్తి గురించిన ఎలాంటి సమాచారం తెలీదు. సాయంత్రం నించి అది తన జేబులోనే ఉండి ఉండాలి అని అతని మెదడులోని ఓ భాగం ఊహించింది.

మరో భాగం నిశ్శబ్దంగా, లోతుగా, శక్తివంతమైన సంపూర్ణ చైతన్యంతో ఆ కత్తి తనదేనని, ఆ హత్య, ఆ ద్వేషం, ఆ పథకం అంతా తనదే అని చెప్తోంది. అద్దంలో తనకి కనబడ్డ ప్రతిబింబం వల్ల ఎందుకో ఈ రెండు భాగాల మధ్య గల సరిహద్దు తొలగిపోయి ఏకమయ్యాయని అనిపించింది. అది ఇంకెవరి కత్తో అని, ఇంకెవరో హంతకుడు అన్న ఆలోచన పోయింది.

ఈ కొత్త సమాచారం వల్ల ఆలివర్ మెదడు నివ్వెరపోయింది. తన గదిలోకి వెళ్ళి ఓవర్ కోట్ని కొక్కేనికి తగిలించాడు. మంట చల్లారుతూండటంతో ఫైర్ ప్లేస్లో రెండు కట్టెలు పెట్టాడు. జేబులోంచి రక్తంతో తడిసిన రుమాలుని తీసి ఆ నిప్పులో పడేసాడు. నిమిషంలో అది నల్లటి మసిగా మారిపోయింది. ఆలివర్ బెడ్ రూమ్లో టబులకి అడుగు డ్రాయర్ని తెరిచి, తన దుస్తుల కింద ఉన్నచిన్న తోలు పెట్టెని తీసాడు. అందులో ఓ నల్లటి ఒర ఉంది. ఆ దంతపు పిడి గల కత్తిని అందులో ఉంచి, మళ్ళీ పెట్టె మూసి డ్రాయర్ని మూసాడు.

నిప్పు ముందు గల రాకింగ్ చెయిర్లో కూర్చుని ఆలోచించసాగాడు. తన బేంక్ కస్టమర్ తన జేబులోని కత్తిని చూసాడు. అద్దంలోంచి చూడటంతో అది తన జేబులోదని తను గుర్తించలేదు. ఆ కస్టమర్ క్రాఫ్షా ఉన్న ఇంట్లోనే బహుశా ఉంటూండాలి. అతను తను చేసిన హత్యని చూసాడా? లేక చూడలేదా? చూస్తే బహుశా పోలీసులు ఈ పాటికి తన కోసం వెదుకుతూంటారు. ప్రతీ శుక్రవారం తన జీతం చెక్ని మార్చుకోడానికి వచ్చే సార్జెంట్ తనే ఆ

హంతకుడని తెలిస్తే బహుశా వెంటనే నమ్మలేడు. తను హంతకుడని తనకి తెలిస్తేనే తను నమ్మలేకపోతున్నాడు.

ఇది మానసిక జబ్బా? దాన్ని ఏమంటారు? స్కిజోఫెర్నియా? నాలుగు హత్యలు. ఐనా తనకేమీ గుర్తు లేదు. చెవుల్లో గంటలు మోగుతున్న శబ్దం. అంతే. ఆ తర్వాత ఇంకేం గుర్తు లేదు. ఈ కత్తి తనకి ఎక్కడి నించి వచ్చి ఉంటుంది? ఆట వస్తువులు అమ్మే దుకాణం నించి కొన్నాడా? లేక ఏదైనా ఇనప కొలిమికి వెళ్ళి కొన్నాడా? అంత పెద్ద నగరంలో తను దాన్ని ఎక్కడ కొన్నదీ ఎవరికీ తెలీదని తను లండన్కి వెళ్ళినప్పుడు కొని ఉంటాడు.

తనలో అసలు ఈ మానసిక జబ్బు ఎందుకు వచ్చినట్లు? ఇక ముందు కూడా తన చెవుల్లో గంటలు మోగుతాయా? తను మరి కొన్ని హత్యలని చేస్తాడా? లేచి డ్రాయర్ తెరిచి తోలు పెట్టెలోని ఆ కత్తిని తీసి పరిశీలనగా చూసాడు. దాని పిడి అంచుకి ఎండిన రక్తం కన్పించింది. ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా తల ఊపాడు. ఎటూ నాలుగు హత్యలు చేసాడు. ఐదో హత్య కూడా చేయాలి. అయితే ఆ ఐదో వ్యక్తి తనకి బయట లేడు అని ఆలివర్కి తెలుసు. అతని చెయ్యి గాల్లోకి లేచింది. ఎడమ పక్కటెముకలని చీల్చుకుంటూ ఆ కత్తి సూటిగా అతని గుండెల్లోకి దిగింది. తన వల్ల ఎవరికీ ఇక మీదట హాని కలగదు అన్నది అతనికి కలిగిన ఆఖరి ఆలోచన.

---

## గుర్తింపు - పెన్నీ హేన్కాక్

అప్పుడే సూర్యుడు ఉదయిస్తున్నాడు. ఆ ఓల్డ్ ఏజ్ హోమ్ లాంజ్లో టీ వాసన వేస్తోంది. ఎవరో పియానోని వాయిస్తున్నారు. ఆ రోజు టెడ్ కన్నా ముందు డాలీ నిద్ర లేచింది. ఎప్పుడూ టెడ్ అందరికన్నా ముందుగా నిద్ర లేస్తూంటాడు.

డాలీ ఏదో పాటని హమ్ చేస్తూ, బేటరీతో నడిచే చక్రాల కుర్చీని నడుపుతూ, కారిడార్లో వెళ్తూ పక్కనే ఆరవిచ్చుకున్న గులాబీలని చూస్తోంది.

‘‘గుడ్ మార్నింగ్ డాలీ." చేతిలో బ్రేక్ఫాస్ట్తో వెళ్ళే నర్స్ బ్రిడ్జెట్ విష్ చేసింది.

‘‘గుడ్ మార్నింగ్."

‘‘సారీ డాలీ. ఓ చెడ్డ వార్త"

"నా వయసులో ఏదీ చెడ్డ వార్త కాదు. అన్ని రకాల చెడ్డ వార్తలని నా తొంభై తొమ్మిదేళ్ళ వయసులో నేను ఇప్పటికే ఎన్నో విన్నాను. ఏమిటది?" డాలీ అడిగింది.

"నిన్న రాత్రి టెడ్ మరణించాడు."

"అసాధ్యం! నిజం రాత్రి ఆరోగ్యంగా... నే... సాధ్యమే."

‘‘దాదాపు వందేళ్ళ బతికాడాయన.’’

"అయ్యో! రేపు టెడ్ జరుపుకునే పుట్టినరోజు పార్టీని రద్దు చేస్తారనుకుంటా.’’

‘‘నిజమే. అతనే లేనప్పుడు ఇక పార్టీ ఏమిటి? అర్థం లేదు. అతను మన ఓల్డ్ ఏజ్ హోంలో వందేళ్ళ వయసు గల మొదటి వ్యక్తి అవచ్చని అంతా ఆశించాం. అదృష్టం ఏమిటంటే టెడ్కి డజన్ల కొద్దీ మనవలు, మనవరాళ్ళు ఇతర బంధువులు ఉన్నారు. అతని అంతిమయాత్రలో పెద్ద సైన్యమే పాల్గొంటుంది."

‘‘నిజమే.’’ డాలీ దిగులుగా అంగీకరించింది.

డాలీకి పిల్లలు లేరు. భర్త వైపు నించి కాని, తన వైపు నించి కాని బంధువులు లేని ఏకాకి డాలీ.

"నేను మరణించాక బహుశా ఎవరి జ్ఞాపకాల్లో జీవించను." విచారంగా చెప్పింది.

‘‘ఏడవకు డాలీ! ఏ వయసులో మరణించినా స్నేహితులు పోవడం బాధాకరమైన సంగతే." నర్స్ కళ్ళ వెంట నీళ్ళు కారే డాలీని ఓదార్చింది.

"క్వీన్ నించి అతనికి ఇక కంగ్రాచ్యులేషన్స్ ఉత్తరం రాదన్నమాట."

వందవ పుట్టినరోజు జరుపుకునేవారు బ్రిటిష్ క్వీన్ నించి శుభాకాంక్షల ఉత్తరం అందుకోవడం బ్రిటన్లో సాధారణం.

* * *

టెడ్ మరణించడంతో ఇప్పుడు ఉదయం నిద్ర లేచి లాంజ్లోకి వచ్చే మొదటి వ్యక్తి డాలీయే. తర్వాత వచ్చేది ఎడిత్.

"టెడ్ ఎప్పుడూ తన వయసుని చాటుకునేవాడు. అధిక కాలం జీవించడం కూడా గొప్ప విషయమే కదా. కాని ఎడిత్ మాత్రం ఎన్నడూ తన వయసు విషయంలో గొప్పలు చెప్పుకోదు." ఆ రోజు బ్రిడ్జెట్ డాలీతో చెప్పింది.

"ఎడిత్ వయసులో నాకన్నా పెద్దది అనుకుంటాను."

‘‘అవును."

‘‘మరి? వీల్ చెయిర్ని వాడమంటే వాడదు కూడా.’’

"వీల్ చెయిర్కి అలవాటు పడితే కాళ్ళు ఇక స్వాధీనంలోకి రావని నా భయం. శరీరంలోని ఏ అవయవమైనా వాడకపోతే ఇక అది పని చేయదు. ముఖ్యంగా వృద్ధాప్యంలో." ఆ సంభాషణ విన్న ఎడిత్ చెప్పింది.

"నాలా ఆమెకి చెవుడు లేదు. కాబట్టి నాకన్నా చిన్నదా?" డాలీ బ్రిడ్జెట్ని అడిగింది.

"కాదు. నిజానికి వచ్చే వారం ఎడిత్ వందవ పుట్టినరోజుని మనం ఇక్కడ జరుపుకుంటున్నాం. అది మార్లోస్కి మంచి పబ్లిసిటీ." నర్స్ చెప్పింది.

"ఓ! మార్లోస్ కేర్ హోంలో టెడ్ కి రాని ఖ్యాతి ఎడిత్కి రాబోతోందన్నమాట. కంగ్రాట్స్ ఇన్ అడ్వాన్స్ ఎడిత్." డాలీ అభినందించింది.

"థాంక్స్" ఎడిత్ చిరునవ్వుతో జవాబు చెప్పింది.

"టివి వాళ్ళు వస్తారు. దినపత్రిక రిపోర్టర్లు వస్తారు. కొందరు రాజకీయ నేతలు కూడా వస్తారు." నర్స్ చెప్పింది.

"టివిలో కనపడే ఏ అవకాశం ఉన్నా నేతలు దాన్ని వదులుకోరు. వాళ్ళకీ, ఎడిత్ జీవించడానికి ఏమిటి సంబంధం? అందుకు వాళ్ళేమైనా సహాయం చేసారా???

"మంచి మాట." బ్రిడ్జెట్ చెప్పింది.

ఎడిత్ నిశ్శబ్దంగా సుడోకు పుస్తకం, పెన్సిల్తో కాలం గడపసాగింది. డాలీ కాసేపు ఆమె వంక చూసి తన గదిలోకి వెళ్ళిపోయింది.

"పత్రికల వాళ్ళ వచ్చి ఇక్కడ ఇన్మేట్స్కి ఏం ఆహారం పెడుతున్నారు లాంటి ప్రశ్నలు వేస్తారు. మనం కూడా టివిలో కనిపిస్తాం." బ్రిడ్జెట్ ఉత్సాహంగా చెప్పి ఈల వేసుకుంటూ వెళ్ళిపోయింది.

* * *

డాలీ నిద్ర లేచి కారిడార్లోకి రాగానే ఆందోళనగా కనపడ్డ బ్రిడ్జెట్ని అడిగింది.

"ఏమిటి సంగతి?"

"నిన్న రాత్రి నిద్రలో ఎడిత్ మరణించింది."

“ఛ! నిజంగా? ఆ పార్టీ ఇంక రెండు రోజులే ఉందనగా?”

“టెడ్, ఎడిత్, నెల్లీ మీకు గాఢ స్నేహితులని నాకు తెలుసు. మీ నలుగురు ఎన్నో సంవత్సరాలుగా ఇక్కడ నివసిస్తున్నారు. మిగతా వాళ్ళంతా మీ తర్వాత చేరారు. పోలీసులకి ఎడిత్ మరణం గురించి వార్డెన్ తెలియచేసాడు. బహుశా మిమ్మల్ని వాళ్ళు ప్రశ్నించచ్చు."

“దేని గురించి?”

"ఎడిత్ మృతదేహాన్ని పరీక్షించిన డాక్టర్. నిజానికి ఇది రహస్యంగా ఉంచాల్సిన సమాచారం. మిమ్మల్ని భయపెట్టాలని చెప్పడం లేదు. ఎడిత్కి ఎవరో ఏదో మందుని ఓవర్ డోస్ ఇస్తున్నారని ఆయన అనుమానపడ్డాడు."

"నాకు భయంగా ఉంది. డాక్టర్ నన్ను పరీక్షిస్తే మంచిది. ఐనా ఆయనకి ఆ అనుమానం ఎందుకు వచ్చింది?"

“ఏమో మరి." బ్రిడ్జెట్ చిన్నగా నిట్టూర్చింది.

* * *

మధ్యాహ్నం డాలీ క్రాస్ వర్డ్ పజిల్స్ని నింపుతూంటే ఓ పోలీస్ ఆఫీసర్ ఆమె గదిలోకి వచ్చి ఓ నాలుగైదు నిమిషాలు ప్రశ్నించి వెళ్ళాడు.

"ఎవరైనా అసలు ఎడిత్ని ఎందుకు చంపినట్లు? ఆమెకి ఆస్థి బాగా ఉందా? ఆమె వాళ్ళు ఎవరూ గత నెలగా వచ్చి ఆమెని చూడలేదా.' లాంటి అతని ప్రశ్నలకి జవాబులు చెప్పి డాలీ అడిగింది.

“ఎడిత్ ఎలా మరణించింది?”

"ఏదీ ఇంకా స్పష్టంగా తెలియదు. పరిశోధన కొనసాగుతోంది." అతను చెప్పాడు.

"ఎడిత్ కీళ్ళవాతం నొప్పులకి తీసుకునే మందు ఓవర్ డోస్ అయి మరణించిందని పోస్ట్ మార్టంలో తెలిసింది." మర్నాడు బ్రిడ్జెట్ డాలీకి చెప్పింది.

"మై గాడ్! ఆమె శవాన్ని కోసారా?"

"అవును."

"ఇది ఎంతటి బాధాకర విషయం?"

"శవానికి బాధ తెలీదు."

"కాని అది ఆమె శవాన్ని అవమాన పరచడమే అవుతుంది."

"నిజమే. కాని ఓసారి పోలీస్ కేస్ అయాక పోస్ట్ మార్టం తప్పదు."

"రేపు నా శవాన్ని కూడా...." డాలీ భయంగా చెప్పింది.

మర్నాడు బాబ్ డ్యూటీకి వచ్చాడు. బ్రిడ్జెట్ డ్యూటీ రాత్రి పది నించి పగలు పది దాకా, బాబ్ది పగలు పది నించి రాత్రి పది దాకా, అతను ఇచ్చిన టీ వంక అనుమానంగా చూసి డాలీ అడిగింది.

"నువ్వు ఇందులో ఏం కలపలేదు కదా?"

"ఊరుకోండి మిస్ డాలీ." నవ్వాడు.

"ఇక్కడ ఓ సీరియల్ కిల్లర్ పని చేస్తున్నాడని నా అనుమానం."

"చంపితే ముందు నెల్లీని చంపుతాను. ఆమె మూడ్ బాగా లేకపోతే సిబ్బందిని తెగ హింసిస్తుంది."

"నిజమే. అందరి మీద అధికంగా ఫిర్యాదు చేసేది నెల్లీనే. కాని, పాపం ఆమెని చంపకు." చెప్పి డాలీ టీ అందుకుంది.

"ఇంకో నెలలో ఆమె పుట్టినరోజు పార్టీ జరిపాక చంపుతాం. ఇప్పటికే రెండు మిస్ అయ్యాం."

"అలా చెయ్యి సంతోషిస్తాను."

ఇద్దరు ఫక్కున నవ్వారు.

"మనది బ్రిటిష్ హాస్యం." డాలీ చెప్పింది.

మూడు వారాల తర్వాత నెల్లీ మాటల్లో డాలీతో చెప్పింది.

"నాకు భయంగా ఉంది."

"దేనికి?"

"వందో పుట్టినరోజు వస్తోంది. ముందుగా మరణిస్తానేమోనని."

"చెడుని చూడకు. వినకు. మాట్లాడకు. ఊహించకు." డాలీ సముదాయించింది.

* * *

నెల్లీ వందవ పుట్టినరోజు ఏర్పాట్ల జోరుగా జరుగుతున్నాయి. సరిగ్గా ఆమె పుట్టినరోజు ముందు రోజు పోలీసులు డాలీని హత్యాప్రయత్న నేరం మీద అరెస్ట్ చేసారు.

దాదాపు తొమ్మిది నెలల తర్వాత అన్ని దినపత్రికలలో డాలీ ఫోటోతో పాటు ఓ వార్త వెలువడింది.

లండన్ టైమ్స్ దినపత్రికలోని ఆ వార్త హెడింగ్ "నన్ను మర్చిపోకండి" అని డాలీ చెప్తోంది.

డాలీ నిన్న తన వందవ పుట్టినరోజుని ఓల్డ్ బెయిలీ జైల్లో జరుపుకుంది. ఓల్డ్ బెయిలీ జైల్లో వందవ పుట్టినరోజు జరుపుకున్న తొలి వ్యక్తి డాలీయే. ఆమె మార్లోస్ కేర్ హోమ్లో ఉన్నప్పుడు ఇద్దర్ని చంపి, మూడో వ్యక్తి నెల్లీని చంపే ప్రయత్నంలో పట్టుబడింది అని పాఠకులకి తెలుసు. పోలీసులకి ఆ మరణాల మీద అనుమానం కలిగి డాలీ, నెల్లీల ఆహారాన్ని నిత్యం రహస్యంగా పరీక్షించసాగారు. నెల్లీ నూరో పుట్టినరోజు ముందు రాత్రి డాలీ దాచిన తన స్లీపింగ్ పిల్స్ని నెల్లీ డిజర్ట్లో కలిపిందని ఋజువైంది. డాలీ తన నేరాన్ని అంగీకరించింది కూడా. ఆమె టెడ్నీ, ఎడిత్నీ చంపడానికి, నెల్లీని చంపే ప్రయత్నం చేయడానికి కారణం గుర్తింపు పొందాలనే. మార్లోస్ కేర్ హోంలో వందవ పుట్టినరోజు జరుపుకున్న మొదటి వ్యక్తిగా తను టివిలో కనపడాలని, దినపత్రికల్లో తన ఇంటర్వ్యూలు ప్రచురింపబడాలనే కోరికతో, ఆ అవకాశం మిగిలిన వారికి రాకూడదని ఇద్దరిని హత్య చేసి, ఇంకొకర్ని చంపే ప్రయత్నంలో పట్టుబడింది. పోలీసులు మార్లోస్ సిబ్బంది చతురతతో దీన్ని కనిపెట్టారు. మార్లో సిబ్బంది పోలీసులకి గోప్యంగా సహకరించారు. డాలీని జడ్జి ప్రశ్నిస్తే నివ్వెరపోయే జవాబు చెప్పింది.

"నాకు కుటుంబం లేదు. మరణించాక నన్నంతా మర్చిపోతారు. వందవ పుట్టినరోజు జరుపుకునే వారు బ్రిటీష్ క్వీన్ నించి శుభాకాంక్షల ఉత్తరం అందుకుంటే కూడా ఆ సంగతి పేపర్లో కేవలం ఓ మూల రాస్తారు. మార్లోస్లో వందవ పుట్టినరోజు జరుపుకునే మొదటి వ్యక్తిగా టివిల ద్వారా, దినపత్రికల ద్వారా నేను ప్రపంచానికి గుర్తుండిపోవాలని ఆ పని చేసాను."

ఆ వార్త చివర్లో ఇలా రాసారు.

"డాలీ! బాధపడకు. ఓల్డ్ దిరంబాలి త్రెబుత్" వందేళ్ళ పుట్టినరోజు జరుపుకున్న తొలి వ్యక్తిగా, అందుకోసం నిర్ధయగా ఇద్దర్ని చంపిన వ్యక్తిగా ప్రపంచం నిన్ను గుర్తుంచుకుంటుంది."

---

## జేమ్స్ హౌస్ - సైమన్ బ్రెట్

కొత్త సంవత్సరం ముందు రోజు అలాంటి ఎస్ ఎం ఎస్ వస్తే మనసు తీవ్ర బాధకి లోనవుతుంది. మెలిస్సా గార్ఫోర్త్కి ఆమె భర్త జాక్ నించి అలాంటి మెసేజ్ వచ్చింది. మెలిస్సాతో కలిసి తను కార్నివాల్కి రాలేనని, తమ ప్రయాణం ఏర్పాట్లని మెలిస్సానే చూసింది కాబట్టి వాటిని రద్దు చేయమని ఆ మెసేజ్లో ఉంది. దాన్ని చూసి మెలిస్సా హతాశురాలైంది. అతను పని వత్తిడితో సతమతం అవుతున్నాడని తెలుసు. మెలిస్సా కూడా తను పి ఆర్ ఓ గా పని చేసే కంపెనీ పని వత్తిడిలో ఉంది. లండన్లో ఈ రకమైన వత్తిడి లేని వారు సాధారణంగా ఉండరు.

ఆమె ఈ ట్రిప్ కోసం చాలా నెలలుగా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. కార్నివాల్లో పెండ్రోలాండ్ గ్రామంలోని జేమ్స్ హౌస్లో నాలుగు రోజులు తన భర్తతో, రాత్రుళ్ళు షాంపేన్ నింపిన గ్లాసులతో ఆనందంగా గడపాలనుకుంది. జేమ్స్ హౌస్ ప్రకటనని ఆన్ లైన్లో సెర్చ్ చేసి సంపాదించింది. జాక్ ఏర్పాట్లని మెలిస్సాకే వదిలేసాడు. "న్యూ ఇయర్కి కార్నివాల్లో నాలుగు రోజుల పాటు ఓ ఇంటిని అద్దెకి తీసుకుంటున్నాం" అని మెలిస్సా చెప్తే, అతను ఎంత, ఏమిటి అని ప్రశ్నించలేదు. జాక్కి డబ్బు ఎప్పుడూ సమస్య కాదు. అతను పని చేసే బేంక్ అతనికి సరిపడే కంటే ఎక్కువ జీతాన్నే ఇస్తుంది.

అతను ఒకటే సూచించాడు. గ్రెగ్, ఫెలిసిటీ దంపతులని కూడా ఆహ్వానించమని, అందువల్ల కాలక్షేపం ఉంటుందని ఆ సూచన. మెలిస్సా ఆ ఆలోచనకి సంతోషించింది. ఎందుకంటే, గ్రెగ్ భార్య ఫెలిసిటీ ఏడు నెలల గర్భవతి. ఆమెని చూసాక తన భర్తలో తమకీ పిల్లలు కావాలనే కోరిక కలగచ్చని ఆశపడింది. పైగా గ్రెగ్, జాక్ ఆప్తమిత్రులు. మెలిస్సా వెంటనే ఆ జంటతో మాట్లాడితే వారూ సుముఖతని వ్యక్తం చేసారు.

వెంటనే ఫెలిసిటీ నించి ఓ ఎస్ ఎం ఎస్ కూడా వచ్చింది. "కార్నివాల్లో నువ్వు నేను ఓ గదిలో ఓడ్కా సీసాతో గడిపే ఆలోచన బావుంది. జాక్, గ్రెగ్లు సమీపంలోని పబ్కి వెళ్తారని పందెం."

తీరా బయలు దేరడానికి కొన్ని గంటల ముందు జాక్ నించి వచ్చిన ఆ మెసేజ్ని చదివాక మెలిస్సాని నీరసం ఆవహించింది. కానీ ఆమెలో పట్టుదల పెరిగింది.

తన భర్త రాకపోతే, తను వారిద్దరితో వెళ్ళలేదా? వెళ్తే అది ‘‘నువ్వు లేకపోయినా నేను ఎంజాయ్ చేయగలన’'' అని తన భర్తకి ఇన్డైరెక్ట్గా చెప్పినట్లు అవుతుందని కూడా భావించింది.

తన భర్తకి ఫోన్ చేసి, తన మనసులోని బాధని కోపం రూపంలో వ్యక్తం చేయాలన్న వ్యామోహాన్ని అణచుకుంది. మెలిస్సా తన తల్లితండ్రులకి తన కార్నివాల్ ట్రిప్ వాయిదా పడిందన్న సంగతి చెప్పదలచుకో లేదు. రాత్రి జాక్ ఇంటికి వచ్చినప్పుడు తను ట్రిప్కి వెళ్తున్నానన్న చీటీని చూసినప్పుడే అతనికి ఆ విషయం తెలియాలి అనుకుంది.

మెలిస్సా సర్ది సిద్ధంగా ఉన్న తన భర్త సూట్ కేస్ తెరిచి అందులోని తన వస్తువులన్నిటినీ తన సూట్ కేస్లోకి మార్చుకుంది. సర్దుతూంటే మొబైల్కి మెసేజ్ వచ్చిన అలర్ట్ వినిపించింది. తన భర్త మనసు మార్చుకున్నాడేమో అనే ఆశతో లేచి వెళ్ళి ఫోన్ చూస్తే, అది ఫెలిసిటీ నించి. గర్భవతైన తనని తన డాక్టర్ ప్రయాణం చేయద్దన్నాడని, కాబట్టి తమ టిక్కెట్లని తన భర్త కేన్సిల్ చేస్తున్నాడని, ఏమీ అనుకోవద్దని.

జాక్ తన ప్రయాణం మానుకోగానే గ్రెగ్ దంపతులకి కూడా ఎస్ ఎం ఎస్ పంపి ఉంటాడని, ఆ దంపతులు చర్చించుకుని ఈ నిర్ణయం తీసుకున్నారని, తను బాధపడకుండా ఆ నెపాన్ని డాక్టర్ మీద వేసారని ఇట్టే గ్రహించింది.

దాంతో ఆమెలోని పట్టుదల ద్విగుణీకృతమైంది. తప్పక వంటరిగా కార్నివాల్కి వెళ్ళాలనుకుంది. భర్తకి కాగితం మీద రెండే వాక్యాలు రాసి, ఫ్రిజ్ మేగ్నెట్ కింద పెట్టింది. తాము బస చేసేది జేమ్స్ హౌస్లో అని ఫెలిసిటీకి తను ఓ సారి మాటల్లో చెప్పింది. ఆమెకి అది గుర్తున్నా ఇతర వివరాలు చెప్పకపోవడంతో, తనని తన భర్త తిరిగి వచ్చే దాకా కాంటాక్ట్ చేయలేడని మెలిస్సా అనుకుంది. ఆమెకి కావలసింది కూడా అదే వెంటనే టేక్సీ కోసం ఫోన్ చేసి బుక్ చేసింది.

జేమ్స్ హౌస్ బుక్ చేసాక వారి నించి వచ్చిన సూచనలని తన ఈ మెయిల్ నించి ప్రింటవుట్ తీసి హేండ్ బేగ్లో పెట్టింది.

* * *

మెలిస్సా కార్నివాల్లోని పెండ్రోలాండ్ గ్రామానికి చేరుకునే సరికి చలి కాలం కాబట్టి త్వరగా చీకటి పడుతోంది. అట్లాంటిక్ మహాసముద్రం మీంచి వీచే గాలి చల్లగా తగిలింది. వెబ్ సైట్లో జేమ్స్ హౌస్ గురించి చదివిన విషయాలు ఆకర్షణీయంగా ఉన్నా అది పూర్తి నిజం కాదని ఆమెకి అక్కడికి వెళ్ళగానే అర్థమైంది.

ఆ సూచనల్లో, ది టిన్ మేన్స్ అర్మ్స్ అనే స్థానిక పబ్లో ఇంటి తాళం తీసుకోమని దాన్ని అద్దెకి ఇచ్చిన కంపెనీ సూచించింది.

జేమ్స్ హౌస్ సముద్రానికి అత్యంత సమీపంలో ఉన్న ఇల్లు, దాని పక్కనే ఓ చిన్న పురాతన చర్చి, ఆ చర్చి ఆవరణలో ఓ క్రమ పద్ధతిలో పాతని సమాధి రాళ్ళ కనిపించాయి. అక్కడ ఓ కూలిన గోడల ఇంటిని చూసింది. దాన్ని అక్కడి తగరపు గనుల పరిశ్రమ మూతపడక ముందు ఉపయోగించి ఉంటారు అనుకుంది. దానికి కొద్ది దూరంలోనే టిన్ మేన్స్ అర్మ్స్ పబ్ కనిపించింది. అందులో ఎవరూ లేరు. తలుపు మీద చాలా సార్లు కొడితే కాని అది తెరచుకోలేదు. చివరికి మాసిన స్వెట్టర్ ధరించిన ఓ ఏభై ఏళ్ళ వ్యక్తి తలుపు తెరిచి నిరాసక్తంగా అడిగాడు.

‘‘ఏం కావాలి?’’

"నా పేరు మెలిస్సా, జేమ్స్ హౌస్ తాళం చెవులు తీసుకోడానికి వచ్చాను.’’

‘‘అందుకు మీరు చాలా మంచి రోజుని ఎన్నుకున్నారు."నవ్వి చెప్పాడు.

‘‘అంటే?’’

అతను మళ్ళీ నవ్వాడు. కాని ఆ ప్రశ్నకి జవాబు చెప్పలేదు.

“చలి గాలి తీవ్రంగా వీస్తోంది. దయచేసి తాళం చెవులు ఇస్తారా?”

“లోపలికి రండి.”

దాని యజమాని లానే ఆ పబ్ లోపల వాతావరణం కూడా ఆకర్షణీయంగా లేదు. నడిచేందుకు ఆట్టే చోటు లేనంత దగ్గరగా వేసిన బల్లలు, బీర్ వాసన. నేల జిగురుగా అంటుకుంటోంది.

"జేమ్స్ హౌస్ గురించి నేను తెలుసుకోవాల్సిన సమాచారం ఏదైనా ఉందా?”

“ఎలాంటి సమాచారం?”

“హీటింగ్ ఎలా ఆన్ చేయాలి? లాంటి సమాచారం.”

“హాల్లో టేబుల్ మీద ఓ కాగితంలో ఆ సూచనలు రాసి ఉంటాయి.”

అతను బ్రాందీ సీసాల వెనక నించి తాళాల గుత్తిని తీసి అందించాడు.

"జేమ్స్ హౌస్లో ఎవరైనా ఉన్నారా?”

అతను తక్షణం వెనక్కి తిరిగి, ఆమె కళ్ళలోకి దీర్ఘంగా చూసి, సగం అనుమానంగా, సగం ఆసక్తిగా అడిగాడు.

“ఈ ప్రశ్న ఎందుకు అడిగారు?"

"ఎవరైనా కేర్ టేకర్ లాంటి వాళ్ళు ఉన్నారేమో అని."

“అక్కడ అలాంటి వాళ్ళు ఎవరూ లేరు. మీరు ఒంటరిగా వచ్చారా?”

"ప్రస్తుతానికి. కొద్దిసేపట్లో నా భర్త వస్తారు." కొత్త సంవత్సరం తను వంటరిగా గడుపుతుందనే నామోషీతో అబద్ధం ఆడింది.

"జాగ్రత్తగా ఉండండి." హెచ్చరించాడు.

"ఏవిషయంలో జాగ్రత్త?"

కొన్ని సమాధానాల్లోంచి ఏది చెప్పాలన్నట్లుగా కొద్ది సేపు ఆలోచనగా చూసాడు. కొద్ది నిశ్శబ్దం తర్వాత చెప్పాడు.

"వీల్ పెండ్రోలేండ్ అవశేషాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి."

"వీల్? ఎలాంటి వీల్?" మెలిస్సా అర్థం కాక అడిగింది.

"మీకది తెలీదా?ఓ! మీరు లండన్ నించి వస్తున్నారు కదా? తగరపు గనిని స్థానిక భాషలో వీల్ అంటాం. తగరం మీద వచ్చిన లాభాలతో జేమ్స్ హౌస్ కట్టబడింది. చాలా కాలం క్రితమే ఇక్కడి గనుల్లో తగరపు నిల్వలు ఖాళీ అయ్యాయి. కొన్ని గనుల చుట్టూ రైలింగ్స్ని ఏర్పాటు చేయలేదు. రాత్రి చీకట్లో గనిలో పడే ప్రమాదం ఉంటుంది. హెల్త్ అండ్ సేఫ్టీ విభాగం వారు ఎందుకో ఈ విషయం పట్టించుకోలేదు."

"ఇంకా ఏమైనా జాగ్రత్తలు చెప్తారా?"

"లేదు. గనులకి మాత్రం దూరంగా ఉండండి. ముఖ్యంగా రాత్రుళ్ళు. మీ వెంట టార్చి తెచ్చారా? బహుశా తెచ్చి ఉండకపోవచ్చు. ఇంట్లో ఒకటి ఉండాలి. కానీ బేటరీలు పని చేస్తున్నాయో లేదో నాకు తెలీదు."

అతని కదలికలని బట్టి ఇక తను వెళ్ళచ్చు అని చెప్తున్నాడని అర్థమైంది.

"ఆఖరి ప్రశ్న ఈ పబ్ని రాత్రి ఎన్నింటికి తెరుస్తారు? నేను రావచ్చా?"

“రాకండి. ఈ రాత్రి న్యూ ఇయర్ స్పెషల్ డిన్నర్. అన్ని టేబుల్స్ బుక్ అయిపోయాయి." అతని సమాధానంలో గర్వం కనిపించింది.

మెలిస్సా బయటకి వచ్చి తన అద్దె కారు ఎక్కుతూ చూస్తే, పబ్ కిటికీ లోంచి తన వంకే చూస్తున్న అతను కనిపించాడు.

ఆ రోడ్డు అంతమయ్యే చోట కారుని పార్కు చేసి, సూట్ కేస్, ఆహార పదార్థాల సంచీలని రెండు చేతులతో పట్టుకుని ఎత్తయిన మెట్లని ఎక్కి జేమ్స్ హౌస్కి చేరుకుంది. ఆమె ఎత్తు ఎక్కే కొద్దీ చల్లటి గాలి వేగం పెరుగుతూ తన మొహాన్ని కోస్తున్న భావన కలిగింది. దీపాలు వెలగని ఆ ఇంట్లోకి వెళ్ళి, బరువైన తలుపుని మూస్తే, దాని ప్రతిధ్వని ఇంట్లో వినిపించింది. ఆమె చల్లటి గోడని తడిమి లైట్ స్విచ్ని ఆన్ చేసింది. తక్కువ వాట్స్ బల్బ్ వెలిగింది.

వంట గది కోసం వెదికి అందులోకి ఆహార పదార్థాలని చేరవేసింది. వాటిని చూడగానే తనతో రాని వాళ్ళు గుర్తొచ్చారు. జాక్ ఇష్టపడే షార్ట్ బ్రెడ్, మాల్ట్ విస్కీ సీసా.... అన్నిటినీ సర్దింది.

అకస్మాత్తుగా మెలిస్సాకి తను ఒంటరి అనే భావన కలిగింది. నిజానికి తన ఇంట్లో తన భర్త పక్కనే ఉన్నా ఆమెకి కలిగేలాంటి భావనే అది. తన జీవితంలో మొట్టమొదటిసారి ఆమెకి ఆత్మహత్య ఆలోచన కలిగింది. ప్రపంచం అంతా కొత్త సంవత్సరం రాకని ఆనందంగా బంధుమిత్రులతో గడుపుతూంటే తను ఒంటరి అన్న భావనతో ఆ ఆలోచన కలిగింది.

హాల్లోంచి ఏదో శబ్దం వినిపించడంతో ఆమె భయంతో స్థాణువైంది . కానీ అంతలోనే అది తన ఊహ అని భావించింది. లేదా ఏ ఎలుకో, పిల్లో చేసిన శబ్దం అనుకుంది. షెల్ఫ్లో గ్లాసుల కోసం చూసి ఒకటి తీసి అందులో కొద్దిగా విస్కీపోసింది. తాగబోతూంటే హాల్లోంచి ఈ సారి శబ్దం స్పష్టంగా వినిపించింది. ఓ అడుగు వేసిన చప్పుడు. చెవులు రిక్కించి విన్నది. ఇంకో అడుగు, మరో అడుగు వేసిన శబ్దం. ఎవరో వంట గది వైపే వస్తున్నారు. ఆమె గుండె ఎంత వేగంగా

కొట్టుకుంటోందంటే, అది ఇల్లంతా వినిపిస్తుందా అనిపించింది. అడుగుల చప్పుడు తలుపుకి దగ్గరవగానే, భయంతో గట్టిగా అరవసాగింది.

ఆ వంటగది తలుపు బయట ఓ వ్యక్తి ఆగాడు. లోపలికి వచ్చి గోడకి ఉన్న స్విచ్ని తడిమి ఆన్ చేయగానే వంటగది అంతా కాంతితో నిండిపోయింది.

"ఎందుకలా పిచ్చి దానిలా అరుస్తున్నావు?" అరవై ఏళ్ళ వ్యక్తి స్థానిక కార్నిష్ యాసతో ఆశ్చర్యంగా అడిగాడు.

అతని వంక చూసింది. ఆరడుగుల ఎత్తు, తెల్లటి జుట్టు. పెరిగిన గడ్డం. నీలం రంగు కళ్ళు. నీలం రంగు వెలిసిపోయిన స్వెటర్. అదే రంగు పేంట్. నల్లటి బూట్లు.

"మీరు దయ్యం అనుకున్నాను."మెలిస్సా ఒప్పుకుంది.

బదులుగా అతను పకపక నవ్వాడు.

"పురాతనమైన జేమ్స్ హౌస్కి వచ్చే వారంతా ఇందులో దయ్యాలు ఉన్నాయి అనుకుంటారు. కాని వెళ్ళేప్పుడు అవి కనపడలేదనే నిరాశతో వెళ్తారు."

"సారీ. మీరెవరు?"

"నా పేరు విలియం రిక్ఫోర్డ్. ఈ ఇంటి మీద ఓ కన్నేసి ఉంచమని దీని యజమాని నన్ను కోరాడు. ఇక్కడికి వచ్చే సందర్శకులకి కావలసినవి తెచ్చి పెడుతూంటాను.... మీరు అన్నీ వెంట తెచ్చినట్లున్నారు." ఆహార పదార్థాల వంక చూసి నవ్వి చెప్పాడు.

"నా పేరు మెలిస్సా గార్ఫోర్ట్."

ఆమె చాపిన చేతిని అందుకుని కరచాలనం చేస్తూ చెప్పాడు.

"ఇప్పటికైనా నేను దయ్యం కాదనే నమ్మకం కలిగిందా?"

"మీరు ఈ ఇంట్లోనే ఉంటారా?"

"లేదు. కింద గ్రామంలో నా దగ్గర ఈ ఇంటి డూప్లికేట్ కీస్ ఉన్నాయి."

"పబ్లో ఇక్కడ కేర్ టేకర్స్ ఎవరూ లేరని చెప్పారు?"

"అతనికి నా గురించి తెలుసు. నేను మీ దగ్గరికి ఏమైనా కావాలా? అని అడగడానికి వస్తానని కూడా తెలుసు. ఎవరు వచ్చినా వాడి తరహా అంతే. మనిషిలో ఉండాల్సిన మొదటి మంచి లక్షణం, అందర్నీ ఇష్టపడటం. అతను అందర్నీ ద్వేషిస్తాడు. మీరు ముందుగా వచ్చారా?"

"అవును. మిగిలిన వాళ్ళ రావడం లేదు." ఈ సారి ఆమె అబద్ధం ఆడదల్చుకోలేదు.

"ఇది సౌకర్యవంతమైన ఇల్లు. ఇక్కడ మీకు బావుంటుంది. మీ సూట్ కేస్ హాల్లోనే ఉంది. నేను ఫైర్ ప్లేస్లో నిప్పు రాజేసి, మీ వస్తువులని పైన బెడ్ రూంలోకి తీసుకెళ్ళనా?"అడిగాడు.

"తప్పకుండా, అది పెద్ద సహాయం అవుతుంది."

విలియం రిక్ ఫోర్డ్ రావడం వల్ల జేమ్స్ హౌస్ వాతావరణమే మారిపోయినట్లుగా మెలిస్సాకి అనిపించింది. అతను ఎంపిక చేసిన మెట్ల ఎదురుగా ఉన్న పడక గదిలోని డబల్ కాట్ స్వాగతం చెప్తున్నట్లుగా అనిపించింది.

దాని మీద ఉన్న ఎలక్ట్రిక్ బ్లాంకెట్ని చూసి సంతోషించి దాని స్విచ్ని ఆన్ చేసింది. విలియం రాజేసిన నిప్పు వెచ్చదనాన్నిస్తోంది. విస్కీ సీసాని తెరిస్తే జాక్ గుర్తొస్తాడనే భయంతో ఆమె రెడ్ వైన్ సీసాని తెరిచింది. ఇద్దరూ ఫైర్ ప్లేస్ ముందు కుర్చీల్లో కూర్చుని తాగసాగారు. ఆ ముసలాయన చేపలు పట్టే వృత్తిలో ఉన్నాడు. ఆ జీవితం గురించిన విశేషాలు చెప్తూంటే మెలిస్సా ఆసక్తిగా విన్నది.

"మీ కుటుంబ సభ్యుల గురించి చెప్పండి." మెలిస్సా అడిగింది.

"ఇప్పుడు ఎవరూ లేరు." ఆయన కంఠం విషాదంగా వినిపించింది.

“సారీ."

"మీ కుటుంబం గురించి చెప్పండి."

తన భర్త జాక్ గురించి, తనని బాధించే అతని ప్రవర్తన గురించి, అతని ప్రయాణం రద్దు గురించి, తన మనసులోని తీవ్ర వేదన గురించి, ఏదీ దాచకుండా మొత్తం ఆయనికి విప్పి చెప్పింది. ఏడుపు ఒకటే తక్కువ. ఆయన ఆమెని ఓదార్చాడు. సీసాలో పావువంతు మాత్రమే మిగిలాక విలియం చెప్పాడు.

"ఇంక పడుకోండి. హేపీ న్యూ ఇయర్"

* * *

ఎవరో అదే పనిగా అద్దం మీద కొడుతున్న చప్పుడుకి మెలిస్సాకి మెలకువ వచ్చింది. మొదట కల అనుకుంది. పూర్తిగా మెలకువ వచ్చాక కానీ తను ఎక్కడుందో అర్థం కాలేదు. ఎక్కడుందో గుర్తు రావడంతో ఆమెని బాధ సునామీలా వచ్చి తాకింది. ఈ సమయంలో జాక్ మరో స్త్రీతో తమ పక్క మీద గడుపుతున్నా ఆశ్చర్యం లేదు.

తలుపు కొట్టే శబ్దం ఆగలేదు. లేచి కూర్చుని చూస్తే కర్టెన్తో మూసిన కిటికీ అద్దం మీంచి ఆ శబ్దం వస్తోందని అర్థమైంది. మొదట ఏ చెట్టు కొమ్మో కొట్టుకుంటోంది అనుకుంది. కానీ ఆ శబ్దం వినిపిస్తూనే ఉంటే ఇక నిద్ర పోలేకపోయింది. దాన్ని ఎలాగైనా ఆపాలనుకుని లేచింది. బాగా చలిగా ఉంది. ఎలక్ట్రిక్ బ్లాంకెట్ ఆన్లో లేదు. పాలిష్ చేసిన చెక్క నేల ఆమె పాదాలకి చల్లగా మంచులా తాకింది. పల్చటి నైట్ గౌనులోని ఆమె చలికి వణికింది. పక్కన ఉన్న టేబుల్ లేంప్ని వెలిగించి కిటికీ వైపు నడిచింది.

కిటికీ దగ్గరికి వెళ్ళి కర్టెన్ని తొలగించింది. ఆమెకి అద్దంలో తన ప్రతిబింబమే అస్పష్టంగా కనిపించింది. ఇత్తడి పిడిని పట్టుకుని రెక్కని తెరుస్తూంటే, జేమ్స్ హౌస్లో ఎటువంటి చెట్లూ లేవు అని బ్రోషర్లో చదివిన సంగతి గుర్తొచ్చింది.

ఎదురుగా తన కన్నా సన్నగా, పొడుగాటి జుట్టు గల ఓ యువతిని చూసాక అది తన ప్రతిబింబం కాదని అర్థమైంది. ఆమె కళ్ళని చూసాక తమ ఇద్దరికీ సమానంగా ఉన్నది తీవ్ర ఆవేదన అనిపించింది. ఆమె కిటికీ లోంచి లోపలకి వస్తూ చెప్పింది.

"ఇలా వస్తున్నందుకు మన్నించండి. ఒకప్పుడు ఇది నా పడక గది."

వాళ్ళిద్దరూ పక్క మీద కూర్చున్నారు. తక్కువ కాంతి గల వెలుగులో మెలిస్సా ఆమె వంక తేరిపార చూసింది. ఆమె చర్మం వాడిపోయినట్లుగా అనారోగ్యంగా కనిపించింది. ఆమె ఒంటి మీది పొడుగాటి బూడిద రంగు గౌనుకి గుండీలు పెట్టి ఉన్నాయి. ఆమెలోని ఆవేదన ఆమె అందాన్ని మరుగు పరచలేకపోతోంది. మెలిస్సా తన డ్రెస్సింగ్ గౌన్ని తీసుకుని ఒంటికి చుట్టుకుంటూ అడిగింది.

"చలికి మీకూ కావాలా? కొద్ది సేపు కిటికీ తెరిస్తేనే గదంతా చల్లగా అయింది."

"నాకు చలి అలవాటే. నా పేరు లవ్ డే" ఆమె మాటల్లో కూడా కార్నిష్ యాసే.

"నా పేరు మెలిస్సా?"

"నేను మీ చేత ఆకర్షింపబడ్డాను. మీలోని తీవ్ర ఆవేదన చేత." ఆమె చెప్పింది.

"ఓ!"

"మీరు దుఃఖంగా ఉన్నారని ఒప్పుకోరా? ఒప్పుకోక పోయినా నేనది నమ్మను."

"అవును. నేను ఆనందంగా లేను." మెలిస్సా చెప్పింది.

‘‘అందుకు కారణం ఓ మగాడు. కదా? ఏం జరిగిందో చెప్పండి.’’

మెలిస్సా మరోసారి తన బాధంతా గత రాత్రి విలియంకి చెప్పినట్లుగానే చెప్పింది. ఐతే విలియంకి చెప్పినప్పుడు కలిగిన మానసిక ఓదార్పు లవ్డేకి చెప్పినప్పుడు కలగకపోగా, ఆ ఆవేదన అధికమైంది.

‘‘మీ ఆవేదనే నన్ను పిలిపించింది అనడంలో అనుమానం లేదు. అది నా ఆవేదనలాగే ఉంది.’’

‘‘నువ్వు దయ్యానివి. అవునా లవ్ డే?’’ మెలిస్సా తన ప్రశ్నకి తనే ఆశ్చర్యపోయింది.

‘‘దెయ్యం అంటే ఏమిటి? ఆవేదనతో కుమిలిపోయే ఆత్మ. నా ఆత్మకి శాంతి లేదు. కాబట్టి అవును."

‘‘నువ్వు మరణించావా?’’

"అవును. చర్చి ఆవరణలో నన్ను పాతిపెట్టారు. నేను మరణించక పోవడం క్రూరత్వం అయ్యేది. నా శరీరం కుళ్ళిపోయింది. కానీ నాలోని విషాదం నాశనం కాలేదు." లవ్ డే బాధగా చెప్పింది.

‘‘ఏం జరిగింది?"ఇష్టం లేకపోయినా మెలిస్సా ఆ ప్రశ్న వేసింది.

లవ్ డే చిన్నగా నిట్టూర్చి చెప్పింది.

"నీలాగే దానికి కారణం ఓ మగాడు. అతని పేరు జార్జి. నా లాగే అతను కూడా ఈ పెండ్రోలేండ్ గ్రామంలో పెరిగాడు. మేమిద్దరం పిల్లలుగా ఉన్నప్పటినించే స్నేహితులం. నా కన్నా రెండేళ్ళు పెద్దయిన జార్జ్ని నేను పెళ్ళి చేసుకుంటానని మా గ్రామస్థులు అనుకునేవారు. కానీ మా నాన్న అందుకు ఒప్పుకోలేదు. తగరపు గని కార్మికుడిని తన ఏకైక కూతురు పెళ్ళి చేసుకోవడం దానికి యజమాని అయిన ఆయనకి నచ్చలేదు. అప్పట్లో గ్రామంలో

ఎక్కువమంది ఉండేవారు. ఈ ప్రాంతంలో గనిని వీల్ అంటాం. వీల్లో చాలా మంది పని చేసేవారు. మా నాన్న చాలా లాభాలు గడించారు. గనుల్లో పనిచేసే వాళ్ళల్లో రౌడీలు ఉండేవాళ్ళు. కానీ జార్జి కుటుంబం దేవుడంటే భయపడే మంచివాళ్ళు. గనిలో కింద పడి అతని తండ్రికి కాలు విరగడంతో జార్జి సంపాదనతోనే వారంతా జీవించే వారు.''

మెలిస్సా ఆమె చెప్పేది మౌనంగా వినసాగింది.

"అప్పుడు ఆస్ట్రేలియాలో కొత్తగా తగరాన్ని కనుగొన్నారు. అది లండన్కి ఎంతో చవకగా వచ్చేది. దాంతో ఇక్కడి గనులు దెబ్బ తిన్నాయి. మా నాన్న పనివాళ్ళని పంపించేయసాగాడు. జార్జిని కూడా పనిలోంచి తీసేసాడు. గని కార్మికులకి అమెరికాలో పని దొరుకుతుందని జార్జి విన్నాడు. అతను ఒన్వే టిక్కెట్ కొనుకుని అమెరికాకి వెళ్ళాడు. తను సంపాదించగానే నాకు టిక్కెట్ కొని పంపిస్తానని, త్వరలో పెళ్ళి చేసుకుందామని మాట ఇచ్చి వెళ్ళాడు. మా నాన్న ఎంత మంది పెళ్ళికొడుకులని తెచ్చినా నేను ఒప్పుకోలేదు. ఎవర్నీ చేసుకోనని చెప్పాను. జార్జి తన కుటుంబ సభ్యులకి టిక్కెట్లు కొని పంపాడని మా నాన్న చెప్తే నిర్ఘాంత పోయాను. వెంటనే వాళ్ళింటికి వెళ్తే, వాళ్ళు లివర్పూల్కి బయలుదేరుతున్నారు. అక్కడి నించి అమెరికాకి ఓడ ఎక్కుతున్నారు."

"మగాళ్ళంతా ప్రేమ విషయంలో దుర్మార్గులే." మెలిస్సా ఓదార్పుగా చెప్పింది.

''తమకి జార్జి వెళ్ళబోయే ముందే ఆ టిక్కెట్లు ఇచ్చి వెళ్ళాడని, ఆ డబ్బుకి జార్జి మా నాన్నకి అమ్ముడు పోయి, నన్ను తిరస్కరించాడని జార్జి తండ్రి చెప్పాడు."

దుఃఖంతో లవ్ డే ఆ తర్వాత కొద్దిసేపు మాట్లాడ లేకపోయింది. మెలిస్సా ఆమె తేరుకునేదాకా వేచి ఉంది.

''మా నాన్న వ్యాపారంలో ఓ లావాదేవిని ఎలా నిర్వహిస్తాడో, నా ప్రేమ విషయంలో కూడా ఆ లావాదేవీని అలాగే నిర్వహించాడు. మరెన్నడూ జార్జి ఇంగ్లండ్ తిరిగి రాకూడదనే మాట

తీసుకుని వారి టిక్కెట్లకి డబ్బు ఇచ్చాడు. జార్జి నన్ను నిజంగా ప్రేమించాడు. కానీ తన కుటుంబ సభ్యులు ఆకలితో పస్తు ఉండకూడదని, తను ప్రేమించిన యువతిని త్యాగం చేసాడు. ఆ రోజు ఆ సంగతి తెలిసాక నా ఆవేదన ఎలా ఉందో మీకు వివరించనక్కర్లేదు. దాదాపు ఇప్పుడు మీలో ఉన్న ఆవేదనే అది."

మెలిస్సాకి జాక్ గుర్తుకు రాగానే ఆమె మనసు బాధతో కలుక్కుమంది.

"మీ బాధని నేను అంతం చేయగలను.'' లవ్ డే చెప్పింది.

''ఎలా?''

''నాతో రండి.''

''ఎలా?''

"నేను నా బాధ నించి సాంత్వనని పొందింది ఇక్కడే. నా తండ్రి మీద పగ తీర్చుకుంది కూడా ఇక్కడే. నువ్వు కూడా ఇక్కడే జాక్ మీద ప్రతీకారం తీర్చుకో.'' ఈదురు గాలిలో లవ్ డే పెద్దగా అరిచి చెప్పింది.

మెలిస్సా మనసు ఆలోచించడం మానేసింది.

''కిందికి దూకక్కర్లేదు. నాలా ముందుకి వంగు. ఇలా. ఇంకొంచెం ముందుకి. నీ శరీరం బరువే మిగతాదంతా చేస్తుంది. అందుకు ఒక్క క్షణం చాలు. తర్వాత నువ్వు కూడా బాధ నించి విముక్తురాలివి అవుతావు."

మెలిస్సాకి తను గాలిలో ఓ ఈకని అనే భావన కలిగింది. లవ్ డేని అనుసరిస్తూ నెమ్మదిగా, ప్రశాంతంగా కింది అగాధం వైపు ఒంగింది.

''ఒద్దు.. మూర్ఖురాలా, ఆగు."

అకస్మాత్తుగా మెలిస్సా నడుంని రెండు బలమైన హస్తాలు చుట్టుకుని వెనక్కి లాగాయి. కానీ లవ్ డే ఆగలేదు. ఆమె అగాధంలోకి పడిపోయింది. లవ్ డే పెట్టిన భయంకరమైన కేక మెలిస్సాకి జీవితాంతం గుర్తుండిపోయింది.

విలియం రిక్ఫోర్ట్ ఏడుస్తున్న మెలిస్సాని ఇంట్లోకి నడిపించుకుని తీసుకెళ్ళాడు.

"ఆమె ఎవరు?" తేరుకున్నాక మెలిస్సా అడిగింది.

"ఎవరు ఎవరు?" విలియం అర్థం కాక ప్రశ్నించాడు.

"ఆ అమ్మాయి. లవ్ డే నా చేతిని పట్టుకున్న అమ్మాయి."

అతను తల అడ్డంగా ఊపి చెప్పాడు.

"అమ్మాయి ఎవరూ లేరు. నీకు ఏదో పీడ కల వచ్చింది. నిద్రలో నడిచి వచ్చావు."

విలియం ఇంట్లోని స్విచ్లన్నీ వేసి, లైట్లని వెలిగించాడు. పాలల్లో విస్కీని కలిపి ఇచ్చాడు. తను నిజంగా కల కన్నదేమో అని మెలిస్సాకి అనిపించింది. మెలిస్సా ఆ షాక్ లోంచి తేరుకునే దాకా ఉండి అతను వెళ్తూ చెప్పాడు.

"రేపు ఉదయం మళ్ళీ వస్తాను."

అతను వెళ్ళాక మెలిస్సా ఎలక్ట్రిక్ బ్లాంకెట్ కింద వెచ్చగా పడుకుని విస్కీ వల్ల కలిగిన మత్తులో నిద్రలోకి జారుకుంటూ "లవ్ డేని తను కలలో చూసింది" అనుకుంది.

* * *

మర్నాడు నూతన సంవత్సరం మొదటి రోజు. మెలిస్సా లేచి బ్రేక్ ఫాస్ట్ చేసుకుంది. చలిగాలి తగ్గింది. జాక్ గురొచ్చినప్పుడల్లా బాధ కలిగింది. విలియం మాటలు వింటూంటే తనలోని బాధ

తగ్గుతోంది. తను అనుకున్నట్లుగానే జేమ్స్ హౌస్లో మరో మూడు రోజులు గడపాలనుకుంది. అందువల్ల తన ఆవేదన తగ్గచ్చని కూడా అనిపించింది.

షాల్వా కప్పుకుని వాకింగ్కి బయటకి వచ్చింది. గత రాత్రి చూసిన తగరపు గని నోరు తెరుచుకుని చూస్తూ కనిపించింది. మెలిస్సా ఆ చిన్న చర్చి ఆవరణలోకి వెళ్ళి ఆసక్తిగా సమాధి రాళ్ళని చూడసాగింది. మొదటి సమాధిరాయి మీద చెక్కిన అక్షరాలని చదివింది.

ఇక్కడ లవ్ డే రిక్ఫోర్ట్ అవశేషాలు ఉన్నాయి. పుట్టింది 1-8-1857. గని ప్రమాదంలో మరణించింది 15-5-1875. ఆమె ఆత్మకి శాంతి కలుగు గాక! పద్దెనిమిదేళ్ళే!

ఆమె శవాన్ని ఇక్కడ పాతి పెడుతూంటే ఆమె తండ్రి ఎంత బాధపడి ఉంటాడో అనుకుంది. అదే ఆమె తన తండ్రి మీద తీర్చుకున్న ప్రతీకారం అనుకుంది. పక్కనే ఉన్న ఇంకో సమాధి రాయి మీద రాసి ఉన్నది చదివింది.

విలియం రిక్ఫోర్ట్ జ్ఞాపకార్థం 1824-1877

తన కూతురి మరణానికి కారణమై, తనని తను క్షమించుకోలేక, బద్దలైన హృదయంతో మరణించాడు.

* * *

మెలిస్సా నాలుగో రోజు పుంజుకున్న మానసిక శక్తితో, ఆనందంగా జేమ్స్ హౌస్ నించి లండన్కి చేరుకుంది.

మరో సారి చూడాలనుకున్నా ఆమెకి విలియం రిక్ఫోర్డ్ మళ్ళీ కనబడలేదు.

# మిస్టరీ టూర్ - రాబర్ట్ బార్నార్డ్

"నా పేరు రోజర్ ప్రెస్కాట్. మీ హోటల్కి నిన్న ఫోన్ చేసి గదిని రిజర్వ్ చేసాను."

రిసెప్షనిస్ట్ అతని వంక బద్ధకంగా చూసి రిజిస్టర్లో వెదికి తల అడ్డంగా ఊపింది.

"సారీ. మీ పేర రిజర్వేషన్ లేదు." ఆమె అనాసక్తిగా చూస్తూ చెప్పింది.

"మీ సూపర్వైజర్తో మాట్లాడుతాను."

పది నిమిషాలు వేచి ఉన్నాక లావుగా, పొట్టిగా ఉన్న మేనేజర్ వచ్చి అడిగాడు.

"మీరు అమెరికా నించి వచ్చిన బృందానికి చెందిన వాళ్ళా?"

"కాదు."

"మీకు రిజర్వేషన్ లేదు. ఐనా ఇందాకే ఖాళీ అయిన సింగిల్ రూమ్ని ఇవ్వగలను. రూమ్ నంబర్ 314."

"సరే. థాంక్స్. నా సూట్ కేస్ని నా గదికి పంపుతారా?" ప్రెస్కాట్ అభ్యర్థించాడు.

"మీకు ఆరోగ్యం బాగా లేదా?" మేనేజర్ ఆశ్చర్యం నటిస్తూ అడిగాడు.

సూట్ కేస్తో ప్రెస్కాట్ లిఫ్ట్ దగ్గర వేచి ఉన్నప్పుడు ఛాతీకి ప్లాస్టిక్ బేడ్జెస్ పెట్టుకున్న కొందర్ని చూసి వారు అమెరికన్ బృందానికి చెందిన వార్తై ఉంటారని అనుకున్నాడు.

చాలా హోటల్స్లో ఎదురయ్యే చేదు అనుభవాలే ఆ హోటల్లో కూడా అతనికి ఎదురయ్యాయి. ఆ గదిలో కార్పెట్ నించి చెడు వాసన వస్తోంది. వాల్ పేపర్ అక్కడక్కడ ఊడిపోయింది. కార్పెట్లో

చిరుగులు. పంపులో వేణ్ణీళ్ళు రావడం లేదు. వార్డ్ రోబ్ తలుపు చప్పుడు చేస్తూ తెరుచుకుంది. టి.వి పని చేయడం లేదు. పరుపు గట్టిగా ఉంది.

ప్రెస్కాట్ మంచం మీద కూర్చుని బ్రీఫ్ కేస్ లోంచి ఓ ఫారం బయటికి తీసాడు. అందులో రిసెప్షనిస్ట్ గౌరవం ఇచ్చిందా? రూమ్ సర్వీస్ బావుందా? గది లోని వస్తువులు సరిగ్గా పని చేస్తున్నాయా? మొదలైన కాలమ్స్ ముందు ఇంటూ గుర్తులే పెట్టాడు. గదిలోని వస్తువుల జాబితా ఎదురుగా ఇంటూ గుర్తు పెట్టాడు. టీ మేకింగ్ ఫెసిలిటీ ఎదురుగా 'లేదు' అని రాసాడు.

బ్రిటిష్ హోటల్ ఇండస్ట్రీ అసోసియేషన్, బ్రిటన్ లోని వివిధ హోటళ్ళకి కొందరు ఇన్స్పెక్టర్లని అతిథులుగా పంపి, ఆ హోటల్ యాజమాన్యం ప్రకటనల్లో పేర్కొన్న విధంగా సౌకర్యాలు అందుతున్నాయా?' అని తణిఖీ చేస్తారు. తమకి అందిన వివరాలని "బేడ్ హోటల్స్ గైడ్లో" ప్రచురిస్తారు. రోజర్ ప్రెస్కాట్ అలా వచ్చిన ఇన్స్పెక్టర్.

అతను తలుపు తాళం వేసి బయటికి వచ్చాడు. ఐదు నిమిషాల నడక దూరంలో ఎటు వెళ్ళినా దుకాణాల సముదాయం కనపడక పోవడంతో, దుకాణాల సముదాయం ఐదు నిమిషాల నడక దూరంలో అన్న కాలం ముందు కూడా ఇంటూ గుర్తు పెట్టాడు.

తర్వాత ఆ హోటల్ లోని రెస్టారెంట్కి వెళ్ళాడు. రోజర్ ఓ పుస్తకం చదువుతున్నట్లు నటిస్తూ, వెయిట్రస్ తన దగ్గరికి వచ్చి పలకరించడానికి పట్టిన సమయాన్ని నోట్ చేసుకున్నాడు. ఇరవై ఐదు నిముషాలు. చాలా ఎక్కువ టైం! టేబుల్ మీద చవకైన పేపర్ నేప్కిన్స్ తప్ప బట్ట నేప్కిన్స్ లేవు. ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో అచ్చైన మెనూ లోంచి కొన్ని ఐటమ్స్ని ఆర్డర్ చేసాడు. చేప తాజాది కాదు. కేలీఫ్లవర్ కూడా. నిమ్మ రసం ఎక్కువ పిండారు. ఫ్రెంచ్ ఫ్రైస్ జిడ్డుగా, మెత్తగా ఉన్నాయి. ఏదీ రుచి లేదు.

ఆశ్చర్యంగా వెయిట్రస్ మాత్రం అందంగా ఉంది.

''నువ్వు ఎక్కడి నించి వచ్చావు? నీ పేరేమిటి?" వైన్ బాటిల్ని ఆర్డర్ ఇచ్చి ఆమెని అడిగాడు.

‘‘గోట్ బార్గ్, స్వీడన్. నా పేరు సిల్వియా. మా స్వీడిష్ రాణి పేరే నా పేరు.’’

"లండన్లో ఏం చేస్తున్నావు?’’

"ఇంగ్లీష్ నేర్చుకుంటున్నాను. బ్రిటిష్ ఇంగ్లీష్ మాట్లాడే ప్రయత్నం చేస్తున్నాను."

ఆమె వైన్ తీసుకు వచ్చాక అడిగాడు.

"ఇదేమిటి? బాటిల్ని తెరిచే తెచ్చావేం? నా ముందు తెరవాలి కదా?’’

"కొందరు కస్టమర్స్ ఇలాగే కోరుకుంటారు."

కొద్దిగా వైన్ని రుచి చూసి సీసాలోని ఆ స్పానిష్ టేబుల్ వైన్ చవక వైన్తో మార్చబడిందని గ్రహించాడు. దాంతో పాటు ఇచ్చిన చిప్స్ సాగుతున్నాయి.

"రెస్టేరెంట్ మూసేసాక ఏం చేస్తావు?" సిల్వియాని అడిగాడు.

"నా బాయ్ ఫ్రెండ్తో గడుపుతాను.’’ వంట గది తలుపు వంక చూస్తూ చెప్పింది.

ప్రెస్కాట్ కూడా అటు వైపు చూస్తే, ఛాతీ మీద దట్టమైన వెంట్రుకలు కనపడేలా షర్ట్ గుండీలని విప్పిన నల్ల యువకుడు తన వంక అనుమానంగా చూస్తూ కనిపించాడు.

‘‘ఇక్కడ నీ పని అయ్యాక రూమ్ నంబర్ 314కి రావచ్చు. మళ్ళీ ఇంత ముడుతుంది." బిల్లు ఇచ్చాక టిప్ని పెద్ద మొత్తంలో ఇచ్చి ప్రెస్కాట్ చెప్పాడు.

గదికి తిరిగి వచ్చాక భోజనం పరమ చెత్తగా ఉందని, వెయిట్రెస్ ఫ్రెండ్లీగా ఉందని రాసాడు. సూట్ కేస్ లోంచి స్కాచ్ విస్కీ బాటిల్ని తీసి బాత్ రూమ్లోకి వెళ్ళి, పంపు లోని నీరు కలుపుకుని ఓ గుక్క తాగాక తలుపు చప్పుడు వినిపించింది.

వెళ్ళి తలుపు తీసాడు. ఎదురుగా సిల్వియా బదులు ఆ నల్ల యువకుడు. వచ్చీ రాని తప్పుడు ఇంగ్లీష్లో ఉగ్రంగా చెప్పాడు.

“నువ్వు నా గర్ల్ ఫ్రెండ్తో ఏం మాట్లాడావు? నిన్ను చంపేస్తాను. నా నించి ఆమెని ఈ రాత్రి దూరం చేస్తావా? ఆమె వేశ్య అనుకున్నావా? నీ రక్తం కళ్ళ చూస్తాను."

అతని చేతిలోని మాంసాన్ని కోసే కత్తి ప్రెస్కాట్ గొంతు కిందికి వచ్చింది.

ప్రెస్కాట్ అతన్ని పక్కకి తోసి "హెల్ప్” అని అరుస్తూ బయటికి దూకి మెట్ల మీంచి కిందకి పరిగెత్తాడు. యూస్టన్ స్టేషన్కి చేరుకున్నాక కాని అతను శాంత పడలేదు.

* * *

"నా పేరు రిప్లే. మా గ్రూప్కి మీరు ప్రామిస్ చేసిన అనుభవం నాకు కలగలేదు. మిగిలిన వాళ్ళని పట్టించుకుని నన్నెందుకు వదిలేసారు? ఇది మన ఒడంబడికని ఉల్లంఘించడమే.” అమెరికన్ గ్రూప్కి చెందిన రిప్లే మేనేజర్కి మర్నాడు ఫిర్యాదు చేసాడు.

"టోనీ.” మేనేజర్ కొన్ని క్షణాలు ఆలోచించి గట్టిగా పిలిచాడు.

ఆ నల్ల యువకుడు రాగానే రిప్లే ఫిర్యాదు మేనేజర్ అతనికి చెప్పాడు. "మీరు కోరినట్లుగానే నిన్న రాత్రి కత్తితో మీరు చెప్పిన గదికి వెళ్ళి సిల్వియా పేరు చెప్పి ‘చంపేస్తాను’ అని భయపెట్టాను." ఆ యువకుడు మేనేజర్కి చెప్పాడు.

"నా గదిలోకి ఎప్పుడు వచ్చావు? నన్నెప్పుడు బెదిరించావు?” రిప్లే అడిగాడు. “మీ గది నంబర్ 314 కదా?” టోనీ అడిగాడు.

“కాదు. 341. మా మిస్టరీ టూర్లో 314లో ఎవరూ లేరు." రిప్లే చెప్పాడు.

“ఓ! అలా ఐతే 314 లోని ప్రెస్కాట్ చెక్ అవుట్ చేయకుండా, సామాను తీసుకెళ్ళకుండా ఎందుకు పారిపోయాడో ఇప్పుడు అర్థమైంది. పాపం. మీ బదులు అతన్ని అనవసరంగా థ్రిల్కి గురి చేసాం. సామాను కోసం అతను మళ్ళీ తిరిగి వస్తాడు అనుకోను.” మేనేజర్ నవ్వుతూ చెప్పాడు.

---

## హలో!త్రిబుల్ నైన్? - హిల్లరీ బోనర్

టౌన్ టన్ పోలీస్ స్టేషన్కి వెళ్ళి అమీ డెస్క్ క్లర్క్తో చెప్పింది.

"మా వీధిలో పిల్లలకి డ్రగ్స్ని అమ్మే ఒకతన్ని ఓ మూల ఇవాళ చూసాను."

పెర్కిన్స్ అనే కానిస్టేబుల్ ఆమెని ఒక గదిలోకి తీసుకెళ్ళి ప్రశ్నించాడు. అమీ తన పేరు, అడ్రస్ చెప్పగానే అతని మొహంలో కొద్దిగా విసుగు కనిపించింది.

"డ్రగ్స్ అమ్మే అతను పొట్టిగా ఉన్నాడు. ఎర్ర రంగు జుట్టు. ఎడమ బుగ్గ మీద మచ్చ ఉంది. అతన్ని ఎవరో జాకీ అని పిలుస్తూండగా విన్నాను."

“ఈ సమాచారం చాలు మేడం. థాంక్యూ వెరీ మచ్."

“అతని మోటార్ సైకిల్ నంబర్ రాసుకున్నాను." ఆ కాగితాన్ని హేండ్ బేగ్లోంచి తీసిచ్చి చెప్పింది.

రెండు రోజుల తర్వాత అమీ పెర్కిన్స్కి ఫోన్ చేసి జాకీని పట్టుకున్నారా అని అడిగింది.

"మీరు ఇచ్చిన మోటార్ సైకిల్ నంబర్ శవాన్ని తీసుకెళ్ళే ఓ స్థానిక ఫ్యూనరల్ హోమ్ వాహనం నంబర్.”

"ఐ యాం సారీ. నేను రాసుకునేప్పుడు పొరపాటు పడి ఉంటాను. మీరు వాడ్ని తప్పక పట్టుకోవాలి." అర్థించింది.

"జాకీని మేము ఎలాగైనా పట్టుకుంటాం." పెర్కిన్స్ చెప్పాడు.

కొన్ని నెలలు గడిచినా పెర్కిన్స్ నించి జాకీని పట్టుకున్నామన్న సమాచారం లేదు. ఆమె తన భర్త డ్రేక్కి ఆ విషయం ఫిర్యాదు చేసింది. అతను విని ఊరుకున్నాడు తప్ప ఏం మాట్లాడలేదు.

* * *

అమీ ట్రిబుల్ నైన్ (మన దేశంలో 100) నంబర్కి ఫోన్ చేసి ఆదుర్దాగా చెప్పింది.

"మా పక్కింట్లో అంటే నంబర్ ముప్పై ఒకట్లో ఇప్పుడు దొంగతనం జరుగుతోంది."

అవతలి వైపు ఆమె అడ్రస్ అడిగి రాసుకున్నారు. పది నిమిషాల్లో వచ్చిన పోలీస్ స్క్వాడ్ కార్లోంచి ఇద్దరు పోలీస్ ఆఫీసర్లు దిగారు. ఒకరు యూనిఫాంలో, మరొకరు సూట్లో ఉన్నారు. వారు ఇంటి నంబర్ ముప్పై ఒకటి ముందు ఆగి కిటికీలోంచి చూసి చివరకి ఆ ఇంటి బెల్ని నొక్కారు. కొద్దిసేపటికి సన్నగా పొడుగ్గా ఉన్న ఒకతను అలసట మొహంతో తలుపు తీయడం, మఫ్టీలోని పోలీస్ ఆఫీసర్తో మాట్లాడటం అమీ గమనించింది. వారిద్దరూ లోపలకి వెళ్ళి, నాలుగైదు నిమిషాల్లో బయటికి వచ్చి అమీ ఇంటి తలుపు తట్టారు.

"నా పేరు డిటెక్టివ్ సార్జెంట్ విల్లిస్. మీరు ఏం చూసారో వివరంగా చెప్పండి." కోరాడు.

"పక్కింటి ముందు సామాను వేసుకెళ్ళే తెల్లటి వేన్ ఆగి ఉండడం నేను చూసాను. మా పక్కింటి రాబ్సన్ ఆఫీస్కి వెళ్ళాకే ఇది జరిగింది. అరగంట తర్వాత కిటికీలోంచి చూస్తే ఇద్దరు ఆ ఇంట్లోంచి పెద్ద సూట్ కేస్లని, టి.వి.ని వేన్ లోకి ఎక్కించడం కనపడింది. దాంతో నేను మీకు ఫోన్ చేసాను. వారిలో ఒకతను ఆరడుగుల పొడవు, నీలం రంగు జీన్స్, గోధుమ రంగు లెదర్

జాకెట్ వేసుకుని ఉన్నాడు. మీసాలు లేవు. రెండో అతని వయసు ఇరవై ఉండచ్చు. మీసం, గడ్డం ఉన్నాయి. ఎందుకైనా మంచిదని నేను ఆ వేన్ నంబర్ని రాసుకున్నాను."

‘‘మిసెస్ అమీ! మీ పొరుగాయన మిస్టర్ రాబ్సన్ ఇవాళ ఆఫీసుకి వెళ్ళలేదు. తమ ఇంట్లో ఎలాంటి దొంగతనం జరగలేదని చెప్పాడు."

‘‘కాని నేను చూసిందే నేను చెప్పాను."

‘‘లేదా చూసాననుకుని ఊహించింది చెప్పుంటారు. అవునా?’’

అమీ ఇచ్చిన వేన్ నంబర్ గురించి ఆమె ఎదురుగానే ఫోన్ చేసి విచారించి విల్లిస్ ఆమెతో కఠినంగా చెప్పాడు.

"మీరు చెప్పిన నంబర్ ఓ తెల్లటి బెంట్లీ కార్ది. అది వేన్ కాదు. సింగిల్ డోర్ కారు. అది సోమర్సెట్ వెడ్డింగ్ కార్స్ అనే కార్లని అద్దెకి ఇచ్చే కంపెనీకి చెందింది. మీరు గతంలో కూడా మూడు సార్లు పోలీసులకి తప్పుడు సమాచారం ఇచ్చారు."

"ఐతే ఈసారి నా కళ్ళ ముందు ఏ నేరం జరిగినా బ్రిటన్ పౌరురాలిగా నేను పోలీసులకి ఫిర్యాదు చేయను. ఐనా వాళ్ళ నంబర్ ప్లేట్ని మార్చి ఉంటారు. నేరం జరిగిందో లేదో విచారించి తెలుసుకోవాల్సింది మీరు తప్ప నేను కాదు.’’ బాధగా చెప్పింది.

‘‘అలా అని నేను అనలేదు. కాని పోలీసుల సమయం వృధా చేయడం నేరం.’’ విల్లిస్ కంఠంలో ఈ సారి పూర్వపు కఠినత్వం లేదు.

* * *

ఆర్నెల్ల తర్వాత అమీ ట్రిబుల్ నైన్ నంబర్కి మళ్ళీ డయల్ చేసింది.

"ఓ స్కూలు విద్యార్థిని ఇద్దరు బలవంతంగా రేంజ్ రోవర్ వేన్లోకి ఎక్కించడం ఇప్పుడే చూసాను…. సెయిన్స్బరీ నించి మాట్లాడుతున్నాను.... ఆ వాహనం హైవే వైపు వెళ్ళింది.... ఆ కారు నంబర్ రాసుకున్నాను...."

ఆ రాత్రి డ్రేక్, అమీ కలిసి భోజనం చేస్తూంటే తలుపు కొట్టిన చప్పుడు వినిపించింది. డ్రేక్ వెళ్ళి తలుపు తెరిస్తే, ఎదురుగా సూట్లో ఒకతను, పోలీస్ యూనిఫాంలో సార్జెంట్ కనిపించారు.

“అమీతో మాట్లాడాలి."

డ్రేక్ ఆశ్చర్యంగా చూస్తూ వారిని లోపలికి ఆహ్వానించాడు. విల్లిస్ని అమీ గుర్తు పట్టలేదు కానీ, అతను ఆమీని గుర్తు పట్టాడు.

"మీరు ఇవాళ ఉదయం మాకు ఫోన్ చేసి స్కూలు విద్యార్థిని ఒకమ్మాయి కిడ్నాప్ అయిందని ఫిర్యాదు చేసారా?" అడిగాడు.

“అవును. ఆమెని రక్షించారా?" అమీ ఆదుర్దాగా అడిగింది.

ఆ మాటలు విన్న డ్రేక్ నిర్ఘాంతపోయాడు.

“టౌన్టన్లోని ఏ విద్యార్థినీ మిస్సవలేదు. మీరు చెప్పిన వాహనం నంబర్ టౌన్టన్ కౌన్సిల్లో చెత్తని సేకరించే వాహనం నంబర్ మిసెస్ అమీ! ఇదివరకే హెచ్చరించాను. పోలీసుల సమయాన్ని వృథా చేసినందుకు మిమ్మల్ని నేను అరెస్ట్ చేయక తప్పదు.”

వెంటనే డ్రేక్ ఆందోళనగా విల్లిస్తో చెప్పాడు.

“నేను చెప్పేది వినండి. నా భార్యకి సంవత్సరం నించి మనఃస్థిమితం లేదు. తరచూ తను చూసిన ఇలాంటి ఓ నేరం గురించి నాకు ఫిర్యాదు చేస్తూంటుంది. అందులో నిజం ఉండదు.

కానీ అది నాకే పరిమితం అనుకున్నాను. నేను వచ్చే నెలలోనే రిటైర్ అవుతున్నాను. ఆమెని అరెస్ట్ చేస్తే ఆఫీస్లో నా పరువు పోతుంది.''

"మిస్టర్ డ్రేక్! మీరు ఇంతదాకా మీ భార్యని సైక్రియాట్రిస్ట్కి చూపించలేదా?''

‘‘లేదు. ఇప్పుడు చూపించాలన్న సంగతి నాకు అర్థమైంది." డ్రేక్ జవాబు చెప్పాడు.

‘‘సరే. ఈ సారికి వదిలేస్తున్నాను. ఇంకో సారి ఇలా జరిగితే ఆమె ట్రీట్మెంట్ రికార్డ్ నాకు చూపిస్తే తప్ప నేను ఆమెని వదలను. ఇవాళ ఆ ఫిర్యాదు అందాక నలుగురు కానిస్టేబుల్స్ దాని మీద పని చేసారు. వారి తలో ఆరు పనిగంటలు వృథా అయ్యాయి."

నేను చెప్పింది నిజం. నా భర్తకి నేను తప్ప బంధుమిత్రులు ఎవరూ లేరు. నేను ఆయనకి దూరమైతే ఆయన జీవించడం కష్టం అని నాకు తెలుసు. అలాంటప్పుడు నేనెందుకు తప్పుడు ఫిర్యాదు చేసి జైలుకి వెళ్ళాలని అనుకుంటాను?" అమీ ప్రశ్నించింది.

విల్లిస్ జవాబు చెప్పకుండా ఆమె వంక సానుభూతిగా చూసి బయటికి నడిచాడు.

రెండు నెలల తర్వాత అమీ నించి ట్రిబుల్ నైన్కి ఓ ఫిర్యాదు అందింది.

"మా ఎదురింట్లోంచి పొగ వస్తోంది. వెంటనే ఫైరింజన్ని పంపండి.''

కొద్ది క్షణాల తర్వాత మళ్ళీ ట్రిబుల్ నైన్కి ఇంకో ఫోన్ కాల్ వచ్చింది.

"నేను ఫిర్యాదుదారు అమీ భర్త డ్రేక్ని. మతి స్థిమితం లేని నా భార్య చేసిన ఆ ఫిర్యాదు విన్నాను. అది తప్పని దాన్ని పట్టించుకోవద్దని చెప్పడానికి ఫోన్ చేస్తున్నాను."

* * *

మరో ఐదు నెలల తర్వాత విల్లిస్కి ట్రిబుల్ నైన్ నించి ఓ సమాచారం అందింది.

"అమీ అనే ఆమె భర్త డ్రేక్ని ముగ్గురు వ్యక్తులు ఇంటికి వచ్చి కిడ్నాప్ చేసారట. వారు రష్యన్ భాషని మాట్లాడడం విన్నదిట. ప్రభుత్వాధికారిగా రిటైరైన ఆయన్నించి ప్రభుత్వ రహస్యాలు తెలుసుకోవడానికి కిడ్నాప్ చేసారని చెప్పింది. కారు నంబర్ కూడా ఇచ్చింది."

గంటన్నర తర్వాత విల్లిస్ కోపంగా అమీ ఇంటి తలుపు తట్టాడు.

"నా భర్తని విడిపించారా?" అమీ ఆదుర్దాగా అడిగింది.

"మీరిచ్చిన కారు నంబర్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ది. మీతో కాదు. నేను మీ భర్తతో మాట్లాడడానికి వచ్చాను."

"ఆయన్ని రష్యన్ గూఢచారులు కిడ్నాప్ చేసారని చెప్పాగా? అతను ఇల్లంతా తిరిగి చూసినా డ్రేక్ కనపడలేదు. అతని దుస్తులు, బూట్లు, సూట్ కేసు కూడా లేదు. మతి స్థిమితం లేని అమీని అరెస్ట్ చేయడానికి విల్లిస్కి మనసు ఒప్పలేదు. ఆ తర్వాత అమీ నాలుగైదు సార్లు విల్లిస్కి ఫోన్ చేసి, 'తన భర్తని కనిపెట్టారా?' అని అడిగింది. ఆమెతో వేగలేక ఆమె భర్త ఆమెని వదిలి వెళ్ళిపోయాడని విల్లిస్ భావించాడు.

కాని అమీ మేధావి. తన భర్తని చంపి అతని శవాన్ని తన ఇంటి వెనకే పాతిపెట్టింది. తన భర్త కనపడకపోతే పోలీసులు చేసే హడావిడి ఉండదని ఆ పథకం వేసింది. ఆమె భర్త పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్ వగైరాలన్నీ కొట్టేయడమే అతని హత్యకి కారణం. ఈ సంగతులేమీ ఆ కేస్ని మూసేసిన విల్లిస్కి తెలీవు.

---

## సముద్రయానం - డొనాల్డ్ ఇవెస్ట్లేక్

సముద్ర ప్రయాణాలు మార్టిన్కి కొత్త కాకపోయినా ఓడ అటూ, ఇటూ ఊగడానికి అతను ఇంకా అలవాటు పడలేదు. ముఖ్యంగా రాత్రుళ్ళు. అందువల్ల అట్లాంటిక్ని దాటేప్పుడు అతనికి తక్కువ నిద్ర పడుతుంది. దాంతో ఇక అలసటతో కళ్ళు వాటంతట అవే మూత పడేదాకా నిద్ర

కోసం వేచి ఉండాల్సి వస్తుంది. అతనికి వ్యాపారం పని మీద తరచు అమెరికా వెళ్ళాల్సిన అవసరం ఏర్పడుతూంటుంది. భార్య అతన్ని విమానంలో వెళ్ళమని తరచూ తిడుతూంటుంది. కాని మార్టిన్కి విమాన ప్రయాణం అంటే మానసికంగా భయం. సముద్రంలోని ఓడ కుదుపులు కడుపులో, మెదడులో కూడా ఇబ్బంది పెట్టినా విమానం అంటే అతనికి గల తీవ్ర భయం వల్ల డోవర్ నించి న్యూయార్క్ దాకా సముద్ర ప్రయాణాన్ని భరిస్తాడు. కళ్ళు తెరచుకుని కేబిన్లో పక్క మీద పడుకుని పైకప్పు వంక చూస్తుండటం చాలా బాధాకరం.

చాలా సముద్ర ప్రయాణాల్లో మార్టిన్ ఓడ డెక్ మీద అటు, ఇటూ నడుస్తూ ఆకాశంలోని లక్షలాది నక్షత్రాలని లెక్క పెట్టే ప్రయత్నం చేస్తూంటాడు. ఇది అతను చేసే ఆఖరి ఓడ ప్రయాణం. ఆ తర్వాత అతను తన వ్యాపారాన్ని అమ్మేసి ఆస్ట్రియాకి వెళ్ళి రిటైర్మెంట్ జీవితాన్ని గడపాలని అనుకుంటున్నాడు.

మూడో రాత్రి అతనిలా నిద్ర పట్టని మరో ప్రయాణీకుడు డెక్ మీద తారసపడ్డాడు. న్యూయార్క్కి చెందిన ఆ మరో ప్రయాణీకుడి పేరు కూలీ. మార్టిన్ కన్నా చిన్న వాడైన అతనూ వ్యాపారస్తుడే. నలభై ఐదు - ఏభై ఏళ్ళు ఉంటాయి. అందరు ప్రయాణీకులు నిద్రిస్తూండగా వారు ఇద్దరూ ఖాళీ డెక్ మీద ఒకరితో మరొకరు కలివిడిగా మాట్లాడుకోసాగారు. అతనితో కొద్ది సేపు ముచ్చటించాక అతను తెలివి గల వాడని మార్టిన్కి అనిపించింది. ఒక్కోసారి అతను వేసే ముతక జోకులని వదిలేస్తే అతను మార్టిన్కి నచ్చాడనే చెప్పాలి.

రాత్రుళ్ళు డెక్ మీద నడుస్తూనో, అతని కేబిన్ ఉన్న డెక్ లోని బిలియర్డ్స్ గది లోనో గడిపేవారు. ఆ ఆట ఆ ఇద్దరికీ నచ్చిన ఆట. ఐతే ఎవరూ నిష్ణాతులు కారు. ఒకరికొకరు పోటీ కూడా కాదు కాబట్టి వారికి ఆట విసుగు అనిపించేది కాదు. ఎనిమిదో రాత్రి బయట బాగా చలిగా ఉంది. దాంతో వారు ప్రతీ తలుపునీ, కిటికీని మూసేసి, బిలియర్డ్స్ గదిలో సిగార్స్ని తాగుతూ సిగార్ పొగని భరిస్తూ గడిపారు.

వు గంట తర్వాత ఆ ఘోరోరం జరిగింది. ఇద్దరికీ పెద్ద పేలుడు శబ్దం వినిపించింది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలోని ఇంకా ఎవరూ స్వాధీనం చేసుకోని, అంతు చిక్కని మందు పాతర ఓడకి తగిలి ఉండచ్చు అని మార్టిన్ అనుకున్నాడు. అది ఏమైనా ఆ రాత్రి నిశ్శబ్దం ఆ శక్తివంతమైన అధిక శబ్దం వల్ల ఓడ అకస్మాత్తుగా ఛిద్రమైంది. వారి ఓడ హింసాత్మకంగా వణికిపోయింది. అకస్మాత్తుగా వారు ఇద్దరూ నేల మీదకి విసిరి వేయబడ్డారు. బిలియర్డ్స్ బంతులు చెల్లాచెదురుగా కింద పడ్డాయి.

తర్వాత ఓడ నిశ్చలమై అంతా నిశ్శబ్దం. మార్టిన్ మెయిన్ డోర్ వైపు చూస్తే దాని అద్దం లోంచి డెక్ మీద తెల్ల గౌన్లోని ఒకామె భయంతో పాలిపోయిన మొహంతో అరుస్తూ కనిపించింది. ఆమె నోరు తెరచుకుని ఉండటం వల్ల అరుస్తోందని గ్రహించాడు కాని ఆ అరుపు వినపడలేదు. అకస్మాత్తుగా ఓడ మళ్ళీ ఇంకో వైపుకి ఒరిగింది. దాంతో డెక్ మీది నుండి ఆమె చీకట్లో సముద్రంలోకి పడిపోవడం మార్టిన్ చూసాడు. ఇప్పుడు సముద్రపు అలలు కిటికీల అద్దాలని తాకుతున్నాయి. ఓడ మునిగి పోతోందని కిటికీ లోంచి కనబడే నీళ్ళని బట్టి మార్టిన్ గ్రహించాడు. మరి కొద్ది క్షణాల్లో తను మరణిస్తాడని కూడా అనుకున్నాడు. మరో సారి- ఆఖరి సారి - ఓడ కదిలి చివరికి మళ్ళీ నిశ్చలం అయిపోయింది. నేల ఏటవాలుగా ఉండటంతో బిలియర్డ్స్ బంతులన్నీ వాలు వైపుకి జారాయి. మార్టిన్ మూలుగుతున్న కూలీ దగ్గరకి వెళ్ళి చేతిని అందించి పైకి లేచేందుకు సహాయం చేసాడు. అతనికి ఏం జరిగిందో మొదట అర్ధం కాలేదు.

"నా తల ఓడ నేలకి తాకింది." కూలీ చెప్పాడు.

‘‘ఓడ ఎంత లోతుకి మునిగిందో, ఉపరితలం ఎంత పైన ఉందో మనకి తెలీదు.’’ మార్టిన్ చెప్పాడు.

"ఎక్కువ లోతుకి దిగలేదు. లేదా నీటి వత్తిడికి కిటికీ అద్దాలు పగిలిపోయేవి. మనం నీళ్ళల్లోకి వెళ్ళి పైకి ఈదుకుంటూ వెళ్ళగలమా?" కూలీ అడిగాడు.

‘‘ఈ వయసులో నేనా ధైర్యం చేయలేను. ఎంత పైకి ఈదాలో తెలీదు. ఈ లోగా ఊపిరి బిగబట్టే శక్తి ఉండకపోవచ్చు." మార్టిన్ దాన్ని నిరాకరించాడు.

‘‘ఎంత మంది ఉన్నారో? ఎంత మంది పోయారో? ఆహ్! మరణించడానికి ఇదేం దారి?’’ కూలీ బాధగా చెప్పాడు.

‘‘మనం చావక పోవచ్చు. ఇంకొందరు జీవించి బయట పడి ఉంటారు. వాళ్ళని కాపాడతారు. తర్వాత మనల్ని కూడా కాపాడుతారు. మనం ఇక్కడ ఉన్నామని ఊహించి డైవర్స్ ఇక్కడికి వస్తారు." మార్టిన్ ధైర్యం చెప్పాడు.

"నీటి గర్భంలోకి వచ్చామా? నిజంగా డైవర్స్ ఇక్కడికి వస్తారంటారా?" కూలీ నమ్మలేనట్లుగా అడిగాడు.

‘‘డైవర్స్ని తప్పకుండా పంపుతారు."

‘‘ఒక వేళ ఎవరూ జీవించి ఉండకపోతే?’’

"అప్పుడు మనం మరణించిన వారితో సమానం. మనం కూడా పోయామనే వారు భావిస్తారు.’’

"అది తెలుసకోడానికి మనం వేచి ఉండాలి." కూలీ నిస్పృహగా చెప్పాడు.

‘‘అవును. అంతకి మించి మనం మాత్రం ఏం చేయగలం?’’

ఓ అరగంటాగి కూలీ బయటి నీళ్ళ వంక చూస్తూ చెప్పాడు.

‘‘ఈ సస్పెన్స్ని భరించలేను. తలుపు తెరిస్తే చాలు.’’

మార్టిన్ అతని వంక చురుగా చూస్తూ అడిగాడు.

"మీరు అంత తేలిగ్గా చావుకి లొంగిపోతారా?''

‘‘లేదు." అతను నవ్వుతూ చెప్పాడు.

అకస్మాత్తుగా లైట్లు ఆరి వెలిగాయి. అలా మూడు సార్లు ఆరి వెలిగాక బల్బులన్నీ ఆరిపోయాయి. ఇప్పుడు వారు కటిక చీకటిలో, సముద్ర గర్భంలో ఉన్నారు.

మార్టిన్ తన భార్యాపిల్లల గురించి ఆలోచిస్తున్నాడు. రెండు ఖండాల్లోని తన మిత్రులు, బంధువులు, ఇంకా భూమి, గాలి, ప్రాణాల గురించి. ఇద్దరూ ఒకరికొకరు ఆ చీకట్లో కనపడక పోవడంతో సంభాషించకుండా నిశ్శబ్దంగా ఉండిపోయారు.

అలా ఎంత సేపు కూర్చున్నారో ఇద్దరికీ తెలీకుండానే లోపలకి స్వల్పంగా వెలుగు ప్రవేశించింది. ఆ గదిలోని వస్తువుల ఆకారాలని మార్టిన్ అలుక్కుపోయినట్లుగా చూడగలిగాడు. కూలీ ఓ కుర్చీలో కూర్చుని ఉండటం కనిపించింది. అతను నెమ్మదిగా లేచి చెప్పాడు.

"సూర్యోదయమైనట్లుంది. ఉపరితలం మీద పడే ఎండ వెలుగై ఉండచ్చు ఇది."

‘‘ఈ గదిలోని గాలి ఎంతకాలం ఉండచ్చని మీ ఉద్దేశం?'' మార్టిన్ కాసేపాగి అడిగాడు.

"నాకు తెలీదు. ఇది చాలా పెద్ద గది. మనం ఇద్దరమే ఇందులో ఉన్నాం. బహుశ మరణించడానికి మునుపు ఆకలికి అలమటించి ఆహారం లేకుండా నెమ్మదిగా మరణించచ్చు." కూలీ చెప్పాడు.

ఆకలి మరణం అనే ప్రమాదం పొంచి ఉందని అంత దాకా మార్టిన్కి తట్టలేదు. గాలి ఉంది కాని ఆ గదిలో ఆహారం లేదు.

కూలీ లేచి మంద్రకాంతి గల ఆ గదిలో అటూ, ఇటూ నడవసాగాడు. తర్వాత ఒళ్ళు విరుచుకుని గతంలోని తమ సంభాషణ ఇంకా కొనసాగుతున్నట్లుగా అడిగాడు.

"కొందరు ప్రాణాలతో ఉన్నారని, కొందరు డైవర్స్ వస్తారని నమ్ముదాం. వారు మనల్ని కాపాడటానికి రావడానికి ఎంత కాలం పట్టచ్చు?"

"ఉపరితలం మీది వారు ఈ రోజే కాపాడచ్చు." మార్టిన్ ఆశగా చెప్పాడు.

"డైవర్స్ రేపు రావచ్చు. వారం తర్వాత కూడా. లేదా రెండు నెలల తర్వాత." కూలీ నిస్పృహగా చెప్పాడు.

"ఏమో మరి? అది ఎవరు చెప్పగలరు?" అతని మాటల్లోని నిరాశావాదం తనకి నచ్చలేదని ధ్వనించేలా మార్టిన్ చెప్పాడు.

చాలా సేపటికి అకస్మాత్తుగా కూలీ నవ్వు ఆ గదిలోని నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ వినిపించింది. అది అసహజంగా, భయం కలిగేలా వినిపించి మార్టిన్ ఉలిక్కిపడ్డాడు. కూలీ తనలా శాంతంగా లేడని గ్రహించాడు.

"ఇదే కనక నవలో, సినిమానో ఐతే రక్షించే వాళ్ళు చివరి నిమిషంలో వస్తారు. సరైన సమయానికి. కాల్పనిక సాహిత్యం ఈ విషయంలో గొప్పది. విలువైనవన్నీ ఆఖరి నిమిషాల్లో జరిగేది సాహిత్యం. ప్రాణం పోవడానికి ఇంక ఒక్క నిమిషం ఉందనగా వస్తారు." కూలీ చెప్పాడు.

"మనం ఇంకే విషయాలైనా మాట్లాడదాం." మార్టిన్ అయిష్టంగా చెప్పాడు.

"అసలు మనం మాట్లాడద్దు."

కొద్ది సేపాగి కూలీ నేల మీంచి బిలియర్డ్స్ బంతులని తీసుకున్నాడు. ఆ మంద్రపు వెలుగులో అతను వాటిని గాల్లోకి ఎగరేసూ పట్టుకోవడం మార్టిన్ చూసాడు.

"నేను మన సమస్యని తేలిగ్గా పరిష్కరించగలను." కొద్ది సేపాగి కూలీ చెప్పాడు.

“ఎలా?” మార్టిన్ ఆశగా అడిగాడు.

“ఓ బంతిని కిటికీ అద్దం మీదకి విసిరి దాన్ని పగలకొట్టి."

వెంటనే మార్టిన్ ఉలిక్కిపడి అరిచాడు.

“ఒద్దు. వాటిని కింద ఉంచు. నీ ప్రాణాలని నువ్వు లెక్కచేయకపోవచ్చు కాని నాకు జీవించాలని ఉంది.”

కూలీ మళ్ళీ ఇందాకటిలా నవ్వి వాటిని బిలియర్డ్స్ బల్ల మీద ఉంచాడు. ఇంకాసేపు అటూ ఇటూ నడిచి తర్వాత మళ్ళీ కుర్చీలో కూలబడ్డాడు.

"నేను అలసిపోయాను. ఓడ కదలడం లేదు. నేను నిద్ర పోతాను.” చెప్పాడు.

కాని మార్టిన్ నిద్ర పోవడానికి భయపడ్డాడు. తను నిద్ర పోయే సమయంలో కూలీ బిలియర్డ్ బంతులని కిటికీ అద్దాల మీదకి విసిరి వాటిని పగల కొట్టి లోపలకి నీరు వచ్చేలా చేస్తాడనే భయంతో కూర్చుని కూలీ వంకే చూడసాగాడు. కాని చివరకి అతని కనురెప్పలు బరువుగా వాలిపోయాయి.

* * *

మార్టిన్ నిద్ర లేచేసరికి మళ్ళీ పూర్తిగా చీకటి. అర్ధరాత్రి అయుండచ్చని అనుకున్నాడు. కూలీ ఊపిరి తీసుకుని విడిచే శబ్దం వినిపిస్తోంది. అతను నిద్రలో ఉన్నాడని గ్రహించాడు.

మళ్ళీ వెలుగు వచ్చే సమయానికి మార్టిన్ నిద్ర లేచాడు. కొద్ది సేపటికి కూలీ ఏదో గొణగడం వినిపించింది.

పూర్తి మెలకువ వచ్చాక అతను లేచి చెప్పాడు.

"నాకు ఆకలి దంచేస్తోంది. గది గోడలు నా మీదకి వస్తున్నాయని అనిపిస్తోంది."

‘‘రక్షించేవారు బహుశ ఇవాళ వస్తారు." మార్టిన్ ధైర్యం చెప్పాడు.

‘‘లేదా వారు ఎప్పటికీ రాకపోవచ్చు. ఎప్పుడో మన అస్థిపంజరాల మీద వారి టార్చ్ లైట్ వెలుగు పడచ్చు."

కూలీ లేచి అటూ, ఇటూ నడవసాగాడు. తర్వాత ఆగి మార్టిన్ వైపు తిరిగి చెప్పాడు.

‘‘ఓ సారి నేను ఎక్కడో చదివాను. ఓ రోజు తినకపోతే మర్నాడు ఆకలి అధికంగా వేస్తుంది. ఆ తర్వాత ఆహారం లేకుండా ఒకటి, రెండు రోజులు గడిపాక ఆకలి బాధ ఇక ఉండదు. తగ్గిపోతుంది."

"అది నిజం కావచ్చు. నాకు నిన్న ఉన్నంత ఆకలి ఇవాళ లేదు." మార్టిన్ అంగీకరించాడు.

"కాని నాకు నిన్నటి కన్నా రెట్టింపు ఆకలి వేస్తుంది.కడుపులో తిమ్మిరులు. బాగా దాహంగా కూడా ఉంది.’’

అతను కిటికీ దగ్గరకి వెళ్ళి బయటి నీటి వంక పరిశీనలగా చూసి చెప్పాడు.

"నాకు దాహంగా ఉంది. కిటికీ తలుపుని తెరచి నీళ్ళని తాగితే?’’

"కిటికీ నించి దూరంగా జరుగు." మార్టిన్ అరిచాడు.

వెంటనే అతని దగ్గరకి వెళ్ళి పట్టుకుని కిటికీకి దూరంగా లాక్కెళ్ళాడు.

‘‘కూలీ! దయచేసి నీ మనసుని నీ ఆధీనంలో ఉంచుకో. మనం శాంతంగా, సహనంగా ఉంటే మన మీద మనకి విశ్వాసం కలిగి సహనంగా వేచి చూసే శక్తి కలుగుతుంది. మనం రక్షించబడచ్చని ఆలోచిస్తూండు. అసలు నీకు జీవించాలని లేదా?"

‘‘జీవించడం?'' కూలీ వైరాగ్యంగా నవ్వాడు.

కొద్ది సేపాగి కూలీ మళ్ళీ చెప్పాడు.

"మీకు తెలీదా? నేను మొన్ననే మరణించాను. నేను మరణించినా ఆ సంగతి నా పొట్టకి తెలీడం లేదు. పాడు బాధ! మార్టిన్. నన్ను నమ్ము ఈ ఆకలి బాధని తప్ప నేను దేన్నైనా భరించగలను. కడుపులోని ఈ బాధ పోవాలంటే నేనేదైనా తినాలి. వెంటనే ఆహారం దొరక్కపోతే నాకు పిచ్చెక్కుతుంది. అది నాకు తెలుసు."

మార్టిన్కి ఏం మాట్లాడాలో తోచక అతని వంకే చూడసాగాడు. కూలీ మూడ్స్ తక్షణమే ఎలాంటి కారణం లేకుండా మారసాగాయి. అకస్మాత్తుగా మళ్ళీ నవ్వాడు.

‘‘ఆహారం లేకుండా నకనకలాడే వారు ఆకలిని చల్లార్చుకోడానికి ఆఖరి పరిష్కారం ఒక్కటే ఉంది."

‘‘ఏమిటది?'' మార్టిన్ అడిగాడు.

"ఒకర్ని మరొకరు. అలా చాలా సార్లు జరిగింది కూడా."

మార్టిన్ అతని వంక భయంగా చూసాడు. తర్వాత గొంతు పెగుల్చుకుని అడిగాడు.

‘‘కూలీ. నువ్వు సరదాగా అంటున్నావా? లేక నిజంగా అంటున్నావా?’’ అతను మళ్ళీ నవ్వాడు.

"భయపడకు మార్టిన్. నేనా పని చేస్తానని అనుకోను. వండగలిగితే అప్పుడు ఆలోచిస్తాను. కాని పచ్చి మాంసం? లేదు. నాకు అంత ఆకలి వేస్తుందని అనుకోను."

అతని మూడ్ మళ్ళీ కొద్ది క్షణాల్లో మారింది. కఠినంగా చూస్తూ చెప్పాడు.

‘‘కాసేపట్లో ఈ రగ్గుని తింటాను. నా బట్టలని తింటాను...''

అతను ఆ తర్వాత నిశ్శబ్దంగా ఉండిపోయాడు. మార్టిన్ అతనికి సాధ్యమైనంత దూరంగా కూర్చున్నాడు. అతను ఆ రాత్రి నిద్ర పోదలచుకోలేదు. ఆ ఆకస్మిక పరిణామానికి కూలీకి మతి స్థిమితం తప్పిందని నమ్మాడు. ఉన్మాది ఏదైనా చేయగల సమర్థుడు. చీకటి పడబోతోందంటేనే మార్టిన్కి భయంగా ఉంది.

వారి మధ్య నిశ్శబ్దం అప్పుడప్పుడూ కూలీ అర్థం కాని గొణుగుడుతో భగ్నం అవుతోంది. చివరకి చీకట్లు అలుముకున్నాయి. కూలీ తన మీద దాడి చేస్తాడనే భయంతో మార్టిన్ అప్రమత్తంగా కూర్చున్నాడు. అతని శ్వాసని బట్టి నిద్ర పోయాడని అనిపించినా మార్టిన్ దాన్ని పూర్తిగా విశ్వసించలేదు. తను ఓ పిచ్చివాడితో ఖైదు చేయబడ్డాడు. అతన్నించి ప్రమాదం రాకుండా జీవించి ఉండాలంటే మెలకువగా ఉండాలి. రక్షించే వారు వచ్చేదాకా అతన్ని కనిపెట్టుకుని ఉండాలి. వాళ్ళు తప్పక వస్తారని ఆశావాదైన మార్టిన్ నమ్మాడు.

అతని భయం అతన్ని ఆ రాత్రి, మర్నాడు ఉదయం కూడా నిద్ర పోనీలేదు. కూలీ మాత్రం చాలా సమయం నిద్రిస్తూనే గడిపాడు. అతను లేచాక కాసేపు ఏదో నెమ్మదిగా గొణుగుతూ, కాసేపు నిశ్శబ్దంగా గడపసాగాడు.

మళ్ళీ రాత్రి చీకటి పడేసరికి మార్టిన్ ఇక నిద్రని ఆపుకోలేపోయాడు. మూడో రోజు కూడా వారి సమస్యకి పరిష్కారం లేకుండా గడిచిపోయింది. మార్టిన్ నరనరంలో భయం నిండి ఉన్నా నిద్రతో పోరాడినా చివరకి మంచు తెరలా నిద్ర అతన్ని చుట్టేసింది.

* * *

అకస్మాత్తుగా మార్టిన్కి మెలకువ వచ్చింది. వెలుతుర్ని బట్టి అది పగలని గ్రహించాడు. అతనికి ఊపిరి అందడం లేదు. ఎదురుగా నిలబడ్డ కూలీ చేతులు తన మెడ చుట్టూ బిగుసుకుని, తన ఊపిరి తిత్తులకి గాలి అందకుండా మూసేస్తున్నాయని గ్రహించాడు. కళ్ళు వెళ్ళుకు వచ్చి,

నోరు నిస్సహాయంగా తెరచి, మూసుకుని మార్టిన్కి తన తల పేలిపోతుందా అనిపించింది. కూలీ మొహంలో భయంకరమైన నవ్వు కనిపిస్తోంది.

మార్టిన్ అతని చేతులని తన చేతులతో నెట్టి వేసే ప్రయత్నం చేసాడు. కాని

బలంగా పట్టుకున్న ఆ వేళ్ళని కదపలేక పోయాడు. గాలి అందడం లేదు. అతని గుండె బలహీన పడసాగింది. మార్టిన్ వేళ్ళు కూలీ మొహాన్ని తాకాయి. అతని కళ్ళల్లో రెండు వేళ్ళతో బలంగా పొడిచాడు.

వెంటనే కూలీ కెవ్వున కేక పెట్టాడు. తక్షణ□ చేతులని తన మొహం దగ్గరకి తీసుకెళ్ళాడు.

మార్టిన్ గట్టిగా ఊపిరి పీల్చి వదిలి కుర్చీ లోంచి లేచాడు. పారిపోవడానికి చుట్టూ చూసాడు కాని ఆ గదిలోంచి దారి బయటికి కనపడలేదు. తామిద్దరం అందులో బందీలమని మరోసారి గ్రహించాడు.

కూలీ మళ్ళీ మార్టిన్ మీదకి దూకాడు. రక్తం అలుముకున్న అతని మొహం భయంకరంగా కనిపించింది. మార్టిన్ అరుస్తూ, ఏడుస్తూ అతన్నించి దూరంగా పరిగెత్తాడు. మార్టిన్కి బిలియర్డ్స్ స్టిక్ కనిపించింది. దాన్ని అందుకుని కూలీ వైపు విసిరాడు. అది వెళ్ళి సరిగ్గా తెరచిన అతని నోట్లోంచి కూలీ గొంతులోకి దిగింది. కూలీ పెద్దగా అరుస్తూ ముందుకి తూలాడు. దాంతో ఆ కర్ర నేలని తాకి అతని గొంతులోంచి తల్లోకి దిగింది. కొద్దిసేపు అతను గట్టిగా మూలుగుతూ కాళ్ళు చేతులు కొట్టుకుంటూంటే మార్టిన్ భయంగా అతనికి దూరంగా గెంతాడు. తర్వాత ఆ కదలికలన్నీ ఆగిపోయాయి.

మార్టిన్ అలసటగా ఓ బిలియర్డ్స్ టేబిల్ మీదకి వాలిపోయాడు. అతనిలోని ఆందోళన తగ్గి శ్వాస మామూలు స్థితికి రావడానికి కొంత సమయం పట్టింది.

* * *

కూలీ మరణించి మూడు రోజులైంది. ఐనా రక్షించే డ్రైవర్స్ రాలేదు. వారు ఏ క్షణంలోనైనా రావచ్చు అనుకున్నాడు. ఆ గదిలోని గాలి నీచు వాసన వేస్తోంది. మార్టిన్ తనలో తను అస్పష్టంగా మాట్లాడుకోసాగాడు. అప్పుడప్పుడు బిలియర్డ్ బంతిని చేతిలోకి తీసుకుని కిటికీ అద్దం వంక కోరికగా చూడసాగాడు. అతనిలో చావాలనే కోరిక పెరగ సాగింది. అది పిచ్చి అని, తననా ఉన్మాదం ఆక్రమించుకోకుండా చూడాలని అనుకోసాగాడు.

ఆకలి మళ్ళీ తిరిగి వచ్చింది. కుళ్ళినా సరే, పచ్చి మాంసం రుచిగా ఉంటుంది అనిపించసాగింది.

---

## పట్టుబడని హంతకుడు - డరోథీ ఎల్ సేయర్స్

కార్లిస్లే నించి రైలు బయలు దేరినప్పటి నించి ఎదుటి సీట్లోని వ్యక్తి తన వంక గుచ్చి గుచ్చి చూస్తూండటం "మర్డర్ ఎట్ ది మాన్సే" అనే పుస్తకం చదివే పెండర్ గమనించాడు. అది అతనికి చాలా ఇబ్బందిగా ఉంది. లైబ్రరీలో హత్య చేయబడ్డ లాయర్ని ఎవరు చంపారో అతను ఈ ఇరకాటం వల్ల చదవలేక పోతున్నాడు. సీట్ మారదామని చూసాడు కాని ఇంకెక్కడా ఖాళీ లేదు.

పెండర్ అతని వంక చూసి అడిగాడు.

"చదవడానికి మీకో పుస్తకం ఇవ్వనా?"

"నేను ఎప్పుడూ డిటెక్టివ్ పుస్తకాలు చదవను. అందులోని విలన్లు ఇట్టే పట్టుబడుతూంటారు. నిజ జీవితంలో హంతకులు అంత తెలివితక్కువగా పట్టుబడరు. పైగా డిటెక్టివ్ కథల్లో కేరక్టరైజేషన్ కాని, మంచి చెప్పడం కాని ఉండదు."

"ఇలాంటి రైలు ప్రయాణాల్లో చదవడానికి అవి ఉత్తేజంగా ఉంటాయి. ఎదురు చూడని ముగింపుతో పూర్తయ్యే కథల్లో అపూర్వమైన తెలివి గల హంతకులని కలవచ్చు. ఎవరైనా సరే హత్య చేస్తే ఈ రోజుల్లో పోలీసుల నించి తేలిగ్గా తప్పించుకోలేరు." పెండర్ చెప్పాడు.

‘‘ఎలా చేయాలో తెలిస్తే తేలిగ్గా తప్పించుకోవచ్చు. అలాంటి ఓ పద్ధతి నాకు తెలుసు." ఎదుటి సీట్లోని వ్యక్తి నవ్వుతూ చెప్పాడు.

"ఏమిటా పద్ధతి?’’ పెండర్ ఆసక్తిగా అడిగాడు.

"నేను చెప్తానని అనుకున్నారా? అలాంటి రహస్యం చెప్తే చాలా మంది హత్య చేయబడచ్చు."

‘‘ఏ ఆయుధం ఉపయోగిస్తారు? కనీసం అదైనా చెప్పారా?’’ అడిగాను.

‘‘సల్ఫేట్ ఆఫ్ సేనటోల్. రెండు పెన్నీలకే ఇది మందుల షాపులో దొరుకుతుంది. దానికి మరో రెండు రసాయనాలు కలిపితే ఇంగ్లండ్ కేబినెట్ లోని అందర్నీ చంపచ్చు. వారంతా స్నానాల తొట్టెలో ఒకే రోజు మరణిస్తారు. అన్ని పదార్థాల ఖరీదు తొమ్మిది పెన్నీలు దాటదు.’’

"స్నానాల తొట్టిలోనా? అంటే?’’

‘‘ఆ రసాయనిక పదార్థాలు వేడి నీళ్ళల్లో కలిస్తే రసాయనిక చర్య జరుగుతుంది. గుండె ఆగి వారి మరణం సంభవించింది అనిపిస్తుంది. ఐదు నిమిషాల్లో ఆ రసాయనిక పదార్థాలు గాల్లోకి ఆవిరై పోవడంతో ఇక వాటి ఉనికిని ఎవరూ కనుక్కోలేరు. దీన్ని ఓ చైనా వ్యక్తి నాకు నేర్పాడు."

రైలు రగ్బీ స్టేషన్లో ఆగగానే అతను నర్మగర్భంగా నవ్వుతూ చెప్పాడు.

"నాకు ఇక్కడ చిన్న పని ఉంది." తర్వాత దిగిపోయాడు.

* * *

మర్నాడు ఉదయం పెండర్ దినపత్రికని తెరవగానే ఓ హెడ్డింగ్ కనిపించింది.

'బాత్ టబ్లో' ధనిక వ్యాపారి మరణం.

రగ్బీలోని బ్రిటిల్స్ ఇంజనీరింగ్ వర్క్స్ అధినేత జాన్ బ్రిటిల్స్ స్నానాల తొట్టెలో మరణించి ఉండటం ఆయన భార్య కనుగొంది. ఆయన గుండె ఆగి మరణించాడని తెలుస్తోంది.''

వెంటనే పెండర్కి గత రాత్రి తనకి రైల్లో తారసపడ్డ వ్యక్తి గుర్తొచ్చాడు. అతను చెప్పిన సల్ఫేట్ ఆఫ్ దాకానే గుర్తుంది. తర్వాతి పదం ఎంత ఆలోచించినా గుర్తు రాలేదు. ప్రతీ రోజు దినపత్రిక చదివినప్పుడల్లా స్నానాల తొట్టెలో గుండాగి మరణించే వ్యక్తుల వార్త కోసం చూడసాగాడు. అలాంటివి రెండు, మూడు కనిపించాయి.

ఓ రోజు స్కిన్నింగ్స్ అనే అతను అలా మరణించిన వార్తని చదివాడు. అతని ఇల్లు తన వెనక వీధిలోనే ఉందని గుర్తించాడు. ఆ సాయంత్రం పెండర్ తన పెంపుడు కుక్కతో వాకింగ్కి వెళ్తుంటే అకస్మాత్తుగా రైల్లోని వ్యక్తి తారసపడ్డాడు.

"మీరు ఈ ప్రాంతం లోనే ఉంటారా?" అతను పెండర్ని గుర్తు పట్టి అడిగాడు.

''అవును. మీరు?''

"ఇక్కడ కాదు. నిన్న ఓ పని మీద ఇక్కడికి వచ్చాను. దాని తాలూకు డబ్బు వసూలు చేసుకోడానికి మళ్ళీ వచ్చాను."

''రగ్బీలో కూడా మీకా రాత్రి ఇలాంటి పని ఉండే దిగారు కదా?'' పెండర్ ప్రశ్నించాడు.

''అవును. నేను ఇంగ్లండ్ మొత్తం ఒకే రకం పని మీద తిరుగుతూంటాను.... బ్రిటిల్స్ నేను రగ్బీకి వెళ్ళినప్పుడే బాత్ టబ్లో మరణించడం కాకతాళీయం. అతను ముసలివాడు. అతని భార్య పడుచుది. నేను చెప్పాగా? ఆ రసాయనిక పదార్థాలు నా ఒక్కడికే తెలుసు. నిజ

జీవితంలో హంతకుడు పట్టుబడడని కూడా ఆ రోజు రైల్లో చెప్పాను కదా? మీకు ఎప్పుడైనా నా అవసరం వస్తే టైమ్స్ దినపత్రికలో “బ్రిటిలీస్ బంధువు నన్ను కాంటాక్ట్ చేయండి" అని మీ ఫోన్ నంబర్ ఇస్తే చాలు.” కన్ను కొట్టి చెప్పాడు.

“సల్ఫేట్ అఫ్... ఆ పదార్థం ఏమిటి?” పెండర్ అడిగాడు.

"నాతో పని పడ్డప్పుడు చెప్తాను." మరో సారి కన్నుకొట్టి అతను వెళ్ళిపోయాడు.

తను అతని పేరు అడగడం మర్చిపోయానని చాలా సేపటికి కాని పెండర్కి తట్టలేదు. అతని గురించి పోలీసులకి ఫిర్యాదు చేద్దామని అనుకున్నాడు కాని తగిన సాక్ష్యాధారాలు లేనిదే వారు నమ్మరని విరమించుకున్నాడు. స్నానాల తొట్టెలో మరణ వార్తల కోసం పెండర్ నిత్యం జాగ్రత్తగా దిన పత్రికలని చదవసాగాడు.

వారం తర్వాత టర్కిష్ బాత్లో ఓ వ్యక్తి మరణించిన వార్తని చదివాడు. మేనేజ్మెంట్ టర్కిష్ బాత్రూమ్లలో కొత్తగా సూపర్వైజర్లని నియమించాలని నిర్ణయించిందని, వేడి నీటి స్నానంతో కొందరికి హార్ట్ అటాక్స్ వచ్చే అవకాశం ఉందని కూడా ఆ వార్తలో చదివాడు.

మూడు వారాల తర్వాత అలాంటి మరో వార్త కనిపించింది. ఎనభై మూడేళ్ళ ఓ రచయిత్రి బాత్ టబ్లో మరణించింది. ఆవిడ ఏకైక మనవడే వారసుడు. ఆవిడ మరణానికి కారణంగా హార్ట్ ఎటాక్ నే పేర్కొన్నారు.

తను ఆ వ్యక్తిని ఎలా పోలీసులకి పట్టించాలా అని తీవ్రంగా ఆలోచించాడు. లేదా మరి కొంత మంది చంపబడతారు. మరో నెల తర్వాత కూడా లివర్పూల్లోని ఓ రాజకీయవేత్త, మరో రెండు వారాల తర్వాత న్యూకేజిల్లో డెట్ఫోర్డ్ అనే వృద్ధుడు తన ఇళ్ళల్లోని స్నానాల తొట్టెల్లో మరణించిన వార్తలని చదివాడు.

* * *

ఓ రోజు పెండర్ పని మీద సౌతాంప్టన్కి వెళ్ళాడు. హోటల్లో బ్రేక్ఫాస్ట్ ముగించి దిన పత్రికని చదువుతూంటే బాత్ టబ్లో మృతి గురించిన ఓ వార్త మళ్ళీ కనిపించింది. మృతుడు లారెన్స్ లండన్లోని పైన్ వుడ్ స్టుడియో అధినేత బావమరిది. పెండర్కి మధ్యాహ్నం మూడు దాకా వేరే పని లేకపోవడంతో అతను సమీపంలోని ఆ మృతుడి ఇంటికి కాలి నడకన చేరుకున్నాడు. ఆయన భౌతిక కాయం చూడటానికి చాలా మంది వచ్చారు. వారిలో ఆ హంతకుడ్ని చూసిన పెండర్ కొద్దిగా నిర్ఘాంతపోయాడు. అతని పక్కకి వెళ్ళి గుసగుసలాడుతూ అడిగాడు.

‘‘ఇందులో కూడా మీ హస్తం ఉందా?’’

‘‘లేకపోతే నాకు ఇక్కడేం పని? నా ఫీజ్ చేతిలో పడే దాకా ఇక్కడ నిర్భయంగా ఉండగలను. ఇది నా పని అని నీతో సహా ఎవరూ ఋజువు చేయలేరు. చెప్పాగా ఐదు నిమిషాల్లో రసాయనాల ఆచూకీ కూడా మిగలకుండా గాల్లో ఆవిరి ఐపోతాయని..... నేను నీకు ఏమైనా సహాయం చేయగలనా?’’ నవ్వుతూ అడిగాడు.

‘‘ఇంకా ఎంత మందిని చంపుతావు? పెండర్ కోపంగా అరిచాడు.

"ష్! అరవక. ఇంత దాకా నా మీద ఎవరూ ఇలా అరవలేదు. లేదా నువ్వు బాత్ టబ్లో స్నానం చేసినప్పుడల్లా 'ఈ రోజు నా గుండె ఆగుతుందా?' అనే భయంతో స్నానం చేయాల్సి ఉంటుంది. కాబట్టి జాగ్రత్త, అసలు నీకు నేను ఆ రహస్యం చెప్పకుండా ఉండాల్సింది." అతను నవ్వుతూ చెప్పినా అతని గొంతులో కాఠిన్యం ఉంది.

అతను హతుడి ఫొటోలు తీయడం పెండర్ గమనించాడు. బహుశ తను చంపిన వారందరి ఫొటోలని సేకరిస్తూండి ఉండచ్చు అనుకున్నాడు. అతన్ని పెండర్ విడిచిపెట్ట దలచుకోలేదు. ఏం చేయాలో నిర్ణయించుకున్నాడు. అతన్ని రహస్యంగా వెంబడించాడు. ఇంగ్లండ్లో ఇళ్ళ తలుపుల కింద సందుల్లోంచి చలి లోపలకి రాకుండా ఉండడానికి అమ్మే ఇసుక సంచీలని అమ్మే బండిని చూసి ఆగి ఓ సంచీని కొన్నాడు. అతను మెయిన్ రోడ్లోంచి సందుల్లోకి వెళ్ళి ఓ

పార్క్‌కి ప్రవేశించాడు. ఓ బెంచ్ మీద కూర్చుని సిగరెట్ అంటించాడు. దూరంగా మరో ఇద్దరు మాత్రమే ఉన్నారు. వారికి, ఆ వ్యక్తికి మధ్య ఓ పొద అడ్డుగా ఉండటం పెండర్ గమనించాడు. పచ్చటి గడ్డి మీద నిశ్శబ్దంగా నడుచుకుంటూ వెళ్ళి అతని వెనక నిలబడ్డాడు. చేతిలోని ఇసక సంచీతో ఆ వ్యక్తి తల మీద బలంగా మోదాడు. మూడో దెబ్బకి అతని తల విచ్చుకుంది. అతను మరణించాడని రూఢి చేసుకున్నాక పెండర్ గబ గబ బయటకి నడిచాడు.

సంచీని చింపి ఇసకని చెత్త డబ్బాలో పోసాడు. తన హోటల్ గదికి వెళ్ళాక సంచీని కాల్చేసాడు. మర్నాడు ఉదయం పెండర్ బ్రేక్ఫాస్ట్కి వెళ్తూ ఆ నాటి దినపత్రికని తెరిచాడు. "పార్క్‌లో హత్య అనే హెడ్డింగ్ కనిపించింది. హతుడి పేరు బక్లే.

అదే సమయంలో పక్క టేబిల్ లోని ముగ్గురు మాట్లాడుకునే మాటలు పెండర్కి వినిపించాయి.

"దురదృష్టం కదా?"

‘‘అవును. ఒకరి అంత్యక్రియలకి వచ్చిన బక్లేకి అంత్యక్రియలు జరగడం దురదృష్టమే మరి. నాకు తెలిసి అతన్ని చంపేంత శతృవులు ఎవరూ లేరు.’’

‘‘బిల్ బక్లే లాంటి గొప్ప క్రైం రిపోర్టర్ మరొకడు లేడు."

"అతని లాంటి ప్రాక్టికల్ జోకర్ కూడా లేరు. సల్ఫేట్ ఆఫ్ సేనటోల్ అనే రసాయనిక పదార్థం పేరు చెప్పి ఎంత మంది రైలు ప్రయాణీకుల్ని ఫూల్ చేసాడో లెక్క లేదు. వేడి నీటి స్నానంతో కొవ్వు కరిగి, గుండె ఆగి స్నానాల తొట్టెలో మరణించడం చలి దేశాల్లో సహజం అని తెలిసి బక్లే తను ఎవరూ పట్టుకోలేని హంతకుడిగా కొత్తవాళ్ళని నమ్మిస్తూంటాడని మన లాంటి దగ్గరి మిత్రులకే తెలుసు."

పెండర్ మూర్ఛపోయాడు. కుర్చీ లోంచి కింద పడిపోయిన అతన్ని చూసి ఆ ముగ్గురు రిపోర్టర్లూ సహాయానికి లేచారు.

---

## దూరం - జాన్ హార్వే

లండన్ పోలీస్ ఫోర్స్లో ఇన్వెస్టిగేటివ్ డిటెక్టివ్గా పనిచేసే ఎల్డర్ బేకర్కి ఉద్యోగంలో ఎలాంటి సమస్యలూ లేవు. కుటుంబ జీవితంలోనే అతనికి అనేక సమస్యలు ఉన్నాయి. వాటన్నిటికీ కారణం అతని భార్య కేథరిన్.

వారుండే ఇంటికి నూట ఇరవై మైళ్ళ దూరంలోని ఓ ఆఫీస్లో కేథరిన్ పని చేస్తోంది. రోజూ రైల్లో వెళ్ళి వస్తూంటుంది. తన ఆఫీస్ ఉన్న నార్త్ కంట్రీకి ఇల్లు మారదామని, అందువల్ల తనకి రైలు ప్రయాణం తప్పుతుందని, వెళ్ళి రావడానికి పట్టే ఆ మూడు గంటల ప్రయాణం విసుగా ఉంటుందని కొన్ని నెలలుగా కోరుతోంది.

"కాని నాకు నార్త్ కంట్రికి బదిలీ కాదు. నేను అక్కడికి మారితే నా ఉద్యోగం పోతుంది. పోలీస్ డిటెక్టివ్గా నేను ఫోన్ వచ్చిన అరగంట కల్లా మా హెడ్క్వార్టర్స్కి చేరుకునే దూరంలో ఉండాలన్నది నియమం." ఎల్డర్ బేకర్ తన భార్యకి చెప్పాడు.

"పోనీ అక్కడ ఇంకో ఉద్యోగం చూసుకోవచ్చు."

"పోలీస్ ఫోర్స్లో రాదు. ప్రయివేట్ సెక్యూరిటీ సేవలు అందించే కంపెనీలో చేరాలి. ఆ పని ఇప్పుడు నేను చేస్తున్న పనిలా ఉత్సాహంగా ఉండదు." ఆ ఒక్క కారణం వల్ల కేథరిన్ ఇల్లు మారాలని పట్టుబట్టలేదు కాని లేకపోతే ఊరుకునేది కాదు. ఎల్డర్కి కొత్తగా ఓ అనుమానం కలిగింది. తన భార్య ఒకోసారి రైలు తప్పిపోయిందనో, తిరిగి వచ్చే ఓపిక లేదనో రాత్రి ఇంటికి రాకుండా నార్త్ కంట్రీ లోనే ఉండిపోతోంది.

"ఆఫీస్లోని ఎవరితో అయినా ఆమెకి కాని అఫైర్ మొదలైందా?" అనే అనుమానం అతనికి కలిగింది.

ఓరోజు ఓ కేసు పని మీద నార్త్ కంట్రీకి వెళ్ళినప్పుడు కొంత రహస్య పరిశోధనని చేసాడు. బాస్ టెడ్తో ఆమె కెఫే రోగికి, కెఫే లాటేకి, సిటీ సెంటర్ స్ట్రీట్లోని బార్లకి వెళ్ళిందని అతనికి తెలిసింది.

మర్నాడు ఆమెని ఆ విషయం మీద నిలదీసాడు. ఆమె అంత వేగంగా తన తప్పుని ఒప్పుకుంటుందని ఎల్డర్ ఎదురు చూడలేదు.

“రైలు ప్రయాణ జీవితంతో విసిగిపోయాను. టెడ్ సాన్నిహిత్యంలో దాన్ని కొంత పోగొట్టుకుంటున్నాను." నిర్భయంగా చెప్పింది.

“ఆ ఉద్యోగం మానేసి లండన్లో ఇంకో ఉద్యోగం చూసుకోమని నీతో చాలాసార్లు చెప్పాను."

"పధ్నాలుగేళ్ళుగా పని చేస్తున్న ఆ ఉద్యోగాన్ని ఎలా మానగలను? నాకు బ్రాంచ్ మేనేజర్గా ఏరోజైనా ప్రమోషన్ రావచ్చు. ఇక్కడ కొత్త ఉద్యోగంలో చేరితే నేను కింది కేడర్లో చేరాల్సి ఉంటుంది. ఆ కంపెనీ సీనియారిటీని ఇంకో కంపెనీ వారు గుర్తించరు కదా?” కొద్ది క్షణాలాగి మళ్ళీ చెప్పింది.

“అసలు మనం విడాకులు తీసుకుంటే ఎలా ఉంటుందనే ఆలోచన కూడా నాకు వచ్చింది."

"విడాకులా?” నిర్ఘాంతపోయాడు అతను.

“అవును. అప్పుడు నాకు ప్రయాణపు విసుగు ఉండదు."

“పిల్లలు?”

"తల్లికే పిల్లల కస్టడీ యిస్తారు." ఆ విషయం ఆలోచించినట్లుగా చెప్పింది కేథరిన్.

వెంటనే ఎల్డర్ చెయ్యి గాల్లోకి లేచింది. అది ఆమెని తాకబోయే ముందు తమాయించుకుని ఆగాడు.

* * *

ఈ సంభాషణ జరిగి వారం అయింది. ఎల్డర్ తన సమస్యకి పరిష్కారం కోసం ఆలోచిస్తున్నాడు. తన భార్య ఎటూ ఉద్యోగం మానదని తెలుసు. తనే త్యాగం చేయాలి. కాని అతను ఆ విషయం మీద ఓ స్థిరమైన నిర్ణయం తీసుకోలేకపోతున్నాడు. ఓసారి కుటుంబం ముఖ్యం అనిపించి రాజీనామా చేసి నార్త్ కంట్రీకి వెళ్ళాలని ఉంటుంది. మరోసారి తన ఉద్యోగమే తనకి ముఖ్యం కాబట్టి రాజీనామా చేయకూడదని అనిపిస్తుంది. ఆ విషయంలో ఓ స్థిర నిర్ణయానికి రాలేకపోతున్నాడు ఎల్డర్.

* * *

రాత్రి పన్నెండున్నరకి ఎల్డర్కి ఫోన్ వచ్చింది.

"మేన్స్ఫీల్డ్లో ఓ ఇంట్లోంచి అరుపులు, శబ్దాలు వినిపించాయని ఇరుగుపొరుగు నించి ఫిర్యాదులు వచ్చాయి. వెంటనే వెళ్ళి చూడు." డిస్పాచర్ చెప్పాడు.

‘‘అలాగే."

లేచి చకచక పోలీస్ యూనిఫాం తొడుక్కుని నిద్రపోతున్న భార్య ఒకవేళ లేస్తే చూసేలా తను వెళ్ళే పని గురించి ఓ కాగితం మీద రాసి, ఆమె పక్కనే వున్న వాటర్ జగ్ మీద ఉంచాడు. అతను కారు స్టార్ట్ చేస్తున్న శబ్దానికి కేథరిన్కి మెళకువ వచ్చింది. అంతలోనే ఆమె మళ్ళీ నిద్రలోకి జారిపోయింది.

లండన్కి ఉత్తరాన ఎల్డర్ ఇంటికి పధ్నాలుగు మైళ్ళ దూరంలో ఉంది మేన్స్ఫీల్డ్ ప్రధానంగా పారిశ్రామిక వాడయిన అక్కడ నిరుద్యోగులు అధికంగా నివశిస్తూంటారు. ఆ ప్రాంతంలో చిన్న చిన్న నేరాలు అధికంగా జరుగుతూంటాయి తప్ప హత్యల్లాంటివి అరుదే.

డిస్పాచర్ చెప్పిన అడ్రస్ ప్రకారం పదిహేడు నిమిషాల తర్వాత ఎడ్విన్ స్టో రోడ్లోని నూట పన్నెండో ఇంటి ముందు తన కారుని ఆపాడు. రెండు పోలీస్ కార్ల మధ్య ఓ అంబులెన్స్ అతనికి కనిపించింది. చుట్టుపక్కల అన్ని ఇళ్ళల్లోంచి వెలిగే లైట్లు కనిపించాయి. ఆ ఇంటి డ్రైవ్ వేలో చిన్న పిల్లలు తొక్కే సైకిల్ చెట్టుకి ఆనించి గొలుసుతో తాళం వేసి ఉంది. తన కొడుక్కి కూడా సరిగ్గా అలాంటి సైకిలే ఉందని ఎల్డర్ అనుకున్నాడు.

బయట యూనిఫాంలోని స్థానిక పోలీసు కాన్స్టబుల్ ఎల్డర్ ఐడెంటిటీ కార్డు అడిగి చూసి సెల్యూట్ చేసి చెప్పాడు.

"హత్యలు సార్. ఈ ఇంటి యజమాని పాల్ అట్కిన్స్ హంతకుడు."

“ఓకే."

అతను చెప్పేది విని తెలుసుకునేకంటే, స్వయంగా చూసి తెలుసుకోవాలని ఎల్డర్ లోపలకి వెళ్ళి మెట్లెక్కిపై అంతస్థులోకి వెళ్ళాడు. సార్జెంట్ గేరి సేక్సన్కి ఎల్డర్తో పూర్వ పరిచయం ఉంది. అతను కరచాలనం చేసి మిగిలిన పోలీస్ సిబ్బందికి ఎల్డర్ని పరిచయం చేసాడు. ఆ గదిలో ఓ మూల నేల మీద నైట్ గౌన్లో ఉన్న ఓ స్త్రీ శవం పడి ఉంది.

“లోరిన్ అట్కిన్స్ సర్. పాల్ అట్కిన్స్ భార్య"

"గొంతు కోసి చంపబడింది కదా?" శవాన్ని పరిశీలనగా చూసి అడిగాడు ఎల్డర్.

“అవును సార్.”

“ఆయుధం?”

"కిచెన్ నైఫ్ సర్ కింద సింక్లో కనిపించింది.”

“కడిగేసారా?”

‘‘అవును సార్.’’

"పాల్ అట్కిన్స్ ఏడి?’’

"కింద గేరేజ్లో వున్నాడు. పిల్లల గదులని కూడా మీరోసారి చూడాలి."

ఎల్డర్ పిల్లల గదుల్లోని వాళ్ళ శవాలని చూసాడు. తన పిల్లల వయసే. పదకొండేళ్ళ కూతురు. ఏడేళ్ళ కొడుకు. వాళ్ళ గొంతులు కూడా కోసి వేయబడ్డాయి. అది నిద్రలో జరిగి ఉంటుందని ఊహించాడు. ‘‘సిన్ ఆఫ్ క్రైమ్ టీమ్’’ అ గదిలో ఆధారాల కోసం వెదుకుతున్నారు.

‘‘గ్యారేజ్లోకి వెళ్ళి చూడండి." ఒకరు ఎల్డర్కి సూచించారు.

గేరేజ్లో కారు ఎగ్జాస్ట్ గొట్టం లోంచి కారులోకి ఓ రబ్బర్ గొట్టం కనిపించింది. లోపల నలభై ఏళ్ళ పైబడ్డ ఒకతని శవం డ్రైవింగ్ సీట్ ముందు ఉంది. తల వంచుకుని ముందుకి స్టీరింగ్ వీల్ మీదకి వాలిపోయి ఉన్నాడు. మోనోకార్బైడ్ వాయువుతో అతను మరణించాడని గుర్తించాడు.

‘‘ఆత్మహత్య కదా?" అక్కడ ఉన్న సార్జెంటిని అడిగాడు.

‘‘అవును సార్. అందుకు వ్యతిరేకమైన ఆధారాలేం కనిపించలేదు."

"ఆత్మహత్య చేసుకునే వారు సాధారణంగా ఓ ఉత్తరం రాస్తారు. అలాంటిదేమైనా దారికిందా?’’

‘‘లేదు సార్ రాక్షసుడు. ముందు తన కుటుంబ సభ్యులని చంపి తర్వాత తను ఆత్మహత్య చేసుకున్నాడు."

ఎల్డర్ అక్కడ గంట దాకా ఉండి దొరికిన ఆధారాలని పరిశీలించాడు. అన్ని ఆధారాలు హత్యలు, ఆత్మహత్యనే సూచించాయి తప్ప పరాయివాళ్ళు వచ్చి చంపిన ఆధారాలేం దొరకలేదు. శవాలని అంబులెన్స్లో తరలించాక ఎల్డర్ తిరిగి ఇంటికి చేరుకున్నాడు.

* * *

మర్నాడు ఉదయం ఎల్డర్ తిరిగి మేన్స్ఫీల్డ్కి వెళ్ళాడు. షెర్వుడ్ బిజినెస్ పార్క్లోని పాల్ అట్కిన్స్ పని చేసే ప్లెషర్ బ్లైండ్స్ అనే కిటికీలకి వాడే వెనీషియన్ కర్టెన్ల ఫేక్టరీకి చేరుకున్నాడు. అతనితో పని చేసే వారు జరిగిందానికి పెద్దగా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేయలేదు. ఒకరిద్దరయితే పాల్ తను చేసిన పనిని ఆలస్యంగా చేసాడని కామెంట్ చేసారు.

"ఎందుకలా అనుకుంటున్నావు?" ఎల్డర్ అడిగాడు.

"భార్యాభర్తలిద్దరికీ చాలా కాలంగా పడటం లేదు."

"కారణం నీకు తెలుసా?"

"ఆఫీస్లో అందరికీ తెలుసు. లోరెన్ అట్కిన్స్కి తన బాస్తో శారీరక సంబంధం ఉంది. ఆర్నెల్ల తర్వాత అది పాల్కి తెలిసింది. అందుకు లోరెన్ చెప్పిన కారణం మా అందరికీ విచిత్రంగా అనిపించింది."

"ఏమిటా కారణం?"

"ప్రయాణపు బడలిక వల్లట. లోరెన్ రోజూ రైల్లో నూట ఆరు మైళ్ళ దూరంలోని నార్త్ కంట్రికి వెళ్ళి ఉద్యోగం చేసి వస్తూంటుంది. తమ కుటుంబాన్ని అక్కడికి షిఫ్ట్ చేసి అక్కడ ఇంకో ఉద్యోగం చూసుకోమని లోరెన్ పాల్ని కోరింది. కాని పాల్ ఇష్టపడే ఫోర్ మెన్ ఉద్యోగం నార్త్ కంట్రీలో రాలేదు. అక్కడ ఆఫీసులు తప్ప ఫేక్టరీలు లేవు. పాల్ది సాంకేతిక నైపుణ్యం గల ఉద్యోగం. లోరెన్ నార్త్ కంట్రికి షిఫ్ట్ అవ్వాలని, పాల్ వద్దని. ఈ విషయం మీద వారిద్దరికీ ఎన్నోసార్లు పోట్లాటలు జరిగాయి. వారం క్రితం కోపంలో పాల్ లోరెన్ని చెంప దెబ్బ కొట్టాడు. నిన్న లోరెన్ లాయర్ని కలిసి విడాకులు గురించి చర్చించింది. రెండు రోజుల్లో విడాకుల కోసం లాయర్ నోటీస్ వస్తుందని, తను మర్నాడు పిల్లలతో నార్త్ కంట్రీలో తను తీసుకున్న ఇంటికి

షిఫ్ట్ అవుతానని చెప్పిందని నిన్న ఉదయం పాల్ మాతో చెప్పాడు. నిన్న రాత్రి ఆ దుర్ఘటన జరిగింది."

ఇరుగుపొరుగుని విచారిస్తే వారిద్దరూ పెద్దగా పోట్లాడుకోవడం విన్నామని, పాల్ చంపేస్తానని అరవడంతో నిజంగా అంత పని చేయచ్చని తాము పోలీసులకి ఫోన్ చేసామని వాళ్ళు చెప్పారు.

అన్ని కోణాలని పరిశీలించాక పాల్ అట్కిన్స్ కొలీగ్స్ లోరెన్ ఇరుగుపొరుగు చెప్పింది నిజమని తేలింది. దాంతో వారం తర్వాత ఆ కేస్ని మేన్స్ఫీల్డ్ పోలీస్ స్టేషన్ ఆఫీసర్ హత్య, ఆత్మహత్య కేసుగా భావించి మూసేసాడు.

మర్నాడు ఎల్డర్ బేకర్ పోలీస్ సూపరింటెండెంట్ కలిసి తన రాజీనామా పత్రాన్ని యిచ్చాడు.

"నీలాంటి మంచి ఆఫీసర్ని పోగొట్టుకోవడం నాకు ఇష్టం లేదు. ఈ ఉద్యోగంలో నీకు గల సమస్య ఏమిటి?" అడిగాడాయన.

"ఏం లేదు సార్ ఉన్నదల్లా నా కుటుంబ జీవితంలోనే. దానికి నా రాజీనామానే పరిష్కారం. లేదా ఇంకో పాల్ అట్కిన్స్ కేసు లాంటిది జరగచ్చు." ఎల్డర్ జవాబు చెప్పాడు.

---

## మేడ్ మేగీ - పీటర్ రాబిన్సన్

ఆమె ఇంటికి పాలని సరఫరా చేసే హేరీ గమనించే దాకా మేడ్ మేగీ మరణించిందన్న సంగతి నాతో సహా ఎవరికీ తెలీదు. వారానికి రెండు పైంట్ల చొప్పున పాలకి రేషన్ పెట్టడంతో పాలవాడు హేరీ రోజూ మేడ్ మేగీ ఇంటికి వెళ్ళాల్సిన అవసరం లేకపోయింది. లేదా ఆవిడ ఇంటి బయట పాల బాటిల్ అలాగే ఉన్నా ఆవిడకి ఏదో అయిందని గ్రహించేవాడు. కాని యుద్ధ సమయంలో పాల బాటిల్ తీసుకోవడం ఐదు నిమిషాలు లేటైనా అది మాయం అవుతుంది. అంతకు మునుపు దొంగలు కాని వారిని కూడా యుద్ధం దొంగలుగా మార్చింది.

మేడ్ మేగీ ఇంట్లోంచి చెడు వాసన రావడంతో హేరీ ఆవిడ ఇంటి తలుపు కొట్టాడు. ఆవిడ తలుపు తీయకపోవడంతో స్పెషల్ కానిస్టేబుల్కి ఆ సంగతి ఫిర్యాదు చేసాడు. మేమంతా వెళ్ళి తలుపు బయట వేచి ఉన్నాం. మేగీ ఇంటి కిటికీ అద్దాలని పగల కొట్టి హంతకుడు లోపలికి వెళ్ళిన మార్గంలోనే కానిస్టేబుల్ వెళ్ళి తలుపు తీసాడు.

"మీరు తిన్న బ్రేక్ఫాస్ట్ బయటకి రాకూడదని అనుకుంటే లోపలకి రాకండి. ఆవిడని ఎవరో దారుణంగా హత్య చేసారు." కానిస్టేబుల్ చెప్పాడు.

"అదేమిటి? ఆవిడని హత్య చేయాల్సిన అవసరం ఎవరికి ఉంది?" ఆశ్చర్యంగా అడిగాను.

“ఏమో మరి? నేను చూసింది చెప్పాను." అతను చెప్పాడు.

పోస్ట్ మార్టంలో ఆవిడ తల మీద కనీసం అరవై సార్లయినా బలమైన దేంతోనో మోది చంపారని తెలిసింది. అది పగతో చేసిన హత్య అయి ఉంటుందని పోలీసులు భావించారు. ఐతే యుద్ధ కాలంలో పోలీసులు బ్లాక మార్కెటీర్లని పట్టుకోవడంలో, బాంబింగ్లో మరణించిన వారి శవాల వివరాలు నమోదు చేసుకోవడంలో బిజీగా ఉండటంతో మేడ్ మేగీ హత్యకి చెందిన పరిశోధన చురుగ్గా సాగలేదు. ఆవిడ తరఫున పోలీసులని నిలదీసేవారు కూడా ఎవరూ లేరు. మేడ్ మేగీ గురించి ఇక్కడ కొంత చెప్పాలి.

మేడ్ మేగీ అసలు పేరేమిటో ఎవరికీ తెలీదు. అంతా ఆవిడని ఆ పేరుతో పిలుస్తారు. ఆవిడ లండన్కి ఎప్పుడు వచ్చిందో కూడా ఎవరికీ తెలీదు. సౌత్ లండన్ లోని మా ఏరియాకి ఆవిడ రెండో ప్రపంచ యుద్ధకాలంలోనే 1940ల్లో ఓ రోజు వచ్చింది.

ఆవిడ ధరించే దుస్తులు చాలా పాత ఫేషన్కి చెందినవి. పురాతన ఫ్రెంచ్ చిత్రాల్లో మాత్రమే అలాంటి దుస్తులని నేను చూసాను. పొడుగాటి కాలర్లు, నేలకి తగిలే గౌను, పక్షి ఈకలు అలంకరించిన విశాలమైన టోపీలు. బరువైన పెద్ద బూట్లు, పిల్లలు తమకి తెలీకుండానే క్రూరంగా ప్రవర్తించగలరు. ఆవిడ బయటకి వస్తే పిల్లలంతా ఆవిడ వెంట నడుస్తూ, “మేడ్ మేగీ,

మేడ్ మేగీ, హర్ బ్రెయిన్ ఈజ్ క్లాగీ" అని అరిచేవారు. ఆవిడ వాళ్ళని పట్టించుకునేది కాదు. ఒకో సారి వెనక్కి తిరిగి వాళ్ళని శాపనార్థాలు పెడుతూ వాళ్ళ మీద రాళ్ళు రువ్వేది. కాని, ఒక్క రాయి కూడా వాళ్ళకి తగిలిన దాఖలాలు లేవు. కాబట్టి ఆవిడ వాళ్ళకి హాని చేయడానికి కాక, అదిలించడానికే రాళ్ళు రువ్వేది అని అందరికీ అనిపించేది. ఆవిడ ఎయిర్ రైడ్ సైరన్ని ఖాతరు చేయకుండా ఎప్పుడూ ఇంట్లోనే ఉండేది.

మేగీ ఇంటికి ఎవరూ వెళ్ళేవారు కారు. ఆవిడ అసలు పేరు అదేనో, కాదో, ఎక్కడ నించి వచ్చిందో కూడా ఎవరికీ తెలియదు. ఆవిడ పిల్లల్ని ఫ్రెంచ్ భాషలో తిట్టేది కాబట్టి ఫ్రాన్స్ నించి వచ్చిందని అంతా అనుకునేవారు. ఆవిడ మీద అనేక వదంతులు కూడా చెప్పేవారు. ఆవిడ తండ్రి బాగా ధనవంతుడని, ఆయన తదనంతరం ఆవిడకి ఒక్క ఫ్రాంక్ కూడా రాకపోవడంతో షాక్కి గురై పిచ్చెక్కిందని, విఫల ప్రేమ నించి కోలుకోలేక అలా అయిందని, ఇలా చాలా కథలు విన్నాను. ఐతే అద్దెని సక్రమంగా చెల్లించేంత, దినపత్రికలని చదివేంత, తన రేషన్ కూపన్లని చక్కగా ఉపయోగించుకునేంత తెలివితేటలు మాత్రం మేగీకి ఉన్నాయి. బ్రిటిష్ వారిని తెగ తిట్టేది అని ఫ్రెంచ్ భాష వచ్చిన ఒకరు చెప్పారు.

యుద్ధానంతరం చాలా మంది యూరోపియన్లా నేను అమెరికాకి వలస వచ్చేసాను. యుద్ధంలో అంతా పోగొట్టుకున్నవారికి తిరిగి సంపాదించుకునే అవకాశాలతో అమెరికా ఆశా దీపంలా కనిపించేది. అది నిజం కూడా.

* * *

న్యూయార్క్నించి నేను ఫిలడెల్ఫియాకి నా వ్యాపార పని మీద వచ్చి, తిరిగి వెళ్ళే రైలుకి యింకా వ్యవధి ఉండటంతో సమీపం లోని ఓ బార్కి వెళ్ళాను. బీర్ తాగుతూంటే ఓ బల్ల ముందు కూర్చున్న ఒకరు నన్ను తన దగ్గరకి రమ్మని సైగ చేయడం గమనించి బార్ కౌంటర్ నించి అక్కడకి వెళ్ళాను.

"నేను పొరబడకపోతే మీరు మైఖేల్ కదా?" అడిగాడు.

అతనిది నాలా బ్రిటిష్ ఏక్సెంట్.

“అవును?”

“మీరు ముప్ఫై అయిదేళ్ళ క్రితం సౌత్ లండన్లో నివశించేవారు కదా?” మళ్ళీ అడిగాడు.

“అవును. మీరు?” అతన్ని తేరిపారా చూస్తే గతంలో సౌత్ లండన్లో చూసిన జ్ఞాపకం వచ్చింది.

“మీరు బుచర్ (కసాయి) కదా?” అడిగాను.

“బాగా గుర్తు పట్టారే! అవును. నా పేరు గుర్తుందా? బాస్కాంట్."

అతని ముందు కూర్చున్నాను. అతను కూడా అమెరికాకి వలస వచ్చాడు. ఆ ఊళ్ళో ఓ చిన్న మాంసం దుకాణాన్ని నడుపుతున్నాడు. మా సంభాషణ సౌత్ లండన్ మీదకి, అక్కడి నించి కార్డిగాన్ రోడ్ మీదకి, చివరికి ఆ రోడ్లో నివశించిన మేడ్ మేగీ మీదకి మళ్ళింది.

"మేడ్ మేగీ హంతకుడెవరో చివరికి తెలీసే లేదు.” చెప్పాను.

అతను ఔను అన్నట్లుగా తల ఊపాడు. కొద్దిసేపాగి చెప్పాడు.

“ఆవిడ అసలు పేరు రోజ్ ఫేవర్షామ్. ఆవిడ ఫ్రాన్స్లో డన్కిర్క్కి సమీపం లోని యెప్రెస్ అనే గ్రామంలో నివశించేది. దాన్ని జర్మన్స్ ఆక్రమించుకున్నారు. మిత్ర సైన్యాలు డన్కిర్క్ సముద్ర తీరం లోంచి ఫ్రాన్స్లోకి ప్రవేశించి జర్మన్ సైనికుల మీద దాడి చేసాయి. అప్పటికే రోజ్కి ఓ ప్రేమికుడు ఉండేవాడు. అతను జర్మన్ సైన్యం లోని గూఢచారి విభాగంలో ఓ చిన్న ఆఫీసర్ వేశ్యయిన రోజ్ దగ్గరకి మిత్ర సైనికులు తరచూ వెళ్తుండేవారు. గంటకి ఆమె ఐదు ఫ్రేంకులని వసూలు చేసేది. తాగి ఉన్న సైనికులని వారి కదలికల గురించి ఆమె ప్రశ్నించేది. అలా సేకరించిన చిన్నచిన్న సమాచారాలని ఆమె తన ప్రియుడికి అందించేది. దాన్ని అతను సమర్థవంతంగా ఉపయోగించుకునేవాడు."

“ఇదంతా నిజమా? మీకు ఎలా తెలుసు?” ఆశ్చర్యంగా అడిగాను.

“నన్ను చెప్పనీండి. చివర్లో ప్రశ్నలు అడగచ్చు. అలా టామ్ ఫ్లెచర్ అనే ఓ బ్రిటిష్ సైనికుడు ఆమె దగ్గరకి వెళ్ళినప్పుడు తాము మర్నాడు ఎక్కడ ట్రెంచ్లని తవ్వుతున్నారో చెప్పాడు. ఆ సమాచారం తక్షణం ఆమె తన జర్మన్ ప్రియుడికి పంపించింది. మర్నాడు ఉదయం వారంతా ట్రెంచ్లని సగం తవ్వగానే జర్మన్ దండు వచ్చి దాడి చేసింది. దాక్కునే చోటు లేక ఆ అరవై నాలుగు మంది బ్రిటిష్ సైనికులు మరణించారు. చాటు నించి కాల్చడంతో జర్మన్స్కి పెద్దగా ప్రాణనష్టం కలగలేదు.

అతను తన విస్కీ గ్లాసుని పూర్తి చేసాడు.

“అలా మరణించిన అరవై నాలుగు మందిలో నా తండ్రి టామ్ ఫ్లెచర్ కూడా ఉన్నాడు." ఉద్వేగంగా చెప్పాడు.

ప్రశ్నలు అడగద్దన్నాడు కాబట్టి నేను ఏం మాట్లాడ లేదు.

“ఆ సంగతి తెలీగానే నా తండ్రి మరణానికి కారణమైన రోజ్ ఫేవర్షామ్ని హత్య చేసాను.”

నేను నోరు మెదపబోతే అతను ఒద్దన్నట్లుగా చేతో వారించి తను చెప్పేది కొనసాగించాడు.

"ఓ రోజు ఎయిర్ రైడ్ సైరన్ మోగింది. ఎప్పటిలా నేను ఎయిర్ రెయిడ్ షెల్టర్లోకి వెళ్ళలేదు. బదులుగా మేడ్ మేగీ ఇంటి తలుపు తట్టాను. ఆమె తలుపు తెరిచింది. మీకు తెలుసుగా? ఆమె ఎయిర్ రైడ్ సైరన్ని ఖాతరు చేయకుండా ఇంట్లోనే ఎప్పుడూ ఉండేది."

అవునన్నట్లుగా తల ఊపాను. అతని కళ్ళు క్రోధంతో మెరుస్తున్నాయి.

“ఆమె తలుపు తెరవగానే నా వెంట తీసుకెళ్ళిన ఓ ఇటుకతో ఆమె మొహాన్ని పచ్చడి చేసాను. నా తండ్రి మరణానికి కారణమైన ఆ హంతకిని హత్య చేస్తే కాని నాకు మనశ్శాంతి కలగలేదు.”

మా ఇద్దరి మధ్యా కొద్ది క్షణాలు నిశ్శబ్దం.

"ఇక్కడ, ఇప్పుడు నేను చేసింది నీకు చెప్పడం వల్ల ఇంకో దేశంలో, ఇంకో కాలంలో చేసిన ఆ హత్యకి నా మీద ఎవరూ క్రిమినల్ కేసుని పెట్టలేరు." అతను తను చెప్పడం పూర్తయినట్లుగా 'ఊ' అని విస్కీని తాగసాగాడు.

నేను కాసేపాగి అడిగాను.

“మేడ్ మేగీ, రోజ్ ఒకరే అని మీకు ఎలా తెలిసింది?”

"నా దగ్గర కొన్న మాంసానికి ఆమె డబ్బు బాకీ పడటంతో ఓ రోజు అడగడానికి వెళ్ళాను. ఆమె లోపలకి వెళ్ళి డబ్బు తెచ్చేలోగా టీపాయ్ మీది ఆల్బంని తిరగేస్తూంటే ఆమె పాత ఫొటోలు కనపడ్డాయి. అందులో ఆ జర్మన్ ఆఫీసర్తో తీయించుకున్న ఫోటోలు కూడా ఉన్నాయి. మా నాన్న పోయాక, మిగిలిన అరవై మూడు మంది బ్రిటిష్ సైనికుల మరణానికి ఓ విధంగా మా నాన్నే కారణం అయ్యారని, మిలటరీ రహస్యం ఆయన రోజ్కి చెప్పడమే దీనంతటకి కారణమని మిలటరీ అధికారులు జరిగింది ఉత్తరం ద్వారా తెలిపారు. ఆ ఫోటోలు చూడగానే నాకు ఆమే రోజ్ అన్న అనుమానం కలిగింది. ఆమె చూస్తూండగా ఆ జర్మన్ ఆఫీసర్ ఫోటోల్లో ఒక దాన్ని తీసి అగ్గిపుల్ల గీసి వెలిగించాను. వెంటనే ఆమె వెర్రి కేక పెట్టి నా మీదకి దూకింది. ఏడుస్తూ ఆ బూడిదని అందుకుని నా ముందే దాన్ని నీళ్ళల్లో కలుపుకుని తాగింది. అంతకంటే ఏం ఋజువు కావాలి? తర్వాత ఆ యుద్ధంలో ఆ జర్మన్ ఆఫీసర్ మన వాళ్ళకి పట్టుబడ్డాడు."

నేను బీర్ని తాగుతూ అతను చెప్పేది విభ్రాంతిగా వినసాగాను.

అతనికి తెలిసిన రహస్యాలని చెప్పించడానికి మన వాళ్ళు అతన్ని చిత్రహింసలు పెట్టారు. అప్పుడు రోజ్ సంగతి బయట పడింది. అతన్ని కాల్చి చంపి, ఆ రక్తసిక్తమైన శవాన్ని మన వాళ్ళు కావాలని రోజ్ ఇంటికి పంపారు. దాన్ని చూసీ చూడగానే ఆమె షాక్కి గురైంది. మూడు రోజులు ఆ శవాన్ని తన ఇంట్లోనే ఉంచుకుని దాని వంకే చూస్తూ, దాంతో మాట్లాడుతూ గడిపింది. నాలుగో రోజు ఆమె ఎప్రెస్ గ్రామం నించి మాయమైంది. బ్రిటన్కి వెళ్ళిందని ఆ గ్రామస్థులు అనుకునేవారు.''

నేను చిన్నగా నిట్టూర్చి నా రైలుకి టైం అవడంతో అతని దగ్గర శెలవు తీసుకుని లేచాను.

---

బ్రిటిష్ క్రైమ్ కథలు * The End * Malladi Venkata Krishnamurthy